ఈనాడు

హైదరాబాద్ 26-2-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 197

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



మానవా... ఇక సెలవ్



దుబాయ్‌లో గుండెపోటుతో శ్రీదేవి కన్నుమూత

- 300 చిత్రాల్లో నటించిన వెండితెర వేల్పు
- సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి.. కన్నీరుమున్నీరైన అభిమానులు
- ప్రధాని మోదీ సహా ప్రముఖుల సంతాపం
- నేడు ముంబయికి 'అతిలోక సుందరి' పార్థివదేహం

"ఈ కన్య మానవ కన్య కాదు.. దేవకన్య".. 'జగదేక వీరుడు.. అతిలోక సుందరి' సినిమాలో శ్రీదేవిని చూసి అమ్రిష్‌పురి డైలాగ్ ఇది. నిజమే.. ప్రేక్షక లోకమంతా అనుకునే మాట అదే.

'బూచాడమ్మ బూచాడు.. బుల్లిపెట్టెలో ఉన్నాడు..' అంటూ బుజ్జి బుజ్జిగా ఆరేళ్ల వయసులో అల్లరి చేసినా.. 'సిరిమల్లె పూవా..' అంటూ పదహారేళ్ల వయసులో మనసులు దోచేసినా.. 'అబ్బ నీ తియ్యనీ దెబ్బ' అంటూ ప్రౌఢ వయసులో పెదవులు తడిచేసినా ఆమెకే చెల్లు!

బాలభారతంలో బుజ్జి శ్రీదేవిని కాని.. వేటగాడులో 'ఆకు చాటు పిందె' అందాన్ని కాని.. 'దేవత'లో 'ఎల్లువొచ్చి గోదారమ్మా ఎల్లాకిలా పడ్డాదమ్మా' అంటూ బిందెల మధ్య ఆమె వేసిన చిందులు కాని.. 'ఝుము రాతిరి.. జాబిలమ్మా.. జోల పాడవే ఇలా..' అంటూ 'క్షణ క్షణం'లో వయ్యారంగా అలవోకగా పలికిన తీరును కాని.. ఎలా మరచిపోగలం?


'గోవిందా గోవిందా'లో 'పూల రెక్కలు.. కొన్ని తేనె చుక్కలు.. రంగరిస్తివో.. ఇలా బొమ్మ చేస్తివో.. అమ్మ బ్రహ్మదేవుడో కొంపముంచినావురో..' అంటూ కథానాయకుడు దంగైపోయిన తీరు కోట్లాదిమంది ప్రేక్షకుల హృదయ స్పందనలకు అసలైన అద్దం.

ఆ చిలిపి కళ్లు.. ముద్దు మోము.. దోర పెదాలు.. భాషాభేదాల్లేకుండా భారతావని మొత్తాన్ని ఉర్రూతలూగించాయి.. రంభ, ఊర్వశి, మేనకలను చూడని సామాన్యులకు ఆమే దేవకన్య.. ఆమే అతిలోక సుందరి. నిన్ను చూస్తేనే 'అందాలతో అహో మహోదయం' అనిపించేస్తుంది.. అందుకే పదహారేళ్ల యువకుడి నుంచి అరవయ్యేళ్ల పెద్దల వరకు ప్రేక్షకలోకం 'యమహో నీ యమా యమా అందం' అంటూ దాసోహమైపోయింది. 'మిస్టర్ ఇండియా'లో చార్లీ చాప్లిన్‌లా చేసిన చిలిపి యాక్షన్‌కు దేశమంతా ఫిదా అయిపోయింది.. 'చాందినీ.. ఓ మేరి చాందినీ' అంటూ ఆమె వెంటపడింది..

కథగా.. కల్పనగా నిలిచిన 'వసంత కోకిల' శ్రీదేవి.. 'మాలినీ అయ్యర్' నవ్వుల శ్రీదేవి.. ఇంగ్లిష్ వింగ్లిష్‌లో మధ్య వయసు శ్రీదేవి.. న్యాయం దక్కక రౌద్రం దాల్చిన 'మామ్' శ్రీదేవి.. ఎన్ని చిత్రాలో! ఎన్ని చమక్కులో!

'అంగుళీయకాన్ని పోగొట్టుకుని భువికి దిగి వచ్చిన ఇంద్రజ.. ఆ ఉంగరాన్ని అంది పుచ్చుకుని తిరిగి స్వర్గానికి వెళ్లిపోయిందా?'





శ్రీదేవి చివరి ఘడియలు: దుబాయ్‌లో పెళ్లి వేడుకలో నవదంపతులు, భర్త బోనీకపూర్‌తో..

అతిథులను చిరునవ్వుతో పలకరిస్తూ..

వైరల్‌గా మారిన చివరి వీడియో

మరణానికి ముందు చివరిసారిగా శ్రీదేవి కనిపించిన వీడియో క్లిప్పింగ్ ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దుబాయ్‌లో మోహిత్ మార్వా వివాహ వేడుకలో తీసిన ఈ వీడియోలో శ్రీదేవి చాలా అందంగా ఉన్నారు. ఏమాత్రం తడబాటు లేకుండా నడిచారు. భర్త బోనీ కపూర్‌తో కలిసి అతిథులను చిరునవ్వుతో పలకరిస్తూ కనిపించారు.

దుబాయ్, ముంబయి

అందం, అభినయాల కలబోత ఎలా ఉంటుందో ఆమెని చూస్తే అర్థమవుతుంది. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోగలిగే నటనా వైదుష్యం ఆమె సొంతం. ఏకాఎకి నాలుగు దశాబ్దాల పాటు ఇటు తెలుగు సహా దక్షిణాది చిత్రసీమ, అటు బాలీవుడ్‌లలో తిరుగులేని కథానాయికగా వెలుగులీనిన ఆమె... ధ్రువతారల చెంతకు చేరారు. నాలుగేళ్ల ప్రాయంలోనే బాలనటిగా తెరంగేట్రం చేసి నిన్నమొన్నటి వరకు వెండితెరపై అలరించిన ప్రఖ్యాత నటి శ్రీదేవి ఇక లేరు. అతిలోకసుందరిగా చెరగని ముద్ర వేసుకున్న ఆమె శాశ్వతంగా దివికేగిపోయారు. 'మానవా... మానవా...' అంటూ 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'లో అమాయకమైన అందాల దేవకన్యలా మాట్లాడుతూ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర సొంతం చేసుకున్న శ్రీదేవి... శనివారం రాత్రి పొద్దుపోయాక దుబాయ్‌లో తీవ్ర గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె వయసు 54 ఏళ్లు. విషాద వార్త తెలియగానే ఆమెతో కలిసి పనిచేసినవారే కాకుండా అభిమానులంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. నటనలో ఆమె ప్రత్యేకతను, భిన్న పాత్రలకు గుర్తుచేసుకుంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. భర్త బోనీకపూర్, చిన్న కుమార్తె ఖుషీలతో కలిసి సమీప బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యేందుకు శ్రీదేవి దుబాయ్ వెళ్లారు. పెద్దకుమార్తె జాహ్నవి మాత్రం తన తొలి బాలీవుడ్ చిత్రం సంబంధించిన పనుల కారణంగా వెళ్లలేదు. పెళ్లికి వెళ్లినవారిలో కొందరు తిరిగి వచ్చేయగా మిగిలినవారు దుబాయ్‌లోనే ఉన్నారు. శ్రీదేవికి ఎన్నడూ గుండె సంబంధిత సమస్యలే తలెత్తలేదని కుటుంబ సభ్యులు (మిగతా 2లో)

మరిన్ని ప్రత్యేక కథనాలు 2, 9, 10, 11, 12, 13 పేజీల్లో

మార్చి 4న లక్ష పెళ్లిళ్లు!

- ఆ రోజు బలమైన ముహూర్తం
- మార్చి 6, 11 తేదీల్లోనూ అధిక సంఖ్యలోనే..

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం మార్చి 4వ తేదీన బాజాభజంత్రీలతో మారుమోగిపోనుంది. ఆ ఒక్కరోజునే దాదాపు ఒక లక్ష పెళ్లిళ్లు ఇక్కడ ఉంటాయని అంచనా. అదే నెల 6, 11 తేదీల్లోనూ అధిక సంఖ్యలో వివాహ మూహూర్తాలు ఉన్నాయి. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని ఫంక్షన్ హాళ్లు ఎప్పుడో బుక్కయిపోయాయి. ఇప్పుడు (మిగతా 2లో)

ఇదీ సంగతి!



కార్డుల ద్వారా పెట్టుబడి

రైతులకు 'ప్రీలోడెడ్ కార్డు'ల పంపిణీ

- సక్రమంగా పంపిణీ చేసే సమన్వయ సమితులకు ప్రోత్సాహకం
- సభ్యులను 2 లేదా 3 దేశాల అధ్యయనానికి పంపుతాం
- నేను పెట్టుబడి కింద రూ. 4 వేలు తీసుకోను..
- నాలాగే తీసుకోని బడా రైతుల సొమ్మునూ సమితులకు ఇస్తాం
- రాష్ట్ర రైసస ఛైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తాం
- వచ్చే ఏడాది రూ.ఆరేడు వేల కోట్ల నిధితో పంటల కొనుగోలు
- పంటలను మద్దతు ధరకు రాష్ట్ర సమితి కొంటుంది
- రైతులకు ఏదైనా చేయాలని ప్రధానికి 10 సార్లు చెప్పా
- అన్నదాతల ఆదాయ రెట్టింపు పథకం నిర్మాణాత్మకంగా లేదు
- రైతు సమన్వయ ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

'పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ.4 వేలను వచ్చే వానాకాలం సీజన్‌లో చెక్కుల రూపంలో ఇస్తాం. యాసంగి నుంచి 'ప్రీలోడెడ్ కార్డు'ను రైతులకు ఇస్తాం. ఇందులో ప్రభుత్వం రూ.4 వేలను డిపాజిట్ చేస్తుంది. కార్డుల ద్వారా అన్నదాతలు వాటిని వాడుకోవచ్చు' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితి(రైసస) ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం రైతుల సందేహాలు, ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చారు. ఆయన మాటల్లోనే... "ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని గతంలో అసెంబ్లీ తీర్మానం చేసి పంపాం. ఇప్పుడు ఈ సదస్సు కూడా ఇదే తీర్మానం చేస్తోంది. రైససల్లో తెరాస వాళ్లే ఉంటారని అసెంబ్లీలోనే నేను చెప్పా. బంగారు తెలంగాణకు మీరు కష్టపడతారని మిమ్మల్ని నమ్ముకుని నేను అసెంబ్లీలో చెప్పా.

జడ్జీలు తిట్టినా సిగ్గురావడం లేదు

కాళేశ్వరంపై 200 కేసులా? జడ్జీలు తిట్టినా సిగ్గుపడటం లేదు. తెలంగాణకు నీరు రావద్దా... ఇవి ప్రతిపక్షాలా...ఇదేనా పద్ధతి. సమన్వయ సమితులతో స్థానిక సంస్థలు నిర్వీర్యమవుతాయని కానిపోని ముచ్చట్లు చెప్పి కాంగ్రెసోళ్లు (మిగతా 2లో)



రైతు సమన్వయ సమితుల సదస్సులో నాగలి, ఎడ్లబండి నమూనాతో ముఖ్యమంత్రి

> 'రైతుల కోసం ఏదైనా చేయాలని ప్రధానికి 10సార్లు చెప్పా.. కానీ ఏం చేయలేదు. వారి ఆదాయం రెట్టింపు చేస్తామని కేంద్రం చెబుతున్నా అది నిర్మాణాత్మకంగా లేదు. కాంగ్రెస్, భాజపాలు వారికి చేసిందేమీ లేదు. ఏపీ కన్నా ఎంతో పైచేయిగా ఉన్నాం. ఎందరో మనల్ని పొగుడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోనే పెట్టుబడి కింద రూ.4 వేలను రైతులకు ఇస్తున్నాం' - సీఎం కేసీఆర్



రైతు సమన్వయ సమితుల సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగిస్తుండగా రైతుల కేరింతలు.. చిత్రంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కార్డుల ద్వారా పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. రైతుల కోసం ఒక సంస్థ పెట్టి వారికి శక్తినిచ్చి సంఘటిత పరుస్తామంటే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు. నేను కూడా రైతునే. సీఎంగా ఉన్నా 3 రోజులకొకసారి నా పొలానికి వెళ్లి గట్టువెంట తిరిగి మొక్కల కాత చూస్తుంటా. రైతులకు పంటకు మద్దతు ధర రావడం లేదని సమస్య వస్తది. వెంటనే మార్కెట్ల వద్ద జెండాలు పట్టుకుని డ్రామాలు. వీడు అధికారంలో ఉంటే వాడి ధర్నా. వాడు అధికారంలో ఉంటే వీడు ధర్నా చేయడం. కాంగ్రెసోళ్లు అధికారంలో ఉంటే తెదేపా వాళ్లు విద్యుత్తు రావడం లేదని కంకులు అసెంబ్లీకి తెచ్చేవారు. ఇలాగే తెదేపా వారు అధికారంలో ఉంటే కాంగ్రెస్ వాళ్లు తెచ్చేవారు. కానీ రైతులకు అప్పట్లో విద్యుత్తు లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్తు అందుబాటులో ఉంది. గతంలో ఉన్న పరిస్థితుల వల్ల ఆటో స్టార్టర్లు తెచ్చి పెట్టారు. కానీ 24 గంటల విద్యుత్తు వచ్చిన తరవాత వాటిని తీసే బాధ్యత రైసస లకు ఉంది. అవసరమున్నంత మేరకే విద్యుత్తును వాడుకోవాలి. ఏడాది పాటు భూగర్భ జలాలు కాపాడుకోవాలి. ఆ తర్వాత ఎత్తిపోతల పథకాల నీరు వచ్చి భూగర్భ జలాలు పెరుగుతాయి. అక్కడక్కడ 24 గంటల విద్యుత్తు వద్దు 12 గంటలే ఇవ్వాలని వినిపిస్తోంది. రైతులు ఇంత చేతకాకుండా ఉన్నారా ఇంత సన్నాసిగా ఉండొచ్చా.. ఇలా అంటున్నందుకు అయాం సారీ... 24 గంటల విద్యుత్తు ఇచ్చినందుకు గర్వపడాలి. దీనిని ఎట్టి పరిస్థితుల్లో ఆపం. హైదరాబాద్‌లో చెత్తకుండీలో ప్లాస్టిక్ ముక్కలు ఏరుకునేవారికి కూడా ఓ సంఘం ఉంటుంది. కానీ రైతులకు అలా సంఘం లేదు. ఇప్పుడు సమన్వయ సమితుల ఏర్పాటుతో వారంతా సంఘటితమై ఆటంబాంబులా పనిచేయాలి. మనం అమెరికాలో నేర్చుకోవాల్సిన అవసరం లేదు. మనం అనుకుంటే తెలంగాణ సాధించుకున్నట్లు బంగారు తెలంగాణ కావాలి. కేంద్రం హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నన్ను దిల్లీలో అడిగారు. ప్రపంచంలో పెట్టుబడి పథకం విప్లవాత్మకమైందని, మీరు ఇచ్చే సొమ్ము తిరిగి రైతు ఎన్ని కిస్తుల్లో వెనక్కివ్వాల్సి ఉంటుందని నన్ను ప్రశ్నించారు. రైతు తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని చెబితే ఆయన కుర్చీలో నుంచి పడినంత పని చేశాడు. మనదేశంలో ఇలా పెట్టుబడి ఇవ్వాలనే పథకం గురించి ఎవరూ ఆలోచించ లేదు. నేను కూడా మొండిగా దీన్ని ప్రకటించి రూ.12వేల కోట్లను బడ్జెట్‌లో పెట్టబోతున్నాం. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రైతులు రెండు పంటలు వరి ధాన్యం సాధారణ విలువ ప్రకారం పండిస్తే రూ.1.25 లక్షల కోట్ల విలువైన పంట వస్తుంది. అంత సొమ్ము వచ్చి వారు ఆర్థికంగా బలపడితే బంగారు తెలంగాణ అవుతుంది. ఇది వందశాతం నిజమవుతుంది. ఏదైనా చేయాలంటే ఆత్మవిశ్వాసం కావాలి. ఉద్యమంలో ఆంధ్రావాళ్లు నన్ను తిట్టినన్ని తిట్లు ఎవరినీ తిట్టలేదు. నా ఆత్మ విశ్వాసం గెలిచింది. ఈ వర్సిటీ ప్రాంగణం నుంచి అందరం ఒక ప్రతిజ్ఞ తీసుకుందాం. రూ.1.25 లక్షల కోట్ల పంటను మనం పండించాలి. ఈ సంకల్పం గెలవాలంటే కర్షకులను సంఘటితం చేయడమే. సంఘటిత శక్తిలో ఉన్న బలం చాలాగొప్పది. తెలంగాణ సమూహంగా కదిలి దిల్లీ మెడలు వంచి రాష్ట్రం తెచ్చుకున్నా. కల్తీ మందులు అమ్ముతున్నారు.. నష్టపోతున్నాం.. కల్తీ విత్తనం అమ్మేదెవరో మనకి తెలియదా. రైసస ఉంటే వారిని పట్టుకోలేరా... కల్తీ విత్తనం అమ్మే పురుగులను రైససలు వాచ్‌డాగ్స్‌లా ఉంటూ పట్టుకుని వాటిపై ఉక్కుపాదం మోపాలి. ఖమ్మం మార్కెట్‌లో లొల్లి ఎందుకవుతోంది. ఒకటేరోజు 50 గ్రామాల రైతులు పంట తెస్తారు. ఎలా తెస్తారు. అంత పంటను తూకం వేయడానికి సదుపాయాలుంటాయా, కొనడానికి ఏజెంట్లు ఉంటారా... పంటను మార్కెట్లకు తేవడానికి నియంత్రణ ఉండాలి. రైసస చెప్పినట్లుగా గ్రామాలవారీగా తేదీలు నిర్ణయించి మార్కెట్లకు తేవాలి.

5 వేల ఎకరాలకు లెక్కలు తీయాలి...

ప్రతీ 5 వేల ఎకరాలకు 'వ్యవసాయ విస్తరణ అధికారి'(ఏఈఓ) ఉన్నారు. వీరి పరిధిలో ఏ పంట ఎన్ని ఎకరాల్లో ఉందనే లెక్కలు తీసి రాష్ట్ర రైససకు పంపాలి. పంటల కాలనీల ఏర్పాటుకు సమితులు కృషి చేయాలి. రైతులంతా ఒకే తరహా పంట వేయకుండా చూడాలి. వ్యవసాయ, వాతావరణ ప్రాంతాలకు అనుగుణంగా, రాష్ట్ర ఆహార అవసరాల ప్రకారం పంటలు సాగుచేసేలా చూడాలి. స్కిల్ డెవలప్‌మెంట్ అంటూ ముచ్చట్లు చెప్పాల్సిన అవసరం లేదు. గొర్రెలు ఇస్తే వారే పెంచుకుని బలపడతారు. ఇలాగే రైతులు కూడా బలపడాలి. మండల రైససకు కంప్యూటర్ ఇస్తాం. మండల కార్యాలయం గది మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసుకోవాలి. రైసస చెప్పిన తేదీల్లోనే రైతులు పంటను మార్కెట్‌కు తెచ్చి ఏరోజుకారోజే అమ్మేసుకుని తిరిగి వెళ్లాలి. పాసు పుస్తకాలు పంపిణీ అయిన తరవాత 141 మంది సబ్ రిజిస్ట్రార్లు ఉంటారు. వారిని అలాగే ఉంచి మిగిలిన మండలాల్లో తహసీల్దార్లకే రిజిస్ట్రేషన్ అధికారం ఇస్తాం. రైతు పొలం అమ్మాలంటే తహసీల్దార్ నుంచి సమయం ఇవ్వగానే రిజిస్ట్రేషన్‌తో పాటు మ్యూటేషన్ కూడా అయిపోతుంది. ఏడాదిలోగా ఎత్తిపోతల పథకాలు పూర్తవుతాయి. వీటి ద్వారా వచ్చే నీటితో 2019 నాటికి కోటి ఎకరాలకు నీరు అందుతుంది. కాకతీయ రెడ్డి రాజులు, నిజాం నవాబులు చెరువులు తవ్వించి అనేక ప్రాజెక్టులు కట్టారు. మిషన్ కాకతీయతో చిన్న నీటివనరులు బాగు చేసుకుంటున్నాం. ఈరోజు నుంచి హీరోలం కావాలి. రైతుల కోసం ఏ పనైనా చేసే ప్రభుత్వం ఇక్కడ ఉంది. రైతు చేతిలో పెద్ద కొరడలాంటి వారు రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఛైర్మన్. ఈ పదవిలో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తాం.. దీనిపై వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తామని సీఎం ప్రకటించారు. ఆయన చేతిలోనే రూ.ఆరేడు వేల కోట్లుంటాయి. మండల రైసస తమ పరిధిలోని కమీషన్ ఏజెంట్లతో సమావేశమై మద్దతు ధరకు పంటలు కొంటారా లేదా అని అడుగుతారు. వారు కొనడం లేదని రాష్ట్ర రైససకు చెబితే వెంటనే కొంటుంది. ఇలా కొన్న పంటలను ఎక్కడ డిమాండు ఉంటే అక్కడికి పంపి అమ్ముకుంటుంది.

నేను పెట్టుబడిని వదులుకుంటున్నా..

రైతుల్లో కొందరు ధనవంతులున్నారు.. పెట్టుబడి పథకం కింద రూ.4 వేలను తీసుకోరు. ఈ రాష్ట్రంలో నేనే మొదట ప్రకటిస్తున్నా. నేను వదులుకున్న ఈ పెట్టుబడి సొమ్ము రాష్ట్ర రైససకు వెళుతుంది. ఏప్రిల్ నెలలో రైతులకు ఈ చెక్కులను సక్రమంగా పంపిణీ చేసిన రైసస సభ్యులను ఇజ్రాయెల్‌తో పాటు రెండు మూడు దేశాలకు సాగుపై అధ్యయనానికి పంపుతాం. పంటల కొనుగోలు వచ్చే ఏడాది రూ.ఆరేడు వేల కోట్లతో నిధి ఏర్పాటు చేస్తాం.. బ్యాంకు పూచీకత్తును రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రైససకు ఇస్తుంది. 1.61 లక్షల మంది రైతులు రైససల్లో సభ్యులున్నారు. వీరంతా పిడికిలి బిగిస్తే ఎంత సమస్య అయినా బద్దలవుతుంది. నాలుగైదేళ్లయితే నాట్లు వేయడానికి కూలీలు దొరకరు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతీ ఏఈఓ పరిధిలో 5 వేల ఎకరాల పరిధిలో వ్యవసాయ యంత్రాలు ఎన్ని ఉన్నాయనే లెక్కలు తీయాలి. మండలానికి 10 చొప్పున 5 వేల నాట్లు వేసే యంత్రాలను ఇవ్వడానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు పెట్టబోతున్నాం. ట్రాక్టర్లు కూడా రైససలు సమకూర్చుకోవాలి. వ్యవసాయ యాంత్రీకరణ తప్పనిసరి అవుతోంది. ఇది జరిగితే తప్ప మనం ముందుకు పోలేం. పలువురు రైతులు అడుగుతున్నందున టార్పాలిన్లను 75శాతం రాయితీతో ఇస్తాం' అని సీఎం అన్నారు.

మానవా... ఇక సెలవ్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు.

1978లోనే బాలీవుడ్‌కు...: బాలనటిగా 'జూలీ' చిత్రంలో 1975లో బాలీవుడ్ గుమ్మం తొక్కిన 'దేవత'... 'సొల్వా సావన్' (1978) చిత్రం ద్వారా పూర్తిస్థాయిలో తనదైన ముద్ర వేశారు. అక్కడికి అయిదేళ్ల తర్వాత 'హిమ్మత్‌వాలా' చిత్రంలో జితేంద్ర సరసన ఆమె పోషించిన పాత్ర వాణిజ్యపరంగా భారీ విజయాన్ని నమోదుచేసింది. 1969లో 'తునైవన్' తమిళ చిత్రంలో మురుగన్ పాత్రతో సినీరంగంలో అడుగుపెట్టిన ఆమె మలయాళం, కన్నడ చిత్రాల్లోనూ నటించారు. చారడేసి కళ్లతో, అద్భుతమైన నటనా కౌశల్యంతో ఆమె చేసిన చిత్రాల్లో మవాలీ (1983), తోఫా (1984), మిస్టర్ ఇండియా (1987), చాందినీ (1989) తదితర చిత్రాలు బాక్సాఫీసు రికార్డుల్ని తిరగరాశాయి. సద్మా (1983), చాల్‌బాజ్ (1989), లమ్హే (1991), గుమ్రా (1993) వంటి చిత్రాలైతే విమర్శకుల నుంచీ ప్రశంసలు అందుకున్నాయి. 1980లు, 1990ల్లో వెండితెర రారాణిగా మరే ఇతర కథానాయికలూ చేరుకోలేనంత ఎత్తుకు ఆమె ఎదిగింది. కథానాయకుల ఆధిపత్యమే ఎక్కువగా కనిపించే పరిశ్రమలో హీరోయిన్లకూ తిరుగులేదని రుజువు చేసుకున్న ఘనత ఆమెదే. ఒక చిత్రంలో ఆమె నటిస్తుందంటే అది హిట్ అవుతుందనేటంతగా పేరును సొంతం చేసుకొంది. తెరపై ఏ పాత్రలోనైనా ఇట్టే జీవించే శ్రీదేవి... నిజ జీవితంలో మాత్రం మహా సిగ్గరి. నటనలో, నాట్యంలో ఆమె శైలిని, దేశవ్యాప్తంగా అనేకమంది అభిమానులు అనుసరించేవారు.

దిగ్గజ కథానాయకుల సరసన...

మరిది అనిల్‌కపూర్, ఊర్మిళా మదోండ్కర్‌లతో కలిసి సొంత బ్యానర్‌పై 'జుదాయి' చిత్రంలో నటించాక బోనీకపూర్‌తో వివాహం, కుటుంబ బాధ్యతలతో దాదాపు 15 ఏళ్ల ఆమె చిత్రసీమకు దూరమయ్యారు. మళ్లీ 2012లో దర్శకుడు గౌరీశిందే రూపొందించిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' చిత్రంతో తెరపైకి వచ్చారు. 2017లో 'మామ్' చిత్రంలో చివరిసారిగా ప్రేక్షకులకు కనిపించారు. అది ఆమెకు 300వ చిత్రం. డిసెంబరులో విడుదల కానున్న షారూఖ్ ఖాన్ చిత్రం 'జీరో'లో అతిథి పాత్రలో ఆమె నటించారు. దిగ్గజ కథానాయకులందరి సరసనా శ్రీదేవి భిన్న పాత్రల్లో కనిపించారు. బాలీవుడ్‌ను తీసుకుంటే అమితాబ్ బచ్చన్, జితేంద్ర, రాజేష్‌ఖన్నా, అనిల్‌కపూర్; తెలుగులో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్; తమిళంలో రజనీకాంత్, కమల్‌హాసన్... ఇలా ఆమె సరసన నటించని అగ్రనటుడంటూ లేరు. ఆంగ్లం నేర్చుకోవాలని పరితపించే సగటు మధ్యతరగతి గృహిణిగా 'ఇంగ్లిష్ వింగ్లిష్'లో శ్రీదేవి నటన చూసినవారు ఆమెలో ప్రతిభ ద్వితీయాంకంలోనూ ఏమాత్రం తగ్గలేదని కొనియాడారు.



2013లో భారత ప్రభుత్వం ఆమెకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

కుమార్తె తొలి చిత్రాన్ని చూడకుండానే...

శ్రీదేవి తన పెద్ద కుమార్తె జాహ్నవిని కథనాయికగా తెరపై చూడాలని తపించారు. ఆ ప్రకారం 'ధడక్' అనే చిత్రం ద్వారా జాహ్నవి వెండితెరపైకి రాబోతున్నారు కూడా. మరాఠీలో సంచలనం సృష్టించిన 'సైరాత్' చిత్రాన్ని ఆధారంగా చేసుకుని దీనిని రూపొందిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ఆ వెండితెర సందడిని కనులారా వీక్షించకుండానే మహానటి కన్నుమూశారు. మృతదేహాన్ని భారత్‌కు తరలించడానికి దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం



ఆదివారం ముంబయిలోని అంధేరీలో శ్రీదేవి ఇంటి వద్ద విషణ్ణవదనంతో ఓ అభిమాని

అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భౌతిక కాయాన్ని పోలీసు ప్రధాన కార్యాలయంలోని శవాగారంలో భద్రపరిచారు. బాధాతప్త హృదయాలతో అభిమానులంతా ఉదయం నుంచే పెద్దఎత్తున శ్రీదేవి నివాసానికి చేరుకున్నారు. ఆమె మరణంపై ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

శవపరీక్ష పూర్తి చేయడంలో జాప్యం

శ్రీదేవి మృతదేహాన్ని ఆదివారం రాత్రికే ముంబయికి తీసుకురావాలని అన్ని ప్రయత్నాలూ జరిగినా శవపరీక్షలో జాప్యంకారణంగా అది సాధ్యం కాలేదు. దీంతో సోమవారమే మృతదేహాన్ని తరలించనున్నారు. శవపరీక్ష పూర్తయిందనీ, ఫోరెన్సిక్ ఆధారాల విభాగం నిర్వహించిన ప్రయోగశాల పరీక్షల నివేదికలు మాత్రం రావాల్సి ఉందనీ యూఏఈ అధికార వర్గాలు తెలిపాయి. రాత్రి పొద్దుపోయేవరకు దుబాయ్ పోలీసుల తుది నివేదికలు సిద్ధం కాలేదు. ఆసుపత్రి వెలుపల ఒక వ్యక్తిమరణిస్తే వివిధ రకాల పరీక్షలు పూర్తయి, నివేదికలు రావడానికి 24 గంటల వరకు సమయం పడుతుంది. శ్రీదేవి విషయంలోనూ అదే జరుగుతోంది. హోటల్‌లో స్నానపుగదిలో ఆమె కళ్లుతిరిగి పడిపోయారనీ, వెంటనే రషీద్ ఆసుపత్రికి తరలించారనీ స్థానికంగా వార్తలు వెలువడ్డాయి.



దివికేగడానికి కొన్ని క్షణాలకు ముందు

అంబానీ ఔదార్యం...
దుబాయ్‌కి రిలయన్స్ విమానం

ముంబయి: శ్రీదేవి భౌతిక కాయాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు రిలయన్స్‌కు చెందిన 13 సీట్ల ప్రైవేటు జెట్ విమానాన్ని దుబాయ్‌కి పంపించేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ ముందుకు వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ విమానం ముంబయి నుంచి దుబాయ్ వెళ్లింది. శ్రీదేవి పార్థివ దేహంతో పాటు కుటుంబ సభ్యులు, సమీప బంధువులు ఈ విమానంలో వస్తారు. సోమవారమే అంత్యక్రియలు జరుగుతాయని తెలుస్తున్నా, కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు.

హోటల్ గదిలోనే ఆమె ప్రాణం విడిచారు: సంజయ్‌కపూర్

దుబాయ్: ప్రముఖ సినీనటి శ్రీదేవి దుబాయ్‌లో బస చేసిన హోటల్లోనే ప్రాణం విడిచారని ఆమె మరిది, బాలీవుడ్ నటుడు సంజయ్‌కపూర్ తెలిపారు. 'ఆమెకు గుండె సంబంధిత జబ్బులేమీ లేవు. అయినా ఇలాజరగడంతో మేమంతా దిగ్భ్రాంతికి గురయ్యాం. కుటుంబం యావత్తూ ఆ విషాదాన్ని జీర్ణించుకోలేకపోతోంది' అని ఆదివారం 'ఖలీల్ టైమ్స్'కు ఆయన చెప్పారు.

పూలసాగులో ఆంధ్రప్రదేశ్‌కు నమూనా అవార్డు

ఈనాడు, అమరావతి: పూలసాగులో ఆంధ్రప్రదేశ్‌కు నమూనా అవార్డు లభించింది. పుణెలో పూలసాగుపై జరిగిన కార్యక్రమంలో ఉద్యానశాఖ ఏడీ శరవణన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఏడు దేశాల నుంచి ఫ్లోరికల్చర్ నిపుణులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పూలసాగులో రైతు ఉత్పత్తి సంఘాలు, పాలీహౌస్, షేడ్‌నెట్‌ల ఏర్పాటు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు.

అందం..అభినయం ఆమె సొంతం

- చిన్న వయసులోనే భిన్నపాత్రలు పోషించిన శ్రీదేవి
- 'మల్లి'గా భిన్న పార్శ్వాల్లో నట కౌశలం

సాధారణంగా అందమైన కథానాయికలకు ఓ శాపం ఉంటుంది. అందరూ వారి అందం గురించి మాట్లాడుకుంటారు తప్ప వారి నటనా ప్రతిభను పట్టించుకోరు. శ్రీదేవి మాత్రం దీనికి అతీతం. తొలి అడుగుల నుంచే అందాలు ఆరబోస్తూనే.. అప్పుడప్పుడూ నటనకు ఆస్కారమున్న బరువైన పాత్రలనూ ఎంచుకోవడమే అందుకు కారణం. 'పదహారేళ్ల వయసు' సినిమాలో మల్లి పాత్రే అందుకు నిదర్శనం. అప్పటికి శ్రీదేవి వయసు 14 ఏళ్లే. ఆ వయసులో ఎవరైనా చలాకీ పాత్రలే ఎంచుకుంటారు. శ్రీదేవి మాత్రం భిన్నపార్శ్వాలున్న పాత్రలో కనిపించారు. పల్లెటూరి అమ్మాయిలోని అమాయకత్వాన్ని ఎంత బాగా అభినయించిందో.. ఇష్టపడినవాడు మోసం చేసినప్పుడు.. అది తెలిసి తన తల్లి చనిపోయిన సమయంలో గుండెలు పిండే బాధను అంతే బాగా పలికించింది. అందుకే తమిళ భాషలో విడుదలైన ఆ సినిమా '16 వయదినిలే'కు గానూ ఆమెకు ఫిలింఫేర్ సౌత్ ప్రత్యేక పురస్కారం దక్కింది.





శ్రీదేవి అభినయానికి అద్దం పట్టిన మరో చిత్రం 'వసంత కోకిల'. ఓ ప్రమాదంలో గతాన్ని మర్చిపోయి తన జీవితంలోని విషాదాన్ని కూడా అర్థం చేసుకోలేని చిన్న పిల్లగా ఆమె నటన కన్నీళ్లు పెట్టించింది. అది ఆమె సిని ప్రయాణంలో అత్యుత్తమ పాత్రల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ సినిమా తమిళ మాతృక 'మూండ్రమ్ పిరై'లో కమల్ హాసన్ లాంటి అద్భుత నటుడి పక్కన నటించి కూడా తనదైన అభినయంతో మెప్పించింది. ఆ చిత్రంతో కమల్‌కు ఉత్తమ నటుడిగా, శ్రీదేవికి ఉత్తమ నటిగా తమిళనాడు ప్రభుత్వ పురస్కారాలు దక్కాయి.

'క్షణక్షణం'లో శ్రీదేవిని చూసి 'అమాయకత్వంలోనూ ఇంత అందముంటుందా!' అని ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. నిజ జీవితంలోనూ ఆమె అంత అమాయకురాలేమో అనిపించేంతలా శ్రీదేవి ఆ పాత్రను పండించింది. అందుకే ఆమెకు ఉత్తమ నటిగా నంది పురస్కారంతోపాటు ఫిలింఫేర్ కూడా లభించింది.

రెండో ఇన్నింగ్స్‌లోనూ భిన్నమైన పాత్రలు ఎంచుకుని మెప్పించిందామె. 'ఇంగ్లిష్ వింగ్లిష్'లో లడ్డూలు తయారు చేసి అమ్మే ఓ సాధారణ గృహిణిగా కనిపించింది. ఇంగ్లిష్ రాకపోవడం కారణంగా కుటుంబ సభ్యుల చేతిలోనే అవమానాలు ఎదుర్కొంటూ.. వయసుతో నిమిత్తం లేకుండా పట్టుదలతో ఇంగ్లిష్ నేర్చుకుని ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే ఓ ఉత్తమ ఇల్లాలి పాత్రలో ఆకట్టుకుంది. ఈ పాత్రకు ఆమెకు ప్రశంసలతో పాటు ఫిలింఫేర్ నామినేషన్ దక్కింది.

శ్రీదేవి ప్రధాన పాత్రలో నటించిన చివరి చిత్రం 'మామ్'. అందులో కూడా ఓ బలమైన పాత్రలో కనిపించింది. తన కూతురిని అత్యాచారం చేసిన దుర్మార్గులపై న్యాయపోరాటం చేసి, ఫలితం లేకపోవడంతో ప్రతీకారం తీర్చుకోవడానికి హింసామార్గాన్ని ఎంచుకున్న ఓ టీచర్‌గా శ్రీదేవి నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ పాత్రతో ఆమె ఫిలింఫేర్ నామినేషన్ అందుకుంది.

వీటితో పాటు 'లమ్హే'లో తల్లీకూతుళ్లుగా, 'చాల్‌బాజ్'లో కవలలుగా ద్విపాత్రాభినయం చేసి ఉత్తమ నటిగా ఫిలింఫేర్ పురస్కారాలందుకుంది శ్రీదేవి.

మార్చి 4న లక్ష పెళ్లిళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

కాకుంటే మళ్లీ ఏప్రిల్‌లో శ్రీరామనవమి తర్వాత మంచి రోజులు అందుబాటులోకి వస్తాయి. మూఢం, శూన్యమాసం వంటి నమ్మకాలు గలవారు సహజంగానే సరైన రోజుల కోసం ఎదురుచూస్తుంటారు. గత ఏడాది నవంబరు 23, 26 తేదీల తర్వాత మళ్లీ మంచి రోజులంటూ మార్చినెలలోనే వచ్చాయి. ఇంత వ్యవధి తర్వాత వస్తున్న.. మార్చి నాలుగో తేదీ చాలా బలమైన ముహూర్తమనేది పండితుల ఉవాచ. మార్చి 4, 6, 11 తేదీల్లోని అత్యధిక ముహూర్తాలు మధ్యాహ్నం 12 గంటలకు ముందువే కావటం విశేషం.

ఆ మూడు రోజులే ఎందుకంటే..

మార్చి 4వ తేదీ ముహూర్తం ఎందుకు మంచిదంటే.. ఆ రోజు హస్త నక్షత్రం. తిథి తదియ. అటువంటి లగ్నం శుభకరం. మార్చి 6న పంచమి. స్వాతి నక్షత్రం. 11న పూర్వాషాడ నక్షత్రం. మార్చిలో మరికొన్ని మంచిరోజులూ ఉన్నాయి.

– గుంగు ఉపేంద్ర శర్మ, అధ్యక్షులు, రాష్ట్ర అర్చక సమాఖ్య

గ్రహం అనుగ్రహం
26–2–2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
ఏకాదశి: మ. 3-13 తదుపరి ద్వాదశి
పునర్వసు నక్షత్రం: తె. 4-18 తదుపరి పుష్యమి
అమృత ఘడియలు: రా. 2-03 నుంచి 3-32 వరకు
వర్జ్యం: సా. 5-07 నుంచి 6-36 వరకు
దుర్ముహూర్తం: మ. 12-35 నుంచి 1-21 వరకు తిరిగి మ. 2-54 నుంచి 3-41 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-24; సూర్యాస్తమయం: సా.6-00

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విశాఖపట్నం	15.0	35.5
హైదరాబాద్	16.9	32.7
రామగుండం	17.1	36.6
హన్మకొండ	17.5	36.0
కరీంనగర్	18.0	34.0
మహబూబ్‌నగర్	18.5	35.6
ఆదిలాబాద్	18.8	37.2

చేర్చుకుంటున్నాయ్.. విద్యార్థులను ముంచేస్తున్నాయ్

- వృత్తి విద్యా కళాశాలల్లో నిబంధనలకు పాతర
- అనుమతులు ఇవ్వక..హాల్‌టికెట్లు రాక.. విద్యా సంవత్సరం వృథా

ఈనాడు, హైదరాబాద్: సీట్లు భర్తీ కావాలి.. రుసుముల రూపేణా ఆదాయం రావాలి.. ఇదే లక్ష్యంతో నిబంధనలకు పాతర వేస్తూ కొన్ని వృత్తి విద్యా కళాశాలలు బరితెగిస్తున్నాయి. అనుమతిచ్చిన సీట్ల సంఖ్యకు మించి.. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. పరీక్షలు రాయబోయే సమయంలో అక్రమాలు బయటపడి పరీక్షలకు దూరమవుతున్నారు. ఫలితంగా విద్యార్థులు తమకు న్యాయం చేయాలంటూ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యామండలి కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

■ అది హైదరాబాద్‌లోని పాతబస్తీ సమీపంలోని ఫార్మసీ కళాశాల. భారత ఫార్మసీ మండలి(పీసీఐ) ఆ కళాశాలలకు 60 బీఫార్మసీ సీట్లకు అనుమతి ఇచ్చింది. యాజమాన్యం మాత్రం స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా 15 మందికి అధికంగా ప్రవేశాలు కల్పించింది. విషయం తెలియని విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. అయితే హాల్‌టిక్కెట్లు రాకపోవడంతో యాజమాన్యం తమదేం తప్పులేదని, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచే జారీ కాలేదని చెప్పుకుంది. విద్యార్థులు ఓయూ, ఉన్నత విద్యామండలి కార్యాలయం చుట్టూ తిరిగారు. చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ప్రయోజనం దక్కలేదు. వారు ఒక ఏడాది నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురైంది.

■ చేవెళ్ల సమీపంలోని ఓ కళాశాలలో విద్యార్థులు బీఈడీ కోర్సులో ప్రవేశాలు పొందారు. అది మైనారిటీ కళాశాల. అక్కడ 100 సీట్లకు అనుమతి ఉంది. కన్వీనర్ కోటాలో 70 శాతం సీట్లను భర్తీ చేయాలి. సీట్లు మిగిలిపోతే వాటికి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించుకోవచ్చు. అందులో 30 శాతానికి మించి మైనారిటీయేతర్లకు సీట్లు ఇవ్వరాదు. అప్పటికీ ఇంకా మిగిలిపోతే వాటిని ఖాళీగా ఉంచాల్సిందే. కళాశాల యాజమాన్యం మాత్రం సీట్లు ఖాళీగా ఉన్నాయని మైనారిటీయేతర్లతో భర్తీ చేసింది. యాజమాన్యం విద్యార్థుల జాబితాను ఉన్నత విద్యామండలికి పంపింది. ఆ జాబితాను పరిశీలించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు కల్పించారని ఆమోదం తెలుపలేదు. దాంతో ఉస్మానియా వర్సిటీ హాల్‌టికెట్లను జారీ చేయలేదు. విద్యార్థులు ఆందోళనకు దిగారు. చివరకు యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించడంతో వారికి హాల్‌టికెట్లను మంజూరు చేశారు. నిబంధనలను బేఖాతరు చేస్తున్న కళాశాలలకు ఈ రెండు ఉదాహరణ మాత్రమే. ఇలాంటి కళాశాలలు ఇంకా ఎన్నో ఉన్నాయి. బీఈడీ కళాశాలలే 10 దాకా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారి ఒకరు స్పష్టం చేశారు. వీటిలో ఎక్కువగా మైనారిటీ హోదా ఉన్న కళాశాలలే కావడం గమనార్హం.

అడ్డుకునే మార్గాల్ని అన్వేషించని అధికారులు: విద్యార్థులను అప్రమత్తం చేసి నష్టపోకుండా చర్యలు తీసుకోవడంపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. నిబంధనలు పాటించలేదని ప్రవేశాలు పొందిన విద్యార్థుల జాబితాను తిరస్కరిస్తున్న ఉన్నత విద్యామండలి ఆ విషయాన్ని విద్యార్థులకు, తల్లిదండ్రులకు చెప్పడం లేదు. ఉన్నత విద్యామండలి పంపిన జాబితాలోని విద్యార్థులకు విశ్వవిద్యాలయాలు హాల్‌టికెట్లు జారీ చేస్తాయి. ఒకవేళ నిబంధనలు పాటించకుండా విద్యార్థులను చేర్చుకుంటే వారికి నష్ట పరిహారం కూడా చెల్లించేలా.. అనుమతి రద్దు చేసి వారిని ఇతర కళాశాలల్లో చేర్పించేలా నిబంధనలు కూడా మార్చాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.



రథంపై ఊరేగుతూ లక్ష్మీనరసింహస్వామి.. అంతరచిత్రంలో గరుడ వాహనంపై నరసింహుడు

యాదాద్రిలో దివ్యంగా రథోత్సవ వేడుకలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన ఆదివారం రథోత్సవం, గరుడోత్సవ సంబరాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో కీలకపర్వమైన రథోత్సవాన్ని దేవస్థానం రెండుమార్లు నిర్వహించింది. మొదట యాదాద్రిలోని బాలాలయంలో.. తరువాత యాదగిరిగుట్ట పట్టణంలో పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల మధ్య కనుల పండువగా నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి తెప్పోత్సవాలు ఆరంభం

తిరుమల, న్యూస్‌టుడే: సర్వజగద్రక్షకుడైన శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక తెప్పోత్సవాలు ఆదివారం తిరుమలలో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారి పుష్కరిణిలో సంధ్యాసమయాన రామావతారంలో తెప్పపై స్వామివారు విహరించారు. తితిదే ఏటా ఫాల్గుణ మాసంలో శుద్ధ ఏకాదశి రోజున తెప్పోత్సవాలను ప్రారంభించి పౌర్ణమివరకు ఘనంగానిర్వహిస్తుంది. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సీతా, లక్ష్మణ, ఆంజనేయ స్వామి సమేతంగా శ్రీరామచంద్రమూర్తి అవతారంలో శ్రీవారు పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. తెప్పోత్సవంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



శ్రీవారి పుష్కరిణిలో వేడుకగా సాగుతున్న తెప్పోత్సవం... తెప్పపై విహరిస్తున్న సీతారామ లక్ష్మణులు

సీఎం పిలుపుతో.. భూముల విరాళం

- ఎకరా చొప్పున ఇచ్చిన రైతులు
- వారిని సన్మానించిన కేసీఆర్
- ఓ అన్నదాత కుమార్తె వైద్యకోర్సుకు ఉపకార వేతనం మంజూరు


రైతువేదిక నిర్మాణానికి ఎకరం భూమిని విరాళంగా ఇచ్చిన ఓ రైతును సన్మానిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో నోముల నర్సింహయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి మహేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రైతు వేదికల నిర్మాణానికి భూములు విరాళంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో పలువురు అన్నదాతలు స్పందించి అప్పటికప్పుడు భూములిచ్చారు. ఆదివారం వ్యవసాయ వర్సిటీ మైదానంలో జరిగిన రైతు సమన్వయ సమితి సదస్సు ప్రాంతీయ సదస్సులో సీఎం ప్రసంగిస్తూ ప్రతీ 5 వేల ఎకరాల పరిధిలో ఏఈఓ కార్యాలయంతో రైతులు సమావేశం కావడానికి 'రైతు వేదిక'ల నిర్మాణాన్ని రూ.400 కోట్లతో చేపడతామని ప్రకటించారు. దీనికి ప్రతీ 5 వేల ఎకరాల వ్యవసాయ భూముల పరిధిలో ఎకరం చొప్పున భూమిని సేకరించాలని, రైతులెవరైనా విరాళంగా ఇస్తే తీసుకుంటామని తెలిపారు. సదస్సులో అప్పటికప్పుడు పలువురు ముందుకొచ్చి తమ సొంత భూమి ఎకరం చొప్పున విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం వారిని వేదికపైనే సన్మానించి అభినందించారు. ఈరోజుల్లో ఇలా ఎకరం భూమి విరాళంగా ఇవ్వడం గొప్ప విషయమని ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించారు. నల్గొండ జిల్లా ఆలియా మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం.లింగారెడ్డి రైతు వేదిక నిర్మాణానికి 12 లక్షల 116 రూపాయలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. కొడంగల్ మండలం రావులపల్లికి చెందిన బస్వారెడ్డి, నర్మెట్టకు చెందిన ఇ.శ్రీనివాసరెడ్డి, దేవరకొండకు చెందిన లాలా నాయక్, న్యాల్‌కల్ మండలానికి చెందిన పాండురంగారెడ్డి ఎకరం భూమి విరాళమిచ్చారు. దేవరకొండ మండలం నేరడిగుమ్మ గ్రామానికి చెందిన బాలూనాయక్ 30 గుంటల భూమి ఇచ్చారు. మక్తల్ నియోజకవర్గం నర్వ మండలానికి చెందిన మరో రైతు ఎకరా ఇస్తున్నట్లు ప్రకటించారు.

అక్కడికక్కడే ఉపకావేతనం మంజూరు...: ప్రభుత్వం నుంచి విదేశీ విద్యార్థుల ఉపకార వేతన (స్కాలర్‌షిప్) పథకం కింద సాయం అందుతుందని భావించి తన కుమార్తెను ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్ కోర్సులో చేర్పించానని.. ఇప్పుడు నిబంధనల ప్రకారం ఉపకార వేతనం రాదని అధికారులు చెబుతున్నారని.. చదువు ఆగిపోతోందని ఓ రైతు రోదిస్తూ సీఎంకు వినతిపత్రం సమర్పించారు. దీన్ని ప్రత్యేక కేసు కింద పరిగణించిన ముఖ్యమంత్రి అప్పటికప్పుడు ఉపకారవేతనం మంజూరు చేశారు.

ఆకుపచ్చ, గులాబీ రంగు కాగితాలపై సందేహాలు: సదస్సులో గంటన్నర సేపు ప్రసంగించిన అనంతరం సీఎం అక్కడే భోజనం చేసి తిరిగి గంట తరవాత మళ్లీ రైతుల సందేహాలు, ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. సదస్సు ప్రారంభంలో ప్రతి రైతుకు ఆకుపచ్చ, గులాబీ రంగు కాగితాలు, పెన్ను, వ్యవసాయ సమాచారంతో గల కవర్‌ను అధికారులు అందజేశారు. సీఎం ప్రసంగం సమయంలో రైతులు ఆ కాగితాలపై తమ సందేహాలు, ప్రశ్నలు రాసి డబ్బాల్లో వేశారు. భోజనానంతరం వాటికి సీఎం సమాధానాలివ్వగా.. కొన్నింటికి మంత్రి హరీశ్‌రావు సమాధానాలిచ్చారు. అంతకముందు వ్యవసాయమంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తూ ఎకరానికి రూ.4 వేల పెట్టుబడినిస్తూ రైతులను ఆదుకోవడంలో దేశానికి దిక్సూచిలా తెలంగాణ రాష్ట్రం మారిందన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏడాది వ్యవధిలోనే రూ.1000 కోట్లతో 18 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యమున్న కొత్త గోదాములను నిర్మించామన్నారు. కేంద్రం నుంచి వచ్చే మార్గదర్శకాల ఆధారంగా కొత్తగా మినీ మార్కెట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, జగదీష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, ఉప సభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంపీలు కేశవరావు, జితేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కేసీఆర్ జిల్లాల పర్యటనలు

ఈనాడు, హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ సోమ, మంగళవారాల్లో జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం పది గంటలకు ఆయన బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో కరీంనగర్‌కు వెళతారు. 10.40కి అంబేడ్కర్ స్టేడియంలో రైతు సమన్వయ సమితుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరుగుతుంది. అనంతరం తీగలగుట్టపల్లిలోని తన నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 27న ఉదయం కరీంనగర్ నుంచి హెలికాప్టర్‌లో అంతర్గాం మండలంలోని ముర్మూరుకు చేరుకుంటారు. అక్కడ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి చనఖా కొరాటా బ్యారేజ్‌ను సందర్శించి పనులను పరిశీలిస్తారు. తర్వాత 12.10కి బయల్దేరి ఆదిలాబాద్ చేరుకుంటారు. డైట్ మైదానంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.30కి అక్కడి నుంచి బయల్దేరి మూడు గంటల అయిదు నిమిషాలకు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ సీసీసీ అతిథి గృహం చేరుకుంటారు. అక్కడి సింగరేణి కార్మికులతో సమావేశమవుతారు. సాయంత్రం 5.50 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరతారు.

నేటి నుంచే కాంగ్రెస్ బస్సుయాత్ర

- ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతే అజెండా
- పాల్గొననున్న పార్టీ ముఖ్యనేతలు
- చేవెళ్ల సభతో ప్రారంభం
- మొదటి విడతలో 9 రోజులు


ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికలే లక్ష్యంగా ప్రజా చైతన్య బస్సు యాత్రకు సోమవారం శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలంతా కలిసికట్టుగా పాల్గొంటున్న బస్సు యాత్ర చేవెళ్ల బహిరంగసభతో ప్రారంభం కానుంది. మొదటి విడత యాత్రను తొమ్మిదిరోజులపాటు నిర్వహించనుంది. 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల నుంచే ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా ఈసారి కూడా అక్కడ నుంచే ప్రారంభిస్తోంది. తెరాస ఎన్నికల హామీలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి, కుటుంబ పాలన, రాష్ట్రం అప్పులు, మానవ హక్కుల ఉల్లంఘన, దళిత, గిరిజన, బీసీ బడుగువర్గాలపై దాడులు సహా పలు అంశాలను ప్రజలకు వివరిస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. తెలంగాణ వ్యతిరేకశక్తులకు ప్రాధాన్యం, అవినీతి, రైతుల ఆత్మహత్యలు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా ప్రస్తావించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణుల్లో విశ్వాసం..ఉత్సాహం నింపడం లక్ష్యంగా ముందుకుసాగుతామన్నారు. ప్రజా చైతన్య యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఆర్.సి.కుంతియా, సీఎల్పీనేత జానారెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క, మండలిలో కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్‌అలీతోపాటు పార్టీ సీనియర్‌నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొంటారు.

మొదటి విడతలో చేవెళ్లలో మొదలై కరీంనగర్ జిల్లా వరకు...: మొదటి విడతలో సోమవారం చేవెళ్ల బహిరంగ సభతో బస్సుయాత్ర ప్రారంభమై మార్చి 9న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగుస్తుంది. మధ్యలో ఒకటి, రెండు, మూడు తేదీల్లో యాత్రకు విరామం ఇచ్చారు. సోమవారం ఉదయం పది గంటలకు నాంపల్లి దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనతో ప్రజా చైతన్య రథం బయల్దేరుతుంది. 11గంటలకు ఆరమైసమ్మ ఆలయంలో పూజలు జరుపుతారు. తర్వాత మొయినాబాద్ చర్చిలో ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు వికారాబాద్ జిల్లా చేవెళ్లకు చేరుకుంటుంది. అక్కడ నిర్వహించే బహిరంగ సభతో బస్సుయాత్రను ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు వికారాబాద్ సభ, మంగళవారం తాండూరు, సంగారెడ్డి, బుధవారం జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ బహిరంగ సభలతోపాటు బస్సు యాత్ర జరుగుతుంది. మళ్లీ ఆదివారం యాత్ర మొదలై బోధన్, నిజామాబాద్, ఆర్మూరు, బాల్కొండ, నిర్మల్, మెట్‌పల్లి మీదుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగుస్తుంది.

అవినీతిని బయటపెడతాం.. ఉత్తమ్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెరాస ప్రభుత్వం అవినీతిని, అక్రమాలను బయటపెడతామని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, నిరుద్యోగ యువతకు రూ.3 వేలు చొప్పున భృతి ఇస్తామని ప్రకటించారు. బస్సుయాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరాభవన్‌లో జరిగిన ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెరాస ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. గాంధీభవన్‌లో ఉత్తమ్, భట్టివిక్రమార్కలు ఉస్మానియా ఐకాస, నిరుద్యోగ సంఘాలు రూపొందించిన నిరుద్యోగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ గుండె చప్పుడు పాటల సీడీని ఉత్తమ్ ఆవిష్కరించారు.

సిబ్బంది నియామకం.. శిక్షణ.. తర్వాతే బాధ్యతలు

- తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ సూచన

ఈనాడు, హైదరాబాద్: రెవెన్యూ శాఖలోని తహసీల్దార్లకు సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతలు అప్పగించే ముందు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక అంశాలపై దృష్టి సారించాలని తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్(టీజీటీఏ) సూచించింది. ఆదివారం ఇక్కడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గౌతంకుమార్ మాట్లాడారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్ల బాధ్యతల అప్పగింతపై పలు జిల్లాల్లో తహసీల్దార్ల నుంచి విముఖత వ్యక్తమైందని అన్నారు. బాధ్యతలు అప్పగించడానికి ముందు సిబ్బంది నియామకం చేపట్టి, శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తహసీల్దార్ల కార్యాలయాల్లో సరైన వసతులు, మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను టీజీటీఏ కార్యవర్గం ఆమోదించింది. పైలెట్ ప్రాజెక్టుగా ముందు కొన్నిజిల్లాల్లో అమలు చేయాలి. కార్యాలయాల్లో అంతర్జాలం, సాంకేతిక సిబ్బంది నియామకం చేపట్టాలి. రెవెన్యూ శాఖ తీరులోనే దస్త్రాల తనిఖీ అధికారం ఆర్డీఓ, జేసీ, కలెక్టర్లకే అప్పగించాలి. రెవెన్యూయేతర పనులను ఆయా శాఖలకే అప్పగించాలి. రిజిస్ట్రేషన్ చట్టంలో మార్పులు చేసి రిజిస్ట్రేషన్‌కు ముందే టైటిల్‌ను పరిశీలించే అవకాశం ఇవ్వాలంటూ తీర్మానాల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యాదగిరి, రామకృష్ణ, వెంకటరెడ్డి, పూల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

హోలీ తేదీపై సందిగ్ధం

ఒకటినా, రెండునా తేల్చాలని దేవాదాయ శాఖకు జీఏడీ లేఖ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో హోలి పండుగ సెలవుపై సందిగ్ధం ఏర్పడింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మార్చి ఒకటో తేదీని హోలీ సెలవుగా ప్రకటిస్తూ ఉత్తర్వులిచ్చింది. కేంద్రం తాజాగా మార్చి 2న హోలీ సెలవుగా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో తెలంగాణలో హోలి సెలవుపై అయోమయం ఏర్పడింది. హోలీ ఏ రోజనేది స్పష్టతివ్వాలని సాధారణ పరిపాలన శాఖ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిని కోరుతూ ఆదివారం లేఖ రాసింది. ఒకటో తేదీ సెలవును కొనసాగించాలా లేదా రెండో తేదీని ప్రకటించాలా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని సూచించింది. దీనిపై సోమవారం సమాచారం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటారు.

రికార్డుస్థాయిలో ఎస్జీటీకి హాజరు

- కొన్ని కేంద్రాల్లో వందశాతం నమోదు
- టీఎస్‌పీఎస్సీ ఆవిర్భావం తరువాత ఇదే అత్యధికం

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ)లో భాగంగా ఆదివారం సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) తెలుగు, ఇంగ్లిష్ మీడియం పోస్టులకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ రెండు పరీక్షలకు టీఎస్‌పీఎస్సీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో హాజరు నమోదైంది. టీఎస్‌పీఎస్సీ ఆవిర్భావం తరువాత ఈ స్థాయిలో ఎన్నడూ కనిపించలేదని తెలిసింది. ఆదివారం ఉదయం జరిగిన తెలుగు మాధ్యమం పరీక్షకు 95.7శాతం, మధ్యాహ్నం నిర్వహించిన ఇంగ్లిష్ మాధ్యమం పరీక్షకు 97.90శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం మీద ఈ పరీక్షలకు సగటున 96.8శాతం హాజరైనట్లు వెల్లడైంది. హెచ్‌ఎండీఏ పరిధిలో 86 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు కొన్ని చోట్ల వందశాతం హాజరు కావడం గమనార్హం. ఉదయం ఎస్జీటీ తెలుగు మాధ్యమ పోస్టులకు 53,435 మంది, మధ్యాహ్నం ఇంగ్లిష్ మాధ్యమం పోస్టులకు 28,619 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు.

నేటి పరీక్షలు: సోమవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ సబ్జెక్టు, మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ గణితం, సోషల్ స్టడీస్ ఇంగ్లిష్ మాధ్యమం సబ్జెక్టులకు కంప్యూటర్ ఆధారిత(సీబీఆర్‌టీ) పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల కోసం హెచ్ఎండీఏ పరిధిలో 10 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

టీజీటీ పోస్టులకు 6నుంచి పత్రాల పరిశీలన

గురుకులాల్లో టీజీటీ పోస్టులకు వచ్చే నెల(మార్చి) 6 నుంచి 9 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు ఉత్తర్వులు, కొందరు పోస్టులను వదులుకోవడం, గతంలో నిర్వహించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకాని స్థానాల్లో తదుపరి మెరిట్ సాధించిన 543 మంది అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ఎంపిక చేశామన్నారు. వీరికి టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. తదుపరి మెరిట్ సాధించిన అభ్యర్థుల ఫలితాలు, షెడ్యూలు వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

ఆ 'వంశ పాలన'ను
మా ప్రభుత్వంతో పోల్చి చూడండి

- కర్ణాటక, ఈశాన్య రాష్ట్రాల్లో మా విజయం ఖాయం
- ప్రధాన మంత్రి మోదీ వ్యాఖ్య

పుదుచ్చేరి: కాంగ్రెస్ 'వంశ పాలన'పై ప్రధాని మోదీ పరోక్ష విమర్శలు గుప్పించారు. 48 ఏళ్ల ఆ కుటుంబ పాలనను.. అభివృద్ధి దృక్పథం కలిగిన నాలుగేళ్ల ఎన్డీఏ పాలనతో పోల్చి చూడాలని కోరారు. ఆదివారం ఆయన.. భాజపా ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాన మంత్రి పుదుచ్చేరిలో ఒక బహిరంగ సభలో ప్రసంగించడం గత 33 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా 1984లో రాజీవ్ గాంధీ ఇక్కడ ప్రస్తావించారు. తమను విమర్శించే బదులు.. ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాల గురించి చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరిన నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "48 ఏళ్లపాటు ఒక కుటుంబం ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఈ దేశాన్ని పాలించింది" అంటూ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలను పరోక్షంగా ప్రస్తావించారు. 2004 నుంచి 2014 వరకూ అదే కుటుంబం.. రిమోట్ కంట్రోల్ సాయంతో ప్రభుత్వాన్ని నడిపిందని పరోక్షంగా మన్మోహన్ సింగ్ సర్కారు ప్రస్తావించారు. ' 'పుదుచ్చేరి నుంచి ఈ దేశంలోని మేధావులకు ఒక సందేశం ఇవ్వాలనుకుంటున్నా. కాంగ్రెస్ ప్రభుత్వాలు పాలనను భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 48 నెలల్లో సాధించిన అంశాలతో పోల్చి చూడాలి" అని పేర్కొన్నారు. కర్ణాటక, ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో భాజపా విజయం సాధించబోతోందని తెలిపారు. పుదుచ్చేరికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరోవిల్ అంతర్జాతీయ టౌన్‌షిప్ స్వర్ణోత్సవాల్లోనూ ప్రధాని మోదీ పాల్గొన్నారు. అంతకు ముందు పుదుచ్చేరిలోని శ్రీ అరబిందో ఆశ్రమాన్ని సందర్శించారు.


ఆదివారం సూరత్‌లో జరిగిన 'రన్ ఫర్ న్యూ ఇండియా మారథాన్'లో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

అన్నింటా మహిళల భాగస్వామ్యం పెంచుదాం

దిల్లీ: అన్ని రంగాల్లో మహిళలను సమాన భాగస్వాములుగా చూసుకోవాలన్నది నూతన భారతావని స్వప్నమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దేశాభివృద్ధిలో వారిని మమేకం చేయాలని ఆకాంక్షించారు. ప్రతినెలా చివరి ఆదివారం రేడియోలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం వృద్ధి చెందేలా చూడటం ప్రతి భారతీయుడి ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. మహిళలు.. తాము ఉన్నతిని సాధించటమే కాకుండా సమాజాన్ని, దేశాన్ని నూతన శిఖరాలకు నడిపిస్తున్నారన్నారు. మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ "పరిపూర్ణమైన మహిళత్వమే నిజమైన స్వాతంత్ర్యం" అన్న స్వామి వివేకానంద భావనను గుర్తుచేశారు. ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గుర్తు చేస్తూ "వైజ్ఞానిక ఆవిష్కరణల నిజమైన స్ఫూర్తి సారాంశం ఇదే" అని వివరించారు. "దైనందిన జీవితంలో భద్రత పట్ల అప్రమత్తంగా లేకుంటే, ఆ దిశగా సరైన ప్రమాణాలను నెలకొల్పుకోకుంటే విపత్తులను ఎదుర్కోవటం చాలా కష్టమవుతుంది"అని ప్రధాని హెచ్చరించారు. ప్రతియేటా నిర్వహించుకునే జాతీయ భద్రత దినోత్సవాన్ని (మార్చి 4వ తేదీ) ప్రస్తావిస్తూ...మన పొరపాట్ల ఫలితంగానే అత్యధిక దుర్ఘటనలు జరుగుతున్నాయన్నారు.

వ్యర్థాల నుంచి శుద్ధ ఇంధనాలు...: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యర్థాలను శుద్ధ ఇంధనాలుగా మార్చేందుకు ఇటీవల ప్రారంభించిన 'గోబర్ దాన్' గురించీ ప్రధాని మాట్లాడారు. గ్రామాల్లోని సేంద్రియ జీవ వ్యవసాయ వనరుల సేకరణ (గోబర్ దాన్) ప్రధాన లక్ష్యం పల్లె సీమల్లో పరిశుభ్రత తీసుకురావటం, సంపద సృష్టి, పశువుల పేడను ఇంధన వనరుగామార్చటం, వ్యవసాయ, వంటింటి వ్యర్థాలను ఎరువులుగా, బయో గ్యాస్‌గా మార్చటమని ప్రధాని వివరించారు.

కుల, మత రహిత దేశాన్ని నిర్మిద్దాం

సూరత్: కుల,మత, అవినీతి రహిత నూతన భారత దేశాన్ని నిర్మిద్దామని ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆదివారం సూరత్‌లోని లాల్‌భాయ్ కాంట్రాక్టర్ క్రీడాప్రాంగణంలో ''నవీన భారత్ కోసం పరుగు''ను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు మోదీ మాట్లాడుతూ.. యావత్ ప్రపంచం మనదేశ ప్రాధాన్యతను గుర్తిస్తోందని, మన లోపాలను సరిచేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఈనాడు

వెండితెరపై చెరగని సంతకం

యావత్ వినోద పరిశ్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది సినీ ప్రేక్షక జనావళీ విషాదయోగంలో మునిగిపోయింది. అందంతో అభినయ గంధంతో వెండితెరకు వెలుగు జిలుగులద్దిన దశాబ్దాల 'స్త్రీ సాధికార సిరి' శ్రీదేవి అర్ధాంతర మరణంతో భారతీయ చలనచిత్ర జగతి మౌనంగా రోదిస్తోంది. తరాల అంతరాలను చెరిపేసి, ఉత్తర దక్షిణాలను ఒక్కతీరుగా మంత్రముగ్ధం చేసిన శ్రీదేవి అయిదు దశాబ్దాల సినీ ప్రస్థానం అనన్య సామాన్యమైనది. తమిళనాట శివకాశి దీపావళి టపాసుల తయారీకి పెట్టింది పేరు. అక్కడ 1963 ఆగస్టులో జన్మించిన శ్రీ అమ్మయ్యంగార్ పిమ్మట నాలుగేళ్లకే బాలనటి శ్రీదేవిగా మారి సినీ వినీలాకాశంలో తారాజువ్వలా దూసుకుపోతుందని ఎవరు ఊహించారు? 1967లో శ్రీదేవి తెరంగేట్రం చేసిన తమిళ సినిమా కందన్ కరుణై ఆ మరుసటి సంక్రాంతికి విడుదలైంది. తదాదిగా 50 ఏళ్లలో 300 చిత్రాలతో భౌగోళిక ఎల్లల్ని చెరిపేసి హీరోలు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులే కాదు హీరోయిన్లకూ ఆదర్శ కథానాయికగా జాతీయస్థాయిలో శ్రీదేవి ఎగరేసిన జయపతాక- ఎన్నేళ్లయినా అవనతం కానిది! పలకా బలపం పట్టి ఒద్దికగా అక్షరాలు దిద్దాల్సిన వయసులో- దిగ్గంత కళాస్రష్టల కనుసన్నల్లో జీవిత పాఠాలు నేర్చుకొన్న ఘనాపాటి శ్రీదేవి. బాలనటిగా భిన్నభాషల్లో రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసిన శ్రీదేవి, పదమూడేళ్ల వయసులోనే బాలచందర్ దర్శకత్వంలో కథానాయికగా ఎదిగింది. బాలచందర్, భారతీరాజా, బాలూ మహేంద్ర, మహేంద్రన్, రాఘవేంద్రరావు, దాసరి, విశ్వనాథ్, బాపయ్య వంటి దర్శక శ్రేష్ఠుల మార్గనిర్దేశంలో నటనకు నగిషీలద్దుకొన్న విదుషీమణి- హిందీ చిత్రరంగంలో ఏకైక మహిళా సూపర్ స్టార్‌గా సృష్టించిన చరిత్ర జగద్విదితం. భారతీయ సినిమా కొత్తపుంతలు తొక్కుతున్న వేళ మరెన్నో ఉద్వేగభరిత పాత్రల్లో పద్మశ్రీ శ్రీదేవి నటనాపటిమకు నీరాజనాలు పలికేందుకు సిద్ధంగా ఉన్న కోట్లాది అభిమాన జనసందోహానికి ఆమె మరిలేరన్న దుర్వార్త- అక్షరాలా శరాఘాతం!

'అమితంగా కష్టపడు... అద్భుత కౌశలాన్ని ప్రదర్శించు; మంచి నటి కావాలంటే నిజాయతీగల మంచి మనుషులై ఉండటం ఎంతో ముఖ్యం; జీవితంలో ఏం సాధించాలన్నా ఒద్దిక, కృతజ్ఞత మరెంతో కీలకం'- శ్రీదేవి నోట జాలువారిన ఈ జీవన సూక్తులే ఆమె విజయ రహస్యాలు. 'మనసు ఆరోగ్యంగా ఉంటే ఆ కాంతి ముఖంలో ప్రతిఫలిస్తుంది... వీలైనంత వరకు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి, సకారాత్మకంగా ఆలోచించడానికే ప్రయత్నిస్తా'నన్న శ్రీదేవి- చిత్రసీమలో అజాత శత్రువనడంలో సందేహం లేదు. ఎన్టీఆర్, ఎంజీఆర్, శివాజీగణేశన్ వంటి మహానటులతో తొలుత మనవరాలిగా తరవాత కొన్నేళ్లకు జవరాలిగా నటించి మెప్పించిన శ్రీదేవి తదుపరి తరాలకూ కథానాయికగా నిలిచి గెలిచిన తీరు స్ఫూర్తిమంతం. కాలానుగుణ మార్పులకు దీటుగా తనను తాను తీర్చిదిద్దుకొంటూ, క్రమశిక్షణతో పరిశ్రమించబట్టే శ్రీదేవి దశాబ్దాలుగా ఇంటింటి బంధువైందన్నది నిర్ద్వంద్వం. అతిలోక సుందరిగా వాణిజ్య ప్రధాన చిత్రాలతో హిందీ చిత్ర రంగంలో పాగా వేసినా- సద్మా, మిస్టర్ ఇండియా, చాల్‌బాజ్, చాందినీ, లంహే, లాడ్లా, ఇంగ్లిష్ వింగ్లిష్, మామ్ వంటి చిత్రాలతో భారతీయ సినిమాకు మకుటం లేని మహారాణిగా శ్రీదేవి తనను తాను రుజువు చేసుకొంది. సహజాత నటనా కౌశలంతో ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసే శ్రీదేవి నిజ జీవితంలో తల్లిగా తన బాధ్యత నిర్వర్తించడానికి 1997 తరవాత పదిహేనేళ్లు చిత్రరంగానికి దూరం జరిగినా, చిత్తరువులు గీయడంలో తన ప్రావీణ్యాన్ని గొప్పగా ప్రదర్శించింది. అయిదున్నర పదుల వయసైనా రాకుండానే అర్ధాంతరంగా నిష్క్రమించిన శ్రీదేవి జాతి గుండెకు చేసిన గాయం ఎంత తీవ్రమైనదో- సామాజిక మాధ్యమాల్లో కోట్లాదిగా పోటెత్తుతున్న ట్వీట్లు, వ్యాఖ్యానాల కన్నీటి జడులే చెబుతున్నాయి!

'అమీర్, షారూఖ్, అక్షయ్, నేను- అందరం నటించిన చిత్రాలన్నీ కలిపినా 275 లోపే ఉంటాయి. అంకితభావం, కష్టపడే తత్వంతో తానొక్కరే మూడొందల చిత్రాల్లో నటించిన శ్రీదేవితో పోలిస్తే మేమెంత?'- కండలవీరుడు సల్మాన్ ఖాన్ నిరుడు మార్చిలో చేసిన ఈ వ్యాఖ్య చాలు, ఆ మహానటి స్థాయి ఏమిటో తెలుసుకోవడానికి! 'ఆమెను చూస్తూ పెరిగాం... ఆమె మనతో లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం' అన్న భారతరత్న సచిన్ తెందుల్కర్ స్పందన చెబుతోంది- శ్రీదేవి ముగ్ధ మనోహర నటనా శేముషీ ముద్ర ఏ ఒక్క వర్గానికో పరిమితమై లేదని! సామాన్య జనవాహిని నుంచి మంత్రులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి దాకా అందరికీ శ్రీదేవి మరిలేరన్న వార్త హృదయ విదారకమే. తెరపై ఓ పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేసే క్రమంలో వృత్తి నిబద్ధత, నిష్ఠలతో కష్టపడితే వారూ వీరన్న భేదం లేకుండా సమస్త వర్గాలకూ ఎంతగా చేరువ కావచ్చో తెలుసుకోవడానికి శ్రీదేవి చిరస్మరణీయ ఉదాహరణే! భారతీయ సినిమాకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2013లో ఐబీఎన్ లైవ్ ఛానల్ నిర్వహించిన ఎన్నికలో దేశంలోనే అత్యధిక ప్రజాదరణ కలిగిన నటీమణిగా శ్రీదేవి అగ్రపీఠిన నిలిచారు. తన బిడ్డల భవిష్యత్తుకు సంబంధించి తాను చేసిన వ్యాఖ్య అపార్థాలకు దారితీయడంతో నిరుడు జూన్‌లో శ్రీదేవి ఇచ్చిన వివరణ- స్త్రీజాతికి కరదీపిక లాంటిది. 'యువతుల అంతిమ లక్ష్యం పెళ్ళిళ్లు చేసుకుని పిల్లల్ని కనడం మాత్రమే కారాదు. వారు కోరుకుంటే, జీవితంలో ఏదైనా సాధించి తమను తాము నిరూపించుకోవడం వారి హక్కు' అని స్పష్టం చేసిన శ్రీదేవి- ఎలాంటి దన్నూ లేకుండానే తనను తాను సాన పట్టుకుంటూ అద్భుతంగా ప్రకాశించిన కోహినూర్ వజ్రం. విస్పష్ట లక్ష్యం, క్రమశిక్షణ, కఠోర శ్రమ, వినయ శీలతలతో తారాలోకంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకొన్న అరుంధతీ నక్షత్రం!

ప్రోత్సహిస్తే... పాడిరైతే రాజు

దేశంలో పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పాల ఉత్పత్తి పెరిగే వర్షకాలం, శీతకాలంలో పాల ధర తగ్గించేసి డెయిరీలు రైతులను దెబ్బతీస్తున్నాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గే వేసవి సీజన్‌లో పాలపొడితో పాలను తయారుచేసి ప్రజలకు విక్రయిస్తున్నాయి. గత రెండేళ్లలో రైతుల నుంచి కొనే పాల లీటరు ఉత్తర భారత రాష్ట్రాల్లో సగటు ధర 20 శాతం వరకూ తగ్గింది. పాలు అధికంగా వచ్చే సమయంలో దానితో పొడి తయారుచేసి డెయిరీలు నిల్వ చేస్తున్నాయి. సహకార డెయిరీలు నిధుల కొరతతో అభివృద్ధికి దూరంగా సతమతమవుతున్నాయి. వేలాది కోట్ల రూపాయల విపణి కళ్లముందే ఉన్నా దాన్ని అందుకోలేని దుస్థితి. ఆపై ఉన్నవాటి బాగుకు తక్షణ కార్యాచరణా కానరావడం లేదు. 'ఆపరేషన్ ఫ్లడ్' పథకం కింద రూ.10,881 కోట్లతో డెయిరీ మౌలిక సదుపాయాల నిధి ఏర్పాటు చేస్తున్నట్లు గతేడాది కేంద్రం ప్రకటించింది. మూడేళ్లలోగా వీటిని ఖర్చు చేసి కొత్త పాలశుద్ధి కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏడాది పూర్తవుతున్నా ఇంతవరకూ ఒక్క కేంద్రమూ కొత్తగా ఏర్పాటుకాలేదు. పది లక్షల లీటర్ల పాల శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేయాలని తెలంగాణలో కొన్నేళ్లుగా డిమాండు ఉన్నా ఇంకా పునాదిరాయే పడలేదు. ప్రైవేటు డెయిరీలు ఏటా శీతకాలంలో పాల ఉత్పత్తి పెరగ్గానే కొనుగోలు ధర తగ్గించేయడం, ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవడం వల్ల పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాడి రైతులకు తప్పనిసరి ఆదాయం పెంపుపై ఎలాంటి పూచీకత్తు ఎవరూ ఇవ్వనందువల్ల పాడి పశువులను వదిలించుకునే రైతుల సంఖ్య పెరుగుతోంది. పెద్ద ప్రైవేటు డెయిరీల వ్యాపార వ్యూహాలకు చిన్నచిన్న డెయిరీలు చితికిపోయి అప్పులపాలవుతున్నారు.

కొరవడిన వ్యూహాలు

దేశంలో పాల వ్యాపారం అత్యధిక శాతం ఎక్కువగా అసంఘటిత రంగంలో ఉన్నందువల్ల భారత రైతులకు ఆదాయం పెరిగే అవకాశాలు స్థిరంగా ఉండటం లేదు. గత రెండేళ్లలో పాల పొడి నిల్వలు పెరగడంతో ధర సైతం ఏకంగా 37 శాతం తగ్గింది. కిలో పొడి టోకు ధర దేశీయ విపణిలో 2016 జనవరిలో రూ.265 ఉంటే గత నెలలో రూ.147కు పడిపోయిందని 'జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య'(ఎన్‌డీడీబీ) వెల్లడించింది. నిరుడు మలి అర్ధభాగం (2107 జూన్-డిసెంబరు) మధ్యకాలంలో పాల విక్రయ ధరలు పలు రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గడంతో రైతులు ఇబ్బందుల పాలయ్యారు. ఈ కాలవ్యవధిలో రోజుకు 40 లక్షల టన్నుల పాలు అధికంగా విపణికి రావడమే ధరల పతనానికి కారణం. పాలు వెల్లువలా రావడంతో డెయిరీల రోజూవారీ సేకరణ ఏకంగా 26 శాతం అదనంగా పెరిగింది. కానీ మార్కెట్‌లో విక్రయాలకన్నా 36 శాతం పాలు అధికంగా రైతులు తీసుకురావడం వల్ల వాటిని గత్యంతరం లేక పాలపొడిగా మార్చుతున్నట్లు సహకార పాల డెయిరీలు సమాఖ్యకు నివేదించాయి. దేశవ్యాప్తంగా సహకార డెయిరీల రోజూవారీ పాల విక్రయాలు 3.38 కోట్ల కిలోలు కాగా, కొనుగోలు 5.35 కోట్ల కిలోలకు చేరడం వల్ల పాలపొడి మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి సహకార డెయిరీలో పాలపొడి నిల్వలు ఏకంగా రెండు లక్షల టన్నులు దాటవచ్చని అంచనా. ప్రపంచవ్యాప్తంగా 2017లో 83.30 కోట్ల టన్నుల పాల ఉత్పత్తిలో ఆసియా దేశాల వాటా 41 శాతం ఉంది. రోజుకు 16.40 కోట్ల టన్నుల పాలతో భారతదేశం అగ్రస్థానానికి చేరింది. తూర్పు ఆసియా, చైనా సహా పలు దేశాల్లో పాల కొరత ఉంది. 1995-2006 మధ్యకాలంలో పాల ఉత్పత్తి ప్రపంచ వార్షిక వృద్ధిరేటు మూడు శాతానికి చేరగా, తరవాత అది క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం ఒక శాతానికి పడింది.

దేశాలవారీగా చూస్తే పాల ఉత్పత్తిలో చాలా అంతరముంది. ఉదాహరణకు తెలంగాణ అంత కూడా లేని న్యూజిలాండ్ లాంటి అతి చిన్న దేశం అక్కడి ప్రజల అవసరాలతో పోలిస్తే 311 శాతం అధికంగా పాలను ఉత్పత్తి చేసి ప్రపంచ విపణిలోకి వదులుతోంది. ఐరోపా సమాఖ్య సైతం తమ అవసరాలకన్నా 12 శాతం అధికంగా ఉత్పత్తి చేస్తోంది. ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే అవసరాలకన్నా తక్కువగా పాలు లభిస్తున్నాయి. 2010-16 మధ్యకాలంలో ఆసియా దేశాల్లో పాల ఉత్పత్తి 93 నుంచి 91 శాతానికి తగ్గింది. అంటే ప్రజల అవసరాలకన్నా తొమ్మిది శాతం తక్కువగా పాలు ఇక్కడ లభిస్తున్నాయి. ఇది న్యూజిలాండ్, ఐరోపా దేశాలకు ఆదాయాన్ని సృష్టించే విపణిగా మారుతోంది. భారత దేశానికి సమీపంలోని పలు ఆసియా దేశాలకు న్యూజిలాండ్ పాలు, పాల ఉత్పత్తులు విక్రయించి సొమ్ము చేసుకుంటోంది. అవే పాలు భారత్‌లో ఉత్పత్తి అయితే అక్కడికన్నా తక్కువ ధరకే ఈ దేశాలకు అమ్మి భారత రైతులకు ఆదాయాన్ని పెంచవచ్చు. ప్రపంచ పాల విపణిలో 1.5 శాతం అంటే ఏటా 1.20 కోట్ల టన్నుల పాల కొరతకు సమానం. ప్రపంచ మార్కెట్‌లోకి అత్యధికంగా పాలను ఎగుమతి చేస్తున్న అయిదు అగ్ర దేశాల్లో పాల ఉత్పత్తి పెరగకపోవడమూ ఆందోళన రేకెత్తించే అంశం. ఇక ప్రజల పాల కొరత ఎవరు తీరుస్తారన్నది ఇప్పుడు ప్రపంచ పాడి పరిశ్రమ వర్గాలను వేధిస్తున్న ప్రశ్న. 2025నాటికి భారతదేశంలో పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని ప్రపంచ పాల విపణి ఆశగా ఎదురుచూస్తోంది. ప్రపంచంలో అత్యంత తక్కువ ధరకు పాలను ఉత్పత్తి చేసి మార్కెట్‌లో అమ్ముకునేది భారత రైతులే కావడం అందుకు కారణం! కెనడా, బ్రిటన్, జపాన్ లాంటి దేశాల్లో లీటరు ఉత్పత్తి వ్యయం రూ.60 దాటుతుంటే ఇండియాలో రూ.30 నుంచి రూ.40కే రైతులు విక్రయిస్తున్నారు. ప్రపంచ జనాభా, పాల గిరాకీ నికరంగా పెరుగుతున్నందువల్ల విపణి అవకాశాలు సైతం ఎప్పుడూ అధికమవుతాయని అంచనా. భారత్ చుట్టుపక్కల దేశాలన్నీ పాల ఉత్పత్తులను దిగుమతి చేసే స్థాయిలో ఉన్నందువల్ల ఇక్కడి రైతులకు మంచి మార్కెట్ అందుబాటులో ఉంది. ఉదాహరణకు చైనా ప్రజల అవసరమైన పాలలో 16 శాతం వరకూ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. కానీ మనదేశానికి ఇప్పటివరకూ అలాంటి పరిస్థితి రాలేదు. శ్రీలంక సైతం 57 శాతం పాలను దిగుమతి చేసుకుంటోంది. తెలుగు రాష్ట్రాల్లో చిన్న చిన్న గ్రామస్థాయి డెయిరీలను నడపలేక మూసేస్తున్నారు. విద్యావంతులు ఆసక్తిగా అప్పులు తెచ్చి చిన్న డెయిరీలు పెట్టినా తట్టుకోలేక ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నారు. వారికి భరోసా ఇస్తే రైతుల ఆదాయం పెంచడానికి అందుబాటులో మార్కెట్ ఉంటుంది.



ప్రపంచ విపణిలో అపార అవకాశాలు




దేశంలో మొత్తం ఒకరోజు పాల విలువ	: రూ.5,265 కోట్లు
ఇందులో రైతులు వాడుకుంటున్న పాల విలువ	: రూ.1,183 కోట్లు
అన్నీ డెయిరీలు పాల వ్యాపారం విలువ	: రూ.1,545 కోట్లు
అసంఘటిత రంగంలో అమ్మే పాల విలువ	: రూ.2,535 కోట్లు
గత డిసెంబరులో సహకార డెయిరీలు రోజూవారీ సేకరణ	: 5.35 కోట్ల కిలోలు
రోజూవారీ ప్రజలకు విక్రయించింది	: 3.38 కోట్ల కిలోలు
పాల ఉత్పత్తులకు వినియోగించిన పాలు	: 30 లక్షల కిలోలు
పాలపొడికి రోజూ మళ్లించిన పాలు	: 1.67 కోట్ల కిలోలు

ఆధారం: ఎన్‌డీడీబీ గణాంకాలు

అందిపుచ్చుకోవాల్సిన తరుణం

భారత రైతుల ఆదాయాన్ని 2022 నాటికల్లా రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకుని అప్పుడే రెండేళ్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఇప్పటివరకూ ఆదాయం పెంపు పరంగా పెద్దయెత్తున వ్యవసాయాభివృద్ధి పథకాలను కేంద్రం ప్రకటించడం మంచిదే. కానీ అందుకు అనుగుణంగా పాడి పరిశ్రమను సైతం సమాంతరంగా ప్రోత్సహిస్తేనే అన్నదాతకు ఆదాయం నికరంగా పెరుగుతుంది. 'పాడి-పంట' అనేది అనాదిగా ఉన్న నినాదం. ఇప్పుడు రైతులకు ఆదాయం అంటే పంట నుంచి మాత్రమేనన్నట్లుగా వ్యవసాయాభివృద్ధి పథకాలపైనే దృష్టి పెట్టడం సరికాదు. 'ఐరోపా సమాఖ్య వ్యవసాయ అవుట్‌లుక్-2017' పేరుతో ఇటీవల విడుదల చేసిన నివేదికలో 2030 నాటికి సార్క్, మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా, చైనా దేశాలు ఏటా 4.50 కోట్ల టన్నుల పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకునే స్థాయికి చేరతాయని అంచనా వేసింది. ఇదంతా భారత రైతుల ఆదాయం పెంచడానికి గల బంగారం లాంటి అవకాశమని విధాన కర్తలు గుర్తించాలి. ప్రపంచ విపణిలో గిరాకీ పెరుగుతున్నందున అమెరికా, న్యూజిలాండ్, ఈయూ డెయిరీలు పాల వ్యాపారాన్ని విస్తృతం చేస్తున్నాయి. అదే తీరు భారత్‌లో కానరావడం లేదు. ప్రస్తుతం అమెరికా, ఈయూ దేశాల డెయిరీల వల్ల 5.31 లక్షల టన్నుల పాలపొడి నిల్వలున్నాయి. అదే తీరులో భారత్‌లోనూ రెండు లక్షల టన్నులకు చేరాయి. దీనివల్ల ప్రపంచ మార్కెట్ పొడి టోకు విక్రయ ధర 2013-17 మధ్యకాలంలో 5,563 డాలర్ల నుంచి 1725 డాలర్లకు తగ్గింది. పాల పొడి నిల్వలు పెరుగుతున్నాయంటే వాటితో పాలు తిరిగి తయారుచేయడానికి అవకాశాలు పెరిగినట్లు అర్థం. అంటే పరోక్షంగా పాల కొనుగోలు ధర పెరగడానికి అవకాశం ఉండదు. దీనివల్ల పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా రైతులకు ఆదాయం పెరగక నష్టాలు తప్పవు. వారిని ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు, ప్రోత్సాహకాలతో ముందుకురావాల్సిన అవసరముంది. దేశంలో గుజరాత్, కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో సహకార డెయిరీలు అధ్వానంగా ఉండటం వల్ల రైతులకు, వినియోగదారులకు కష్టాలు తప్పడం లేదు. ఈ డెయిరీల్లో 76 శాతం పాలశుద్ధి ప్లాంట్లు అత్యంత పురాతనమైనవి. మొత్తం 297 ప్లాంట్లలో కేవలం 24 శాతం పాలశుద్ధికే ఆధునాతన యంత్రాలున్నాయి. సహకార డెయిరీలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధారాళంగా నిధులు ఇవ్వాలి. అది సాధ్యం కాకుంటే వడ్డీలేని రుణాలైనా ఇప్పించాలి. సహకార డెయిరీలను ప్రోత్సహిస్తే రైతులకు నికరంగా ఆదాయం పెంచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన పాలను అందించడానికి మంచి మార్గం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో సహకార డెయిరీల మధ్య అనైక్యత వల్ల ప్రైవేటు డెయిరీలు ఆడింది ఆటగా సాగుతోంది. వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు సమైక్య పరచి పాలశుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు విరివిగా ప్రోత్సహిస్తే రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. దేశంలో అమ్ముతున్న పాలలో 75 శాతం వరకూ కల్తీ, నాసిరకం అని గతంలోనే నిర్ధారణ అయింది. స్వచ్ఛమైన, నాణ్యమైన పాలు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పాలకులు పూచీకత్తు ఇవ్వాలి. ఇలాంటి కనీస అవసరాలపై దృష్టి పెట్టకుండా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భవ అంటూ వేల కోట్ల రూపాయలు ఆస్పత్రులకు ఇస్తామంటూ పథకాలు తేవడం వల్ల ప్రజల ఆరోగ్యం ఎంతకాలానికి బాగుచేయగలరన్నది ఆలోచించాలి!

– మంగమూరి శ్రీనివాస్



సందీప్‌పాండే

ఈ చదువులు మారాలి!

బండెడు పుస్తకాలు భుజాన వేసుకొని పాఠశాలలకు వెళ్ళే పిల్లలకు చివరికి మిగులుతోంది మోత బరువే తప్ప జ్ఞానం కాదు! జీవితానికి అక్కరకు రాని చదువులు ఇప్పుడు దేశానికి అతిపెద్ద సమస్యగా ఉన్నాయి. పాఠాలను బట్టీయం వేయించి, తిరిగి వాటిని అప్పజెప్పించుకొని, పరీక్షల్లో అవే పాఠాలు వారిచేత రాయించే రొడ్డకొట్టుడు విధానాలకు చెల్లుచీటీ పాడక పోతే- మున్ముందు సొంతంగా ఆలోచించే బుద్ధి జీవులే దేశంలో కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది. ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు సిద్ధం కావడమెలా అన్న విషయంపై దేశవ్యాప్తంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ప్రసంగించారు. మరోవంక వచ్చే విద్యా సంవత్సరం నుంచి జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠ్యాంశాలను సగానికి తగ్గిస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు ప్రకాశ్ జావడేకర్ తాజాగా ప్రకటించారు. అయితే జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ పరిధిలోని పాఠశాలల్లో హాజరును తప్పనిసరిగా మారుస్తూ ప్రభుత్వం ఇటీవల వెలువరించిన నిర్ణయంపట్ల మాత్రం విద్యార్థులనుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చెవిపట్టుకు మెలివేసి పిల్లలను ఠంచనుగా స్కూలుకు తీసుకురావడం అన్ని సందర్భాల్లోనూ ఆమోదయోగ్యం కాదు. అసలు ఇలాంటి విధానాలవల్ల విద్యావ్యవస్థ బాగుపడుతుందా అన్నది ఆలోచించాల్సి ఉంది.

పాఠ్యాంశాలను సంపూర్ణంగా అవగాహన చేసుకోవడం, పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించడం రెండూ వేర్వేరు ప్రక్రియలు! పరీక్షల్లో కేవలం అత్యధిక మార్కులు సంపాదించడమే లక్ష్యంగా పిల్లలపై ఒత్తిడి తీసుకువస్తే వారి మానసిక వికాసం ఆగిపోతుంది. అవగాహనకు కొదవపడుతుంది. కానీ దేశంలో దురదృష్టవశాత్తూ జరుగుతోంది ఇదే! విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టి మార్కుల చుట్టే తిరుగుతోంది. పుస్తకాల్లోని పాఠాలపై సంపూర్ణ అవగాహన ఏర్పడినప్పుడే వాటిని సరిగ్గా నేర్చుకున్నట్లు లెక్క! తమ అభిరుచులకు అనుగుణమైన అంశాలు ఎంపిక చేసుకొని, సహజ సిద్ధమైన పద్ధతిలో, తమకు అనుకూలమైన వాతావరణంలో వాటిని నేర్చుకునే వెసులుబాటు విద్యార్థులకు ఉండాలి. ఈ మొత్తం ప్రక్రియలో ఉపాధ్యాయులు కేవలం సమన్వయ కర్తలుగానే ఉండాలి. పిల్లలను యంత్రాలుగా మార్చి, పాఠాలు బట్టీ వేయించే అహేతుక పథంలో ఉపాధ్యాయలోకం ప్రయాణం చేయరాదు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే విద్యా విధానం నేడు దేశానికి అవసరం. సామాజిక బాధ్యతను తెలియజెప్పి,



మేధోవికాసమే లక్ష్యం కావాలి

విద్యార్థులను బాధ్యతగా పెంచే చదువులకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. నిత్య జీవన పథంలో అవసరపడే విజ్ఞానం, నైపుణ్యాలను సమకూర్చుకోవడంపై విద్యార్థులు దృష్టిపెట్టాలి. పాత పద్ధతుల్లోనే ఇంకా బట్టీయం చదువులను పట్టుకు వేలాడితే దేశానికీ, విద్యార్థులకూ ఇసుమంతైనా ప్రయోజనం ఉండదు.

తరగతి గదుల్లో విద్యార్థుల హాజరుకు నిక్కచ్చి కొలబద్దలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ఇటీవల వెలువరించిన నిర్ణయం చూస్తే మనం తప్పు దారిలో వెళుతున్నామేమో అనిపిస్తోంది. బలవంతంగా కూర్చోబెట్టి, అదే పనిగా ఊదరగొడితే పిల్లల బుర్రల్లోకి చదువులు ఎక్కవు! విద్యార్థుల్లోని సహజ నైపుణ్యాలకు పదును పెడుతూ, వారిలో కొత్త ఆలోచనలు రగిలిస్తూ పాఠాలు బోధించగల సామర్థ్యం ఉన్న ఉపాధ్యాయులను తయారు చేయడంపై ఇప్పుడు ప్రధానంగా దృష్టి పెట్టాలి. అలాంటి గొప్ప గురువులను తయారు చేసుకోగలిగితే పిల్లలు తరగతి గదులు వదిలి ఒక్క క్షణం బయటకు పొమ్మన్నా పోరు! అర్థంకాని సూత్రీకరణలను పిల్లల బుర్రల్లోకి బలవంతంగా కూరే ప్రయత్నం చేసినన్నాళ్లూ స్కూళ్లు... పిల్లలకు చేరువ కాలేవు. కొందరు విద్యార్థులు పాఠాలను త్వరగా నేర్చుకోగలరు... ఇంకొందరికి రెండు మూడు సార్లు అదనంగా చదివితే తప్ప అది సాధ్యం కాదు. పాఠం నేర్చుకోవడానికి విద్యార్థులు ఎంత సమయం తీసుకున్నారన్న దానికన్నా- అందులోని సారాన్ని వారు నిర్దుష్టంగా అర్థం చేసుకున్నారా లేదా అన్నదే ముఖ్యం. పాఠాలపై పిల్లలకు సంపూర్ణ అవగాహన ఏర్పడే వరకూ వారికి సమయం ఇస్తూనే ఉండాలి. అంతేగానీ నిర్దిష్ట కాలావధిలో పాఠాలు అప్పజెప్పాలంటే వారు బట్టీ కొడతారే కానీ, వాటిని అర్థం చేసుకొనే ప్రయత్నం చేయరు!

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య ప్రణాళికను సగానికి తెగ్గోస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ప్రకటించడం బాగానే ఉంది. పాఠాల బరువు తగ్గించడం తోపాటు వాటి నాణ్యతను పెంచడం, అభ్యసన తీరుతెన్నుల్ని మార్చడం కూడా ఇప్పుడు అవసరం. కేవలం ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకొని, జీవితంలో కుదురుకోవడమే లక్ష్యంగా విద్యార్థులకు చదువులు చెబుతున్నామా లేక వారి సర్వతోముఖ వికాసాన్నీ తద్వారా జాతి అభివృద్ధినీ కాంక్షిస్తున్నామా అన్న విషయాన్ని తేల్చుకోవలసి ఉంది. కేవలం ఉద్యోగంలో కుదురుకోవడమే చదువుల లక్ష్యమైతే విద్యావిధానం కొరగానిదిగానే మిగిలిపోతుంది. విద్యార్థులకు తరగతి గదుల్లో పాఠాలను విశదీకరించడంతోపాటు, వారికి ఆచరణాత్మక జ్ఞానం అలవడేట్లుగానూ చర్యలు తీసుకోవాలి. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో సామాజిక, ఆర్థిక వికాసాన్ని దగ్గరనుంచి గమనించేందుకు వారికి అవకాశం ఇవ్వాలి. చదువులకూ సమాజానికీ మధ్య నెలకొన్న అంతరాన్ని పూడ్చాలి. హాజరు తప్పనిసరి చేయడమంటే తరగతి గదులను జైళ్లుగా మలచి, విద్యార్థులను ఖైదీలుగా మార్చడమే! ఇలాంటి ఒత్తిళ్ల మధ్య విద్యార్థుల మేధోవికాసం ఆగిపోతుంది... చివరికి ఎందుకూ అక్కరకు రాని మార్కులే మిగులుతాయి!

(రచయిత– రామన్ మెగాసెసె పురస్కార గ్రహీత)

ఈనాడు లేఖలు

భేషైన ప్రదర్శన

దక్షిణాఫ్రికా పర్యటనలో భారత క్రికెట్ జట్టు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని విజయాలు సాధించి అభిమానులను ఆనందపరచింది. సన్నాహక మ్యాచులు ఆడకుండా బరిలోకి దిగడంతో టెస్టుల్లో తొలుత ఎదురుదెబ్బ తగిలినా- ఆ వెన్వెంటనే తేరుకొని మనవాళ్లు ప్రతాపం చూపిన తీరు ప్రశంసనీయం. విదేశీ పిచ్‌లపై మనవాళ్లు కొరగారన్న విమర్శలకు ఈ పర్యటన సమాధానం చెప్పింది. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లోనూ మనవాళ్లు విజయపతాక ఎగరేస్తే- భారత్ క్రికెట్ జట్టు ఇంటా బయటా సాటిలేని మేటిగా పేరు తెచ్చుకుంటుందనడంలో సందేహం లేదు.

- ఆవుల కృష్ణసాహితి, అత్తాపూర్, హైదరాబాద్

వేళ్లూనుకున్న అవినీతి

తీగ లాగితే డొంకంతా కదిలినట్లు నీరవ్ మోదీ నిర్వాకం వల్ల బ్యాంకింగ్ రంగంలో పలు కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని ఓ గ్రామీణ బ్యాంకులో బయటపడిన అవకతవకలు అందుకో ఉదాహరణ. ఇన్నేళ్లుగా బ్యాంకింగ్ రంగం నిబద్ధతకు మారుపేరుగా నిలుస్తూ వచ్చింది. అందులోనూ కొందరు అధికారులు అవినీతికి మరిగి చేతివాటం ప్రదర్శిస్తున్న వైనాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ప్రజల డబ్బుకు కాపలదారుగా ఉండాల్సిన అధికారులు, బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను ఆసరా చేసుకుని చెలరేగిపోతున్నారు. ఇప్పటికైనా రిజర్వుబ్యాంకు మేలుకోవాలి. నిబంధనలకు పదును పెట్టాలి. అక్రమార్కులకు సత్వరం కళ్లెం వేయకపోతే బ్యాంకింగ్ రంగంపై ప్రజల విశ్వసనీయత మరింతగా సడలిపోతుంది.

- మ్యాకల భాస్కర్, దేశాయిపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా

రామనామం

అధర్వ వేదానికి సంబంధించిన 'రామ రహస్య ఉపనిషత్తు'ను చదివితే మనోరంజకం, వింటే కర్ణామృతం. రామనామంలోని స్వారస్యం సర్వమూ ఆ ఉపనిషత్తులోనే ఉంది. దాని అర్థాన్ని మహర్షి ముద్గల్యుడికి రామబంటు హనుమ వివరించాడంటారు. శ్రీరాముడి గుణ వివరణ చేసిన హనుమాన్ 'ఆయన సంపూర్ణ పరబ్రహ్మ అవతారం' అని చెబుతాడు. ప్రపంచంలో సకల పాప నివృత్తికీ రామనామం ఒక్కటే సాధనమని రుషితో అంటాడు. ఆ నామంలో అతి గుప్తమైన బీజాక్షరాలు ఉన్నాయన్న హనుమంతుడి మాటలే అధర్వ వేదానికి మూల సూత్రాలు. అవే బీజాక్షరాల నుంచి ధనుర్వేదం ఆవిర్భవించింది.

రామనామం మంగళకరమని రామ, రావణ యుద్ధం తరవాత విభీషణుడు తన భార్య సరమకు విశదీకరిస్తాడు. ఆ నామాన్ని సదా శ్రావ్యంగా జపించేందుకు గాయకుల్ని ఆమె రప్పిస్తుంది. వారి కోసం లంకలోని అశోక వనంలో నివాసగృహాల్ని నిర్మింపజేస్తుంది. ఆ గాయకులు రోజూ ఉషోదయ, సాయంసంధ్య వేళల్లో రామనామాన్ని వివిధ రాగాల్లో గానం చేసేవారట. 'మహా వంశ' కావ్యంతో పాటు, శ్రీలంకకు చెందిన పురాతన వాంగ్మయాలు; చూళవంశ, రాజావలియా వంటి గ్రంథాలూ దీన్ని నిర్ధారిస్తున్నాయి.

'మానవ రూపంలో నడయాడిన రాముడు శ్రీమహావిష్ణువు అపరావతారం' అంటాయి ఉపనిషత్తులు. మానవుడు ఈ ధరణిపై ధర్మబద్ధంగా ఎలా జీవించాలో తెలిపేందుకు, విష్ణువే మనిషి రూపంలో అవతరించాడని చెబుతాయి. ధార్మికుడైన రాముడిగా మహావిష్ణువు; రావణ, కుంభకర్ణులుగా వైకుంఠంలో ద్వారపాలకులైన జయ, విజయులు జన్మించారంటూ- ధర్మాధర్మాల మధ్య భేదాన్ని అవి వెల్లడిస్తాయి. సత్యయుగంలో మానవ ధర్మం సంపూర్ణంగా నడిచింది. త్రేతాయుగం నుంచి అధర్మం వైపు నడక సాగింది. మానవ ధర్మం ఏవిధంగా సాగాలో చాటేందుకే రామాయణం అవసరమైందని విష్ణువు భావించాడంటారు. ధర్మం మరెంతో తగ్గిన ద్వాపర యుగంలో వైకుంఠుడు శ్రీకృష్ణుడిగా; జయ విజయులు శిశుపాల, దంతవక్త్రులుగా రూపు దాలుస్తారు.



అంతర్యామి

వేదాల్లోని గణితశాస్త్రంలో పదహారు సూత్రాలు ఉన్నాయి. వాటిలో 'కటపయాది' సూత్రం ఒకటి. అందులో సంస్కృతంలోని ప్రతి అక్షరానికీ అంకెల విలువలున్నాయి. 'రా' అనే అక్షరాన్ని ఉచ్చరిస్తే రెండుసార్లు విష్ణునామాలు పలికినట్లు అవుతుంది. 'మ' అనే అక్షరానికి అయిదు విష్ణునామాల విలువ ఉంది. ఒక్కసారి 'రామ' అంటే పది (2×5) సార్లు విష్ణునామాలు స్తుతించినట్లే. రామ అని మూడుసార్లు పలికితే (10×10×10) విష్ణు సహస్ర నామాలతో సమానం. అందుకే భీష్ముడు 'శ్రీరామ రామ రామేతి' అని చెబుతూ, 'ఆ మంత్రం సహస్ర నామాల తుల్యం' అని వివరిస్తాడు.

రామనామంతో భక్తిరసాస్వాదన అనుభవం కలుగుతుందని తుంబురుడు ఒక సందర్భంలో హనుమతో అంటాడు. అందుకే వాల్మీకి రామాయణం తరవాత, రామనామంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ మరెందరో అవే కావ్యాలు రచించారు. అనుభూతులకు అక్షర రూపమిచ్చారు. మొల్ల తెలుగులో రామాయణం రాసింది. నిర్వచనోత్తర రామాయణాన్ని తిక్కన రచించాడు. గోన బుద్ధారెడ్డి ద్విపద కావ్యంగా 'రంగనాథ రామాయణం' వెలువరించాడు. కంకంటి పాపరాజు, కూచిమంచి తిమ్మన వంటి మహాకవులూ రాశారు. వచన, పద్యకావ్యాలతో పాటు ఎందరో గేయాలు వెలయించి తరించారు. కంచర్ల గోపన్న 'దాశరథీ శతకం'- చదివితే చక్కెరకేళి, వింటే విందు అని వర్ణిస్తారు.

రామభక్తుడైన త్యాగరాజు కీర్తనలు రసమయాలు. 'కన కన రుచిరా' అంటూ రసాస్వాదన చేశాడాయన. 'పిబరే రామరసం' అనే సదాశివ బ్రహ్మేంద్రుల సంస్కృత కీర్తన హృదయాన్ని ఆర్ద్రం చేస్తుంది. శ్రీరామనామం జనన మరణ భయ శోకాల్ని దూరం చేస్తుంది. అది సకల శాస్త్ర నిగమాగమ సారం, పరమాత్మ ప్రసాదం- అని ఆయన భావం, అనుభవం. ఆ వాగ్గేయకారుడి ప్రసిద్ధ గ్రంథం 'స్వప్నోదితం'. వైకుంఠంలోని పాలకడలి నుంచి తీసిన కొన్ని పాలలో అమృతం కలిపి సేవిస్తే కలిగే రుచినే సదాశివ 'రామరసంలో చవి'గా వర్ణించాడు. శ్రీరామరసాన్ని సేవిస్తే కలిగే అనుభూతి ఒకటే... మదిలో ఆయన నాట్యం చేయడం! భక్తుడికి కావాల్సిందీ అదే!

– అప్పరుసు రమాకాంతరావు

సేవాగ్రామ్ సందర్శన.. మరపురాని అనుభూతి!

ఉద్విగ్నతకు లోనైన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
ఇద్దరికి అంతర్జాతీయ గాంధీ అవార్డుల ప్రదానం



సేవాగ్రామ్‌లో గాంధీజీ నాటిన మర్రిచెట్టు కింద కూర్చుని ధ్యానం చేస్తున్న వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తిచేసుకున్న రోజునే.. మహారాష్ట్రలోని విశిష్ట ప్రాంతమైన గాంధీ 'సేవాగ్రామ్'ను సందర్శించడం తన జీవితంలో మరపురాని ఘటనగా ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అభివర్ణించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు ఎనలేని కృషిచేసిన డాక్టర్ ఎం.డి.గుప్తే, డాక్టర్ అతుల్‌షా గాంధీ మెమోరియల్ ఫౌండేషన్ ప్రతినిధికి 2017-అంతర్జాతీయ గాంధీ అవార్డులను సేవాగ్రామ్‌లో ఆదివారం ఆయన ప్రదానం చేశారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి 1978 ఫిబ్రవరి 25న వెంకయ్యనాయుడు తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆదేరోజు 'సేవాగ్రామ్‌'లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ఆశ్రమ పరిసరాలను పరిశీలించి బాపూజీ స్మృతులను నెమరువేసుకున్నారు. తన అనుభూతులను ట్విటర్, ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు. "జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజున 'సేవాగ్రామ్'ను సందర్శించడం నా అదృష్టం. గాంధీజీ 12 ఏళ్లపాటు గడిపిన ఆశ్రమాన్ని సందర్శించినపుడు ఎంతో స్ఫూర్తిదాయక అనుభూతి కలిగింది. సర్దార్ పటేల్, ఆచార్య కృపలానీ, సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ వంటి వారెందరో ఇక్కడ తమ విలువైన సమయాన్ని గడిపారు. మధ్యభారతంలో ఓ గ్రామాన్ని తన ప్రధాన కేంద్రంగా గాంధీజీ ఎంచుకోవడంతో అదో ప్రముఖ ప్రాంతంగా గుర్తింపు పొందింది. 'పేదలకు సేవ చేయడమంటే పరమాత్ముడికి సేవ చేయడమే'నన్న భావన సేవాగ్రామ్‌ని సందర్శించిన తర్వాత మరింత బలపడింది. నా జీవితంలో ముఖ్యమైన రోజే ఆ ప్రాంతాన్ని సందర్శించడం ఎంతో ఉద్విగ్నతకు గురిచేసింది. ఆరోజు నాకు ఘనవిజయం చేకూర్చిన ఉదయగిరి ప్రజలను ఎప్పటికీ మరిచిపోను.. ఇంతకాలం వెన్నంటి నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. గాంధీజీ ఆలోచనలు, ఆచరణ, బోధనలు అజరామరం.. సర్వకాలాలకూ అనుసరణీయం. అవి ఎప్పుడూ నా మదిలో మెదలుతూ ఉంటాయి. ఇది మరిచిపోలేని అనుభూతి.. ఉపరాష్ట్రపతి హోదాలో అంతర్జాతీయ గాంధీ అవార్డు కమిటీ ఛైర్మన్‌గా ఉండటం మరో యాదృచ్ఛికం.." అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

భూకంపాలకు విరుగుడు దిశగా అడుగులు!

- హిమాలయాలు కేంద్రంగా ఎన్‌జీఆర్ఐ మూడేళ్ల పరిశోధన
- విపత్తు నిర్వహణ ప్రణాళికకు మార్గం..
- బిల్డింగ్ కోడ్‌లో మార్పులకు అవకాశం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

దేశంలోని పలు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భవనాలు భూకంపాల్ని తట్టుకునే పరిస్థితిలో లేవని పరిశోధనల్లో తేలినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బిల్డింగ్ కోడ్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు భూకంపాలు సంభవించినా భవనాలు తట్టుకు నిలిచేలా చేసే దిశగా జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) హిమాలయాల కేంద్రంగా పరిశోధన చేపట్టనుంది.

59 ఏళ్ల వ్యవధిలో అత్యధిక పెద్ద భూకంపాలు తలెత్తడంతో హిమాలయ పర్వతాల్లో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ఈశాన్యంలోని అనేక ప్రాంతాల్లో భారీ భూకంపాలు సంభవించే అవకాశముందని ఎన్‌జీఆర్ఐ గుర్తించింది. హిమాలయాల్లో మార్పుల నేపథ్యంలో భవిష్యత్తులో అక్కడ సంభవించే పెను భూకంపాల గురించి ముందే తెలుసుకునే అవకాశం లేకపోయినా భూగర్భంలో మారుతున్న పరిస్థితులను తెలుసుకునేందుకు వీలుగా ఉత్తరాఖండ్ కేంద్రంగా హిమాలయాల్లో భారీ పరిశోధనలను మొదలుపెట్టాలని ఎన్‌జీఆర్ఐ నిర్ణయించింది. ఇదే సమయంలో దేశంలోని అనేక రాష్ట్రాల్లో భూకంపాలు సంభవిస్తే ప్రస్తుతం ఉన్న నిర్మాణాలు తట్టుకోగలవా అన్న దానిపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. భవన నిర్మాణాల బిల్డింగ్ కోడ్‌ను చాలా రాష్ట్రాల్లో పాటించడం లేదని తేల్చారు. భారత్‌లో పలు రాష్ట్రాల్లో భవనాల్లో సెల్లార్‌ను పార్కింగ్ కోసం వినియోగిస్తుండటంతో, మొదటి అంతస్తు వరకు భవనం స్తంభాలపైనే ఉండటం ప్రమాదకరమని తేల్చారు. కింది నుంచి గోడలతో ఉంటే భవనాలు భూకంపాల ఒత్తిడిని తట్టుకోగలవని గుర్తించారు. ఇలా భూకంపాల్ని తట్టుకోలేని భవనాలు దేశంలో కోట్ల సంఖ్యలో ఉంటాయని అంచనా వేశారు. భూమి లోపల జరిగే మార్పులతోపాటు, భూకంపాలు సంభవించినపుడు తట్టుకునేవిధంగా నిర్మాణాలపై ముందే సమగ్ర పరిశోధన చేపట్టనున్నారు. దీనివల్ల సరికొత్త విపత్తు నిర్వహణ ప్రణాళికను రూపొందించడం, భవన నిర్మాణాల్లో మార్పుచేర్పులు చేపట్టేందుకు వీలవుతుంది. దీని ప్రకారం బిల్డింగ్ కోడ్‌లో మార్పులు చేపట్టాలని ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఉత్తరాఖండ్‌లో భూకంప సంబంధ స్టేషన్లు

పరిశోధనల్లో 40 మంది శాస్త్రవేత్తలు..



హిమాలయాలు కేంద్రంగా జరిగే పరిశోధనల్లో 40 మంది శాస్త్రవేత్తలు పాలుపంచుకుంటున్నారు. దీనికి రూ.8 నుంచి రూ.10 కోట్ల వరకు వ్యయం చేయబోతున్నాం. మూడేళ్లలో ఈ పరిశోధనను పూర్తి చేసి దేశంలో నిర్మాణ రంగంలో కొన్ని మార్పులు తీసుకురావాలని భావిస్తున్నాం. కీలకమైన ఈ అధ్యయనం బిల్డింగ్ కోడ్‌లో కీలక మార్పులు తేనుంది.

–శ్రీనగేష్, సీనియర్ సైంటిస్టు, ఎన్‌జీఆర్ఐ

వేలాది మంది మృతి: లక్షల ఇళ్లు ధ్వంసం

1998 నుంచి దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ భూకంపాలు సంభవించి వేలాది మంది చనిపోయారు. లక్షలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇటువంటి భూకంపాలు సంభవించినపుడు మృతుల సంఖ్యను తగ్గించడంతోపాటు ఆస్తి నష్టాన్ని తగ్గించడం కోసమే ఎన్‌జీఆర్ఐ కసరత్తు మొదలుపెట్టింది.

ఏడాది	భూకంప ప్రాంతం	చనిపోయిన వారు	ధ్వంసమైన ఇళ్లు
1998	బిహార్-నేపాల్	1,004	2,50,000
1991	ఉత్తర కాశీ	768	42,400
1993	కిల్లారి	8,000	30,000
1997	జబల్‌పూర్	38	8,546
1999	చమోలీ	100	2,595
2001	భుజ్	13,805	2,31,000
2004	సుమత్ర	10,805	సమాచారం లేదు
2005	కశ్మీర్	1,500	4,50,000
2006	సిక్కిం	2	.....
2015	నేపాల్	100	సమాచారం లేదు.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు మద్దతు: సీపీఎం

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న ఎమ్మార్పీఎస్ పిలుపునిచ్చిన తెలంగాణ బంద్ కార్యక్రమానికి సీపీఎం మద్దతు తెలిపింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ చేస్తామని భాజపా నేతలు హామీ ఇచ్చి... బిల్లు పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. వర్గీకరణ కోసం రాష్ట్రఅసెంబ్లీలో రాజకీయపార్టీలు మద్దతు తెలిపాయని, ఈ మేరకు కేంద్రంపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు.

'ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరించాలి'

వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.యాదా నాయక్, కె.బలరాం డిమాండ్ చేశారు. ఆదివారమిక్కడ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడారు.

అవినీతి సొమ్ముతో విలాస జీవితం

- పురుషోత్తమ్‌రెడ్డి ఇంట్లో ఖరీదైన మద్యం
- కళ్లు చెదిరే సామగ్రి.. అధునాతన హంగులు
- అనిశా బృందం తాజా సోదాల్లో బహిర్గతం

ఈనాడు, హైదరాబాద్: ఖరీదైన మద్యంసీసాలు, రూ.లక్షల విలువైన వజ్రాభరణాలు, ఇంటి లోపల లిఫ్టు, బాత్‌టబ్, కళ్లు చెదిరే సామగ్రి.. అవినీతి నిరోధక శాఖకు చిక్కి సస్పెండైన హెచ్‌ఎండీఏ ప్రణాళికవిభాగం సంచాలకుడు కట్టా పురుషోత్తమ్‌రెడ్డి ఇంట్లోని దృశ్యాలివి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అనిశా బృందం దాడులు చేసిన సమయంలో తప్పించుకున్న పురుషోత్తమ్‌రెడ్డి ఇటీవలే న్యాయస్థానంలో లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ఈ నేపథ్యంలో న్యాయస్థానం అనుమతితో అనిశా అధికారులు బంజారాహిల్స్ సాగర్ సొసైటీలోని ఆయన ఇంటిని ఆదివారం సోదా చేశారు. పురుషోత్తమ్‌రెడ్డి పరారైనప్పుడు ఆ ఇంటిని సీజ్ చేసిన అధికారులు.. తాజాగా పురుషోత్తమ్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యుల సమక్షంలో ఇంటినితెరిచారు. ఆఇంట్లో ఖరీదైన సామగ్రిని గుర్తించారు. అతడి విలాసవంతమైన జీవితం అధికారుల కళ్లకు కట్టింది. ఈ క్రమంలో లెక్కలు చూపని ఆభరణాలు, మద్యం, చీరలు, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. అనిశా బృందం ఇప్పటివరకు పురుషోత్తమ్‌రెడ్డికి చెందిన రూ.34 కోట్ల అక్రమాస్తుల్ని గుర్తించగా.. తాజాగా స్వాధీనం చేసుకున్నవి రూ.50 లక్షల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు రూ.20 లక్షల విలువైన చీరలు, రూ.1.05 లక్షల నగదు, రూ.70 వేల విలువైన మద్యం, రూ.9 వేల విలువ గల రద్దయిన నోట్లు, 501 అమెరికా డాలర్లు, 265 యూఏఈ దిర్హామ్‌లు.



తాజాగా స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి



పురుషోత్తమ్‌రెడ్డి, ఆయన భార్య

దోచుడు కంటే దాచుడే కీలకం..!

- అక్రమార్కుల కొత్త ఎత్తుగడలు
- సాంకేతికతతో అధికారుల కళ్లెం..

ఈనాడు, హైదరాబాద్: 'దోచుకోవడం కంటే ఎవరికీ దొరక్కుండా దాచుకోవడమే కీలకం' అక్రమార్కులు అనుసరిస్తున్న సరికొత్త ఎత్తుగడ ఇది. అధికారం అడ్డం పెట్టుకుని ఆర్జించిన అక్రమ సొత్తును దాచేందుకే ఎక్కువ శ్రమ పడుతున్నారు. దీన్ని ఛేదించేందుకు అవినీతి నిరోధకశాఖ (అనిశా) ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. తాజాగా బయటపడ్డ హెచ్‌ఎండీఏ సంచాలకుడు పురుషోత్తమ్‌రెడ్డి కేసు ఇందుకు నిదర్శనం. గతంలో అక్రమార్కులు తమ అడ్డగోలు సంపాదనను బంధువులు, స్నేహితుల పేర్లమీద రిజిస్ట్రేషన్ చేయించేవారు. క్రమేణా అన్ని కార్యకలాపాలు ఆన్‌లైన్ కావడంతో డబ్బులు ఏ ఖాతా నుంచి ఏ ఖాతాకి మళ్లాయి వంటి వివరాలన్నీ అనిశా అధికారులు సేకరిస్తున్నారు. దీంతో అవినీతిపరులు ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించడం మొదలుపెడుతున్నారు. పురుషోత్తంరెడ్డి తన ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయం పెరిగినట్లు చూపించి, దాన్ని రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టించేవాడు. మరోపక్క దైనందిన విధుల ద్వారా ఆర్జించిన అక్రమాదాయాన్ని కూడా రియల్‌ఎస్టేట్‌లోకి మళ్లించి ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు చూపించేవాడని అనిశా అధికారులు గుర్తించారు. అంటే రియల్ ఎస్టేట్ సంస్థ ఆదాయం రూ.2 లక్షలు వస్తే తాను అక్రమంగా ఆర్జించిన మొత్తాన్ని కూడా దానితో కలిపి ఆదాయం మొత్తం పెంచి చూపించేవాడని వారు చెబుతున్నారు.

అన్నింటికీ కళ్లెం..: ఒక్క పురుషోత్తంరెడ్డి మాత్రమేకాదు.. ఇప్పుడు పట్టుబడుతున్న అక్రమార్కులు అనేక మంది ఇలాంటి పద్ధతులే అనుసరిస్తున్నారని అనిశా అధికారులు చెబుతున్నారు. మిత్రుల ద్వారా రకరకాల వ్యాపారాలు పెట్టించి, అక్రమార్జనను వారి ఖాతాల్లోకి మళ్లించి, సదరు వ్యాపారాల్లో లాభాలు వచ్చినట్లు చూపిస్తున్నారని వారు చెబుతున్నారు. విదేశాల నుంచి కూడా నిధులు వస్తున్నట్లు కూడా చాలామంది చూపిస్తున్నారు. ఇందుకోసం విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఇటువంటి వ్యూహాలు ఎన్నో పన్నుతున్నారని, అన్నింటికి తమ వద్ద పరిష్కారం ఉందని అనిశా అధికారులు చెబుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రతి అనుమానితుడి ఆదాయ వ్యయ వివరాలు, లావాదేవీల వంటివాటన్నింటినీ సేకరించగలుగుతున్నారు. ఆస్తి లావాదేవీలు పర్యవేక్షించే రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు కూడా లావాదేవీలన్నీ ఆన్‌లైన్లోనే నిర్వహిస్తున్నాయి. ఇక ఆదాయపన్నుశాఖ అధికారులు కూడా అక్రమార్కులపై కన్నేసి ఉంచుతున్నారు. అకస్మాత్తుగా ఎక్కువ పన్ను కట్టడం మొదలుపెట్టిన వారి వివరాలను ఆయా దర్యాప్తు సంస్థలతో పంచుకుంటున్నారు.



ఆదివారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న ఫార్మసీ వైద్యులు

ఫార్మసీ వైద్యుల ఆందోళన

అరెస్టు చేసిన పోలీసులు

కవాడిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ నివేదికను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందించాలని కోరుతూ ఫార్మసీ వైద్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు సుమారు 300 మందిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫార్మసీ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి వినతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.రామలక్ష్మి మాట్లాడుతూ.. ఫార్మసీ వైద్యుల సేవలను ఎలా వినియోగించుకోవాలి? వారి భవిష్యత్తు, ఉద్యోగ కల్పన తదితర అంశాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని 2015లో రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందన్నారు. మూడేళ్లు అవుతున్నా నివేదిక ఇవ్వకపోవడం విచారకరమన్నారు. అంబేడ్కర్ విగ్రహం ముందు సుమారు మూడు గంటలపాటు ఆందోళన చేశారు. సీఎం కేసీఆర్ లేదా మంత్రి కేటీఆర్‌తో మాట్లాడించాలని సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తర్వాత సమయం తీసుకుని కలుద్దామని ఆయన నచ్చజెప్పారు. ఫార్మసీ డాక్టర్లు వినకుండా రోడ్డుపై బైఠాయించడంతో అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అటవీ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా వన్నె మోహన్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ అటవీ రేంజ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎఫ్‌ఆర్‌ఓ వన్నె మోహన్ ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న విజయానందరావు పదోన్నతిపై వెళ్లడంతో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు రేంజ్ అధికారుల సంఘం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

బీసీలకు బడ్జెట్ సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం

ఈనాడు, హైదరాబాద్: వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్ల నిధుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మార్చి 2న హైదరాబాద్‌లో అన్ని సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ..బీసీలకు జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించాలని, ఉపప్రణాళిక ప్రకటించాలని కోరినా స్పందన రావడం లేదన్నారు. డిమాండ్ల సాధన కోసం అన్నిసంఘాలతో కలిసి కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు తమతో కలిసి రావాలని కోరారు.

విధానాలు మారేవరకు పోరాడాల్సిందే

- రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వాలే కారణం
- కార్పొరేట్లకు లక్ష కోట్లకుపైగా మాఫీ.. అన్నం పెట్టే రైతులపై స్పందించరా?
- రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు సంఘీభావ కార్యక్రమంలో వక్తలు

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు వ్యవసాయంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణమని, వీటిలో మార్పు వచ్చేంతవరకు పోరాటం చేయాల్సిందేనని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అన్నదాతలు బలహీనతతో ఆత్మహత్యలు చేసుకోవట్లేదని, వారిని బలవన్మరణానికి పురికొల్పేలా విధానాలున్నాయని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.1.14 లక్షల కోట్ల రుణాల్ని మాఫీ చేసిన పాలకులు అన్నం పెడుతున్న రైతులు చనిపోతే మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలతో కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్(సిసిసి) ఆదివారం హైదరాబాద్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించింది. మెగసెసే అవార్డు గ్రహీత, విశ్రాంత ఐఏఎస్ కె.ఆర్.వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతోనే రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. వేల కోట్ల కుంభకోణాలు చేసినవాళ్లు విదేశాలకు వెళ్లిపోతుంటే.. బ్యాంకుల నష్టాలకు రైతులకు రుణాలివ్వడమే కారణమనడం సిగ్గుచేటని అన్నారు. సీనియర్ సంపాదకుడు పొత్తూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల సంఖ్య తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. బాధితుల్లో అర్హులందరికీ సాయం అందట్లేదని, వచ్చినవారికీ ఆ సాయం చాలట్లేదన్న అభిప్రాయముందన్నారు. ఆత్మహత్యల నివారణకు అన్ని పార్టీలు, నాయకులు మార్గాలను అన్వేషించాలని బాధిత కుటుంబాలకేం చేస్తారో చెబుతూ వాటిని వచ్చే ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలని కోరారు. మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ మాట్లాడుతూ.. రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. వేల కోట్లు దోచుకున్నోళ్లు దేశం విడిచిపోయే పరిస్థితిని నేతలే కల్పిస్తున్నారని, ఐదారు లక్షలమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా ప్రధాని మోదీ స్పందించడం లేదన్నారు. తెలంగాణలో ఆత్మహత్యలు జరిగితే కేసీఆర్‌ను, ఏపీలో జరిగితే చంద్రబాబును బాధ్యులుగా చేయాలన్నారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలనుంచి ప్రభుత్వం తప్పుకుని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమూ రైతు ఆత్మహత్యలకు ఓ కారణమన్నారు. రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి విస్సా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. కౌలు రైతులకు గుర్తింపు లభించక, బ్యాంకు రుణాలు దొరకక ప్రైవేటు అప్పులతో ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో నాలుగేళ్లలో 3,400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం 800 మందికే పరిహారమిచ్చిందని సిసిసి ప్రతినిధి కొండల్‌రెడ్డి విమర్శించారు. 2014 నుంచి ఒక్క అనంతపురం జిల్లాలోనే 314 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని.. ఓ వైపు అప్పులవాళ్ల వేధింపులు, మరో వైపు పిల్లల పోషణతో బాధిత మహిళలు సతమతమవుతున్నారని, పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ 13 రకాల ధ్రువీకరణపత్రాలు సమర్పించడమెలా సాధ్యమని 'రెడ్స్' సంస్థ ప్రతినిధి భానుజ ప్రశ్నించారు. రైతు ఆత్మహత్యల నివారణలో సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని వక్తలు కోరారు. బాధిత కుటుంబాలకు ఈ సందర్భంగా చెక్కుల పంపిణీ చేశారు. సిసిసి డైరెక్టర్ కె.సజయ, అధ్యక్షులు రమ మేల్కోటే, రచయిత భాషాసింగ్, ఐ ఫర్ ఫార్మర్స్ ప్రతినిధులు శ్రీనివాస్, మల్లిఖార్జున్, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రతినిధి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో.. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబీకులతో కేరింగ్ సిటిజెన్స్ కలెక్టివ్ సంస్థ అధ్యక్షురాలు రమామెల్కోటే, మెగసెసే పురస్కార గ్రహీత బెజవాడ విల్సన్, ప్రముఖ పాత్రికేయుడు పొత్తూరి వెంకటేశ్వరరావు, జీవన్‌కుమార్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న బాధిత కుటుంబ సభ్యులు

కేసీఆర్‌ది మోసపు పాలన

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ

పరకాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్‌ది మోసపు పాలన అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ విమర్శించారు. ఆదివారం వరంగల్ గ్రామీణ జిల్లా పరకాలలో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న రమణ మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే దళితున్ని సీఎం చేస్తానన్న కేసీఆర్ తొలిసారిగా మాట తప్పారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాటలతో ప్రజలను మోసగిస్తున్నారని, రైతు ఆత్మహత్యల నివారణలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉందని కేంద్ర నేర పరిశోధన సంస్థే తేల్చిందన్నారు. తాము అధికారంలోకి వచ్చినట్లయితే వ్యవసాయ రంగానికి రూ.25 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ రూపొందిస్తామని, దీన్ని ఎన్నికల ప్రణాళికలో పెట్టనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల సమాయత్తానికి వచ్చే నెల 29న హైదరాబాద్‌లో సమావేశాన్ని నిర్వహించి కార్యాచరణ రూపొందించనున్నట్లు రమణ తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో వార్డు నుంచి ఎంపీ వరకు పోటీ

బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్,
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

పాలమూరు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో ఇకముందు వచ్చే ఎన్నికల్లో వార్డు స్థానం నుంచి లోక్‌సభ స్థానం వరకు పోటీ చేస్తామని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దె దించడమే తమ ఫ్రంట్ ముఖ్య లక్ష్యమన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బీఎల్‌ఎఫ్ బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సమాజంలోని 93శాతమున్న బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలను ఏకం చేసి వారిలో చైతన్యం తీసుకురావడానికి ప్రతి జిల్లాలో బహిరంగ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, తాము అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేస్తామన్నారు. మైనార్టీలకు అండగా ఉంటున్నట్లు నటిస్తూనే కేసీఆర్.. కేంద్రంలోని భాజపాతో సఖ్యతగా ఉంటున్నారని ఆరోపించారు. గతంలో రాష్ట్రాన్ని, దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌ది అంతా కుంభకోణాల చరిత్రని, వారు అధికారంలోకి వస్తే దుష్టపాలన అందిస్తారన్నారు. అందుకే తమ పార్టీకే పట్టం కట్టాలని ప్రజలను ఆయన కోరారు. సభలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ నల్లా సూర్యప్రకాశ్, ఎంబీటీ నాయకులు మజీదుల్లాఖాన్, జలజం సత్యనారాయణ, కెవిఎస్ రవికుమార్, జయరాములు, టి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంగా బోన్సాయ్ మొక్కల పెంపకం


పుణె అంతర్జాతీయ సదస్సులో మంత్రి తలసాని

ఈనాడు, హైదరాబాద్: అందంతోపాటు ఔషధ గుణాలు గల బోన్సాయ్ మొక్కల పెంపకాన్ని తెలంగాణలో ఉద్యమంలా చేపట్టేలా ప్రోత్సహిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పుణెలో జరుగుతున్న అంతర్జాతీయ బోన్సాయ్ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముగింపు సమావేశంలో మాట్లాడారు. బోన్సాయ్ మొక్కలు మూడు వేల రకాలున్నాయని, వీటితో ఇంటికే అందమని, అతి తక్కువ స్థలంలోనే వీటిని పెంచవచ్చన్నారు. ఔషధ గుణాలున్న బోన్సాయ్ మొక్కలు కాలుష్య నియంత్రణకు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. హరిత హారంలో సీఎం కేసీఆర్ ఈ మొక్కల పెంపకాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారని తెలిపారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సును త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

న్యాయవాదులకు ఆరోగ్య, ప్రమాద బీమా

- బార్ అసోసియేషన్లకు ప్రత్యేకంగా నిధులు
- కార్యాలయాల ఏర్పాటుకు ఆర్థిక తోడ్పాటు
- మార్చి నెలాఖరున సీఎం చేతుల మీదుగా కార్యక్రమాలు ప్రారంభం
- న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ తీర్మానాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర న్యాయవాదులకు రూ.2 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు నిర్ణయించింది. రాష్ట్ర అడ్వొకేట్ జనరల్, ట్రస్టు ఛైర్మన్ డి.ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నట్లు కార్యదర్శి బాచిన రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ట్రస్ట్ సభ్యులు, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు సహా సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్టులో 18 వేలమంది న్యాయవాదులు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. వారికి సంక్షేమం పరంగా, వృత్తిపరంగా ట్రస్ట్ తరఫున పూర్తి తోడ్పాటును అందించాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. ఆరోగ్య, ప్రమాద బీమాలతో పాటు రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. వెయ్యిమందికిపైగా ఉన్న బార్ అసోసియేషన్లకు రూ.5 లక్షలు చొప్పున, ఐదువందలపైన వెయ్యిలోపు ఉన్న వాటికి రూ.3 లక్షలు, 250 నుంచి 500 మంది ఉంటే రూ.2 లక్షలు, 100 నుంచి 250 మంది ఉన్న వాటికి రూ.1.5లక్షలు, వంద మంది లోపు ఉన్న అసోసియేషన్లకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. న్యాయవాదవృత్తిలో రెండు నుంచి ఐదేళ్లలోపు ఉన్నవారికి కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి రూ.10వేల రూపాయలు అందిస్తామన్నారు. న్యాయవాదులకు నల్సార్ ద్వారా శిక్షణ తరగతులు ఇవ్వాలని, మార్చి నెలాఖరున ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా కార్యక్రమాలను ప్రారంభించాలని తీర్మానించినట్లు వివరించారు.



ఎగిరే కారు ఇంటికొస్తుందట!

- క్యాబ్‌లాగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం
- ప్రతిపాదనతో వచ్చిన అమెరికా కంపెనీ

ఈనాడు, విశాఖపట్నం: మనం బుక్ చేస్తే కారు ఎగురుకుంటూ రావడమేంటి? ఆశ్చర్యంగా లేదూ! ఇదేం ఆశ్చర్యం కాదు.. సాంకేతిక పరిజ్ఞానంతో ఇది సాధ్యమేనంటున్నారు అమెరికాకు చెందిన కార్మన్ ఇంక్ వ్యవస్థాపకులు. ఇలాంటి వినూత్నబాటలోనే మరికొంతమంది విదేశీ యువత వాణిజ్య విపణిలో తమదైన శైలిలో రాణిస్తున్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో వీరు 'ఈనాడు'తో మాట్లాడారు. ఆ వివరాలు..

గాలిలో విద్యుత్తుతో నడుస్తుంది

మేం కార్మన్ ఇంక్ అనే సంస్థను స్థాపించాం. మేం తీసుకొచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఏమిటంటే.. ఎగిరే కారు. దీన్ని భారతదేశానికి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. ఇలాంటి తయారీ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌లో పెడితే ఎలా ఉంటుంది? ఇది రాష్ట్రానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనే దానిపై నీతిఆయోగ్‌తో కలిసి పనిచేస్తున్నాం. అమరావతి నుంచి విశాఖకు గానీ, దేశంలోని ఏ మూలకైనా ఎగిరే కారులో రవాణా చేయించే కొత్త ఆలోచనని ప్రతిపాదించాం. గంటలోపు వెళ్లే మార్గాల్ని ఎంపిక చేసుకుని రవాణా సాగించాల్సి ఉంటుంది. ఇందులో నలుగురు కూర్చోవచ్చు. పూర్తిగా విద్యుత్తుతో నడిచేది కాబట్టి.. కాలుష్యం సమస్యలేదు. మనం క్యాబ్ ఎలా బుక్ చేసుకుంటామో.. ఈ ఎగిరే కారును కూడా అలాగే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కిలోమీటరుకు రూ.4 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. విశాఖ నుంచి అమరావతికి గంటలోపే ప్రయాణించవచ్చు. ఈ టెక్నాలజీపై మహారాష్ట్ర ప్రభుత్వంతో కూడా చర్చలు జరుగుతున్నాయి. ఐరోపా దేశాల్లో కూడా ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

– జార్జ్ ఓనియల్, కల్ల చిరంజీవ్, కాలిఫోర్నియా, అమెరికా

స్వేచ్ఛా ప్రపంచ వాణిజ్య విధానంతోనే ఆర్థికాభివృద్ధి: సురేష్ ప్రభు

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: ప్రపంచ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య విధానం అమలుతోనే ఆయా దేశాల ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేష్‌ప్రభు అన్నారు. ఆదివారం భాగస్వామ్య సదస్సులో 'ప్రపంచ వాణిజ్యంలో ఒడిదొడుకులు, అనిశ్చితి' అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయంగా వాణిజ్య ఒప్పందాలు పెరగడం ద్వారా ఆ రంగంలో పోటీతత్వం నెలకొని నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తాయన్నారు. తద్వారా ఆర్థికాభివృద్ధి జరిగి సమాజాభివృద్ధికి అవకాశం కలుగుతుందన్నారు. వాణిజ్యం విశ్వవ్యాప్తం కావడం వల్ల ప్రపంచ దేశాల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. ఆ దిశగా అన్ని దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దిల్లీలో మార్చి 19, 20 తేదీల్లో ప్రపంచ వాణిజ్యాభివృద్ధి, ఒప్పందాలు అంశంపై పెద్ద ఎత్తున చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న పెట్టుబడుల ప్రవాహం

విశాఖ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: విశాఖలో రెండో రోజు భాగస్వామ్య సదస్సులో అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. రిలయెన్స్ ఇండస్ట్రీస్ సంస్థ అత్యధికంగా రూ.55 వేల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకుంది. శని, ఆదివారాల్లో మొత్తం రూ.2,18,814 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ఇవన్నీ ఆచరణలోకి వస్తే 3,84,662 మందికి ఉపాధి లభిస్తుంది. శనివారం రూ.44,246 కోట్ల విలువైన 79 ఒప్పందాలు జరగ్గా, ఆదివారం రెండో రోజు రూ.1,74,569 కోట్ల విలువైన 285 ఒప్పందాలు జరిగాయి. పెట్టుబడులు ఆకర్షించడంలో ఇంధన రంగం ముందంజలో ఉంది. ఆ రంగంలో ఏకంగా రూ.1,11,921 కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయి. రెండో రోజు వైమానిక, రక్షణ, జౌళి, ఇంధన, ఆహార శుద్ధి, ఆరోగ్యం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కీలక ఒప్పందాలు జరిగాయి. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు టాటా ట్రస్ట్ వంటి ప్రముఖ ప్రైవేటు సంస్థలు, పలు ప్రభుత్వ సంస్థలు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఒప్పందాలు చేసుకున్నాయి. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పరిస్థితి పరిశీలిస్తే ఒప్పందాలు 7 నుంచి 15 శాతం కార్యరూపం దాలుస్తుంటే.. ఏపీలో మాత్రం 38 నుంచి 40 శాతం ఫలితాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పరిశ్రమలకు ఇచ్చే రాయితీల భారం రాష్ట్ర ప్రభుత్వంపై తగ్గేదని.. ఇంతకంటే మూడు రెట్లు అదనంగా పరిశ్రమలకు ప్రోత్సాహం ఉండేదని అన్నారు.

జవాన్‌ల సంక్షేమానికి రూ.కోటి విరాళం

అఖిల భారత చిరంజీవి అభిమానుల సంఘం

మంగళగిరి, న్యూస్‌టుడే: దేశరక్షణ కోసం సరిహద్దులో శ్రమిస్తున్న జవాన్ల సంక్షేమానికి అఖిల భారత చిరంజీవి అభిమానుల సంఘం రూ.కోటి విరాళం ప్రకటించింది. రాజధాని అమరావతిలో ఆదివారం ఏర్పాటు చేసిన అఖిల భారత చిరంజీవి యువత జాతీయ స్థాయి సమావేశం నిర్వహించారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. అమర జవాన్ల కుటుంబాలను ఆదుకోవడం, వారి పిల్లలను చదివించడం కోసం త్వరలో రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి రూ.కోటి విరాళం అందజేస్తామనిసంఘం జాతీయ అధ్యక్షులు స్వామినాయుడు తెలిపారు. చిరంజీవి పిలుపు మేరకు రక్తదాన శిబిరాలను ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. వేసవిలో తెలుగురాష్ట్రాల్లో నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో తాగునీటి సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు కర్ణాటకకు చెందిన మహేష్, ఉత్తరాంధ్ర అధ్యక్షులు తోటకూర వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి: ఆర్.కృష్ణయ్య

నల్లకుంట, న్యూస్‌టుడే: తెలుగు భాషను పరిరక్షించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'తెలంగాణ రాష్ట్ర కవుల సంఘం' ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్యభాషల ప్రభావం వల్ల తెలుగుభాష బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. రోజురోజుకు తెలుగు భాషపై ఆంగ్ల భాష ప్రభావం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో కవులు, కళాకారులు, రచయితలు తెలుగు భాషావికాసానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రముఖ కవి పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ... తెలుగు భాష అనేక మంది జీవితాలకు వెలుగన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కవుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఆర్.కృష్ణయ్య, ప్రధాన సలహాదారులుగా సుతారపు వెంకటనారాయణ, నరేంద్రచౌదరి, అధ్యక్షుడిగా జీఎస్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మక్కపాటి మంగళ, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కావూరి సాంబశివరావు ఎన్నికయ్యారు.

నిరసనల మధ్య ద.కొరియా చేరుకున్న కిమ్‌యోంగ్ బృందం

సియోల్: వివాదాస్పద ఉత్తర కొరియా జనరల్ కిమ్‌యోంగ్ చోల్ ఎట్టకేలకు ఆదివారం దక్షిణ కొరియాలో అడుగుపెట్టారు. శీతాకాల ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యేందుకు గాను ఆయన నేతృత్వంలోని 8 మందితో కూడిన ప్రతినిధుల బృందం 'దక్షిణ'కు చేరుకుంది. కిమ్‌యోంగ్ రాకను వ్యతిరేకిస్తూ వందల సంఖ్యలో ప్రజలు సరిహద్దులో నిరసనలు తెలిపారు. 'కిమ్‌యోంగ్‌ను అరెస్టు చేయాలి, బాధిత కుటుంబాలకు అతను క్షమాపణలు చెబుతూ మోకరిల్లాలి..' వంటి బ్యానర్లతో ఆందోళన తెలిపారు. 2010లో 46 నిండుప్రాణాలు బలైన - దక్షిణ కొరియా యుద్ధనౌకపై దాడి సహా అనేక దారుణాలకు కిమ్‌యోంగ్ కారణమంటూ 'దక్షిణ' వాసులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. కాగా కిమ్‌యోంగ్ చోల్‌కు దక్షిణ కొరియా మంత్రి చున్ హే-సంగ్ శుభాకాంక్షలు తెలిపారు. శీతాకాల ఒలింపిక్స్ ముగింపునకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా కూడా హాజరు కానున్నారు. అయితే కిమ్-ఇవాంకాల మధ్య ఎలాంటి భేటీ ఉండబోదని దక్షిణ కొరియా, అమెరికా అధికారులు ఇప్పటికే ప్రకటించారు.

అడిగితే అన్నీ చెప్పే అలెక్సా

- అది ప్రజలతో మాట్లాడుతుంది
- సమస్యలు పరిష్కారమయ్యేలా చేస్తుంది
- ఈ తరహా పరిజ్ఞానం దేశంలో ఆంధ్రప్రదేశ్ వద్దే ఉంది
- 'భవిష్యత్తు సాంకేతికతలు' ప్లీనరీలో ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు – విశాఖపట్నం

అమెజాన్ ప్రతినిధి: అలెక్సా.. రియల్ టైమ్ గవర్నెన్స్(ఆర్‌టీజీ) డ్యాష్‌బోర్డు చూపించు

అలెక్సా: నమస్కారం. వెల్‌కమ్ టు సీఎం డ్యాష్‌బోర్డు. ఇంతకీ మీరేం అడగాలనుకుంటున్నారో అడగండి

అమెజాన్ ప్రతినిధి: అటవీ శాఖ వివరాలందిస్తావా?

అలెక్సా: మొక్కల పెంపకంలో శ్రీకాకుళం జిల్లా ముందుంది. అక్కడ 100శాతం లక్ష్యాన్ని అధిగమించారు.

అమెజాన్ ప్రతినిధి: విద్యాశాఖ గురించి చెబుతావా?

అలెక్సా: ప.గో.జిల్లాలో ఒక పాఠశాలలో 180 మంది పిల్లలున్నారు. మొత్తంగా ఆ జిల్లాలో 5,29,067 విద్యార్థులు, 4,457 మంది ఉపాధ్యాయులున్నారు.

'అలెక్సా' పేరుతో సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన అమెజాన్ కంపెనీ ప్రతినిధికి, అలెక్సా సాఫ్ట్‌వేర్‌కు మధ్య జరిగిన సంభాషణలివి..

ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న అలెక్సా సాఫ్ట్‌వేర్.. భవిష్యత్తులో ప్రజలు అడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానమిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు ఆదివారం 'భవిష్యత్తు సాంకేతికతలు' అంశంపై ప్లీనరీ నిర్వహించారు. భవిష్యత్తు పాలనలో సాంకేతిక పరిజ్ఞానం ఏ స్థాయికి విస్తరిస్తుందో వివరిస్తూ ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రపంచదేశాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి పరిచయం చేశారు. రాష్ట్ర ప్రజలు ఇంటి నుంచే ఈ సాఫ్ట్‌వేర్‌తో నేరుగా మాట్లాడొచ్చని, ఆఖరికి నీటి సమస్యలు, ఇతర ఏ సమస్యల గురించి చెప్పినా 'అలెక్సా' నేరుగా ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిష్కారమయ్యేలా చూస్తుందని వివరించారు. ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ వద్ద తప్పితే మరెక్కడా లేదని చంద్రబాబు చెప్పారు. ఈ ప్రాంతాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా రూపొందిస్తున్నామని, ఎవరైనా వచ్చి వినూత్న ఆలోచనల్ని పంచుకోవచ్చని సీఎం పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ కుటుంబం నుంచి ఒక వెంచర్‌గానీ, ఒక పరిశ్రమ(ఎంటర్‌ప్రైజెస్)గానీ స్థాపించే స్థాయికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతీ కుటుంబంలో ఒకరు కంప్యూటర్ జ్ఞానాన్ని కలిగి ఉండాలని ఆకాంక్షించారు.



పసికందు మాట్లాడగలదో, వినగలదో తెలుసుకునే పరికరాన్ని కనుగొన్నామని చెబుతున్న నితిన్ సిసోడియా

సాంకేతికత చేటు తేకూడదు

"మనకు మంచి చదువు, సాంకేతికత అత్యుత్తమంగా ఉంది. ఆ సాంకేతికత వినియోగం ఎంత ఆనందాన్ని సంతృప్తిని ఇచ్చిందనేదే ప్రధానం" అని యాంగ్రీబర్డ్స్ గేమ్ రూపకర్త, ఫిన్లాండ్‌కు చెందిన స్లష్ వ్యవస్థాపకుడు పీటర్ వెస్టర్‌బక్కా అన్నారు. వ్యవస్థ, దాని వినియోగం కచ్చితంగా ఉంటేనే ఫలితాలు బాగుంటాయని, సాంకేతిక పరిజ్ఞానం కూడా అలాగే ఉండాలని ఆయన వెల్లడించారు. త్వరలో పాఠశాలల్లో గేమింగ్ తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నానని అన్నారు.

పుట్టిన బిడ్డ మాట, వినికిడిపై పరిశీలన

అప్పుడే పుట్టిన బిడ్డ భవిష్యత్తులో మాట్లాడతాడో, వినగలుగుతాడో లేదో తెలుసుకునేందుకు సోహమ్ ఇన్నోవేషన్ ల్యాబ్ పేరుతో ఒక పరికరాన్ని కనిపెట్టామని, దాని సాయంతో పసివాళ్ల మాట, వినికిడి సరిగా ఉంటుందో, ఉండదో కూడా చెప్పేయవచ్చని వ్యవస్థాపకుడు నితిన్ సిసోడియా అన్నారు.

మొక్క నుంచి విద్యుత్తు

మొక్కల నుంచి విద్యుత్తు పుట్టించే సాంకేతికత పరిజ్ఞానాన్ని నెదర్లాండ్స్‌కు చెందిన ప్లాంట్-ఈ సంస్థ సీఈవో మార్జోలీన్ హెల్డర్ ప్రదర్శించారు. ఒక చిన్న మొక్కకు ఎల్ఈడీని అనుసంధానించి వెలిగించారు. బ్యాక్టీరియాల్లో ఉన్న ఎలక్ట్రాన్స్ ఆధారంగా ఈ ప్రయోగం చేశానని, ఈ సాంకేతిక పరిజ్ఞానం ఇళ్లపై కప్పుల మీద, పొలాల్లో అద్భుతంగా వినియోగించవచ్చని చెప్పారు.

పరిశ్రమల్లో కాలుష్యశాతం '0'

పరిశ్రమల్ని డీకార్బనైజ్ చేయడంతో పాటు, కార్బన్‌ను మరోరూపంలో ఉపయోగపడేలా చేయడంలో తాము విజయం సాధించామని ఇంగ్లండ్‌కు చెందిన కార్బన్ క్లీన్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు ప్రతీక్ బంబ్ తెలిపారు. తమిళనాడులో రసాయన, ఎరువుల కర్మాగారాల్లో కాలుష్యం ఎక్కువగా ఉంటుందని, అక్కడ తమ ఆలోచనలను అమలు చేసి విడుదలైన కార్బన్‌ను రసాయనాలుగా మారుస్తూ వాతావరణంలోకి జీరో శాతం వెళ్లేలా చేస్తున్నామని చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేయాలి

చంద్రబాబుకి వెంకయ్యనాయుడు సూచన

విశాఖ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం మంచిది కాదని ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. వీరిద్దరి మధ్య ఆదివారం ఉదయం అల్పాహార విందు సమావేశం జరిగింది. భాగస్వామ్య సదస్సుకి హాజరయ్యేందుకు విశాఖ వచ్చిన వెంకయ్యనాయుడు శనివారం నగరంలోని కిర్లంపూడి లేవుట్‌లోని తన కుమారుడికి చెందిన ఇంట్లో బస చేశారు. ముఖ్యమంత్రి అక్కడికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి మెలసి పనిచేయాలని, రాష్ట్రానికి సంబంధించిన సమస్యల్ని కేంద్రంతో కూర్చుని పరిష్కరించుకోవాలని ఆయన సూచించినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. రాష్ట్రానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. విభజనచట్టంలో పేర్కొన్న అంశాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని నెరవేరిస్తే కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అభ్యంతరం లేదని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని వెంకయ్యనాయుడు పేర్కొన్నట్లు తెలిసింది. సమావేశం అనంతరం ఉపరాష్ట్రపతి విశాఖ నుంచి బయల్దేరి వెళ్లారు. రాష్ట్రానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి వెంకయ్యనాయుడు ఇది వరకూ ప్రయత్నం చేశారు. తొలి విడత బడ్జెట్ సమావేశాల చివరి రోజు అమిత్‌షా, అరుణ్ జైట్లీలతో సమావేశమయ్యారు. విభజన చట్టంలోని అంశాలు, రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలుకి తాను కేంద్ర మంత్రిగా ఉండగా కొంత ప్రయత్నం చేశానని, దానికి కొనసాగింపుగానే ఈ సమావేశం నిర్వహించానని ఆయన అప్పట్లో ఒక ఆంగ్ల పత్రిక విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. తాను పెద్దన్న పాత్రే పోషిస్తున్నాని, దీనికి రాజకీయాలతో సంబంధంలేదని అప్పట్లోనే స్పష్టం చేశారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఆయన మంత్రివర్గ సహచరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సెల్‌ఫోన్ తయారీలో 80 శాతం వాటా మనదే

ఏపీ ఐటీ మంత్రి నారా లోకేష్

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: 'రాష్ట్రంలో 2014కు ముందు ఒక్క సెల్‌ఫోన్ కూడా తయారయ్యే పరిస్థితి లేదు. నేడు ఆ రంగంలో 20 శాతం వాటా చేజిక్కించుకున్నాం. తాజాగా రిలయన్స్ జియోతో సెల్‌ఫోన్ తయారీ ఒప్పందం చేసుకోవడంతో ఈ వాటా 80 శాతానికి పెరిగింది. దేశంలో తయారయ్యే ప్రతి వంద సెల్‌ఫోన్లలో 80 మన రాష్ట్రం నుంచే ఉత్పత్తవుతాయని చెప్పడానికి గర్వంగా ఉంది' అని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భాగస్వామ్య సదస్సులో 'భవిష్యత్తు రంగాలు- భారతదేశ సవాళ్లు' అంశంపై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ల తయారీలోనే కాదు.. సెటాప్ బాక్సులు, ఐవోటీ డిజైన్, ఇతర అంశాల్లోనూ దేశంలోనే ముందుంటామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం నుంచి తయారీ రంగం వరకు సాంకేతికతను వినియోగించుకోవడంలో మిగతా రాష్ట్రాలకంటే ఆంధ్రప్రదేశ్ ముందుందని తెలిపారు.

మేటి సులభతర వ్యాపార కేంద్రంగా ఏపీ

- కేంద్రమంత్రి సురేష్‌ప్రభు తోడుగా ముందుకు
- 'సులభతర వ్యాపారంపై ప్రచారం' అంశంపై చంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం: వాణిజ్య, పరిశ్రమల ప్రగతిని అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చుకుని పోటీగా భావిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. ఆదివారం విశాఖలోని సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'సులభతర వ్యాపారంపై ప్రచారం' అంశంపై చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మొదటి దశ, రెండో దశలుగా లక్ష్యాలు పెట్టుకుని ముందుకెళ్తున్నామని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం వివరించారు. ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ తొలి దశలో 64వ ర్యాంకులో ఉంటామని, రెండో దశలో 40వ ర్యాంకు వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు.



సులభతర వ్యాపారం అంశంపై నిర్వహించిన చర్చలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి సురేష్ ప్రభు, సీఎం చంద్రబాబు తదితరులు

వచ్చే రెండేళ్లలో ఇది సాధ్యమవుతుందని, ఇందుకు కేంద్రమంత్రి సురేష్‌ప్రభు తోడుగా ఉంటారని అన్నారు.

ప్లీజ్ ఆఫ్ బిజినెస్ చేస్తాం: దేశంలో మానవ వనరులకు కొదవలేదని, సామర్థ్యంలో మనకు ఎదురులేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి సురేష్ ప్రభు అన్నారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మేం ప్లీజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా పరిచయం చేయాలనే తపనతో ఉన్నాం. ఎవరైనా ఇష్టంగా పని చేస్తే అందులో ప్రేమ కనిపిస్తుంది. నేనైనా, చంద్రబాబునాయుడైనా రాజకీయాల్లో ఆనందంగా ఉన్నామంటే.. ప్రజలకు సేవ చేయడంలో మాకు సంతృప్తి కనిపిస్తోందని అర్థం" అన్నారు.

ట్రంప్ మీ నుంచి నేర్చుకుంటారు...: రాష్ట్రంలో ఆశ్చర్యకర అభివృద్ధి, సాంకేతికత కనిపిస్తోందని అమెరికా అంతర్జాతీయ వ్యవహారాల పర్యవేక్షక ఉపాధ్యక్షుడు మైరాన్ బ్రిలియంట్ అన్నారు. వచ్చే సదస్సుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వస్తే ఇక్కడి కార్యక్రమాల ద్వారా తప్పకుండా నేర్చుకునే పరిస్థితి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఎంను ఆయన అమెరికాకు ఆహ్వానించారు. తన ప్రసంగాన్ని ముగిస్తూ భారత్‌పై గౌరవసూచకంగా 'జైహింద్' అని అన్నారు.

రూ.55 వేల కోట్ల రిలయన్స్ పెట్టుబడులు

- తిరుపతిలో ఎలక్ట్రానిక్ పార్కు, అమరావతిలో క్యాంపస్
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒప్పందాలు

విశాఖ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో ఐటీ, పెట్రోలియం రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ ముందుకొచ్చింది. రూ.55 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో రెండు కీలక ఒప్పందాలు చేసుకుంది. విశాఖపట్నంలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సులో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్, రిలయన్స్ జియో డిజిటల్ సర్వీసెస్ విభాగం అధ్యక్షుడు కిరణ్ థామస్, ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి ఒప్పందంలో భాగంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ రూ.15 వేల కోట్లు నేరుగా పెట్టుబడి పెడుతుంది. తిరుపతి సమీపంలో 150 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ పార్కు ఏర్పాటు చేస్తోంది. 10 లక్షల జియోఫోన్లు ఉత్పత్తి చేసే యూనిట్, సెట్‌టాప్ బాక్స్ తయారీ పరిశ్రమ, చిప్ డిజైనింగ్ యూనిట్ వంటివి ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ రంగంలో శిక్షణ కేంద్రం నెలకొల్పుతారు. రాజధాని అమరావతిలో 100 ఎకరాల్లో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇది ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, స్టార్టప్, వెంచర్ క్యాపిటల్, పరిశోధన కేంద్రంగా పనిచేస్తుంది. ఈ రెండు ప్రాజెక్టుల్లో సుమారు 20 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటిష్ పెట్రోలియం సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మరో ఒప్పందం జరిగింది. దీని విలువ రూ.40 వేల కోట్లు.

బ్యాండ్ విడ్త్ చాలా అవసరం: చంద్రబాబు

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో రిలయన్స్ విప్లవాత్మక మార్పులు తెస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. "విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థలో బ్యాండ్ విడ్త్ చాలా అవసరం. రిలయన్స్ సంస్థ బ్యాండ్‌విడ్త్‌తో పాటు విద్య, వినోదం, పరిపాలన, వ్యవసాయం తదితర రంగాల్లో విలువ ఆధారిత సేవలూ అందిస్తోంది. అమరావతిలో ఏర్పాటు చేసే క్యాంపస్‌లో పెద్ద ఎత్తున ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను అభివృద్ధి చేయవచ్చు. ప్రపంచంలోనే అది గొప్ప కేంద్రమవుతుంది. 2017 అక్టోబరు 23న ఐటీ మంత్రి లోకేష్ ముంబయి వెళ్లి రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీతో సమావేశమయ్యారు. అనంతరం ముకేశ్ అమరావతికి వచ్చారు. ఆయన తిరిగి వెళ్లిన నాలుగు రోజుల్లోనే కిరణ్ థామస్ ఆధ్వర్యంలో ఒక బృందాన్ని పంపించారు. ఇ-గవర్నెన్స్‌పై ఆయనకున్న ఆసక్తి, నిబద్ధత గొప్పది. ప్రజలకు ఉత్తమ సేవలందించాలన్నదే ఆయన ఆకాంక్ష" అని చంద్రబాబు పేర్కొన్నారు.

హార్డ్‌వేర్ రంగంలో విప్లవాత్మక మార్పులు

తిరుపతిలో ఏర్పాటు చేసే ఎలక్ట్రానిక్ పార్కు ద్వారా హార్డ్‌వేర్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని చంద్రబాబు అన్నారు. రిలయన్స్ సంస్థ తమ షాపింగ్ మాల్స్ కోసం రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని పెద్ద ఎత్తున సేకరించనుందని, దానిపై కూడా ఆ సంస్థ రానున్న రోజుల్లో పెట్టుబడులు పెట్టనుందని తెలిపారు.

ప్రతి మూడు నెలలకు సీఎం, ముకేశ్ సమీక్ష

రాష్ట్రానికి రిలయన్స్ పెట్టుబడులు తీసుకురావడం వెనుక ఐటీ మంత్రి లోకేష్ కృషి చాలా ఉంది. ఆయన గత అక్టోబరు 23న ముంబయి వెళ్లి, ముకేశ్ అంబానీతో సమావేశానికి 10 నిమిషాల సమయం కోరారు. ఆ భేటీ రెండు గంటలపాటు సాగింది. అప్పటికి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచన ముకేశ్‌కి లేదు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, పెట్టుబడి అవకాశాల గురించి లోకేష్ ఆయనకు వివరించారు. ముకేశ్ సానుకూలంగా స్పందించారు. ఆ తర్వాత రిలయన్స్ ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. ఆ తర్వాత సుమారు 10 వీడియో కాన్ఫరెన్స్‌లు, టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. చివరకు నాలుగు నెలల వ్యవధిలోనే పెట్టుబడుల ప్రతిపాదనలు సాకారమయ్యాయి. ఆదివారం అవగాహన ఒప్పందం(ఎంఓయూ) తర్వాత రిలయన్స్ ప్రతినిధులతో లోకేష్ మళ్లీ సమావేశమయ్యారు. ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు సంయుక్త కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ బృందం ప్రతి వారం సమావేశమవుతుంది, ప్రతి నెలా మంత్రి స్థాయిలో సమీక్ష జరుగుతుంది. ప్రతి మూడు నెలలకు ముఖ్యమంత్రి, ముకేశ్ అంబానీ వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశమై, పురోగతిని సమీక్షించనున్నారు.

ఎవరి గురించి ఆలోచిస్తున్నామో చెప్పేస్తుంది!

టొరంటో: మనం మనసులో ఎవరి గురించి ఆలోచిస్తున్నామో కనిపెట్టి చెప్పేసే సరికొత్త సాంకేతికతను శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. మెదడు తరంగాలను విశ్లేషించడం ద్వారా.. ఊహల్లోని వ్యక్తుల ముఖచిత్రాలను ఈ సాంకేతికత పునర్నిర్మిస్తుంది. సాధారణంగా మనం వ్యక్తులు/వస్తువులు వంటి దేన్నైనాసరే చూసినప్పుడు మెదడులో ప్రత్యేక మానసిక అనుభూతులు ఏర్పడతాయి. ఎలక్ట్రోఎన్‌సెఫలోగ్రఫీ(ఈఈజీ) సాయంతో ఈ అనుభూతులను సమీకరించి.. ఆయా వస్తువులు/వ్యక్తుల ముఖచిత్రాలను మళ్లీ సృష్టించవచ్చునని టొరంటో స్కార్‌బరో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాన్ నెమ్రొడోవ్ తెలిపారు. పరిశోధనల్లో భాగంగా పలువురికి కొన్ని ముఖాలను చూపించి మెదడులో ఈఈజీ సమాచారాన్ని సేకరించామని వెల్లడించారు. అనంతరం ఆ వివరాలను ఉపయోగించుకుంటూ.. వ్యక్తులు మనసులో తలచుకుంటున్నవారి ముఖచిత్రాలను పునర్నిర్మించగలిగామని వివరించారు. నేర విచారణ ప్రక్రియలో తాజా సాంకేతికత దోహదపడే అవకాశముందని పేర్కొన్నారు.

కేంద్రంలో అధికారంలోకి వస్తే ఐదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా

- తొలి సంతకం దానిపైనే
- కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: 2019లో తాము (కాంగ్రెస్) కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్లపాటు ప్రత్యేక హోదా కల్పిస్తామని.. ఆ దస్త్రంపైనే తొలి సంతకం పెడతామని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ ప్రకటించారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలతోపాటు, ఆ బిల్లుపైన చర్చ సందర్భంగా అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. రాజధాని నిర్మాణం బాధ్యతను తామే తీసుకోవడంతోపాటు రాష్ట్రానికి ఆర్థికసాయం చేస్తామని వివరించారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అశాస్త్రీయంగా, హేతుబద్ధత లేకుండా రూపొందించారని ఆరోపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ఈ చట్టానికి సవరణలు చేపట్టాలని ప్రధానిని కలిసి ఎందుకు అడగడం లేదో చెప్పాలన్నారు. "14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రత్యేక హోదాను రద్దు చేస్తున్నట్లు 2015 ఫిబ్రవరి 20న కేంద్రం ప్రకటించింది. కానీ అది పచ్చి అబద్ధం. రద్దు చేయమని తాము పేర్కొనలేదంటూ ఆర్థిక సంఘం ఛైర్మన్ వై.వి.రెడ్డి నాతో చెప్పారు. ఇప్పటికీ 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ప్రయోజనాలన్నీ అమలవుతున్నాయి. అలాంటప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వకూడదు? 2014 జూన్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు 2015 ఫిబ్రవరి వరకూ ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు? అని ప్రశ్నించారు. రైల్వే జోన్ ఇవ్వాలంటే మోదీకి 2 నిమిషాలు చాలని.. కానీ ఆయనకు ఆ దిశగా సంకల్పం కొరవడిందని వ్యాఖ్యానించారు.

తెరాస టికెట్ల కోసం.. తటస్థుల తహతహ

- సార్వత్రిక ఎన్నికల్లో స్థానాల కోసం ఇప్పటినుంచే పోటీ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో తెరాస తరపున టికెట్లు పొందేందుకు ఇప్పటినుంచే పోటీ మొదలైంది. పార్టీ నేతలతో పాటు.. ఏ పార్టీలో లేని తటస్థులు సైతం బరిలోకి దిగేందుకు తహతహలాడుతున్నారు. ఇందులో ఉన్నతాధికారులు, మేధావులు, సినీ, వాణిజ్య, వ్యాపార ప్రముఖులున్నారు. ఇప్పటికే పార్టీ అధిష్ఠానానికి తమ సంసిద్ధతను తెలియజేశారు. రాష్ట్రంలో 119 శాసనసభ నియోజకవర్గాలు, 17 లోక్‌సభ స్థానాలున్నాయి. శాసనసభలో 90 స్థానాల వరకు తెరాస ఎమ్మెల్యేలున్నారు. 14 మంది ఎంపీలున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు లేని నియోజకవర్గాలతోపాటు ఉన్న స్థానాల్లోనూ టికెట్ల కోసం తటస్థుల రద్దీ ఏర్పడింది. హైదరాబాద్‌లోని స్థానాలకు భారీగానే పోటీ ఉంది. ఈ జిల్లాలోని రెండు స్థానాల్లో పోటీకి సినీరంగ ప్రముఖులు, మేధావులు ఆసక్తి చూపుతున్నారు. విశ్రాంత ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నగరంలోని మరో నాలుగింటిపై కన్నేశారు. సికింద్రాబాద్, హైదరాబాద్ ఎంపీ స్థానాల్లో కొందరు విశ్రాంత అధికారులతో పాటు మేధావులు తమకు అవకాశం ఇస్తే పోటీ చేస్తామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో విపక్ష ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో పోటీకి ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థ పదవిని నిర్వహిస్తున్న ఓ అధికారి ఉత్సాహం చూపుతున్నారు. పూర్వ వరంగల్ జిల్లాలోని ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్న స్థానంలో పోటీకి ప్రవాస తెలంగాణ ప్రముఖుడు ముందుకొస్తున్నారు. ఇప్పటికే దాతగా పేరు తెచ్చుకున్న ఆయన రాజకీయాలవైపు మళ్లుతున్నారు. పార్టీ అధిష్ఠానానికి సన్నిహితంగా ఉండే వైద్యరంగంలోని ప్రముఖుడు సైతం ఒక నియోజకవర్గంపై కన్నేశారు. కోదాడ, హుజూర్‌నగర్‌లలో బలమైన సామాజిక వర్గానికి చెందిన పోలీసు అధికారి టికెట్ పొందాలనే భావనతో ఉన్నారు. పూర్వ వరంగల్ జిల్లాకు చెందిన గుర్తింపు గల ఒక ఉన్నతాధికారి రాజకీయాలపై ఆసక్తితో తెరాస మంత్రులను సంప్రదించి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



సిట్టింగు స్థానాలపై గురి: ప్రస్తుతం పదవుల్లో ఉన్న వారిలో చాలా మందిని మార్చే అవకాశముందనే కారణంతో ఆయా స్థానాల్లో తమకు సీటు కావాలని కోరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలోని ఒక స్థానం తమకు కేటాయించాలని పారిశ్రామికవేత్తలు అధిష్ఠానాన్ని కోరారు. రంగారెడ్డి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో తమకు అవకాశమివ్వాలని ఇద్దరు వ్యాపారవేత్తలు కోరినట్లు తెలిసింది. పూర్వ వరంగల్ జిల్లాలోని ఒక ఎమ్మెల్యేపై తరచూ ఫిర్యాదులు, వివాదాలు వస్తుండగా, అక్కడ తమకు అవకాశమివ్వాలని స్థానిక వ్యాపార ప్రముఖులు పార్టీ అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిసింది. మహబూబాబాద్ జిల్లాలోని ఒక స్థానంలో పోటీకి పోలీసుఉన్నతాధికారి పేరు వినిపిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 8స్థానాలు, పూర్వ జిల్లాలైన కరీంనగర్‌లోని రెండు, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్‌లలోమూడేసి, మెదక్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని రెండేసి, నల్గొండలోని అయిదు స్థానాల్లో తటస్థులు తెరాస టికెట్ల కోసం గట్టి పోటీదారులుగా మారనున్నారు. పార్టీ అధిష్ఠానం ముందు జాగ్రత్తగా ఎమ్మెల్యేలు, నేతలతో పాటు తటస్థులైన వారి గురించి ఆరా తీస్తోంది. పార్టీ ఆధ్వర్యంలో జరిగే సర్వేలో నియోజకవర్గంలో మంచి పేరు, గుర్తింపు ఉన్న వారు ఎవరైనా ఉన్నారా అనే వివరాలు తెలుసుకుంటోంది. సర్వేలో ఎవరికి మంచి పేరు, బలాలు ఉంటే వారిని ఎంపిక చేసే అవకాశముంది.

శునకాలకో రెస్టారెంట్



ఆ దంపతులిద్దరూ ఉన్నతోద్యోగులు. ఓ రోజు తమ పెంపుడు కుక్కను తీసుకొని ఓ రెస్టారెంట్‌కు వెళ్లారు. తొలుత ఇద్దరినీ సాదరంగా లోనికి స్వాగతించిన రెస్టారెంట్ నిర్వాహకులు అంతలోనే 'ఆగండి! కుక్కను లోనికి అనుమతించడం కుదరదు' అని చెప్పారు. చేసేది లేక వెనక్కి వచ్చేశారు.

ఆ ఇద్దరూ ఇప్పుడు ఓ రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. పెంపుడు కుక్కల కోసం ప్రేమతో ప్రారంభించారు. దాని పేరు "కేఫ్ లోకో". హైదరాబాద్ గచ్చిబౌలీలో ఉంటుంది. అక్కడి ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు!



పట్నంలో పల్లెను మరిపించే వాతావరణం. గుడిసెలు, చెట్లు, పచ్చిక.. ఇలా ఉంటుంది 'కేఫ్ లోకో'. పెట్స్ బిర్యానీ లోకో డిలైట్, ఫిష్ విత్ రైస్, ఓట్స్, స్పినాచ్ బ్రోకలీ రైస్, బిస్కెట్లు, కేక్స్.. ఇలా పది రకాల వెరైటీలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. వీటిని రుచి చూడడానికి ఎక్కడెక్కడి నుంచో శునకాలు వస్తాయి. వాటంతటవి అవే రావనుకోండి! యజమానుల వెంట వస్తాయన్నమాట. యజమానుల కోసమూ ప్రత్యేక మెనూ ఉందండోయ్! నచ్చిన ఆహారాన్ని ఆస్వాదిస్తూ.. యజమానులతో కలిసి ఒకటో రెండో సినిమాలు చూస్తాయి. సినిమా చూసేందుకు అక్కడ ప్రొజెక్టర్ కూడా ఉంది మరి. సినిమా బోర్ కొట్టిందా.. బయట ఉన్న విశాలమైన ప్రాంగణంలో ఎంచక్కా విహరిస్తాయి. గట్టిగా అరుస్తాయి. మధ్య మధ్యలో తమ యజమాని చెంతకు వచ్చి తోకాడించి మళ్లీ ఆటల్లో మునిగిపోతాయి. ఏ కుక్కదైనా పుట్టిన రోజు వచ్చిందా..! ఆ రోజు అన్ని శునకాలకూ పండగే! కేక్ కటింగ్ ఉంటుంది. ఆటపాటలుంటాయ్. పప్పీ థెరపీ ఇక్కడ మరో ప్రత్యేకత. కుక్కలతో యోగా చేయిస్తారు.

మౌఖిక పరీక్ష తర్వాతే..

శునక రెస్టారెంట్ ఇప్పుడు సంరక్షణ కేంద్రంగా కూడా సేవలందిస్తోంది. ఐటీ కారిడార్‌లో నివాసం ఉంటున్న ఎందరో భార్యాభర్తలు ఉద్యోగానికి వెళ్తూ.. తమ పెంపుడు



కుక్కలను రెస్టారెంట్‌లో వదిలి వెళ్తారు. యజమానులు తిరిగి వచ్చేంత వరకూ వాటి సంరక్షణ బాధ్యత రెస్టారెంట్ నిర్వాహకులదే. తమ కుక్క ఎలా ఉందో ఆన్‌లైన్ లింక్ ద్వారా ఎప్పుడంటే అప్పుడు చూసుకోవచ్చు. అంతేకాదు వీధి కుక్కలను చేరదీసి.. కోరుకున్న వారికి దత్తత ఇస్తున్నారు. తీసుకునేవాళ్లకు మౌఖిక పరీక్ష నిర్వహించి.. వాళ్లు జంతు ప్రేమికులా.. కాదా.. అని రూఢీ చేసుకొని ఆ తర్వాతే ఇస్తారు. ఇన్ని ప్రత్యేకతలున్న 'కేఫ్ లోకో'కు చాలా మంది శునకాలను తీసుకొని వస్తున్నారు. వారాంతంలో వారి సంఖ్య అధికంగా ఉంటోంది. పెంపుడు కుక్కలు లేని వారు సైతం ఇక్కడికి వచ్చి ఇతరుల కుక్కలను చూసి కాసేపు వాటితో ఆడేందుకు ఇష్టపడుతున్నారు.

– తిరుపతిరెడ్డి, మాదాపూర్

సామాజిక బాధ్యతగా..

ఈ రెస్టారెంట్ నిర్వాహకులు హేమంత్ సకర్వాల్, రుచిరా సకర్వాల్. అతను ఓ ఐటీ కంపెనీలో డైరెక్టర్. ఆవిడేమో హెచ్ఆర్ మేనేజర్. ఇద్దరూ విదేశాల్లో ఉద్యోగం చేసినవారే. 2007లో హైదరాబాద్‌కు వచ్చి గచ్చిబౌలిలో స్థిరపడ్డారు. ఇంట్లో శునకాలను పెంచుకునేవారు. వారాంతాల్లో తమ పిల్లలతో పాటు శునకాలనూ తీసుకొని సరదాగా బయటకు వెళ్తుండేవారు. రెస్టారెంట్లు, కాఫీ షాప్‌లకు వెళ్లినప్పుడు మాత్రం కుక్కలను లోనికి అనుమతించేవారు కాదు. దీంతో.. పెంపుడు జంతువుల కోసమే ఓ రెస్టారెంట్ ప్రారంభించాలని భావించారు. జంతుప్రేమికులను కలిసి వారి అభిప్రాయాలను, సూచనలు తీసుకున్నారు. ఆరు నెలలు కష్టపడి ప్రణాళికలు సిద్ధం చేశారు. గతేడాది ఏప్రిల్‌లో 'కేఫ్ లోకో'ను ప్రారంభించారు. ఈ రెస్టారెంట్ నిర్వహణను ఓ సామాజిక బాధ్యతగా భావిస్తామంటారు ఈ దంపతులు.

హైదరాబాద్, సోమవారం
ఫిబ్రవరి 26, 2018

మా చిరునామా: వారెవ్వా! ఈనాడు
ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

■ varevva@eenadu.in



వందల ఎకరాల భూమితో... కోట్ల రూపాయల వ్యాపారంతో ఉన్న బంధాన్ని ఒక్కరోజులో వదిలేశారు.. చలసాని బలరామయ్య ఉరఫ్ సీబీఆర్ ఒలింపిక్స్‌లో పతకం గెలవాలి... దేశానికి పేరు తేవాలని కలలుకనే యువతకు, చిన్నారులకు అండగా ఉండటమే ఆయన ఆశయం. నేతాజీ, వివేకానందలు కలలుకన్న ఉక్కునరాలున్న యువతని తయారుచేసేందుకే ఈ త్యాగం అంటారాయన. ఆ ఆశయం ఎలా మొదలైంది.. దాని కోసం ఏం చేస్తున్నారు? ఆయన మాటల్లోనే..



నా త్యాగం ఉక్కు నరాలున్న యువత కోసం

వ్యవసాయంపై ఆధారపడ్డ దిగువ మధ్య తరగతి కుటుంబం మాది. కృష్ణాజిల్లా భట్లపెనుమర్రు మా సొంతూరు. పదేళ్లు వచ్చేసరికి ఇంటిపనులు, వ్యవసాయ పనులు నేర్చుకున్నా. ఆటపాటలతో చక్కని దేహదారుఢ్యం ఉండేది. కానీ నేను అంత తెలివైన అబ్బాయిని కాను. ఐదో తరగతి ఫెయిల్. ఆ ఓటమి నన్ను కలల ప్రపంచంలో ఉండిపోకుండా... వాస్తవానికి దగ్గరగా ఉండేలా చేసింది. దాంతో ఒళ్లు దగ్గర పెట్టుకుని చదివి పదోతరగతి పాసయ్యాను. ఇక.. కాలేజీలో చేరి పైచదువులు చదవడమే తరువాయి అనుకున్నారు అమ్మానాన్నలు. కానీ నా తెలివితేటలు గురించి నాకు తెలుసుగా! అప్పటికే నాకు ఆటలంటే ఇష్టం. మాఊర్లో కామినేని ఈశ్వర్రావుగారని వెయిట్ లిఫ్టర్ ఒకాయన ఉండేవారు. ఆయన ఒలింపిక్స్‌లో గెలవాలని అనుకునేవారు. ఆయన ప్రభావంతో నాకూ ఒలింపిక్‌లో పతకం గెలవాలనే లక్ష్యం పెట్టుకున్నాను. కానీ అందుకు తగ్గట్టుగా.. బలమైన ఆహారం తినే స్తోమత లేదు. ఎవరో అన్నారు. ఆర్మీలో చేరితే జీతం... ఆటలు రెండూ సాధ్యమే అని. ఇంకేముంది.. ఆర్మీలో ఎంపికలవుతుంటే వెళ్లా. వైమానిక దళంలో మెకానిక్‌గా పనిచేయడానికి ఎంపికయి కాన్పూర్ వెళ్లా! ఆరేళ్లపాటు కష్టపడినా రాని హిందీ అక్కడ ఆరు గంటల్లో వచ్చింది... ఇంగ్లిష్ ఆరువారాల్లో వచ్చింది. అవసరం అలాంటిది మరి. వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పరిచయం, పుస్తకాలు నా ఆలోచనా పరిధిని విస్తృతం చేశాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగాను. ఇక ఆ తర్వాత ఒలింపిక్స్‌కి వెళ్లడమే అనే ధీమాతో ఉండేవాడిని.

ఆ ఉద్యోగం రాలేదు...

అంతా బాగానే ఉంది అనుకునే సమయానికి...సికింద్రాబాద్ రైల్వేలో పనిచేసే అవకాశం వచ్చింది. దాంతో తొమ్మిదేళ్లపాటు చేసిన ఆర్మీ ఉద్యోగాన్ని వదులుకున్నా. మరేం చేయాలి? అప్పుడే కొత్తగా పెళ్లయ్యింది. మా ఆవిడ పుట్టింటి నుంచి తెచ్చిన డబ్బు కొంత... నేను దాచుకున్నది కొంత పెట్టి హైదరాబాద్ సాగర్‌రోడ్‌లో... 1500 కోళ్లతో ఒక ఫారం పెట్టా. ఎక్కడ ఆర్మీ.. ఎక్కడ కోళ్ల ఫారం.. అనిపించినా, వ్యవసాయంపై నాకున్న అపారమైన ప్రేమ ఈ పని చేసేలా చేసింది. తాత్కాలికంగా ఆటలని పక్కన పెట్టాను. అలా తాత్కాలికం అనుకున్నది కాస్తా.. ఏడేళ్లు దొర్లిపోయాయి. ఈలోపు వ్యాపారం ... ఊహించిదానికంటే అభివృద్ధి చెందింది. లక్షలాది కోళ్లు.. ఐదొందల ఎకరాలు... నాలుగు యూనిట్లలో విస్తరించింది. హేచరీస్ స్థాయికి చేరుకున్నాం. మేమే కోడిపిల్లలని ఉత్పత్తి చేసి.. రైతులకు అమ్మేవాళ్లం. డబ్బు, వ్యాపారం ఇవన్నీ ఆటల్లో గెలవాలనే నా లక్ష్యాన్ని.. వాయిదా పడేలా చేశాయి. కొన్నాళ్లకు పూర్తిగా ఆటలకు దూరమయ్యా. కోట్ల రూపాయలు వచ్చి పడుతున్నా... అందులో తృప్తి లేకుండా పోయింది.

సాయం చేయడంలో కనిపించింది..

అదేసమయంలో... ఎవరైనా పేద క్రీడాకారుడికి కాస్త సాయం చేస్తే వచ్చే సంతృప్తి మాత్రం చాలా బాగుండేది. మనసు నిండిపోయేది. ఓసారి ఓ సంస్థ వాళ్లు బడికోసం .. రెండు గదుల నిర్మాణానికి సాయం చేస్తారా? అని అడిగారు. నేను రెండు గదులు కాకుండా.. భవనం మొత్తాన్ని నిర్మించి ఇచ్చాను. చిన్నప్పుడు మా గురువు గారి తల్లి ఒకరు మమ్మల్ని దగ్గర కూర్చోపెట్టుకుని రామాయణ, భారతాలు చెప్పేవారు. నాకెందుకో భారతంలో నిజమైన కథానాయకుడు కర్ణుడే అనిపించేది. అతని దాతృత్వం అంటే నాకు ఇష్టం. ఆ ప్రభావంతోనే... నాకు తోచినట్టుగా తోటివారికి సాయం చేయాలనిపించేది. నాకు ఆటలంటే ఇష్టం కాబట్టి.. క్రీడాకారులు ఏం సాధించినా, సాధిస్తామని అన్నా వాళ్లకు నా వంతుగా సాయం చేసేవాడిని. తొలినాళ్లలో కరణం మల్లీశ్వరి వంటి వారితో సాయం మొదలయ్యింది. నాగార్జున విశ్వవిద్యాలయంలోని క్రీడాకారుల రాణింపు కోసం నెలకి లక్ష రూపాయల విరాళం ఏడేళ్లపాటూ అందించాను. ఇలాంటి చిన్న చిన్న సాయాలు కాకుండా ఇంకా పెద్దఎత్తున చేస్తే బాగుండుననిపించింది.



75 ఎకరాల్లో ఉచిత విద్యా, క్రీడా బోధన...

ఓ రోజు నా వ్యాపారాన్ని, భూములని, ఏటావచ్చే కోట్ల రూపాయల ఆదాయాన్ని వదిలేయాలనుకున్నాను. ఇందుకోసం నేనేమీ కుటుంబాన్ని సమావేశపరిచి మీ నిర్ణయం ఏంటి అంటూ రోజుల తరబడి చర్చించలేదు. ఒక్క నిమిషంలో తీసుకున్న నిర్ణయం అది. ఇంట్లో వాళ్లతో చెప్పలేదు కూడా. ఐదొందల ఎకరాల్లో.... కొంత అవసరాల కోసం ఉంచుకున్నా. తక్కినది మా ఉద్యోగులకే అప్పగించాను. వారినే యజమానులని చేశాను. మా అమ్మాయి మాధవి కూడా నా ఆశయాలకు తగ్గట్టుగానే ఉంటుంది కాబట్టి నా నిర్ణయంతో తనకే ఇబ్బంది కాలేదు. 75 ఎకరాల భూమిని విజయవాడ కేతనకొండలో ఓ స్కూల్ నిర్మాణానికి ఇచ్చేశాను. అది నా కలల స్కూల్. నేను సైనికుడిగా పనిచేసినప్పుడు నేతాజి ప్రభావం నాపై చాలా ఎక్కువగా ఉండేది. సర్వస్వతంత్ర హైందవ సేనానిగా పిలిచే నేతాజీ ఆశయాలతో కేతనకొండలో 75 ఎకరాల్లో ఓ స్కూల్‌ని ప్రారంభించాను. ఇక్కడ ఆంగ్ల మీడియం ఉంటుంది. అన్ని సదుపాయాలతో కూడిన జిమ్ ఉంటుంది. ఇక్కడ చదువు పూర్తిగా ఉచితం. త్వరలో... హైదరాబాద్‌లో కూడా ఈ తరహా పాఠశాల నిర్మాణం కోసం పనులు ప్రారంభం అయ్యాయి.

> **కేతనకొండ స్కూల్లో ఏ గోడని తాకినా మన సంస్కృతి తేటతెల్లం అయ్యేలా గోడలు మొత్తం చరిత్రతో నింపేసి ఉంటాయి. అక్కడ ఉండాలనుకునే పిల్లలు ఎవరి పని వాళ్లే చేసుకోవాలి. ఆహారాన్ని పండించుకోవాలి. పాడి నిర్వహణ తెలిసుండాలి. ఆటలు తప్పసరిగా ఆడాలి. శ్రమ చేయాలి. శరీరాన్ని కదిలించాలి. అలా అయితేనేగా మనం కోరుకున్న శక్తిమంతమైన భారతావని ఉంటుంది.**

విజేతలని చేయాలనే...

ఒలింపిక్స్, వరల్డ్ ఛాంపియన్‌షిప్ తర్వాత స్థానంలో వరల్డ్ యూనివర్సిటీ పోటీలున్నాయి. ఈ పోటీలకు చాలాకాలంగా మన భారతీయులు వెళ్లడం లేదు. ఈ పోటీల్లో మన దేశ క్రీడాకారులని కూడా విజేతలని చేయాలన్నది నా లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహించి... వారి నుంచి క్రీడల్లో సామర్థ్యం చూపేవారిని ఎంపిక చేయాలని అనుకుంటున్నా. సింధులాంటి వారు విజయం సాధించడానికి కారణం వాళ్ల తల్లిదండ్రులు కూడా క్రీడాకారులు కావడం... వారిలో క్రీడాభిరుచి ఉండటం. ప్రతి తల్లిదండ్రులు మన పిల్లలు క్రీడాకారులు కావాలని ఆకాంక్షించడంతోపాటు... రాజకీయ నాయకులు కూడా ఇన్ని కోట్ల మంది ఉన్న భారతావని నుంచి ఒక్క క్రీడాకారుడు కూడా పతకం ఎందుకు తీసుకు రాలేకపోతున్నారని చిత్తశుద్ధితో ఆలోచించాలి. అప్పుడే క్రీడాప్రపంచంలో కొన్నైనా మంచి మార్పులని స్వాగతించగలుగుతాం. భవిష్యత్తులో వ్యాయామ ఉపాధ్యాయులు, కౌన్సెలింగ్ నిపుణులు, కోచ్‌లు, క్రీడల్లో ఇంజినీరింగ్, మెడిసిన్, సైకాలజి వంటి రంగాలు వృద్ధి చెందడానికి ఆస్కారం ఉంది. మా అకాడమీ నుంచి ఈ దిశగా ఉపాధి కల్పించాలన్నదే నా లక్ష్యం.

– గొర్లె శ్రీసత్యవాణి

మే..మే.. యోగా!



కొన్ని ఆలోచనలు మనల్ని అమాంతం ఆశ్చర్యపరుస్తాయి. గోట్ యోగా కూడా అలాంటిదే. లైనీ మోర్సీ అనే అమెరికన్ మహిళ ప్రవేశపెట్టిన ఈ యోగా ఇప్పుడక్కడ ప్రాచుర్యాన్ని పొందింది.

ఆలోచన అలా పుట్టింది..

అమెరికాకు చెందిన లైనీ మోర్సీ వ్యాధినిరోధక శక్తి సన్నగిల్లటం వల్ల వచ్చే జోగ్రెన్స్ సిండ్రోమ్ వ్యాధి బారినపడింది. కళ్లు, నోరు పొడిబారటం ఈ వ్యాధి లక్షణాలు. ఆ సమయంలోనే ఆమె తన భర్తతో విడాకులు తీసుకుంది. ఒంటరిగా ఉండే మోర్సీ 2016 మార్చి సమయంలో తన ఫామ్ హౌస్‌కు వెళ్లింది. అక్కడ అన్ని అనే నైజీరియా మేకపిల్ల తన దగ్గరికొచ్చి ఆడుకుందట. ఆమెకి మేకలంటే చిన్నప్పటినుంచే ఇష్టం. దీంతో ఆమె మేకలతో కాలం గడపటం ప్రారంభించింది. మానసికంగా ఒత్తిడి తగ్గింది. మేకపిల్లలను చూస్తూనే హాయిగా నవ్వేది. ఆనందం దొరికిందామెకి. దీంతో 2016 వేసవికాలంలోనే 'యోగా, గోట్స్' అంటూ యోగా తరగతులను తన ఫామ్ హౌస్‌లో ప్రారంభించింది. ఎనిమిది నెలల కాలంలోనే.. టైమ్‌మ్యాగజైన్, న్యూయార్క్ టైమ్స్, ది వాల్‌స్ట్రీట్ జర్నల్‌తో పాటు సిఎన్ఎన్, నేషనల్ జియోగ్రాఫిక్ ఛానెల్‌లో మోర్సీ గురించి కథనాలొచ్చాయి. దీంతో ఆమె పేరు మార్మోగిపోయింది. మార్కెటింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్‌లో మోర్సీకి పదిహేనేళ్ల అనుభవం ఉంది. దీంతో మనుషులకు థెరపీ చేసే జంతువుల్లో మేకలు ప్రధానమైనవంటూ ఏకంగా 'గోట్ యోగా' పదాన్ని ప్రచారం చేసింది.

పాత కథే...

నిజానికి యానిమల్ థెరపీ కొత్తేంకాదు. కొన్ని రకాల జంతువులకు దగ్గరగా ఉండటం వల్ల ఆనందం కలుగుతుంది. ఒత్తిడి, డిప్రెషన్ తొలగిపోతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఆటిజం ఉండే పిల్లలు మానసికంగా ఎదుగుతారు. గోట్ యోగా కూడా అంతే. మోర్సీ తన ఫామ్‌లో మేకపిల్లలను పెంచుతుంది. యోగా తరగతులు వారాంతాల్లో అక్కడే నిర్వహిస్తారు. యోగా చేసే సమయంలో మేకల్ని ఆ ప్రాంతంలో వదిలేస్తారు. అవి యోగా చేసేవాళ్ల దగ్గర ఎగురుతూ, దూకుతూ ఆడుకుంటాయి. నిర్వాహకులు ఆసనాలు వేసే సమయంలో వారిపైన మేక పిల్లలను నిలబెడతారు. దాని శరీరం, కాళ్లలోని మెత్తదనం సాధకులకు ఒత్తిడి నుంచి విముక్తి కలిగిస్తుందని చెబుతారు.



మొదట అరిజోనా ప్రాంతంలో మొదలైన ఈ గోట్ యోగా న్యూయార్క్, పెన్సిల్వేనియా, ఫ్లోరిడా.. ఇలా దాదాపు పదిచోట్ల జరుగుతున్నాయి. ఈ వేసవిలో ఈ యోగా క్లాసులకు హాజరు కావాలనుకునేవారు గోట్‌యోగా.నెట్, ది గోట్ యోగా ఫేస్‌బుక్ పేజీలో అడ్వాన్స్ బుకింగ్ అందుబాటులో ఉంది. సబ్‌స్క్రైబ్ అవుతూనే వారికి దగ్గరగా ఉండే లొకేషన్‌ను మెయిల్ చేస్తారు. తరగతులకు సంబంధించిన వివరాల్ని అందిస్తారు.

గుమస్తా లేని దుకాణం

ఆ దుకాణంలో వినియోగదారులు తప్ప ఎవరూ ఉండరు. ఏ వస్తువులు కావాలో వాటిని తీసుకోవడం. బయటకు వచ్చేయడం అంతే. బిల్లు చెల్లించేందుకు ఎదురుచూడాల్సిన పనిలేదు. ఆన్‌లైన్ విక్రయ సంస్థ అమెజాన్ మాయ ఇది. ఖాతాదారులు బిల్లు చెల్లించేందుకు వేచి ఉండాల్సిన ఇబ్బందిని తొలగించడానికి, కొనుగోలు ప్రక్రియలో ఇంతకుముపెన్నడూ లేని వినూత్నమైన అనుభూతిని వారికి అందివ్వడమే లక్ష్యంగా 'అమెజాన్ గో'ను అందుబాటులోకి తెచ్చింది. ఇటీవల అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం సీటెల్‌లో గుమస్తా (నగదు తీసుకునే వ్యక్తి) రహిత తొలి కిరాణా దుకాణం అమెజాన్ గోను ప్రారంభించింది. ఈ దుకాణానికి వెళ్లిన ఖాతాదారులు తమకు కావాల్సిన వస్తువులను తీసుకొని నేరుగా బయటకు వచ్చేయవచ్చు. బిల్లు చెల్లించేందుకు వేచి ఉండటం అంటూ ఉండదు. ఇందుకోసం డ్రైవర్ రహిత వాహనాల్లో (సెల్ఫ్ డ్రైవింగ్) వినియోగించే కంప్యూటర్ విజన్, సెన్సర్ ఫ్యూషన్, డీప్‌లెర్నింగ్ సాంకేతికతలను వినియోగించారు.

అమెజాన్ గో దుకాణానికి వెళ్లాలనుకున్న వారు ముందుగా తమ మొబైల్‌లో అమెజాన్ గో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వ్యక్తిగత వివరాలు, క్రెడిట్/డెబిట్ కార్డ్ వివరాలు నమోదు చేయాలి (మొదటిసారి). దుకాణం ప్రవేశమార్గం దగ్గర యాప్‌ను తెరవగానే.. చరవాణి తెరపై క్యూఆర్ కోడ్ వస్తుంది. ఈ కోడ్‌ను స్కాన్ చేసి దుకాణంలోకి ప్రవేశించాలి. లోనికి వెళ్లగానే ఖాతాదారుడి ప్రతి కదలికనూ సెన్సర్లు గమనిస్తాయి. ఖాతాదారు తొలివస్తువును తీసుకోగానే.. వర్చువల్ కార్ట్ (కొనుగోలు జాబితా) ఏర్పడుతుంది. అలా ఖాతాదారు ఏ వస్తువును తీసుకుంటే. అది జాబితాలో కలుస్తుంటుంది. ఖాతాదారు మనసు మార్చుకొని ఏదైనా వస్తువును తిరిగి యథాస్థానంలో ఉంచితే.. కొనుగోలు జాబితా నుంచి ఆ వస్తువు తొలగిపోతుంది. మాల్ అంతా తిరిగి కావాల్సిన వస్తువులన్నీ తీసుకొని.. దుకాణం నుంచి బయటకు రాగానే.. సరకుల జాబితా (కార్ట్) బిల్లుగా మారిపోతుంది. బిల్లు మొత్తం ఖాతాదారుడి క్రెడిట్/ డెబిట్ కార్డ్ నుంచి అమెజాన్ గో ఖాతాకు బదిలీ అవుతుంది.



– వి.ఎస్.ఎస్.ఎస్.ప్రసాద్

రాష్ట్రప్రభుత్వ అత్యుత్తమ సర్వీసుకు నిర్వహించే పరీక్షలో అగ్రశ్రేణిలో నిలవడమంటే అంత సులువు కాదు. అందుకు ఏయే అంశాలు దోహదపడతాయో గమనిస్తే... భావి అభ్యర్థులకు అవి మార్గదర్శకం. మన ముందుకు ఏపీపీఎస్‌సీ గ్రూప్‌-I (2011) మొదటి, రెండో ర్యాంకర్లు వచ్చారు. ఒకరిది ప్రకాశం జిల్లా, మరొకరిది శ్రీకాకుళం జిల్లా. స్ఫూర్తిదాయకమైన వారి ప్రిపరేషన్ వ్యూహాలు పరిశీలిద్దాం! భారీ పోటీలో దూసుకువెళ్ళటానికి పట్టుదలతో వారు చేసిన అలుపెరగని కృషిని తెలుసుకుందాం! వారి సూచనలతో ప్రయోజనం పొందుదాం!



ఇలా నిలిచాం...గెలిచాం!



పరీక్ష స్థాయి కంటే పైస్థాయిలో ప్రిపేర్ కావాలనేది నా సలహా. గ్రూప్స్‌లో నెగ్గాలంటే.. సివిల్స్‌కు సిద్ధం కావాలి.

'గ్రూప్‌-1 పోస్టులా? అలాంటివి మనవల్ల కాదు' అని ఒకప్పుడు భావించిన **ఆకుల వెంకట రమణ** అదే గ్రూప్‌-1 పరీక్ష రాసి ఏకంగా స్టేట్ మొదటి ర్యాంకు సాధించాడు. అది కూడా తొలి ప్రయత్నంలోనే! ఈ గెలుపు వెనక ఏళ్ళతరబడి చేసిన కృషీ, సామాజిక అంశాల అధ్యయనమూ, క్షేత్రస్థాయి అనుభవమూ ఉన్నాయి. ఈ గ్రూప్‌-1 టాపర్ విజయ గాథను విందామా?

అంతర్జాలం...ఎంతో సాయం

నేను గ్రూప్స్ వైపు యాదృచ్ఛికంగానే వచ్చాను. ఎంవీ ఫౌండేషన్ అనే ఎన్‌జీఓ ద్వారా సామాజికసేవలో భాగంగా పేద పిల్లలకు బోధన చేసేటప్పుడు మాత్రం సివిల్స్, గ్రూప్స్ లాంటి పరీక్షల గురించి అస్పష్టంగా తెలిసింది. ఎన్‌జీఓలు ఎన్ని మంచి పనులు చేస్తున్నా వాటికి పరిమితులుంటాయి. కానీ ప్రభుత్వానికి ఉండవు. అది అతిపెద్ద సేవాసంస్థ. అందుకే ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాదల్చుకున్నాను. లోక్‌సత్తా యూత్ వాలంటీర్‌గా సామాజిక సమస్యలపై అధ్యయనం చేశాను. 2013-16లో హైదరాబాద్ పెండేకంటి లా కళాశాల నుంచి లా చదివాను. సివిల్స్, గ్రూప్స్‌లకు సన్నద్ధం కావటానికి అద్భుతమైన ప్రేరణనిచ్చే ఐఏఎస్ అధికారి ఎస్‌ఆర్ శంకరన్ గురించి తెలుసుకున్నాను. ఒక అధికారి ప్రజల జీవితాలను ఎంత బాగా మార్చగలడనేదానికి ఆయన మార్గం చూపారు. పైగా పబ్లిక్ సర్వీసులకు జరిపే సన్నద్ధత స్వల్పకాలంలోనే గొప్ప పరిజ్ఞానాన్ని అందిస్తుంది. అందుకే పరీక్షల ప్రిపరేషన్ ఆరంభించాను.

సివిల్స్‌కు కొంత కోచింగ్ తీసుకున్నాను గానీ, గ్రూప్స్‌కి ఎలాంటి శిక్షణా తీసుకోలేదు. పరీక్షలో నెగ్గటానికి కోచింగ్ తప్పనిసరేమీ కాదు. కాకపోతే అవగాహన ఆరంభానికి అది పనికొస్తుంది. ప్రస్తుత డిజిటల్ విప్లవ శకంలో ఆరువేల రూపాయిల స్మార్ట్‌ఫోన్ ఇంటర్నెట్ ఉంటే ఎవరైనా అవసరమైన పరిజ్ఞానం సంపాదించవచ్చు. నా ప్రిపరేషన్‌కు అంతర్జాలం (ఇంటర్నెట్) ఎంతగానో ఉపయోగపడింది. ఆర్‌ఎస్ టీవీ, బీబీసీ డిబేట్లూ, టెడ్ టాక్స్, నిపుణుల చర్చలూ పరీక్షల కోణంలో ఎంతో విలువైనవి.

నా సన్నద్ధత సందర్భంగా ఎంతోమందితో మాట్లాడాను. హేతుబద్ధ, విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని రవీంద్ర వేపాటి నాకు పరిచయం చేశారు. డా. జి. వి. రామాంజనేయులు సమాజానికి సంబంధించిన వివిధ అంశాలపై ముఖ్యంగా వ్యవసాయరంగంపై నా దృక్పథాన్ని మెరుగుపరిచారు. అమర్‌నాథ్ వాసిరెడ్డి పర్సనల్ ఇంటర్వ్యూ గైడెన్స్ అందించారు. తుదిఫలితాల్లో 489.5 మార్కులతో మొదటి ర్యాంకు వచ్చింది. ఒక నిర్దిష్ట ర్యాంకుకు గురిపెట్టకుండా అభ్యర్థులు తమ సామర్థ్యాన్ని మెరుగుపరచుకుంటూ ఉండటమే సరైనదని నా ఉద్దేశం. అత్యుత్తమ ప్రదర్శన ఎటూ ఉన్నతమైన ర్యాంకును తెచ్చిపెడుతుంది కదా!

నా ఉద్దేశంలో గ్రూప్‌-1 ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలకు విడివిడి ప్రిపరేషన్ ఉండకూడదు. సమాజం, రాష్ట్రం, దేశం ఎదుర్కొనే సమస్యలకు తన పరిజ్ఞానాన్ని తార్కిక చింతనతో, లోకజ్ఞానంతో అన్వయించటం తెలిసుండాలి. ఈ మూడు అంచెలకూ ఉన్న తేడా... ప్రశ్నలను అడిగే విధానం మాత్రమే. సంబంధిత నైపుణ్యాలను సాధనతో పెంచుకోవాలి.

విడివిడి సన్నద్ధత వద్దు!

ప్రిలిమ్స్: కటాఫ్ 1:50 నుంచి 1:15/12కు మారిన నేపథ్యంలో ప్రిలిమ్స్ చాలా కష్టంగా ఉండబోతోంది. అందుకే నాణ్యమైన ప్రశ్నలను విస్తృతంగా సాధన చేయాలి. యాంత్రికంగా కాకుండా మనసును లగ్నం చేసి చదవాలి. పరీక్షకు కాన్సెప్టులపై స్పష్టత ఎంతో అవసరం. మనకు ఏది రాదనేదానిపై అవగాహన ఉండాలి. సంబంధం లేని జవాబులను తెలివిగా తొలగించటం నేర్చుకోవాలి. కంగారుగా చదవటం పనికిరాదు. ఏ ప్రశ్నపైనా మరీ ఎక్కువ సమయం వెచ్చించకుండా 'ఆర్ట్ ఆఫ్ లీవింగ్ ద క్వశ్చన్' తెలుసుకోవాలి. స్థూల దృష్టి లోపించిన సూక్ష్మ ఆలోచనా విధానం వల్ల ప్రయోజనం ఉండదు.

మెయిన్స్: దీనికి నిమిషానికి కనీసం 15 పదాల చొప్పున రైటింగ్ ప్రాక్టీస్ చాలా అవసరం. ఇది కొద్దిరోజుల్లోనో, నెలల్లోనో సాధ్యం కాదు. ముఖ్యంగా తెలుగు మీడియం నేపథ్యం నుంచి వచ్చిన నాలాంటివారికి ఎక్కువ సాధన తప్పదు. గ్రూప్స్ పరీక్షకు రాసే వేగం చాలా ముఖ్యం. ఎందుకంటే చాలామంది అభ్యర్థులకు తమకు తెలిసినది రాయటానిక్కూడా సమయం సరిపోదు. ఎంతోమంది పరీక్ష దగ్గరకొచ్చేవరకూ సమాచారం సేకరించటంలోనే మునిగిపోయి మాక్ టెస్టులు రాయకుండా పొరపాటు చేస్తుంటారు. చదవటమూ, రాయటమూ రోజూ చేయాలి. నేనైతే 60 శాతం వెయిటేజిని రైటింగ్‌కూ, 40 శాతం స్టడీకి ఇస్తాను. 'బెస్ట్' ఆన్సర్ కోసం కాకుండా జవాబు సంతృప్తిగా రాయటానికి ప్రయత్నించాలి.

ఇంటర్వ్యూ: దీనికి నిజాయతీ తప్పనిసరి. ఇంటర్వ్యూలో మరీ వేగంగానో, అతి నెమ్మదిగానో జవాబులు చెప్పకూడదు. సమతూకంలో చెప్పాలి. నా ఇంటర్వ్యూలో ప్రశ్నలు లోతుగానే అడిగారు. 'ప్రభుత్వోద్యోగులందరూ అవినీతి పరులని నేను అనుకుంటాను. ఏమంటావు?' అని ఛైర్మన్ అడిగారు. మంచీ చెడూ అన్ని రంగాల్లో ఉంటాయని చెపుతూ ఉత్తమ అధికారుల పేర్లు కోట్ చేశాను. చెడు ఉదాహరణలు కూడా ఉంటాయని చెప్పాను. అవినీతి తక్కువ ఉండాలంటే.. చట్టాలను కఠినంగా అమలు చేయాలనీ, వాటి లొసుగులను ఉపయోగించుకోకుండా చూడాలనీ చెప్పాను.

'మీడియం'పై ఆందోళనా?

ఇంటర్మీడియట్ వరకూ తెలుగుమీడియంలోనే చదివినప్పటికీ ఈ గ్రూప్‌-1 పరీక్షను ఇంగ్లిష్‌మీడియంలోనే రాశాను. విషయం, దాన్ని వ్యక్తీకరించటం గురించి ఆలోచించాలి కానీ, మీడియం గురించి ఆందోళనపడకూడదు. చదివే సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవటం ముఖ్యం. నేను కొన్ని రోజులు కేవలం 4-5 గంటలూ, మరికొన్ని రోజుల్లో అయితే 12-13 గంటలు చదివాను. సబ్జెక్టును ప్రేమించి, నేర్చుకునే ప్రక్రియను ఆస్వాదించాలి. కాన్సెప్టులపై పునాది కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదివాను. మెటీరియల్స్‌పై ఆధారపడకుండా స్టాండర్డ్ పాఠ్యపుస్తకాలు చదివాను. యూట్యూబ్‌లో చాలా వీడియోలు ఉపయోగపడ్డాయి. ప్రభుత్వ నివేదికలెన్నో సమగ్రంగా చదివాను. ఆర్‌ఎస్ టీవీ, ఆలిండియా రేడియో, మృణాల్, జీకే టుడే, అన్ అకాడమీ వెబ్‌సైట్లు, ఇతర మొబైల్ యాప్స్ ఉపయోగించుకున్నాను.

ఇవి పాటిస్తే తిరుగుండదు

- అభ్యర్థులు ప్రిపరేషన్లో నిలకడపై శ్రద్ధ పెట్టాలి.
- ఇతరులు చెప్పిన దాన్ని గుడ్డిగా పాటించకూడదు. దేనినైనా ప్రశ్నించి, విశ్లేషించి ఒక అభిప్రాయానికి రావాలి.
- సమాధానాలు సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా ఉండాలి.
- అడిగిన ప్రశ్న దృక్కోణంలోనే జవాబును సానుకూల దృక్పథంతో రాయాలి.
- రాజ్యాంగం, ప్రజాస్వామ్యాలపై గొప్ప విశ్వాసం ఉండాలి.
- మొండి పట్టుదలతో కాకుండా ప్రజానుకూల ధోరణి ప్రదర్శించాలి.
- రాజకీయపరంగా తటస్థత మరో అవసరమైన లక్షణం.
- పరీక్ష కోసం సమాచారం సేకరించటానికి పరిమితం కాకుండా జ్ఞాన సముపార్జనకు నిజమైన తపన ఉండాలి.
- సమస్యలను వివరించటమే కాకుండా పరిష్కారాలూ చెప్పగలగాలి.

సన్నద్ధత నిరంతరం

ఓటమికి కుంగుబాటు సహజం. దాన్ని అధిగమించి, మరో లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు సాగినవారే విజేత. అలా ఒక్కో సోపానాన్ని జాగ్రత్తగా నిర్మించుకుంటూ గ్రూప్‌-1లో రెండో ర్యాంకును సాధించారు **కనుగుల హేమలత**. తన విజయ ప్రస్థానం ఆమె మాటల్లోనే..

చిన్నప్పటినుంచీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాను. దాంతో సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలి అనుకునేదాన్ని. అందుకే నా లక్ష్యం పబ్లిక్ సర్వీస్ అయ్యింది. నిజానికి నాకు ఫిజిక్స్ అంటే ఇష్టం. చిన్నపుడు ఏరోనాటిక్స్ చేయాలనుకునేదాన్ని. ఐఐటీలో సీటు సాధించాలనుకుని విఫలమయ్యాను. దాంతో నిరాశకు గురయ్యాను. అప్పుడు పేపర్లో టాపర్ల విజయగాథలను చదివాను. గ్రూప్స్ గురించి తెలిసిందీ అప్పుడే! దీంతో గ్రూప్స్‌ను నా లక్ష్యంగా చేసుకున్నాను.

లక్ష్యం అయితే ఏర్పడింది కానీ.. ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక ఎదగడానికి గ్రూప్స్‌వైపు వెళదామనుకున్నాను. అందుకే ముందుగా డీఈడీని పూర్తిచేశాను. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం చేస్తూనే దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేశాను. వెంటనే గ్రూప్స్, పోటీపరీక్షలకు సన్నద్ధత మొదలుపెట్టాను. అదే ఏడాది డిసెంబరులో గ్రూప్స్ నోటిఫికేషన్ విడుదలైంది. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా సన్నద్ధమయ్యాను. ఇంటర్వ్యూ వరకూ వెళ్లాను. 13 మార్కులతో సర్వీస్ చేజారింది.

2010 గ్రూప్‌-1 కూడా ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అప్పుడు ఒక మార్కుతో సర్వీస్ కోల్పోయాను. నిరాశపడినా, సన్నద్ధత ఆపలేదు. ఆ తరువాత 2011లో ప్రకటించిన గ్రూప్‌-1 రాశాను. కానీ దానిని 2012లో క్యాన్సిల్ చేశారు. దానికి 2016లో మళ్లీ మెయిన్స్ పెట్టారు. ఇంటర్వ్యూ ఫిబ్రవరి 16న జరిగింది. మొత్తం 470 మార్కులతో రెండో ర్యాంకు వచ్చింది. నేను కేవలం గ్రూప్స్‌కే పరిమితం కాలేదు. ఈలోపు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్‌ల్లో వేర్వేరుగా పీజీలు చేశాను.

వైఫల్యాన్ని గమనించుకుని..

ఏదైనా ఒత్తిడి లేకుండా సింపుల్‌గా చేసుకుంటూ పోవాలనే మనస్తత్వం నాది. దాన్నే నా సన్నద్ధతలోనూ ఆచరణలో పెట్టాను. వార్తాపత్రికలను ముఖ్యంగా ఎడిటోరియళ్లను పరీక్ష కోణంలో చదవడం అలవాటు చేసుకున్నా. సమాచారాన్ని సేకరించుకుని సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నాను. మెయిన్స్ విషయంలో ఎక్కడ విఫలమవుతున్నానో చూసుకున్నాను. నాలుగో పేపర్‌లో తక్కువ మార్కులు రావడాన్ని గమనించాను. ఈ అంశానికి సంబంధించి ఇంటర్వ్యూలోనూ ఇదే పరిస్థితి. నా జవాబుల్లో తాజాదనం లోపించడమే కారణం అనిపించింది. దీంతో కేంద్రప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ వెబ్‌సైట్‌ను అనుసరించాను. ఇస్రో యాప్‌లనూ అనుసరించాను. పరీక్షలో బయాలజీ విషయాలను వివరించేటప్పుడు ఫ్లోచార్టులు, బొమ్మలు ఉపయోగించాను.

బృందంతో...

మొత్తంగా నాలుగుసార్లు గ్రూప్స్‌కు హాజరవడంతో పరీక్షపై కొంత అవగాహన వచ్చింది. మధ్యలో చాలా విరామం వచ్చినా ఏదో ఒక పోటీ పరీక్ష రాస్తుండటంతో సన్నద్ధత కొనసాగుతూనే ఉంది. పరీక్షకు చాలా తక్కువ సమయం ఉండటంతో సన్నద్ధతలోనూ కొన్ని మార్పులు చేసుకున్నాను. పేపర్‌-1కు సంబంధించి గ్రూప్స్‌కు సీరియస్‌గా సిద్ధమవుతున్న నలుగురు అభ్యర్థులం కలిసి పరీక్షలో వచ్చే అవకాశమున్న అంశాల జాబితా తయారు చేసుకున్నాం. ఎవరెవరు ఏ అంశంలో నిష్ణాతులో వాటిని తీసుకున్నాం. వాటి సమాచారాన్ని సేకరించుకుని పంచుకున్నాం. ఇది మిగతా పేపర్లకూ ఉపయోగపడింది. దానివల్ల లోతైన అధ్యయనం సాధ్యమైంది.

నా అధ్యయనానికి తెలుగు అకాడమీ పుస్తకాలతో పాటు ప్రభుత్వ వెబ్‌సైట్లు ఎక్కువగా ఉపయోగపడ్డాయి. ప్రభుత్వ పత్రికలూ కీలకమే. ఇలా డైరెక్ట్ సోర్స్‌లను ఉపయోగించడం లాభించింది.

సన్నద్ధతకు రోజూ 3-4 గంటలు కేటాయించేదాన్ని. సిలబస్ కవర్ అయ్యిందా లేదా అనేదానిపైనే ఎక్కువగా దృష్టిపెట్టాను.

ఇంటర్వ్యూలో: 90% ప్రశ్నలు ప్రస్తుతం నేను చేస్తున్న ఉద్యోగానికి సంబంధించినవే అడిగారు. అప్పుడే బడ్జెట్ విడుదలవడంతో దానికి సంబంధించి 2-3 ప్రశ్నలు, డెప్యూటీ కలెక్టర్ ఉద్యోగ ప్రొఫైల్, వ్యక్తిగత జీవితంపై మిగతా ప్రశ్నలను అడిగారు.

అభ్యర్థులకు సూచనలు

- సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- పరీక్షలతో సంబంధం లేకుండా వార్తాపత్రికలను చదువుతూ ఉండాలి. ముఖ్యంగా ఎడిటోరియల్స్ చదవాలి. వాటిలో సిలబస్‌కు సంబంధించిన అంశాలు కనిపిస్తే సేకరించి తరచూ చదువుతుండాలి.
- తెలుగు మాధ్యమంవారు ప్రాథమికాంశాల కోసం అకాడమీ పుస్తకాలను అనుసరిస్తే సన్నద్ధత తేలికవుతుంది.
- ప్రభుత్వ వెబ్‌సైట్లను తరచూ చూస్తుండాలి. ముఖ్యమైన అంశాలను సీరియస్ అభ్యర్థులతో బృందంగా ఏర్పడి చర్చిస్తుండాలి.
- గత ప్రశ్నపత్రాలు వెబ్‌సైట్లలో దొరుకుతుంటాయి. వాటిని చూసుకుంటుండాలి. సమాధానాలు రాయడం ప్రయత్నించాలి.
- మెయిన్స్‌లో ఎస్సే పేపర్‌కు వచ్చే అవకాశమున్న ప్రశ్నలను జాబితాగా రాసుకుంటుండాలి. నోటిఫికేషన్ వచ్చినప్పటినుంచి ఇలా చేస్తుండాలి. 10-15 ప్రశ్నలకు మాదిరి ఎస్సేలను తయారు చేసుకోవాలి. పరీక్షలో ఇవే ప్రశ్నలు వస్తే సమాధానాలు రాయడం తేలికవుతుంది. ఒకవేళ రాయకపోయినా పరీక్ష స్వరూపం అర్థమవుతుంది. ఇలా చేస్తే ప్రశ్న తెలియకపోయినా కరెంట్ అఫైర్స్ చదువుతుంటారు కాబట్టి, కనీస అవగాహన ఏర్పడే అవకాశముంటుంది.

పిలుస్తున్నాయి... గురుకులాలు

మంచి చదువులు... మెరుగైన బోధన... రుచికరమైన భోజనం... ఆటలతోపాటు పోటీ పరీక్షలకు శిక్షణ... ఇంటిని మరిపించే సౌకర్యాలు... ఇవన్నీ కావాలంటే... లక్ష రూపాయలు జేబులో ఉంటే ఏ కార్పొరేట్ విద్యా సంస్థలోనైనా చేరిపోవచ్చు. అయితే లక్షలు లేకపోయినప్పటికీ ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఇలాంటి సౌకర్యాలే ఉచితంగా దక్కాలంటే?

చదువు, వసతి,భోజనం అన్నీ ఉచితమే

ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం

ఈ ప్రశ్నకు సమాధానమే గురుకులాలు... సమర్థులైన ఉపాధ్యాయులతో బోధన, మెరుగైన వసతి సౌకర్యాలు... మంచి పౌష్టికాహారం... ఆటపాటల్లో శిక్షణ... విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా కార్పొరేట్ సంస్థలను మించిన ఏర్పాట్లు గురుకులాల సొంతం. ఇక్కడి విద్యార్థులు చదువులో రాణిస్తూనే కొత్త రికార్డులూ సృష్టిస్తున్నారు. ఎవరెస్టునీ అధిరోహించారు... విదేశాలనూ చుట్టొచ్చారు. ఇలాంటి అవకాశం మీ పిల్లలకూ దక్కాలని కోరుకుంటున్నారా? అయితే మీకోసమే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 497 గురుకుల పాఠశాలలు ఎదురుచూస్తున్నాయి. కేవలం ప్రతిభ, సామాజిక వెనుకబాటు, స్థానికత ప్రాతిపదికగా తెలంగాణ గురుకులాలు అయిదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి.

కేటాయింపు ఇలా...

పాత జిల్లాలను యూనిట్‌గా చేసుకుని విద్యార్థులను ఎంపికచేస్తారు. సర్వేల్ గురుకులంలో మాత్రం రాష్ట్రస్థాయి ప్రతిభ ద్వారా ఎంపికచేస్తారు. అన్ని జిల్లాల విద్యార్థులూ ఇక్కడి సీట్ల కోసం పోటీ పడవచ్చు. ప్రవేశపరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్, స్థానికత ప్రాతిపదికన విద్యార్థులను గురుకులాల్లోకి తీసుకుంటారు. కొడిపల్లి గురుకులానికి మత్స్యకార వృత్తికి చెందిన అన్ని జిల్లాలవారు అర్హులు. ఎంపికైనవారిని అయిదో తరగతిలోకి ప్రవేశం కల్పిస్తారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ఈ పరీక్ష ద్వారా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 232 సాంఘిక సంక్షేమ గురుకులాలు, 88 గిరిజన సంక్షేమ గురుకులాలు, 142 బీసీ సంక్షేమ గురుకులాలు, 35 టీఆర్ఈఐఎస్ జనరల్ గురుకులాల్లో ప్రవేశం లభిస్తుంది.

ప్రత్యేకతలివీ...

అమ్మలాంటి ఆప్యాయత, నాన్నలాంటి ఆదరణ... ఈ రెండింటి మేళవింపునకు ఆధునిక గురుకులాలు చిరునామాగా నిలుస్తున్నాయి. ఇక్కడ సీటు లభిస్తే తల్లిదండ్రుల కల నెరవేరినట్టే.. విద్యార్థుల ఆశయం సాధ్యమైనట్టే. ఎందుకంటే ఇక్కడి ఉపాధ్యాయులు కేవలం పాఠశాల సమయానికే పరిమితం కాకుండా నిరంతరం విద్యార్థులను పర్యవేక్షిస్తారు. పాఠశాల తరగతులు ముగిసిన తర్వాత ఆటలు, విరామం తర్వాత ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ ఉంటాయి. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవచ్చు. ప్రతి తరగతికీ హౌస్ టీచర్ ఉంటారు. వీరు విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకుంటారు. చదువులో వెనుకబడిన, ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తారు. అలాగే చదువు విషయంలో విద్యార్థులపై ఒత్తిడి ఉండదు అలాఅని చెప్పి నేర్పడంలో రాజీ పడరు. పై తరగతుల విద్యార్థులకు ఒలంపియాడ్, ఐఐటీ, నీట్, ఎంసెట్... తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తారు. ఆటల్లోనూ తర్ఫీదునిస్తారు. వీటన్నింటితోపాటు పోషక విలువలతో కూడిన భోజనం (మాంసాహారం, గుడ్లు, అరటిపళ్లు, చిరుతిళ్లు ఇవన్నీ అందిస్తారు), పుస్తకాలు, యూనిఫారంతోపాటు పాదరక్షలు, సబ్బు, దువ్వెన, పేస్టు ఇలా అవసరమైన సామగ్రి అంతా ఇస్తారు.



దరఖాస్తు చేసేటప్పుడు...

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పుడు పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల మొబైల్ నంబరు, ఆధార్ నెంబరు, జిల్లా పేరు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలి. దరఖాస్తు సమర్పించిన తర్వాత ఏవైనా తప్పులు దొర్లినట్లు గుర్తించినప్పటికీ మార్పులకు అవకాశం ఉండదు. అందువల్ల అప్‌లోడ్ చేయడానికి ముందే మరోసారి వివరాలు సరిచూసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: మార్చి 16, **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 8 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు

హాల్ టికెట్లు: పరీక్షకు పది రోజుల ముందు నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫీజు: రూ.50. http://tgcet.cgg.gov.in

ప్రవేశం లభించాలంటే...

అర్హత: ప్రస్తుతం విద్యార్థి 4వ తరగతి చదువుతుండాలి.

వయసు: ఓసీ, బీసీలైతే 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే సెప్టెంబరు 1, 2007 - ఆగస్టు 31, 2009 మధ్య జన్మించినవాళ్లు అర్హులు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య వయసులో ఉండాలి. అంటే సెప్టెంబరు 1, 2005 - ఆగస్టు 31, 2009 మధ్య జన్మించినవాళ్లు అర్హులు.

ఆదాయ పరిమితి: తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలవారైతే రూ.1,50,000 పట్టణ ప్రాంతాల్లో నివసిస్తే రూ.2 లక్షల లోపు ఉండాలి.

ఎంపిక విధానం: రాతపరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా.

పరీక్ష ఇలా..

వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. తెలుగు 20, ఇంగ్లిష్ 25, గణితం 25, పరిసరాల విజ్ఞానం 25, మెంటల్ ఎబిలిటీ 5 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. జవాబులను ఓఎంఆర్ పత్రంపై గుర్తించాలి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణ సెర్ప్

సంస్థ: తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్).

పోస్టు: ప్రాజెక్ట్ మేనేజర్ తదితరాలు

ఖాళీలు: 03

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ లేదా పీజీతోపాటు అనుభవం.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

చివరితేది: 08.03.2018

వెబ్‌సైట్: www.serp.telangana.gov.in

ఏటీఐ, హైదరాబాద్

సంస్థ: భారత నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఐ).

పోస్టు: జూనియర్ కన్సల్టెంట్

ఖాళీలు: 07

జాబ్ లొకేషన్: విద్యానగర్, హైదరాబాద్.

అర్హత: బీటెక్/ బీఈ లేదా డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో అనుభవం.

ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్

చివరితేది: 15.03.2018

వెబ్‌సైట్: http://atihyderabad.ap.nic.in/

ప్రవేశాలు

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఢిల్లీ

కోర్సులు: యూజీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రాములు

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ.

ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ (యూజీ ప్రోగ్రాములకు జేఈఈ మెయిన్ స్కోరు ద్వారా).

రాతపరీక్ష/ ఇంటర్వ్యూ: 2018 ఏప్రిల్ 2 నుంచి 4 వరకు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.

దరఖాస్తు ఫీజు: రూ.2,500.

చివరితేది: 16.03.2018

వెబ్‌సైట్: http://spa.ac.in/

ఎన్‌సీహెచ్‌ఎంసీటీ, నోయిడా

సంస్థ: నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ), నోయిడా.

కోర్సు: ఎంఎస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్-194 సీట్లు

అర్హత: బీఎస్సీ ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్.

ఎంపిక: రాతపరీక్ష ద్వారా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.

దరఖాస్తు ఫీజు: రూ.900.

చివరితేది: 25.04.2018.

వెబ్‌సైట్: http://nchm.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.



'కెమెరా చూస్తే... ఎప్పటికప్పుడే కొత్త'

'శ్రీ'....అంటూ సన్నిహితులంతా ప్రేమతో పిలిచే శ్రీదేవి ఒక్క మాటలో చెప్పాలంటే నటించడానికే జన్మించారు. ఆ క్రమంలో ఎన్నెన్నో ఆటుపోట్లను అధిగమించారు. అజేయంగా నిలిచారు. అఖండ ఖ్యాతితోపాటూ అసంఖ్యాకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. సాధించిన విజయాల జాబితాను నెమరేసుకోవడం కాదు....ప్రస్తుతం తన ముందున్న పనిని నూటికినూరుపాళ్లు చిత్తశుద్ధితో చేయడం మీదనే దృష్టి కేంద్రీకరించడం శ్రీదేవి ప్రత్యేకత. బహుశా...ఈ లక్షణమే ఆమెను ఎంతో మందికి దగ్గర చేసింది.

ఇన్ని చిత్రాలు పూర్తిచేసినా...ఎన్నెన్నో విజయాలు వరించినా.. .కెమెరా ముందు నిలబడాలంటే ఎప్పటికప్పుడే కొత్తగా అనిపిస్తుందంటారామె.. అప్పుడే కొత్తగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన వ్యక్తిలాగా చాలా సంశయంగా...ఏదో జంకుగా అనిపిస్తూ ఉంటుంది అని శ్రీదేవి తరచూ చెప్పేవారు. బహుశా ఇలాంటి ప్రవృత్తి మూలంగానే ఆమె ఎప్పటికప్పుడు తన నటనా వైదుష్యాన్ని మెరుగుపరచుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించారు. అద్భుత ఫలితాన్ని చవిచూశారు. ప్రేక్షకులకూ అంతే స్థాయి అనుభూతిని మిగిల్చి ..వారి గుండెల్లో అమరులై నిలిచారు.



భారతీయ కలల రాణి

వెండితెర దేవత

అసలు భూలోకం ఇలాంటి సిరి చూసి ఉంటదా..! అనేంత సమ్మోహన సౌందర్యం శ్రీదేవిది. అతిలోక సుందరి అనే మాట ఆమెకు తప్ప ఇంకెవరికీ సరిపోదేమో అనేంతగా భారతీయ చిత్ర పరిశ్రమను మైమరపించారామె. ఐదు దశాబ్దాలుగా భారతీయ సినిమా అభిమానుల్ని అందం, అభినయంతో అలరిస్తున్న శ్రీదేవి (54) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. శ్రీదేవి మరణ వార్త యావత్ భారతీయ ప్రేక్షకుల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. 1963 ఆగస్టు 13న అయ్యప్పన్, రాజేశ్వరి దంపతులకు శివకాశీలో జన్మించారు శ్రీదేవి. ఆమె అసలు పేరు శ్రీ అమ్మయాంగర్ అయ్యప్పన్. శ్రీదేవికి శ్రీలత అనే సోదరి ఉంది. శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ న్యాయవాది. ఆయన వృత్తిరీత్యా చెన్నైలో సిరపడ్డారు. నాలుగేళ్ల వయస్సులోనే శ్రీదేవి చిత్ర పరిశ్రమకు బాలనటిగా పరిచయమయ్యారు. ఎంఏ తిరుమురుగన్ దర్శకత్వంలోని 'తునైవన్' చిత్రంలో సుబ్రమణ్యస్వామి పాత్రలో తెరపై అడుగుపెట్టారు. ఆ తర్వాత 'కనిముత్తు', 'వసందమాలిగై', 'భారత విలాస్' వంటి చిత్రాల్లో బాలనటిగా మెప్పించారు. జయలలిత వంటి పలువురు హీరోయిన్లకు ముద్దులొలికే పాపాయిగా నటించారు. 'మా నాన్న నిర్దోషి'లో బాలనటిగా తెలుగులో ప్రవేశించారు. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ వంటి పలు చిత్రాల్లో బాలనటిగా భిన్నమైన పాత్రలు పోషించారు.

బాలచందర్ దర్శకత్వంలో నాయికగా..

బాలనటిగా బాలీవుడ్ వరకు గుర్తింపు తెచ్చుకున్న శ్రీదేవిని కథానాయికగా తెరకు పరిచయం చేసిన దర్శకుడు కె.బాలచందర్. 13 ఏళ్ల వయసులో ఆమెను తన 'మూంద్రు ముడిచ్చు' చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయం చేశారు. ఇందులో రజనీకాంత్, కమల్‌హాసన్ కలసి నటించారు. ఆ తర్వాత నటించిన 'పదహారేళ్ల వయసు' ఆమెను తిరుగులేని తారను చేసింది. అందులోని సిరిమల్లే పువ్వా...సిరిమల్లె పువ్వా' పాటలో ఆడిపాడే శ్రీదేవి ఇప్పటికీ అభిమానుల కళ్లలో కదులుతూనే ఉంటుంది. ఆమె తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 300పైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో అప్పటి స్టార్ హీరోలు అందరితోనూ నటించారు. ఎన్టీఆర్‌తో 'వేటగాడు', కొండవీటి సింహం', 'బొబ్బిలిపులి'లాంటి హిట్ చిత్రాల్లో నటించి మెప్పించారు. ఏఎన్నార్‌తో 'ముద్దులకొడుకు', 'ప్రేమ కానుక', 'ప్రేమాభిషేకం', శోభన్‌బాబుతో 'కార్తీకదీపం', 'దేవత' ఇలా పలు చిత్రాల్లో తనదైన అభినయంతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించారామె. తెలుగులో అత్యధికంగా కృష్ణతో 33 చిత్రాల్లో నటించారు శ్రీదేవి. ఆయనతో కలిసి 'కంచుకాగడ', 'కలవారి సంసారం', 'కృష్ణావతారం', 'బుర్రిపాలెం బుల్లోడు', 'కిరాయి కోటిగాడు' తదితర చిత్రాల్లో నటించారు.

అదే ఆమె ప్రత్యేకత

శ్రీదేవి గొప్పతనం ఏంటంటే ఏ హీరోతో నటిస్తే ఆ హీరో వయసుకి తగిన జోడీలా కుదిరిపోతారు. అక్కినేనితో నటించిన ఆమె నాగార్జునతో 'గోవిందా గోవిందా'లో నటించి చక్కటి జోడీ అనిపించుకొన్నారు. వెంకటేష్‌తో 'క్షణం క్షణం'లో ఆమె నటనను ప్రేక్షకులు మర్చిపోలేరు. చిరంజీవితో కలిసి నటించిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి'తో శ్రీదేవి ఎంతటి జగదేక సుందరో మరోసారి ప్రేక్షకులు చూశారు. రజనీకాంత్, కమల్‌హాసన్ తరంలో నాయికగా మారారు శ్రీదేవి. అయితే ఎంజీఆర్, శివాజీ గణేశన్, శివకుమార్ వంటి మునుపటితరం హీరోలతోనూ జతకట్టి మెప్పించారు. 'కవరిమాన్', పట్టాకత్తి భైరవన్', 'బాబు' వంటి సినిమాల్లో నటించారు. శివకుమార్‌కు జోడీగా శ్రీదేవి నటించిన 'కవికుయిల్', 'మచ్చాన పాత్తీంగలా', 'సాయిందాడమ్మా సాయిందాడు'లు హిట్ చిత్రాలుగా నిలిచాయి. 'సాల్వా సావన్'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టి.. 'హిమ్మత్‌వాలా 'తో స్టార్‌డమ్ తెచ్చుకున్నారు. ఆ తర్వాత నటించిన 'మిస్టర్ ఇండియా', 'ఖుదాగవా' లాంటి చిత్రాలు హిందీ చిత్రసీమలో ఆమెను తిరుగులేని తారగా నిలబెట్టాయి. తమిళంలో 1977- 83 మధ్యకాలంలో శ్రీదేవి-కమల్‌హాసన్ వెండితెరపై చక్కటి జోడీగా గుర్తింపు పొందారు. బాలీవుడ్‌లో జితేంద్ర- శ్రీదేవి జంట బాగా పాపులర్.

రజనీ, కమల్‌తో అధిక చిత్రాలు

తమిళ చిత్ర పరిశ్రమలో ఎవరికీ సాధ్యంకాని చరిత్రను లిఖించారు శ్రీదేవి. రజనీకాంత్‌తో ఏకంగా 23 చిత్రాల్లో నటించారు. వాటిలో 'ప్రియా', 'జాని', 'రాణువ వీరన్', 'ధర్మయుద్ధం', 'అడుత్త వారిసు', 'పోక్కిరిరాజా' చిత్రాలు మరిచిపోలేవి. తెలుగులో 'రామ్ రాబర్ట్ రహీం' చిత్రంలో నటించారు. ఇక హిందీలో రజనీతో కాంబినేషన్‌లో 'మహాగురు', 'భగవాన్ దాదా', 'జాని ఉస్తాద్' చిత్రాలున్నాయి. విశ్వనటుడు కమల్‌హాసన్‌తో 22 చిత్రాల్లో నటించారు. 'సిగప్పు రోజాక్కల్', 'సక్కపోడు పోడురాజా', 'కల్యాణరామన్', 'తాయిల్లామ్ నానిల్లై', 'శంకర్‌లాల్', 'గురు', 'వరుమైనిరం సిగప్పు(ఆకలిరాజ్యం)', 'వాళ్వే మాయం' చిత్రాలు చిరస్థాయిగా గుర్తింపు తెచ్చుకున్నాయి. తెలుగులో వీద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఒకరాధ ఇద్దరు కృష్ణులు', 'అందగాడు' చిత్రాలు అలరించాయి. 'మూంద్రాంపిరై (వసంతకోకిల)' చిత్రమైతే ఆమెకు నటిగా ఎనలేని గుర్తింపును తీసుకొచ్చింది. బుద్ధిమాంద్యం అమ్మాయిగా తన నటనతో ఆ పాత్రకు మరింత వన్నె తెచ్చి.. కొన్ని సందర్భాల్లో ప్రేక్షకులను కంటతడి పెట్టించారు. ఆ సినిమా క్లైమాక్స్‌లో కూడా తిరుగులేని నటనను ప్రదర్శించి మెప్పించారు.

26 ఏళ్ల తర్వాత 'పులి'గా..

1976లో కథానాయికగా అడుగుపెట్టిన శ్రీదేవి తిరుగులేని తారగా విజయదుందుభి మోగించారు. తమిళంలో ఆమె రజనీకాంత్‌తో 1986లో 'నాన్ అడిమై ఇల్లై' చిత్రంలో నటించారు. ఆ తర్వాత తమిళ చిత్రాల్లో పెద్దగా కనిపించలేదు. ప్రముఖ నిర్మాత బోనీకపూర్‌తో వివాహమయ్యాక సినిమాలకు దూరమయ్యారు శ్రీదేవి. కానీ 2012లో 'ఇంగ్లిష్ వింగ్లిష్'లో కనిపించారు. ఇందులో అజిత్ కూడా అతిథి పాత్ర పోషించారు. 2015లో విజయ్ నటించిన 'పులి' చిత్రంలో ముఖ్యపాత్రలో కనిపించారు శ్రీదేవి. అందులో రాణిగా తనదైన నటన ప్రదర్శించారు. సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయినప్పటికీ శ్రీదేవి నటనకు ప్రశంసలు దక్కాయి. శ్రీదేవికి ఇద్దరు కుమార్తెలు జాన్వి కపూర్, ఖుషీ కపూర్. జాన్వి 'ధడక్' చిత్రంతో వెండితెరకు పరిచయమవుతోంది.



అవార్డులు

- భారత ప్రభుత్వం 2013లో శ్రీదేవిని పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.
- తెలుగులో 'క్షణం క్షణం' చిత్రానికి ఉత్తమ నాయికగా నంది అవార్డు అందుకొన్నారు శ్రీదేవి.
- ఎన్నోసార్లు ఫిలింఫేర్ అవార్డులు దక్కాయి.
- 'మామి పురస్కారం', 'అక్కినేని జీవిత సాఫల్య పురస్కారం'... ఇలా ఎన్నో అవార్డులు రివార్డులు శ్రీదేవి ఇంట కొలువుతీరాయి.



హీరోయిన్‌గా తొలిచిత్రం 'అనురాగాలు'

1972లో హిందీలో విడుదలైన 'అనురాగ్' సినిమాను..1975లో 'అనురాగాలు' పేరిట తెలుగులో తీశారు. అనురాగ్‌లో నటి మౌసమీ ఛటర్జీ నటించిన అంధురాలి పాత్రను..'అనురాగాలు'లో శ్రీదేవి పోషించారు. కథానాయికిగా ఆమెకు అదే తొలి చిత్రం. అందరూ అనుకుంటున్నట్టుగా 1978లో వచ్చిన 'పదహారేళ్ల వయసు' హీరోయిన్‌గా శ్రీదేవికి తొలిచిత్రం కాదు.

'క్షణక్షణం' సినిమాలో 'కింగులా కనిపిస్తున్నాడు...' అనే పాటను శ్రీదేవే పాడారు. ఆ పాట రికార్డింగ్‌కు శ్రీదేవి తనతోపాటు చెల్లెలు మహేశ్వరిని వెంటబెట్టుకుని వచ్చారు. 'కొంచెం కొంచెం పాడటం.. ఆమె బాగుందంటూ కళ్లతో సైగ చేస్తే కొనసాగించడం.. లేదన్నట్టు సంజ్ఞలు ఇస్తే ఆపేయడం చేశారట' శ్రీదేవి. ఆ తర్వాతి రోజుల్లో మహేశ్వరి కూడా హీరోయిన్‌గా ప్రేక్షకులకు పరిచయమయ్యారు.

–రాజా (మ్యూజికాలజిస్ట్)

ఎన్టీఆర్‌కి డ్యాన్స్ గురు



ఎన్టీఆర్- శ్రీదేవి.. ఓ అపురూపమైన కలయిక. ఒకరు వెండి తెర ఇలవేల్పు.. మరొకరు ఆ తెరకే అందాన్ని తీసుకొచ్చిన అతిలోక సుందరి. ఇద్దరూ ఒకేసారి తెరపై కనిపిస్తే ప్రేక్షకులకు పండగే. వీరిద్దరూ ఆడిపాడిన పాటలన్నీ హిట్టే. వయసు, అనుభవం రీత్యా ఎన్టీఆర్ సీనియర్. కానీ శ్రీదేవి ఆయనకు గురువుగా మారింది. అదెలాగంటే.. ఆ రోజుల్లో ఎన్టీఆర్ స్టెప్పులన్నీ ఒకే రీతిలో సాగేవి. ఆయన అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు నడిచినా మాస్‌కి అదే కిక్కు. అయితే శ్రీదేవి పక్కనుంటే మాత్రం ఎన్టీఆర్ డాన్సుల్లో మరింత మజా వచ్చేసేది. వయసుని మర్చిపోయి శ్రీదేవితో స్టెప్పులు వేసేవారు. దీనికి కారణం ఏమిటని ఓసారి ఎన్టీఆర్‌ని అడిగితే "శ్రీదేవితో నా డ్యాన్సులు బాగుండడానికి కారణం ఆమే. సెట్లో నాకు కొన్ని డ్యాన్సు చిట్కాలు చెబుతుంది. కొన్ని స్టెప్పులు వేసి మరీ చూపిస్తుంది. ఈ రకంగా శ్రీదేవి నాకు డ్యాన్సుల్లో గురువు" అని చెప్పారు.

ఏడుపు ముఖంతో రొమాంటిక్ సన్నివేశాలు

రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం శ్రీదేవికి తొలినాళ్లలో కష్టంగా ఉండేది. తక్కువ వయసులోనే హీరోయిన్ పాత్రలు దక్కడం అందుకు కారణం. దీంతో రొమాంటిక్ ఫీలింగ్స్ ఆమె ముఖంలో స్పష్టంగా వచ్చేవి కావు. 'రొమాంటిక్‌గా చూడండి' అంటూ దర్శకులు అడిగితే.. కెమెరా స్టార్ట్ చేయగానే ఫక్కున నవ్వేసేది. ఓసారి బాలచందర్ దర్శకత్వంలో నటిస్తూ అలాగే నవ్వేసింది. ఆయనకు చాలా కోపం వచ్చింది. ఆరోజే వెళ్లి శ్రీదేవి అమ్మానాన్నలను ఆయన కలిశారు. 'మీ అమ్మాయికి రొమాంటిక్ ప్రేమకథలు చూపించండి. ఆ ఫీల్‌ని అర్థం చేసుకొమ్మనండి' అని సలహా ఇచ్చారు. ఆపై శ్రీదేవి అలాంటి చాలా సినిమాలు చూసినా.. పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. చేసేదేం లేక బాలచందర్.. 'నువ్వు కాస్త ఏడుస్తున్నట్లు ముఖం పెట్టు చాలు. అదే రొమాంటిక్‌గా ఉంటుంది' అనేసి షూటింగ్ కానిచ్చేశారు. ఆ తర్వాత కూడా శ్రీదేవి అదే సూత్రాన్ని ఫాలో అయ్యింది. అయితే, రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె ఏడుపు ముఖంతో నటిస్తుందని తన అమ్మానాన్నలకు తప్ప ఇంకెవరికీ తెలియదట. స్వయంగా శ్రీదేవి ఓ ముఖాముఖీలో ఈ విషయాలను బయటపెట్టింది.

పద్నాలుగేళ్ల వయసులో పదహారేళ్ల పాట..!

'పదహారేళ్ల వయసు' చిత్రంతో శ్రీదేవిని కథానాయికగా తెలుగు తెరకు పరిచయం చేశారు రాఘవేంద్రరావు. టైటిల్ పదహారేళ్ల వయసు అయినా.. ఆ సినిమా చేసేటప్పటికి ఆమె వయసు పద్నాలుగేళ్లే. అందులో శ్రీదేవి అందాన్ని, 'సిరిమల్లె పువ్వా..' పాటలో ఆమె పలికించిన హావభావాలను అంత త్వరగా ఎవరూ మర్చిపోలేరు. శ్రీదేవిని అంత అందంగా చూపించడానికి రాఘవేంద్రరావు ఆమెపై 24 క్లోజప్ షాట్లను తీశారట.



దక్షిణాదికి ప్రియ శ్రీదేవేరి!



బాలీవుడ్‌లోకి ప్రవేశించడానికి ముందు శ్రీదేవి దక్షిణాదిలో అన్ని ప్రాంతీయ భాషల్లో తన నటప్రతిభను చాటారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో ఒక వెలుగు వెలిగారు. బాలనటి ప్రవేశించిన ఆమె.. కథానాయకిగా ఎదిగి ప్రేక్షకులపై చెరగని ముద్ర వేశారు.

తమిళంలో ఆమె బాలూ మహేంద్ర, బాలచందర్ వంటి దిగ్గజ దర్శకుల సినిమాల్లో నటించారు. రజనీకాంత్, కమల్‌హాసన్ అగ్ర నటులతో తెరను పంచుకున్నారు. తమిళంలో ఆమెకు తొలి హిట్‌ను మూంద్రు ముడిచు (1976) రూపంలో బాలచందర్ అందించారు. అందులో ఆమె కమల్‌హసన్, రజనీకాంత్‌లతో కలసి నటించారు. ఆ రోజుల్లో నడిచిన రజనీ-శ్రీ-కమల్ రొమాంటిక్ ట్రయాంగిల్ తరహాలోనే ఈ చిత్ర కథాగమనం నడిచింది. భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన పదునారు వయధినిలై, సిగప్పు రోజాగళ్ వంటి చిత్రాలు శ్రీదేవికి మంచి పేరు తెచ్చిపెట్టాయి. మూంద్రామ్ పిరైలో ఆమె రేష్మి పాత్రకు ప్రాణంపోశారు. కారు ప్రమాదంలో ఆమె గతాన్ని మర్చిపోతుంది. వ్యభిచార గృహానికి చేరుతుంది. అక్కడి నుంచి ఆమెను కథానాయకుడు సోము (కమల్‌హసన్) రక్షిస్తాడు. కుటుంబ వివరాలేమీ ఆమెకు చెప్పలేకపోవడంతో సోము ఆమెను ఊటీకి తీసుకెళతాడు. ఆమెలోని కల్మషంలేని పసి మనస్సు కథానాయకుడికి బాగా నచ్చుతుంది. ఊటీకి వెళ్లేదారిలో పొడవైన ఒక చెట్టు ఆమెకు కనిపిస్తుంది. అదేంటని ఆమె.. సోమును ప్రశ్నిస్తుంది. 'యూకలిప్టస్' అని బదులిస్తాడు. దాన్ని పలకడానికి ఆమె చాలా ఇబ్బంది పడుతుంది. హిందీ, ఇంగ్లిష్‌తో ఆమె పడ్డ ఇబ్బందులకు ఈ దృశ్యం దర్పణం పడుతోంది. భాషతో తనకున్న ఇబ్బందులను ఆమె హిందీ చిత్రాల్లో ఆయుధంగా మలచుకున్నారు. హిందీ చలనచిత్ర ప్రస్థానంలో ఆమె ఒకింత తమిళ ఉచ్చారణ దొర్లేది. అది ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. 1977లో వచ్చిన గాయత్రి సినిమా కూడా శ్రీదేవి ప్రతిభను చాటింది. అందులో దారితప్పిన భర్త పాత్రను రజనీకాంత్ పోషించారు. నామ్ నాడు, కంధన్ కరుణై వంటి చిత్రాల్లో జయలలితతో కలసి ఆమె నటించారు.

కుమార సంభవం సినిమాతో 8 ఏళ్ల వయసులో శ్రీదేవి.. మలయాళ సినీ రంగ ప్రవేశం చేశారు. అయితే పూంపట్టా (1971) ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ బాలనటి అవార్డు దక్కింది. ఆ తర్వాత ఆలింగనం, ఆశీర్వాదం, ఆంతర్దాహం, ఊంజల్ సినిమాల్లో అద్భుతంగా నటించారు.

కన్నడలోనూ కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, లీలావతి, మంజుల తదితరుల వద్ద బాలనటిగా శ్రీదేవి నటించారు. బాలభారత, సంపూర్ణ రామాయణం, యశోదాకృష్ణలో ప్రేక్షకులను మెప్పించారు. అంబరీశ్‌తో కలసి 1978లో ఆమె నటించిన ప్రియ చిత్రం ఘన విజయం సాధించింది. 175 రోజుల పాటు నడిచింది.





భారతీయ కలల రాణి

'పోటీనే తప్ప పోట్లాటల్లేవు'

"నాకు...జయప్రదకు మధ్య పోటీతత్వమే తప్ప....పోరాటాలు, పోట్లాటలేమీ లేవు. ఇద్దరం కలిసి నటించిన సినిమాల్లో ఒకరికంటే మరొకరం మెరుగ్గా నటించాలనే తాపత్రయపడేవాళ్లం. అంతేతప్ప మరింకేమీ లేదు. ఆమె నాతో మాట్లాడేవారు కాదు. అదంతా గతం తెలుసా! నాన్న పోయినపుడు జయప్రద నన్ను పరామర్శించవచ్చారు. ఎంతో ఆప్యాయతగా ఉన్నారు.ఒకలాంటి దగ్గరతనాన్ని చూశానామెలో" అని శ్రీదేవి ఓ సందర్భంగా చెప్పారు. తన మటుకు తాను ఉద్దేశపూర్వకంగా పోటీ పడనని... ప్రతి నటి కూడా తను నటించే ప్రతి సన్నివేశాన్నీ నూటికినూరు శాతం పండించడానికి శాయశక్తులా యత్నిస్తుందని తెలిపారు.

దగ్గరయ్యాం

పసిపిల్లలాంటి ముఖం... స్వరం అంటుంటారు గానీ.. అవసరమైనపుడు స్వరాన్ని మార్చి మాట్లాడగలను కూడా. 'ఖుదా గవా'లో తల్లీ, కుమార్తె ఇద్దరి స్వరాలను వేర్వేరుగా వినిపించలేదా. 'సద్మా' సినిమాలో ఆరేళ్ల పిల్లలాగా చక్కగా స్వరాన్ని మార్చుకుని మాట్లాడగలిగాను అని ఆమె చెప్పేవారు.



వర్మ కళ్లతో శ్రీదేవి!

లక్ష ఏళ్ల అందం

"విశ్వ బ్రహ్మ సృష్టించిన అత్యద్భుతమైన సౌందర్య రాశి శ్రీదేవి. అలాంటి అందం లక్ష ఏళ్లకు ఒక్కసారి మాత్రమే జన్మిస్తుంది"

- రాంగోపాల్ వర్మ 'నా ఇష్టం'లో శ్రీదేవిపై రాసుకున్న మాటలు ఇవి.

శ్రీదేవి మహా అందగత్తె. వర్మ కళ్లతో చూస్తే.. ఆమె మరింత ముగ్ధమనోహరంగా కనిపిస్తుంది. వర్మ అసలే సౌందర్య పిపాసి. అందుకే శ్రీదేవి అంటే పిచ్చి. కేవలం శ్రీదేవిని మెప్పించడం కోసమే 'క్షణం క్షణం' సినిమా తీశానని చాలా సార్లు చెప్పాడు వర్మ. అది సినిమా కాదు.. తన దృష్టిలో శ్రీదేవికి రాసిన ప్రేమలేఖ. శ్రీదేవి అనగానే తన యవ్వనంలోకి.. దర్శకుడిగా అడుగుపెట్టిన కొత్తరోజుల్లోకి వెళ్లిపోతాడు వర్మ. 'శివ' స్క్రిప్టు పనులు చెన్నైలో జరిగాయి. అప్పట్లో నాగార్జున ఆఫీసు పక్కనే శ్రీదేవి ఇల్లు. రోజూ శ్రీదేవి ఇంటి గేటు ముందు నిలబడి.. ఆ ఇంటిని తదేకంగా చూసేవాడట వర్మ. 'అంతటి శ్రీదేవి.. ఇలాంటి డొక్కు ఇంట్లో ఉంటుందా' అని ఆశ్చర్యపోయేవాడట. అలాగని శ్రీదేవి ఇల్లేం పాడుపడ్డ బంగ్లా కాదు. కానీ శ్రీదేవిని తనలో ఉంచుకోగలిగే అర్హత మనిషి నిర్మించిన ఏ ఇంటికీ లేదన్నది వర్మ భావన.



'క్షణం క్షణం'.. ఓ గమ్మత్తైన సంఘటన..

ఆ సినిమా షూటింగ్ దట్టమైన అడవిలో. ఓ రోజు... శ్రీదేవిని ఏదో పురుగు కుట్టింది. తొడ అంతా ఎర్రగా కందిపోయింది. దాంతో షూటింగ్ ఆగిపోయింది. అదేం పురుగో, కుడితే ఎంత ప్రమాదమో ఎవ్వరికీ తెలీదు. ఆసుపత్రికి తీసుకెళ్దామంటే.. ఆ అడవి పట్నానికి సరిగ్గా వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. శ్రీదేవికే కాదు, సెట్లో ఉన్నవాళ్లందరికీ ఒకటే కంగారు. ప్రొడక్షన్ వాళ్లు ఓ ఆర్ఎంపీని వెతికి తీసుకొచ్చారు. తనని చూస్తే.. 'డాక్టరా, వాళ్లింట్లో పనోడా' అన్న రేంజ్‌లో ఉన్నాడు. తనని చూడగానే శ్రీదేవికి భయం, అనుమానం. 'ఇతని వల్ల అవుతుందా?' అని. ఆ ఆర్ఎంపీ ఏమో.. శ్రీదేవిని చూడగానే షాక్‌లోకి వెళ్లిపోయాడు. 'ఏంటి? నేను చూస్తోంది శ్రీదేవినేనా' అని. సంచిలో ఉన్న ఇంజక్షన్‌నీ, సిరంజినీ బయటకు తీశాడు. కానీ అది కాస్తా శ్రీదేవిని చూసిన కంగారులో జారవిడిచాడు ఆర్ఎంపీ. ఈ తతంగం అంతా గమనిస్తున్న శ్రీదేవిలో మరింత భయం పుట్టుకొచ్చింది. 'వర్మ గారూ... నాకేదో భయంగా ఉంది..' అంటూ ఆవిడ ఏదో చెప్పబోతుంటే.. ఆ సంచిలోంచి మరో రంగు ఇంజక్షన్ తీశాడు ఆర్ఎంపీ. 'ఇందాక తీసింది వేరు.. ఇది వేరు కదా' అనే సందేహం అందరిలోనూ! 'ఈ ఇంజక్షన్ వర్కవుట్ అవుతుంది లెండి..' అని ధైర్యంగానే పొడిచేశాడు ఆర్ఎంపీ అదృష్టవశాత్తూ.. అది పనిచేసింది. శ్రీదేవి గాయం మాయమైంది. కానీ ఆ రోజున ఆ ఆర్ఎంపీ కళ్లలో ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ ఎప్పటికీ మర్చిపోలేనని చెబుతుంటాడు వర్మ.

'అందనంత ఎత్తా తారాతీరం' పాట జరుగుతోంది..

వెంకటేష్, శ్రీదేవితో డాన్సులు చేయిస్తున్నారు సుందరం మాస్టారు. షాట్ అయిపోగానే 'సూపర్ సూపర్' అని అరిచాడు వర్మ. కానీ సుందరం మాస్టారు వచ్చి 'మరో టేక్ చేద్దాం..' అన్నాడు. అది అవ్వగానే 'సూపర్ సూపర్' అంటూ వర్మ నుంచి సేమ్ రియాక్షన్. కానీ సుందరం మాస్టారు మాత్రం 'వన్ మోర్' అంటూ మరో టేక్‌కి వెళ్లిపోయాడు. వర్మకి చిరాకొచ్చింది. 'ఏంటి.. అస్తమానూ వన్ మోర్, వన్ మోర్ అంటున్నారు' అంటూ సహాయకుడ్ని అడిగాడు. 'సార్ మీరు శ్రీదేవిని మాత్రమే చూస్తున్నారు.. ఆయన వెంకటేష్‌ని కూడా చూస్తున్నారు..' ఇదీ అతని సమాధానం. సెట్లో ఎంతమంది ఆర్టిస్టులున్నా వర్మ కళ్లెప్పుడూ శ్రీదేవినే చూస్తుంటాయి. శ్రీదేవి ఏం చేసినా పర్‌ఫెక్ట్‌గానే కనిపిస్తుంది. అది వర్మకు శ్రీదేవిపై ఉన్న ప్రేమ.

కథానాయికగా ఆరాధించిన వర్మకు.. తల్లి పాత్రలో ఒదిగిపోయిన శ్రీదేవి నచ్చలేదు. 'స్టార్‌డమ్ నుంచీ, మ్యాగజైన్ల కవర్ పేజీల నుంచి, ఆర్క్ లైట్ల వెలుతురు నుంచీ, వెండి తెర వెలుగుల నుంచీ ఆమె ఒక సాధారణ గృహిణిగా మారిపోయింది. ఒక మామూలు మహిళలా బోనీకపూర్ ఇంట్లో టీ అందిస్తుండటం చూశాను. స్వర్గంలో ఉండాల్సిన ఒక దేవతను నేల మీదికి దించినందుకు బోనీకపూర్‌ని లాగి కొట్టాలనిపించింది. ఎందుకంటే ఒక మామూలు ఇంట్లో, మామూలు మనుషుల మధ్య, మామూలు వాతావరణంలో శ్రీదేవిని చూడటం నావల్ల కాలేదు' అంటూ తన కోపాన్ని ప్రదర్శించాడు.

శ్రీదేవి మరణం వర్మని బాగా ఇబ్బంది పెట్టింది. ప్రతీ విషయంపైనా తనదైన శైలిలో స్పందించే వర్మ.. ఈసారి అదే స్థాయిలో స్పందించాడు. 'మనలానే తనకీ మామూలు గుండె ఉందా? అది కూడా ఆగిపోతుందా? అందుకే ఐ హేట్ శ్రీదేవి... శ్రీదేవిని చంపేసినందుకు దేవుడ్నీ ద్వేషిస్తున్నా..' అంటూ ఫేస్‌బుక్‌లో తన బాధని వెళ్లగక్కాడు వర్మ. వర్మకెప్పుడూ విలాసాలే కావాలి. విషాదాలు ఉండవు. ఉన్నా పట్టించుకోడు. కానీ, శ్రీదేవి మరణం.. వర్మకు జీవితాంత విషాదం!!



చిరస్మరణీయ నటి

చలనచిత్ర రంగంలో శ్రీదేవి సుదీర్ఘ కాలం కొనసాగారు. ఎన్నో వైవిధ్యభరిత పాత్రలతో చిరకాలం గుర్తుండిపోయే అభినయాన్ని ప్రదర్శించారు. **– ప్రధాని నరేంద్ర మోదీ**

శ్రీదేవి అకాల మరణం అత్యంత విచారకరం.. ఆమె తెలుగు, హిందీలతో పాటు పలు దక్షిణాది భాషా చిత్రాల్లో అనేక పాత్రల్లో నటించి పేరుతెచ్చుకున్న ప్రజ్ఞాశాలి..

– ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

దేశమంతా అభిమానించే నటి శ్రీదేవి. ఆమె ఇక లేరన్న వార్త విని దిగ్భ్రాంతికి లోనయ్యా.. అద్భుతమైన అభినయంతో అనేక భాషల్లో నటించారు. **– కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ**

భారత చలనచిత్ర రంగంలో శ్రీదేవి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. జాతీయ సమగ్రతకు భారతీయ సినిమాను గుర్తుగా నిలపడంలో విశేష పాత్ర పోషించారు.

– భాజపా సీనియర్ నేత ఎల్.కె.అద్వాణీ

తెలుగు, హిందీతోపాటు పలు ఇతర భాషల్లో తన నటన, నృత్యాలతో ఎంతో మంది అభిమానం పొందిన ఆమె ఇంకా నటిస్తూనే... అకాల మరణం చెందడం బాధాకరం. ఆమె పాత్రలు చిరస్మరణీయం. **– తెలంగాణ సీఎం కేసీఆర్**

అసమానమైన అభినయంతో దేశం గర్వించదగ్గ నటిగా శ్రీదేవి నిలిచిపోయారు. ఆమె మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. బహు భాషా నటిగా, ముఖ్యంగా తెలుగువారికి అత్యంత అభిమాన నటిగా ఎదిగారు.

– ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్‌లో ఒక అంకుర పరిశ్రమ ప్రారంభోత్సవంలో శ్రీదేవితో మాట్లాడాను. ఆమె దయాగుణం ఎంతగానో నచ్చింది.

– తెలంగాణ మంత్రి కేటీఆర్

ఆమెకు వీరాభిమానిని. సినిమాలను అమితంగా ప్రేమించేందుకు ఆమె ఓ కారణం. భారత సినీ పరిశ్రమ తన చిరునవ్వును పోగొట్టుకున్నట్టు అనిపిస్తోంది. స్వర్గలోకపు వాసులు ఎంతో అదృష్టంచేసుకున్నారు. వారి కోసం అద్భుతమైన బహుమతి వస్తోంది.

– కరణ్ జోహర్, దర్శక నిర్మాత

శ్రీదేవి ఇకలేరన్న వార్త విని ఆశ్చర్యపోయా.. ఆవేదన చెందా. తమిళంలో మాత్రమే కాదు హిందీలో కూడా అనర్గళంగా మాట్లాడి నటించే సత్తా ఆమె సొంతం. 40 ఏళ్ల పాటు ఆమె నాకు మంచి స్నేహితురాలు. శ్రీదేవి లోటును ఎవరూ భర్తీ చేయలేరు. పుట్టుకతోనే ఆమె ఓ మహానటి.

– రజనీకాంత్

శ్రీదేవి చిన్నతనంలో మా పక్కింట్లోనే ఉండేది. మా ఇంట్లోనే ఎక్కువ సేపు గడిపేది. శ్రీదేవి, నేను కలిసి 34 చిత్రాల్లో నటించాం. చిన్న వయసులోనే ఆమె మనందరికీ దూరం కావడం ఎంతో బాధకి గురిచేసింది **– కృష్ణ**

చిన్నప్పట్నుంచి శ్రీదేవికి నటన తప్ప మరో వ్యాపకం లేదు. ఆమె అంకితభావాన్ని చూసి నేనెంతో నేర్చుకొన్నా. మా ఇద్దరి కలయికలో వచ్చిన అద్భుత దృశ్యకావ్యం 'జగదేకవీరుడు అతిలోకసుందరి'. అందులోని పాత్ర ఆమె కోసమే సృష్టించిందా అనిపిస్తుంది. ఆమె ఎప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో జీవించే ఉంటారు. సినిమా ప్రపంచం ఉన్నంతవరకూ బతికేఉంటారు. **– చిరంజీవి**

ఎలాంటి భావాన్నైనా కళ్లతోనే పలికించగల మహానటి శ్రీదేవి. ఆవిడ, నాన్న చాలా సినిమాల్లో నటించారు. శ్రీదేవి మరణం చిత్రసీమకి తీరని లోటు.

– బాలకృష్ణ

శ్రీదేవి కుటుంబంతో నాకు మంచి అనుబంధం ఉంది. మంచి నటిని, ఉన్నతమైన వ్యక్తినీ భారతీయ చిత్ర పరిశ్రమ కోల్పోయింది.

– మోహన్‌బాబు

అమాయకంగా కనిపిస్తూ శ్రీదేవి పండించిన నటన ఎప్పటికీ మరిచిపోలేనిది. 'జగదేకవీరుడు అతిలోకసుందరి'లో దేవకన్యగా కనిపించిన తీరు, మానవా... మానవా అంటూ చెప్పే సంభాషణలు అందరికీ గుర్తుండిపోతాయి. పెద్ద కుమార్తెని కథానాయికగా పరిచయం చేస్తున్న తరుణంలో ఆమె ఈ లోకాన్ని వీడటం బాధాకరం.

– పవన్‌కల్యాణ్

గొప్ప నటిని కోల్పోయిన దురదృష్టకరమైన రోజు ఇది. 'క్షణక్షణం'లో ఆమె పలికించిన హావభావాలు సహ నటుడిగా నా మనసులో చెరగని ముద్రవేశాయి. **– వెంకటేష్**

శ్రీదేవి మన నుంచి దూరమయ్యారన్న నిజాన్ని నమ్మడానికి ప్రయత్నిస్తూనే ఉన్నా. అంతా ఓ పీడకలలా ఉంది. శ్రీదేవిని ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాం. **– నాగార్జున**

ఎప్పటికీ నా అభిమాన నటి శ్రీదేవి. మహిళగా, నటిగా ఆమె అద్భుతం. ఆమె ఆత్మకి శాంతి కలగాలి. **– మహేష్‌బాబు**

దేశంలో తొలి లేడీ సూపర్‌స్టార్ శ్రీదేవి. యాభై నాలుగేళ్ల జీవితంలో యాభై ఏళ్లపాటు నటిగా గొప్ప ప్రయాణం చేశారు.

– ఎస్.ఎస్.రాజమౌళి

శ్రీదేవి ఇక లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టం. ఇదో పెను విషాదం. పొద్దున్నే ఈ వార్త చదివి తీవ్ర ఆవేదనకు గురయ్యాను.

– క్రికెట్ దిగ్గజం సచిన్

శ్రీదేవిలో ప్రత్యేకమైనవి ఆమె కళ్లు. ఎవరైనా నవ్వితే పెదాలు కనిపిస్తాయి. దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం శ్రీదేవికి ఇవ్వాలని పార్లమెంట్‌లో విజ్ఞప్తి చేస్తా.

– మురళీమోహన్



నక్షత్రాలూ అసూయ పడతాయి

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు

శ్రీదేవి సినీ జీవితంలోని ప్రతి మలుపు.. రాఘవేంద్రరావుకు తెలుసు. బాల నటిగా ఉన్నప్పుడు శ్రీదేవిని ఎత్తుకున్న రాఘవేంద్రుడు.. ఆ తరవాత 'పదహారేళ్ల వయసు'తో కథానాయికగా మార్చేశారు. ఎన్టీఆర్‌కి మనవరాలిగా నటించిన శ్రీదేవి.. ఎన్టీఆర్‌తో జోడీ కట్టి స్టెప్పులు వేసిందంటే కారణం రాఘవేంద్రుడే. వీరిద్దరి కాంబినేషన్లో ఏకంగా 24 చిత్రాలొచ్చాయి. దర్శకేంద్రుడు అంటేనే పాటలకు ప్రసిద్ధి. ఆయన ఫ్రేముల్లో శ్రీదేవి ఇంకెంత అందంగా ఒదిగిపోయిందో ప్రత్యేకంగా చెప్పాలా?

శ్రీదేవికి 'అతిలోక సుందరి' అనే ట్యాగ్‌లైన్ ఇచ్చిందే రాఘవేంద్రరావు. ఆ గురుభావం శ్రీదేవికీ ఉంది. 'మామ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా శ్రీదేవి హైదరాబాద్ వచ్చినప్పుడు కూడా అది కనిపించింది. 'నీతో మరో సినిమా చేయాలని వుంది' అని ఆయన అడగడమే ఆలస్యం.. 'అది నా గౌరవం' అంటూ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంది. ఆ సన్నివేశం మన స్మృతిపథంలో మెదులుతుండగానే శ్రీదేవి ఇక 'సెలవంటూ' వెళ్లిపోయింది.

ప్రతి కథానాయికనూ అందంగా చూపించడమే దర్శకేంద్రుడి అలవాటు. అయితే 'మోసగాడు' చిత్రంలో మాత్రం ఆమెలోని నెగిటివ్ కోణాన్ని కూడా ఆవిష్కరించారు. వ్యసనాలకు బానిసైన యువతిగా శ్రీదేవి నటించింది. కొన్నిచోట్ల శ్రీదేవి సిగరెట్ తాగుతూ కనిపిస్తుంది. నిజానికి అప్పటికి అగ్రకథానాయికగా అభిమానుల్లో గుర్తింపు తెచ్చుకున్న శ్రీదేవిని అలాంటి పాత్రలో చూపించడం పెద్ద సవాలే. విశేషమేమిటంటే ఇది శ్రీదేవి ఏరికోరి ఎంచుకున్న పాత్ర. 'నాకు నెగిటివ్ పాత్ర చేయాలని వుంది' అని స్వయంగా అడగడంతో రాఘవేంద్రరావు ఆ పాత్రను సృష్టించారు.

కోపం తెప్పించిన శ్రీదేవి

'వేటగాడు'లోని 'జాబిలితో చెప్పనా..' పాట చిత్రీకరణలో భాగంగా ఓ ఆసక్తికరమైన సంగతి జరిగింది. షూటింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. ఎన్టీఆర్ అప్పటికే సెట్‌కి వచ్చేశారు. సాంకేతిక బృందం అంతా రెడీగా ఉంది. కానీ శ్రీదేవి ఇంకా రాలేదు. ఎన్టీఆర్‌ని అలా కూర్చోబెట్టడం రాఘవేంద్రరావుకి నచ్చలేదు. దాంతో ఆయనే స్వయంగా శ్రీదేవిని తీసుకొద్దామని బయలుదేరారు. సరిగ్గా అప్పుడే మరో కారులోంచి శ్రీదేవి వస్తోంది. కారులోని శ్రీదేవిని చూడగానే.. రాఘవేంద్రరావు కోపంగా చేయెత్తి సైగ చేశారు. 'ఇప్పుడేదో జరగబోతోంది' అంటూ భయం భయంగానే శ్రీదేవి సెట్లో అడుగుపెట్టింది. ఎన్టీఆర్ మామూలుగానే షాట్‌కి రెడీ అయిపోయారు. కానీ రాఘవేంద్రరావు మాత్రం 'శ్రీదేవి ఉన్న షాట్ అయితే చేయను, ఎన్టీఆర్ షాట్ మాత్రమే చేస్తా' అని అలిగారట. శ్రీదేవిపై ఆ రోజంతా కోపంగానే ఉన్నారు రాఘవేంద్రరావు. అలా తొలిసారి రాఘవేంద్రరావులోని కోపాన్ని చూసింది శ్రీదేవి.

వెరైటీ ప్రయత్నం

ప్రాణమున్న పాలరాతి శిల్పం.. శ్రీదేవి. ఆమె అందానికి ఎవరైనా సరే దాసోహం అవ్వాల్సిందే. మరి సంగీత వాయిద్యాలకు ప్రాణమొస్తే ఎలా స్పందిస్తాయి? ఆ చిలిపి ఆలోచన వచ్చింది దర్శకేంద్రుడికి. వెంటనే దాన్ని అమలు చేశారు. కృష్ణతో నటించిన 'వజ్రాయుధం' చిత్రంలో 'బుగ్గమీద ఎర్ర మొగ్గలేందబ్బా..' అనే పాటలో కేవలం ఫ్లూట్, తబలా, వీణ, గిటార్ తదితర సంగీత వాయిద్యాలతో శ్రీదేవి సౌందర్యాన్ని వాటి అంతరంగంతో వర్ణింపజేశారు రాఘవేంద్రరావు. ఆ పాట చాలా పెద్ద హిట్టయింది.

బోనీకి దగ్గర చేసిందీ ఆయనే

బోనీకపూర్ జీవితంలోకి శ్రీదేవి ప్రవేశించడానికీ ఓ విధంగా రాఘవేంద్రరావే కారణం. శ్రీదేవి బాలీవుడ్ చిత్రం 'హిమ్మత్‌వాలా'కు రాఘవేంద్రరావు దర్శకత్వం వహించారు. ఆ చిత్రంతోనే బోనీకపూర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత అది వారిద్దరి పెళ్లికి దారితీసింది. ఈ విషయాన్ని శ్రీదేవి పలు సందర్భాల్లో గుర్తుచేసుకుంది.

ఆ పదాన్ని డిక్షనరీలోంచి తీసేయాలి

శ్రీదేవి మరణవార్త వినగానే రాఘవేంద్రరావు 'ఈనాడు'తో మాట్లాడుతూ.. ''రెండ్రోజుల క్రితమే మా ఇంట్లో శ్రీదేవి ప్రస్తావన వచ్చింది. తనని ఒక్కసారి చూడాలని ఉందండీ అంటూ మా ఆవిడ అడిగింది. సరే మనం ముంబై వెళ్దాం అని చెప్పాను. శ్రీదేవిని కడసారి చూడడానికి ముంబై వెళ్లాల్సి వస్తుందని అనుకోలేదు. తను మా ఇంటి అమ్మాయి. ఎన్ని సినిమాలు చేసినా, ఎన్ని విజయాలు అందుకున్నా.. తన వినమ్రత, పెద్దలకు ఇచ్చే గౌరవం ఇవన్నీ ఎక్కడికీ పోలేదు. నేటితరం ఆమె నుంచి నేర్చుకోవాల్సిన ప్రధాన విషయం ఇదే. 'అందం అభినయం కలబోసిన నటి' అనే పదం మనం తరచూ వాడుతుంటాం. శ్రీదేవి వెళ్లిపోయాక ఆ పదాన్ని తెలుగు సినిమా డిక్షనరీలోంచి తీసేయాలి అనిపించింది. క్రీ.పూ, క్రీ.శ అని చెప్పుకుంటున్నట్లు ఇక మీదట కథానాయికల గురించి చెప్పుకోవాల్సి వస్తే 'శ్రీదేవికి ముందు.. తరవాత' అనుకోవాలి. తనతో పనిచేసిన జ్ఞాపకాలు, ఆమె చెరగని చిరునవ్వు గుర్తొస్తున్నాయిప్పుడు. 'శ్రీదేవి వస్తోందంటూ' ఆకాశంలో చుక్కలన్నీ అసూయపడతాయిప్పుడు. దేవలోకానికి కొత్త కాంతులు అద్దడానికే శ్రీదేవి వెళ్లిపోయిందనిపిస్తోంది' అన్నారు.

శ్రీవారి పరమ భక్తురాలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అంటే శ్రీదేవికి అమితమైన భక్తి. పలుమార్లు తన జన్మదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఎంత లేదన్నా ఏడాదికోమారు.. శ్రీవారిని దర్శించుకునేవారు. చివరిగా గతేడాది జూన్ 24న స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి సుప్రభాత సేవంటే శ్రీదేవికి చాలా ఇష్టం. 2012లో వచ్చిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. ఈ చిత్రం 2012 అక్టోబరు 5న విడుదల కాగా అంతకు ముందు సెప్టెంబరు 5న శ్రీదేవి తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీదేవి తల్లిగా నటించిన చిత్రం 'మామ్' 2017 జులై 7న విడుదల కాగా అంతకు ముందు జూన్ 24న చివరిసారిగా శ్రీవారిని భర్త బోనీకపూర్‌తో కలిసి దర్శించుకున్నారు.

తిరుపతితో అనుబంధం: శ్రీదేవికి చిత్తూరు జిల్లాలోని తిరుపతితో అనుబంధం ఉంది. ఆమె తల్లిదండ్రులు కొద్దికాలం తిరుపతిలో నివసించారు. శ్రీదేవి పుట్టకముందు వారు స్థానిక ఆకుతోట వీధిలో ఉండేవారు. కొన్ని కారణాల రీత్యా తర్వాత చెన్నైకు వెళ్లారు. అయినా తరచూ తిరుపతికి వచ్చి వెళ్లేవారు. శ్రీదేవి తల్లి రాజేశ్వరి సొంత చెల్లెలు అనసూయమ్మ ఇప్పటికీ తిరుపతిలోనే ఉంటున్నారు. ఈ కారణంగానే రాజేశ్వరి తరుచూ తిరుపతికి వచ్చివెళ్లేవారు.



శ్రీవారి ఆలయం వద్ద శ్రీదేవి, బోనీకపూర్ (పాత చిత్రం)

మళ్లీ వస్తానమ్మా అంది!



శ్రీదేవి తల్లి మరణించిన సమయంలో చాలా రోజులు తిరుపతిలో నా దగ్గరే పెరిగింది. తనకు సినిమాలో నటించడం ఎంత ఇష్టం అంటే ఐస్‌క్రీమ్ తింటే లావు అవుతావని తల్లి చెప్పిన మాటకు పెళ్లి అయ్యేవరకు మళ్లీ ఐస్‌క్రీమ్ జోలికి వెళ్లలేదు. సినిమాల్లో నటించాలంటే సన్నగా ఉండాలనే ఒకే తలంపుతో ఆమె అంత కఠినంగా ఉండేది. తండ్రి, తల్లి ఒకరి తరువాత ఒక్కరు మృతిచెందినా సినిమాలను నిర్లక్ష్యం చేయలేదు. తన తల్లి మరణించిన తరువాత నా దగ్గరే ఉంటూ సినిమాల్లో నటించేది. ప్రతి ఏడాది శ్రీవారి దర్శనార్థం వచ్చేది. గతేడాది వచ్చినప్పుడు ఇంట్లోని కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు తీసుకుంది. వచ్చే ఏడాది మళ్లీ వస్తాను అమ్మా.. అని చెప్పింది. ఇంతలోనే మమ్మల్ని ఒంటరి వాళ్లను చేసి అనంతలోకాలకు వెళ్లిపోయింది. – అనసూయమ్మ (శ్రీదేవి చిన్నమ్మ)

సంతాపంలో రాజకీయం

కాంగ్రెస్‌పై సామాజిక మాధ్యమాల్లో ఆగ్రహం

శ్రీదేవికి శ్రద్ధాంజలి ఘటిస్తూ కాంగ్రెస్ చేసిన ట్వీట్‌పై సామాజిక మాధ్యమాల్లో తీవ్రస్థాయి ఆగ్రహం వ్యక్తమవుతోంది. యూపీఏ ప్రభుత్వమే ఆమెకు పద్మశ్రీ పురస్కారం అందించిందని పేర్కొనడం వివాదానికి కారణమైంది. ఇది రాజకీయం చేయడమేనని విమర్శలు వచ్చాయి. ఈ వివాదం నేపథ్యంలో తన ట్వీట్‌ను కాంగ్రెస్ తొలగించడం కొసమెరుపు.

శ్రీదేవి 'శవం' అంటారేం?: రిషికపూర్

శ్రీదేవి మరణానికి సంబంధించిన వార్తల్లో ప్రసార మాధ్యమాలన్నీ ఆమె భౌతిక కాయం తరలింపు గురించి చేసిన ప్రస్తావనలపై 'చాందినీ'లో ఆమె సరసన నటించిన రిషికపూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'శ్రీదేవి ఒక్కసారిగా శవం (బాడీ) ఎలా అయిపోతుంది? శవాన్ని ముంబయికి తరలిస్తారని టీవీ ఛానెళ్లూ చెబుతున్నాయి. మన ఆత్మీయులు మనకు దూరం కాగానే కేవలం శవంగా మారిపోతారా?' అని ట్విటర్లో ప్రశ్నించారు.

ఈనాడు
హైదరాబాద్, సోమవారం, ఫిబ్రవరి 26, 2018

సినిమా



మనసులో మాట

■ నా పిల్లలు నా సినిమాలు చూస్తుంటే ..'ముందు ఆ ఛానల్ మార్చండి అని చెబుతా'. నిజం చెప్పాలంటే... ఆ పాత జ్ఞాపకాలన్నీ గుర్తొస్తూ ఉంటాయి. 'అరె..ఈ సినిమా నేనెప్పుడు చేశాను? అనిపిస్తుంది. 'పదహారేళ్ల వయసు'లో 'సిరిమల్లె పువ్వా..' పాటను ఓ తోటలో చిత్రీకరించారు. ఓ చోట నా హావభావాలు ఎంతో చల్లని వాతావరణం ఆస్వాదిస్తున్నట్టు అనిపిస్తుంది. కానీ సరిగ్గా ఆ సమయంలోనే నన్ను చీమలు కుట్టేస్తున్నాయి. ఆ బాధను కనిపించకుండా భలే నటించానే అనిపిస్తుంది.

■ నా సౌందర్య రహస్యం ఏంటంటే నేను అన్నం తక్కువ తింటాను. వేపుడు కూరలు, మసాలా జోలికి వెళ్లను. శీతల పానియాలు ముట్టుకోను. ఇవి పాటిస్తే మీరూ అందంగా ఉంటారు.

■ కుటుంబంతో గడపడం ఇష్టం. వీలు చూసుకొని పిల్లలతో కలసి టీవీ ముందు కూర్చుంటా. పిల్లలేమో కార్టున్ నెట్‌వర్క్ చూస్తుంటారు. మా వారికి క్రికెట్ అంటే పిచ్చి. ఆయన గదిలో నేను అడుగుపెట్టినప్పుడే వికెట్ పడిందనుకోండి. 'నువ్వొచ్చినందుకే అవుటయ్యాడు. ఇక గదిలోకి రాకు' అని హుకుం జారీ చేస్తారు.

■ భాషతో సంబంధం లేకుండా పాత పాటలన్నీ బాగా వింటాను. కొత్త పాటల గురించి నాకు తెలియదు.

వయసు వసంతాల్ని చీరకొంగుకు ముడివేసిందేమో? పదహారేళ్ల దగ్గరే ఆమె ప్రాయం ఆగిపోయింది. యవ్వన ప్రాంగణంలోకి అడుగిడిన తొలినాళ్లలోనే తమిళంలో 'పదునారు వయదినిలే', తెలుగులో 'పదహారేళ్ల వయసు' చిత్రాలతో సొగసు సోయ 'గాలా'ల్ని ఆమె ఒడుపుగా విసరడంతో ఆ ముగ్ధమోహనత్వానికి మనీపర్సులా వెండితెర కూడా మనసుని పారేసుకుంది. ఆ అందాల్ని ఆరాధించేందుకు పదేపదే ఆమె చిత్రాల్ని ఇష్టపడింది. రోజుకు నాలుగాటలుగా ప్రదర్శించి పులకించిపోయింది. ప్రేక్షకులూ ఆ అతిలోక సౌందర్యానికి దాసోహమంటూ తమదైన ఏకాంత సీమలో 'జగదేకవీరు'లే అయ్యారు. ప్రేక్షకులిచ్చిన మద్దతుతో ఆమె కొన్ని దశాబ్దాలపాటు భారతీయ సినీ సామ్రాజ్యానికి మకుటం లేని మహారాణిగా ఏలుబడి సాగించింది. ఆమె కనుసైగ చేస్తే నిర్మాతలకు కనకాభిషేకం. అడుగు కదిపితే 'అష్టపది'. నర్తిస్తే నయగార జలపాతం. భారతీయ సినిమాని అనుక్షణం శ్వాసించి, శాసించిన ఆమె శ్రీదేవి.

బాలీవుడ్ తెరపై అభినయ సౌందర్యం



హిమ్మత్‌వాలా (1983) | సద్మా (1983)
నాగినా (1986) | మిస్టర్ ఇండియా (1987)
చాందిని (1989) | చాల్‌బాజ్ (1989)
లమ్హే (1991) | ఖుదాగవా (1992)
గుమ్రాహ్ (1993) | లాడ్లా (1994)

బాలీవుడ్ బాక్సాఫీస్ బొనాంజా...

తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషా చిత్రాల్లో తనదైన ముద్ర వేసిన శ్రీదేవి, భారతీయ సినిమాకి అసలు సిసలైన చిరునామాగా పేర్కొనే హిందీ చిత్రాల్లోనూ ప్రత్యేకత చాటుకుంది. అసమాన ప్రతిభతో అక్కడి స్టార్ హీరోలందరికీ 'హాట్ ఫేవరెట్'గా, ఫీమేల్ సూపర్‌స్టార్‌గా ఖ్యాతి గడించింది. తన సినీ యానంలో శ్రీదేవి మొత్తం 300 పైగా సినిమాల్లో నటించగా.. 71 హిందీ చిత్రాల్లో నటించింది. దక్షిణాది భాషల్లో ఎన్ని చిత్రాల్లో నటించినా 'బాలీవుడ్ కల' సాకారమైనప్పుడే ఓ తారగా సంపూర్ణ విజయాన్ని సాధించినట్లని చాలామంది తారలు భావిస్తుంటారు. తననితాను బాలీవుడ్ తెరపై ఆవిష్కరించుకోవడంలో పూర్తిస్థాయి విజయం సాధించిన అభినయ తారకగా శ్రీదేవిని అభివర్ణించొచ్చు.


'జూలీ'తో ఎంట్రీ...

1975లో 'జూలీ' సినిమాతో హిందీ చిత్రపరిశ్రమలోకి ప్రవేశించి, 1979లో 'సోల్వా సావన్' చిత్రం ద్వారా ఉనికిని చాటుకున్నా 1983లో జితేంద్రతో జోడి కట్టిన 'హిమ్మత్‌వాలా' సినిమాతోనే అసలైన స్టార్‌డమ్‌ని సొంతం చేసుకుంది శ్రీదేవి. ఆ చిత్రంలో 'నయనోంమే సప్‌నా.. సప్‌నోంమే సజనా..సజనాపే దిల్ ఆగయా.. క్యోం సజనాపే దిల్ ఆగయా?' అనే పాట సూపర్ డూపర్ హిట్. ఆ పాట చిత్రీకరణ కూడా నయన మనోహరం. అంతే! బాలీవుడ్‌లో శ్రీదేవి శకం ఆరంభమైందనే చెప్పాలి. ఆ చిత్రంతో ఆమె బాలీవుడ్ సూపర్ స్టార్లందరికీ 'మోస్ట్ వాంటెడ్ హీరోయిన్' అయింది. అదే సంవత్సరం 'జానీ దోస్త్', 'జస్టిస్ చౌదరి', 'మవాలి', 'కళాకార్' సినిమాలు శ్రీదేవి స్థానాన్ని సుస్థిరం చేశాయి. 'జాగ్ ఉఠా ఇన్‌సాన్'తో శ్రీదేవి 1984కి శుభారంభం పలికింది. ఆపై వరుసగా 'అకల్ మండ్', 'ఇంక్విలాబ్', 'తోఫా', 'మక్సద్', 'నయా కదమ్', 'సర్ఫరోష్' చిత్రాల్ని చేసింది. ఆ సంవత్సరం 'తోఫా' చిత్రం సాధించిన విజయం మాత్రం అసాధారణం. అనూహ్యం. 'శ్రీదేవి అన్‌క్వశ్చనబ్లీ నంబర్ వన్' అంటూ ఈ చిత్రం తర్వాతే 'ఫిలింఫేర్' మాగజైన్ శ్రీదేవి ముఖచిత్రంతో సంచలన వార్తాకథనాన్ని ప్రచురించింది.

హీరోలకు సూపర్‌హిట్ జోడీ...

స్టార్ హీరోలకు సూపర్ హిట్ జోడీగా శ్రీదేవి ప్రత్యేక గుర్తింపు పొందింది. జితేంద్రతోపాటు, రాజేశ్‌ఖన్నా, రిషికపూర్.. ఇలా ఎంతోమంది హీరోల సరసన నాయికగా నటించి సక్సెస్‌లు అందించడంలో తనవంతు కృషి ఆమె చేసింది. 'హిమ్మత్‌వాలా' తర్వాత 1983 నుంచి 1988 వరకూ జితేంద్రతో జోడీగా శ్రీదేవి 16 చిత్రాలు చేయగా 13 చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాల్ని సొంతం చేసుకోవడం విశేషం. హిమ్మత్‌వాలా' (1983), 'జానీ దోస్త్' (1983), 'జస్టిస్ చౌదరి' (1983), 'మవాలీ' (1983), 'అకల్ మంద్' (1984), 'తోఫా' (1984), 'బలిదాన్' (1985), 'సుహాగన్' (1986), 'ఘర్ సంసార్' (1986), 'ధరమ్ అధికారి' (1986), 'ఔలాద్' (1987), 'సోనేపె సుహాగ్' (1988) చిత్రాలు హిట్లుగా నిలిచాయి. ఈ జోడీ నటించిన చిత్రాల్లో 'సర్ఫరోష్' (1985), 'ఆగ్ ఔర్ షోలా' (1986), 'హిమ్మత్ ఔర్ మెహనత్' (1987) వైఫల్యం చెందాయి.

ఇక రాజేష్ ఖన్నాతో కూడా శ్రీదేవి 1987లో 'నయాకదమ్', 1984లో 'మఖ్సద్' 1985లో 'మాస్టర్జీ', 1987లో 'నజరానా' చిత్రాల్లో నటించి విజయాలు సొంతం చేసుకుంది.




హిమ్మత్‌వాలాలో జితేంద్ర, శ్రీదేవి



సద్మాలో కమల్‌హాసన్‌తో..



మిస్టర్ ఇండియాలో అనిల్‌కపూర్‌తో..



చాందినిలో రిషికపూర్‌తో..



ఖుదాగవాలో అమితాబ్‌తో..

1989లో శ్రీదేవి ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'చాల్‌భాజ్'. కవల పిల్లలుగా చిత్రంలో రెండు పాత్రల్ని అమోఘంగా పోషించిన ఆమె నటిగా తనకు తానే సాటి అని నిరూపించుకుంది.

రొమాంటిక్ 'చాందిని'..

అదే ఏడాది దర్శకుడు యష్‌చోప్రా దర్శకత్వం వహించిన రొమాంటిక్ చిత్రం 'చాందిని' (1989) కూడా సంచలన విజయాన్ని చవి చూసింది. ఈ చిత్రంలో 'మేరే హాతోంమే నౌనౌ చుడియాన్' పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. యష్‌చోప్రా 1991లో 'లమ్హే' పేరుతో శ్రీదేవి అభినయానికి పెద్ద పీట వేసే చిత్రానికి దర్శకత్వం వహించారు. 1992లో శ్రీదేవి బిగ్‌బి అమితాబ్‌తో కలిసి నటించిన 'ఖుదాగవా' గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇందులో శ్రీదేవి ద్విపాత్రాభినయం చేసింది. ఓ పాత్రలో అమితాబ్‌కి జోడీగా, మరో పాత్రలో నాగార్జునకు జోడీగా శ్రీదేవి ప్రదర్శించిన నటన 'నభూతో నభవిష్యతి' అంటారు విమర్శకులు. ఈ సినిమా కాబూల్‌లో పదివారాల పాటు కిక్కిరిసిన ప్రేక్షకులతో ప్రదర్శనలకు నోచుకుంది. 1993లో అనిల్ కపూర్ హీరోగా 'రూప్‌కి రాణి చోరోంకా రాజా' చిత్రం విడుదలైంది. అప్పట్లో అత్యధిక బడ్జెట్‌తో నిర్మించిన చిత్రం ఇది. బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ధర్మ ప్రొడక్షన్స్'తోపాటు అనేక సంస్థల్లో హీరోయిన్‌గా నటించి మెప్పించింది. ధర్మా ప్రొడక్షన్స్ 'గుమ్రాహ్'లో సంజయ్‌దత్ సరసన శ్రీదేవి నటించింది. దశాబ్దాల తరబడి తెలుగు, తమిళ్, హిందీ, మలయాళ భాషా చిత్రాల్లో నటిస్తూ వచ్చిన శ్రీదేవి చిత్ర పరిశ్రమకు సుదీర్ఘ విరామం ఇచ్చే ముందు విడుదలైన చిత్రం 'జుదాయి'. ఇది 1997లో విడుదలైంది. ఇందులో అనిల్ కపూర్‌కి జోడీగా శ్రీదేవి నటించింది. మరో హీరోయిన్ ఊర్మిళతో స్క్రీన్ షేర్ చేసుకున్న ఈ చిత్రంలో శ్రీదేవి డబ్బు మీద విపరీతమైన మోహం ఉన్న నాయికగా నటించింది. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు 'శుభలగ్నం'గా పరిచితమే.

15 ఏళ్ల సుదీర్ఘ విరామం..

'జుదాయి' సినిమా తర్వాత 1997 నుంచి సినీ పరిశ్రమకి దూరంగా ఉన్న శ్రీదేవి కొన్నాళ్లు 'మాలినీ అయ్యర్'గా 2004 నుంచి 2005 వరకూ బుల్లితెర ప్రేక్షకుల్ని అలరించింది. అలాగే, 'జీనా ఐసీకా నామ్ హై' పేరుతో మరో బుల్లి తెర కార్యక్రమంలో కూడా కనిపించిన శ్రీదేవి కొన్ని టీవీషోలకు న్యాయమూర్తిగా కూడా వ్యవహరించారు. 2009లో సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఓ షోలో కూడా పాల్గొన్నారు.

2012లో 'ఇంగ్లీష్‌వింగ్లిష్' సినిమాతో మళ్లీ వెండితెరపై కనిపించి మురిపించింది. 2017లో మళ్లీ 'మామ్' సినిమాతో శ్రీదేవి పలకరించింది.

స్నేక్ డాన్సర్‌గా శ్రీదేవి..

శ్రీదేవి నటించిన ఫాంటసీ మూవీ 'నగినా'. ఈ చిత్రం 1986లో వచ్చింది. ఇందులో 'మై తేరీ దుష్మన్...' అనే నృత్యగీతం ఆద్యంతం అపూర్వం... అద్భుతం. ఇదే సందర్భంలో శ్రీదేవి నటించిన 'సద్మా' చిత్రంలోని పాత్ర కూడా విశేష జనాదరణ పొందింది. ఇంకా పసితనం వదలని పరిస్థితిలో 'అమ్నేసియా' పీడితురాలిగా ఆమె అభినయం ప్రేక్షకుల్ని కంటతడి పెట్టిస్తుంది.

మిగిలింది 'జీరో'

అనితరసాధ్యమైన విజయాల్ని నమోదు చేసిన శ్రీదేవి చివరి చిత్రం 'జీరో'. ఇంకా నిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రంలో హీరో షారుఖ్ ఖాన్. కరిష్మాకపూర్, అలియాభట్‌తో పాటు షారుఖ్ ఖాన్‌తో తెరపంచుకున్న ఈ చిత్రం శ్రీదేవి ఆఖరి చిత్రంగా నివాళి ఘటించబోతోంది. శ్రీదేవి సినీయానంలో 'మెచ్చు'తునకలనదగ్గ ఎన్నో పాత్రలు... ఎన్నో నేపథ్యాలు... మరెన్నో హృదయస్పర్శలు. అందరిలాగే ఆమెది కూడా ఒకే ఒక్క జీవితం. కానీ, నటిగా శ్రీదేవి తెరపై ఎన్నో జీవితాల్ని ఆవిష్కరించింది. అలా ఆమె ఆవిష్కరించిన పాత్రలు ఆమె అపురూప జ్ఞాపకాలుగా శాశ్వతంగా నిలిచే ఉంటాయి.

- పి.వి.డి.ఎస్. ప్రకాశ్

ఐదు భాషల్లో... అగ్రతారలతో...



కృష్ణతో శ్రీదేవి



ఎన్టీఆర్‌తో..

వయసుని జయించిన కథానాయిక శ్రీదేవి. ఎవరి పక్కన నటించినా సరే, వాళ్లకి తగ్గ కథానాయిక అనిపించుకోవడం ఆమెకి మాత్రమే చెల్లింది. పద్నాలుగేళ్ల వయసులోనే ఎన్టీఆర్‌తో కలిసి ఆడిపాడిన ఆమె ఆ తర్వాత ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు తదితర అగ్ర కథానాయకులతోనూ నటించి మెప్పించింది. అంతే కాదు.. ఆ తర్వాత తరం కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతోనూ కలిసి మురిపించింది. అందుకే శ్రీదేవి అంటే నిన్నటితరం ప్రేక్షకులతో పాటు, నవతరం కూడా ఆమెని అదే స్థాయిలో ఆరాధిస్తుంటారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ... ఇలా ఐదు భాషల్లోనూ అగ్ర కథానాయకులతో కలిసి నటించిన అతి కొద్దిమందిలో శ్రీదేవి ఒకరు. నాలుగేళ్లకే సినీ ప్రయాణం ఆరంభించిన ఆమె నట ప్రస్థానం ఐదు దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చింది. తెలుగులోనే శ్రీదేవి అత్యధికంగా సినిమాలు చేసింది. కృష్ణతో కలిసి అత్యధికంగా 33 సినిమాల్లో నటించారు శ్రీదేవి. 'సమాజానికి సవాల్', 'బుర్రిపాలెం బుల్లోడు', 'రామ్ రాబర్ట్ రహీమ్', 'మామా అల్లుళ్ల సవాల్', 'ఘరానా దొంగ', 'దేవుడిచ్చిన కొడుకు', 'చుట్టాలున్నారు జాగ్రత్త', 'బంగారు బావ', 'గడసరి అత్త సొగసరి కోడలు', 'భోగి భాగ్యాలు', 'వయ్యారి భామలు వగలమారి భర్తలు', 'సంషేర్ శంకర్', 'ప్రేమ నక్షత్రం', 'కృష్ణావతారం', 'కృష్ణార్జునులు', 'కలవారి సంసారం', 'మకుటం లేని మహారాజు', 'మా ఊరి మగాడు', 'ఖైదీ రుద్రయ్య', 'పచ్చని కాపురం', 'వజ్రాయుధం' తదితర చిత్రాలున్నాయి. 1980, 82 సంవత్సరాల్లో ఈ ఇద్దరి కలయికలోనే ఏడు చొప్పున సినిమాలు విడుదలై విజయాల్ని సొంతం చేసుకొన్నాయంటే ఆ జోరు, హుషారు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. హిందీలో అప్పటికే బిజీ అయినప్పటికీ కృష్ణతో కలిసి పలు చిత్రాల్లో నటించారు శ్రీదేవి. కృష్ణ నిర్మాణ సంస్థ పద్మాలయ స్టూడియోస్ హిందీలో నిర్మించిన 'హిమ్మత్‌వాలా'తో శ్రీదేవికి ఎంతో పేరొచ్చింది. ఏఎన్నార్ చిత్రాల్లోనూ బాలనటిగా మెరిసిన శ్రీదేవి ఆ తర్వాత ఆయన సరసన నటించారు. 'సత్యం శివం', 'ప్రేమాభిషేకం', 'ప్రేమ కానుక', 'బంగారు కానుక', 'శ్రీరంగనీతులు', 'ముద్దుల మొగుడు' తదితర చిత్రాలు ఏఎన్నార్, శ్రీదేవి కలయికలో వచ్చాయి. ఏఎన్నార్‌తోనే కాకుండా ఆయన తనయుడు నాగార్జున సరసన 'ఆఖరి పోరాటం', 'గోవిందా గోవిందా', 'ఖుదా గవా' తదితర చిత్రాల్లో నటించి నిత్యనూతన తార అనిపించుకొన్నారు శ్రీదేవి. శోభన్‌బాబు - శ్రీదేవి జోడీ విజయవంతమైన కలయికే. 'కార్తీకదీపం', 'బంగారు చెల్లెలు', 'మోసగాడు', 'ఇల్లాలు', 'కృష్ణార్జునులు', 'దేవత' తదితర చిత్రాలతో ఆ ఇద్దరూ విజయాల్ని సొంతం చేసుకొన్నారు. 'పులిదెబ్బ', 'త్రిశూలం', 'అడవి సింహాలు' తదిదతర చిత్రాలతో కృష్ణంరాజు - శ్రీదేవి జోడీ ఆకట్టుకుంది. 'రాణికాసుల రంగమ్మ', 'జగదేక వీరుడు అతిలోకసుందరి', 'ఎస్పీ పరశురాం' తదితర చిత్రాల్లో చిరంజీవితో కలిసి నటించారు శ్రీదేవి.

ఎన్టీఆర్‌తో ఆయనకి మనవరాలిగా 'బడిపంతులు'లో నటించిన శ్రీదేవి, 'వేటగాడు'లో కథానాయికగా నటించింది. ఆ చిత్రంలో శ్రీదేవి అందాన్ని చూసి ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌తో వరుసగా సినిమాలు చేసింది శ్రీదేవి. 'సర్దార్ పాపారాయుడు', 'రౌడీ రాముడు కొంటె కృష్ణుడు', 'ఆటగాడు', 'సత్యం శివం', 'కొండవీటి సింహం', 'గజదొంగ', 'అగ్గిరవ్వ', 'వయ్యారి భామలు వగలమారి భర్తలు', 'జస్టిస్ చౌదరి', 'బొబ్బిలి పులి', 'అనురాగ దేవత' తదితర విజయవంతమైన చిత్రాలు ఈ కలయికలో ప్రేక్షకుల ముందుకొచ్చాయి.



అక్కినేని నాగేశ్వరరావుతో..




శోభన్‌బాబుతో..



నాన్న చనిపోయినా చెప్పలేదు

కెరీర్ తొలినాళ్లలోనే స్టార్‌గా గుర్తింపు దక్కించుకున్న శ్రీదేవి షూటింగులతో ఎప్పుడూ బిజీగా ఉండేది. చాలారోజులు ఇంటికి దూరంగా ఉండాల్సి వచ్చేది. ఓసారి ఇలాగే 'గురుదేవ్', 'రూప్‌కీ రాణీ చోరోంకా రాజా', 'లమ్హే' షూటింగ్‌లు వరుసగా జరిగాయి. దీంతో కొన్ని నెలలపాటు ఇంటికి రాలేదు. ఉదయాన్నే తల్లిదండ్రుల నుంచి ఫోన్ వచ్చాకే షూటింగ్ స్పాట్‌కి వెళ్లేది. ఓ రోజు మాత్రం ఫోన్ రాలేదు. చాలాసేపు ఎదురుచూసింది. చేసేదేం లేక దిగాలుగా షూటింగ్‌కి వెళ్లిపోయింది. ఆ మర్నాడు శ్రీదేవికి వాళ్ల అమ్మ ఫోన్ చేసింది. 'నాన్నకి కాస్త అనారోగ్యంగా ఉంది. అందుకే నిన్న నీకు ఫోన్ చేయలేదు' అని చెప్పింది. అసలు విషయం ఏంటంటే.. వాళ్ల నాన్న ముందురోజే మరణించారు. ఆ విషయం తెలిస్తే శ్రీదేవి తట్టుకోలేదని.. వెంటనే ఇంటికి బయలుదేరి రావడం కష్టమని తండ్రి మరణవార్తను ఆమెకు చెప్పలేదు.


తల్లిదండ్రులతో చిన్నారి శ్రీదేవి

అతిలోక సుందరి శ్రీదేవిలో సాటిలేని శ్రీమతీ దాగుంది. సినిమాల్లో చక్రం తిప్పుతూనే ఇంటినీ ఆమె ముందుండి నడపించారు. ఓ తల్లిగా, భార్యగా ఆమె కర్తవ్యాన్ని ఏనాడూ మరువలేదు. ఆమె గురించి భర్త బోనీ కపూర్ ఓ ముఖాముఖిలో ఏం చెప్పారో ఆయన మాటల్లోనే చూద్దామా??....

'శ్రీ'మతిగానూ సాటిలేరెవ్వరూ

కుమార్తెను తెరపై చూడకుండానే..

'జాన్వీ కోరి సినిమా రంగాన్ని ఎంచుకుంది. తల్లిగా వంద శాతం ఆమెకు ఏం చేయాలో అంతా చేస్తా. ఇప్పుడు జాన్వీ నటిస్తుంటే నేను తిరిగి నా కెరీర్‌ను మొదలు పెట్టినట్టే అనిపిస్తోంది'' అనేవారు శ్రీదేవి. దురదృష్టం.. జాన్వీని తెరపై చూడకుండానే శ్రీదేవి జీవితం నుంచే తెరమరుగైపోయారు!



తెలుగు, తమిళ సినిమాల్లో ఓ వెలుగు వెలుగుతున్నప్పుడే "శ్రీ"ని తొలిసారి చూశాను. బహుశా అది 1979 అనుకుంటా. కమల్‌హాసన్‌తో ఆమె ఓ సినిమా చేసింది. అది చూస్తున్నంతసేపూ అసలు కళ్లు తిప్పుకోలేకపోయాను. ఎలాగైనా నా సినిమాలో ఆమెను తీసుకోవాలని అనుకున్నాను. మీకు ఓ విషయం తెలుసా? ఆ సినిమా ప్రింట్‌ను ఇప్పటికీ భద్రంగా దాచుకున్నా. అయితే ఆమెను తొలి సినిమాకు ఒప్పించేందుకు నాకు ఆరేళ్లు పట్టింది.

అందరికీ మేడమ్.. నాకు శ్రీదేవి

నిజానికి ఆమె ఎక్కువగా మాట్లాడేదికాదు. తనపని తాను చేసుకొని వెళ్లిపోయేది. ఎంతో అమాయకంగా కనిపించేది. ఆ లక్షణాలకే పడిపోయాను. కాదు.. నన్ను పడేసింది. కల్లాకపటము లేని తన మనసు నన్ను ఆకర్షించింది. తనను కలిసిన ప్రతిసారీ నాలో ప్రేమ మరింత ఉప్పొంగేది. ఓ స్టార్ అయినప్పటికీ తను సాదాసీదాగా ఉండేది. అసలు గర్వమే కనిపించేదికాదు.

అప్పట్లో ఆమెను అందరూ "మేడమ్"అని పిలిచేవారు. కొందరు 'శ్రీ'అనేవారు. నేనైతే చక్కగా "శ్రీదేవీ"అనేవాణ్ని.

అప్పట్లో ఓ సినిమా మ్యాగజైన్ ఎడిటర్ వస్త్రధారణ శైలి నాకు బాగానచ్చేది. అలాంటి వస్త్రాలే శ్రీ కోసం ప్రత్యేకంగా సిద్ధంచేయించాను కూడా.

కాల్‌షీట్ల చర్చలే కలిపాయి

తొలుత ఓ సినిమా కోసం 40 రోజుల కాల్‌షీట్లను శ్రీ వాళ్లమ్మ కేటాయించారు. అయితే పట్టాలెక్కకుండానే ఆ సినిమా ఆగిపోయింది. దీంతో మిస్టర్ ఇండియా సినిమా కోసం ఆ కాల్‌షీట్లు సర్దుబాటుచేశాను. దీనికి 120 రోజులు అవసరం. మిగతా 80 రోజుల కోసం చాలాసార్లు శ్రీవాళ్లమ్మతో చర్చలు జరిపాను. కొన్నిసార్లయితే వాగ్వాదానికీ దిగాను. ఆ క్రమంలో శ్రీకి మరింత దగ్గరయ్యాను. వాళ్ల నాన్నతోనూ మంచి అనుబంధం ఏర్పడింది. ఒకసారైతే "బోనీ లాంటి అబ్బాయిని మా అమ్మాయికి చూడండి'అని మా అమ్మతో శ్రీ వాళ్లమ్మ చెప్పారు కూడా. మిస్టర్ ఇండియా సినిమా పూర్తయిన వెంటనే రూప్ కీ రాణి చోరోంకా రాజా సినిమా పట్టాలపైకి ఎక్కింది. దీంతో మరో 150 నుంచి 175 రోజులు శ్రీకి దగ్గరగా ఉండే అవకాశం దక్కింది.

ప్రేమను చెబితే చీవాట్లు పెట్టింది

మొదట్లో నా ప్రేమ ఒకవైపే ఉండేది. ఒక రోజు చెన్నైలో వాళ్లమ్మతోపాటు శ్రీని బయటకు తీసుకెళ్లాలనుకున్నా. చివర్లో శ్రీవాళ్లమ్మ రాలేదు. దీంతో నేనే శ్రీని బయటకు తీసుకెళ్లాను. బయటి వ్యక్తులతో శ్రీ అలా రావడం అదే తొలిసారి.

ఆమెను ఇంటిలో వదిలిపెట్టేటప్పుడు నా మనసులో మాట చెప్పాను. వెంటనే శ్రీకి కోపం వచ్చింది. చీవాట్లు పెట్టింది. ఎనిమిది నెలలు మాట్లాడటమూ మానేసింది. 1993 మేలో ముంబయి పేలుళ్లు మళ్లీ మమ్మల్ని కలిపాయి.

ఆ సమయంలో శ్రీని మా ఇంటికి తీసుకొచ్చేశాను. మార్చి 1994 వరకు తను మా ఇంట్లోనే ఉంది. దీంతో మళ్లీ మా బంధం చిగురించింది. 1995లో శ్రీ వాళ్లమ్మకు మెదడులో కణితి వచ్చింది. చికిత్సకు కావాల్సిన సదుపాయాలన్నీ నేనే దగ్గరుండి చూసుకున్నా. ఆ సమయంలో నాపై శ్రీలో ప్రేమ మొలకెత్తింది. 1996, జూన్ 2న మా పెళ్లి జరిగింది. ఆరు నెలల తర్వాతే ఈ విషయం బయటకు తెలిసింది.

1997లో జాన్వీ, 2000లో ఖుషి పుట్టారు. సినిమాల విషయంలో నేనెప్పుడూ అడ్డుచెప్పలేదు. మరోవైపు శ్రీ కూడా ఇంటికి తగిన ప్రాధాన్యం ఇస్తుంది.

శ్రీ అయితే నేరుగా మార్కెట్ వెళ్లి చేపలూ కొనితెస్తుంది. పిల్లలకు ఎప్పుడూ తాజా పళ్లు, కూరగాయలు తేవడంపై శ్రద్ధపెడుతుంది. ఆమెలో ఎన్నో నైపుణ్యాలున్నాయి. ముంబయి, చెన్నైలలోని మా ఇళ్లకు అంతర్గతంగా మెరుగులు దిద్దింది శ్రీనే. తనకు సంగీతమంటే చాలాఇష్టం. కొన్ని వాద్య పరికరాలూ తను వాయిస్తుంది. రాత్రి మూడు గంటల వరకూ పనిచేసినా తెల్లవారి 6.30కే ఆమె నిద్రలేస్తుంది.

నా కోసం కాలినడకన గుడికి వెళ్లింది

సుఖాల్లోనే కాదు కష్టాల్లోనూ ఎప్పుడూ తను వెన్నంటే ఉంది. 2000లో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాను. ఆ సమయంలో తను ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. నా కోసం ఇంటి నుంచి సిద్ధివినాయక దేవాలయానికి ఆమె నడుచుకుంటూ వెళ్లింది. నన్ను ఇబ్బందుల నుంచి బయటపడేసేందుకు ఓ టీవీ షో (మాలినీ అయ్యర్)లోనూ తను నటించింది. అందరిలానే మేమూ గొడవలు పడతాం. అయితే ఇద్దరం కలిసి వీటిని పరిష్కరించుకుంటాం. ఒకసారి నేను సిగరెట్లు తాగడం మొదలుపెట్టాను. తను వద్దని బలవంతపెట్టింది. భావోద్వేగాలతో బెదిరింపులకూ దిగింది. నేను సిగరెట్లు మానేసేంత వరకూ కోడిమాంసం ముట్టుకోనని తెగేసి చెప్పింది. ఆమె గాంధీగిరీకి తలవంచక తప్పలేదు.

అమ్మ కలను మోసింది అమ్మగా మురిసింది

- కుమార్తే లోకంగా బతికిన తల్లి రాజేశ్వరి
- బిడ్డల కోసం కెరీర్‌ను వదిలిన శ్రీదేవి

శ్రీదేవి అనగానే అందరికీ అందం..అభినయం ఇవే గుర్తొస్తాయి. వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూస్తే అంతకుమించి అన్నట్టు ఆమెలో ఓ గొప్ప కూతురు, మరో గొప్ప తల్లి కనిపిస్తారు. కథానాయికగా ఎంత ఎత్తుకి ఎదిగినా తల్లి రాజేశ్వరి మాటే ఆమెకు వేదవాక్కు. ఆమె సలహాలు తీసుకోకుండా ఏ పనీ చేసేవారు కాదు. ఇంకా చెప్పాలంటే..ఆమె అమ్మ మాట జవదాటని బుద్ధిమంతురాలు. ఎంతగా అంటే 'చిన్నప్పుడు కుమార్తెను పిట్టగోడ మీద కూర్చోబెట్టి 'కదలకుండా కూర్చో..ఇప్పుడే వచ్చేస్తా' అని చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయారట రాజేశ్వరి. పనిలో పడి ఆ విషయమే మరిచిపోయి నాలుగైదు గంటల తర్వాత తిరిగొచ్చి చూసినా అక్కడే కూర్చుని ఉన్న కుమార్తెను చూసి తల్లి కన్నీళ్లాపుకోలేకపోయారట. 'నేను చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడానికి కూడా మా అమ్మే కారణం' అనేవారు శ్రీదేవి.

తల్లికి అండగా..అంతెత్తుకు

"అమ్మకి చేదోడుగా నిలవాలనే ఉద్దేశమే లేకపోతే నేను చిత్ర పరిశ్రమలోకి వచ్చేదాన్ని కాదేమో" అని 'మామ్' సినిమా వేడుకలో చెప్పారు శ్రీదేవి. రాజేశ్వరి కూడా కుమార్తెను కంటికి రెప్పలా కాపాడుతూ పెంచి పెద్ద చేశారు. కుమార్తెను కథానాయికగా చూడాలని కలలుగన్నారు. అందుకోసం ఎన్నో త్యాగాలు చేశారు. "తెల్లవారుజామున నాలుగ్గంటలు గానీ..ఐదు గంటలుగానీ షూటింగ్ అంటే నాకంటే ముందే నిద్రలేచేది అమ్మ. ఎండ..వానా అన్న తేడా లేకుండా..అవి కొండలా, గుట్టలా అన్నది పట్టించుకోకుండా సెట్‌లో నా కళ్లెదుటే అలా నిలుచుండిపోయేది. అనారోగ్యం.. మరే కారణంతోనైనా నేను ఇవాళ సెట్‌కి రాను అని అమ్మ చెప్పిన సందర్భం ఒక్కటి కూడా లేదు. అమ్మ చెప్పిన మాటలు, ఆమె చూపిన ప్రేమే నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి" అంటూ తల్లితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకొనేవారు శ్రీదేవి.

అమ్మఒడిలో నిద్ర.. సెట్‌లోనే చదువు

సినిమాల వల్ల కుమార్తె చదువుకి ఆటంకం కలగకూడదని భావించిన తల్లి రాజేశ్వరి..ట్యూటర్‌ని నియమించి సెట్‌లో షూటింగ్ విరామంలోనే చదివించేవారట. నిదరొస్తే ఒళ్లో పడుకోబెట్టడం, షాట్ ఓకే అనగానే మెల్లగా లేపడం చేసేవారట. ఆ విషయాన్ని ఈటీవీలో ప్రసారమైన 'సౌందర్య లహరి'లో ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు గుర్తు చేసుకొన్నారు. నటిగా తాను కన్న కలల్ని, ఆశల్ని కుమార్తె రూపంలో నెరవేర్చుకొన్న రాజేశ్వరి తరచూ 'నువ్వు నా కూతురువి కాదు, కొడుకువి' అనేవారట.

రంగుల లోకం వదిలి..

బిడ్డగా తల్లి నుంచి తాను ఎంత ప్రేమని పొందిందో, అంతకు రెట్టింపు ప్రేమని తన పిల్లలకి పంచారామె. నటిగా ఓ వెలుగు వెలుగుతున్నప్పటికీ కుమార్తె పుట్టగానే ఇంటికే పరిమితమయ్యారు. పిల్లలే లోకంగా బతికారు. "అమ్మ అని పిలిపించుకోవడంలో ఉన్న ఆనందమే వేరు. వాళ్ల ఆలనాపాలనతోనే నాకు సమయం సరిపోయేది. నాకు సంబంధించిన సమస్తం అమ్మే చూసుకొనేవారు. అమ్మగా నా బాధ్యత కూడా ప్రస్తుతం అదే. మా పెద్దమ్మాయి జాన్వి నిద్ర లేవగానే 'అమ్మా' అంటుంది. కళ్ల ముందు నేను కనిపించాలి. మా చిన్నమ్మాయికేమో లేవగానే తాను ఇష్టపడి పెంచుకున్న కుక్కపిల్ల కనిపించాలి." అని చెప్పేవారు శ్రీదేవి. సెకండ్ ఇన్నింగ్స్‌ని కూడా పిల్లల అనుమతితోనే మొదలుపెట్టారు శ్రీదేవి.


రాజేశ్వరి

శ్రీదేవి, ఆమె కుటుంబం గురించి చాలామందికి చాలా తెలిసినా...అందరికీ తెలియని కొన్ని ఆసక్తికర సంగతులూ ఉన్నాయి. అలాంటి వాటిలో కొన్నివి..

నర్తకిగా శ్రీదేవి తల్లి సినీ ప్రవేశం

శ్రీదేవి తల్లి రాజేశ్వరి నటిగా గుర్తింపు తెచ్చుకునేందుకని పరిశ్రమకు వచ్చారు. 1960లో విడుదలైన..సావిత్రి కథానాయికగా నటించిన 'చివరకు మిగిలేది' సినిమాలో 'అందానికి అందం నేనే' అనే పాటకు నర్తకి జ్యోతితోపాటు నృత్యం చేస్తూ తొలిసారి వెండితెరపై కనిపించారు.

- 'చివరకు మిగిలేది'లో ఆమెను చూసిన నటుడు కాంతారావు సూచన మేరకు ఏయన్నార్, రాజసులోచన నటించిన 'శాంతినివాసం' (1960)లో కృష్ణకుమారి సోదరి పాత్ర కోసం రాజేశ్వరిని ఎంపిక చేశారట దర్శకుడు. ఆ సినిమాలో కృష్ణకుమారి అభినయించిన 'కలనైనా నీ వలపే' అనే పాటలో రాజేశ్వరి కనిపించారు.
- ఆ తర్వాత ఏయన్నార్, కృష్ణకుమారి నటించిన 'భార్యభర్తలు' (1961)లో ఓ చిన్న పాత్ర పోషించారామె. ఆ సినిమాలో అక్కినేని అభినయించిన "జోరుగా హుషారుగా షికారు పోదమా" అనే పాటలో ఆయన వెంటపడే ఒక అమ్మాయిగా రాజేశ్వరి కన్పిస్తారు. శ్రీదేవి అటు అక్కినేని, ఇటు ఆయన కుమారుడు నాగార్జునతో నటించగా..ఏయన్నార్.. శ్రీదేవితోపాటు..ఆమె తల్లి రాజేశ్వరితోనూ నటించడం గమనార్హం.

– రాజా (మ్యూజికాలజిస్ట్)

ఆమె రంగుల కల... తీరనేలేదు!

వెండితెర కేన్వాస్‌పై ఓ అపురూప చిత్రంగా అభిమానులు భావించే శ్రీదేవి ఓ చిత్రకారిణి కూడా. శ్రీదేవి వేసిన ఎన్నో పెయింటింగ్స్ ఆమె ఇంట్లో గోడలపై చూపరులను ఆకర్షిస్తూ ఉంటాయి. "పెయింటింగ్ వేయడమంటే నాకు చాలా ఇష్టం. ఈ హాబీ చిన్నప్పటి నుంచే ఉంది. ఇదొక ఆధ్యాత్మిక చికిత్సలాంటిదని నా అభిప్రాయం. షూటింగ్ నుంచి వచ్చిన తర్వాత తప్పకుండా కాసేపు బొమ్మలు వేయడం నా అలవాటు" అని చెప్పేవారు శ్రీదేవి. నటిగా బిజీ అయిపోయాక కొన్నేళ్లు పెయింటింగ్‌లకు దూరమయ్యారు. అయితే జాన్వీ చదువులో భాగంగా ఆర్ట్‌వర్క్ గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు తిరిగి రంగులు, కుంచెలు శ్రీదేవిని ఆకర్షించాయి. భర్త బోనీకపూర్ కూడా ప్రోత్సహించడంతో ప్రముఖ ఆర్టిస్ట్ సుభాష్ అన్సాత్ దగ్గర చిత్రకళపై శిక్షణ తీసుకున్నారు. "నేను వేయాలనుకునే పెయింటింగ్స్ చాలా ఉన్నాయి. అవన్నీ పూర్తయిన తర్వాత ఒక ఎగ్జిబిషన్ కూడా పెట్టాలని ఉంది" అని చెప్పారు శ్రీదేవి. ఆ కోరిక నెరవేరకుండానే ఆమె రంగుల కల చెదిరిపోయింది.



వీళ్లకి పిచ్చెక్కిందా అనుకున్నా..!

శ్రీదేవి దృష్టి ఎప్పుడూ తాను చేస్తున్న సినిమా మీదనే ఉండేది. ఆ సినిమాలో తన పాత్ర గురించి తప్ప అది హిట్టవుతుందా, లేదా... ఇకపై కెరీర్ సంగతేంటి లాంటి విషయాలేవీ ఆలోచించేవారు కాదు. ఆ విషయాన్ని ఆమే చెప్పారు. "నా కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడానికి ప్రత్యేకంగా ప్రణాళికలేవీ వేసుకోలేదు. నా 50 ఏళ్ల సినీ ప్రయాణంలో అన్నీ అలా జరిగిపోయాయంతే. అసలు నేను బాలీవుడ్‌కి వెళతానని కూడా ఊహించలేదు. నా తొలి హిందీ సినిమా 'సోల్వా సావన్' (1979లో ఓ తమిళ చిత్రానికి రీమేక్) తీసేటప్పుడు 'అక్కడ హిట్టయింది కాబట్టి ఇక్కడ వేరే భాషలో తీస్తున్నారంతే' అనుకున్నా. ఆ సినిమా సరిగా ఆడకపోవడంతో మామూలుగా దక్షిణాది సినిమాలు చేసుకుంటూ ఉన్నా. అయితే 1983లో 'హిమ్మత్‌వాలా'కి నా డేట్లు అడిగినప్పుడు ఆశ్చర్యపోయా. ఇదేంటి! నా తొలి హిందీ సినిమా ఫ్లాప్ అయినా నన్నే అడుగుతున్నారు? వీళ్లకేమీ పిచ్చెక్కలేదు కదా? అనుకున్నా. అయితే హిమ్మత్‌వాలా తర్వాత శ్రీదేవి బాలీవుడ్ ప్రస్థానం అప్రతిహతంగా సాగిపోయింది. అవకాశం వచ్చిన సినిమా మీదే మనసుపెట్టారు కాబట్టే శ్రీదేవి ఇంత స్థాయికి ఎదిగారనడంలో సందేహం ఏముంటుంది?

– న్యూస్‌టుడే, చెన్నై

రాజకీయాల్లోకి రావాలనుకున్న రారాణి

వెండితెరపై తిరుగులేని ఆధిపత్యం కనపరిచిన ప్రఖ్యాత నటి శ్రీదేవి ఒకానొక దశలో రాజకీయ రంగంలోనూ అడుగుపెట్టాలని భావించారు. ఒకపక్క హోటల్ వ్యాపారంలో, మరోపక్క రాజకీయాల్లో రాణించేందుకు నిర్ణయించుకున్న ఆమె.. తన కుటుంబ సభ్యుల సహకారంతో ఆ దిశగా అడుగులు వేసినా ఎందువల్లనో రాజకీయాల్లో అడుగిడలేకపోయారు. 1988లో ఒక ఆంగ్ల సినీ పత్రికకు ఇచ్చిన ముఖాముఖిలో భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆమె వెల్లడించారు...రాజకీయ రంగంలోకి రెండుమూడేళ్లలో రాబోతున్నట్లు శ్రీదేవి 30 ఏళ్ల క్రితం ప్రకటించారు. ఎందుకు రావాలనుకుంటున్నారని ప్రశ్నిస్తే తండ్రి కోరిక మేరకేనని బదులిచ్చారు. తల్లిదండ్రులు ఏది కోరుకుంటే అది చేస్తానన్నారు. తల్లిదండ్రులు చాలా అనుభవజ్ఞులనీ, తనకంటే ఎక్కువ విషయాలు వారికి తెలుసు కాబట్టే అన్నింటికీ వారిపై ఆధారపడతాననీ సమర్థించుకున్నారు. 'ఎన్నికల్లో నెగ్గితే ఏం చేయాలో నా తండ్రిని సలహా అడుగుతాను. ఎందుకంటే రాజకీయనేతలందరికీ ఒక సలహాదారుడు ఉండాలి కదా. మన దేశంలో పేదలు, ధనికుల మధ్య ఉన్న తేడాలను సరిచేసి, అందరూ సమానం కావాలనేది నా ఆకాంక్ష' అని చెప్పారు.

జాన్వీ శ్రీ వైపు.. ఖుషీ బోనీ వైపు

ముంబయి: అతిలోక సుందరి శ్రీదేవికి నిజ జీవితంలో తల్లి పాత్రకూ నూటికి నూరు మార్కులు దక్కుతాయి. పెద్దకుమార్తె జాన్వీ తనలాగే ఎంతో అణకువగా ఉంటుందని గత మాతృత్వ దినోత్సవంనాడు ఆమె వివరించారు. అంతేకాదు జాన్వీ తనతో ఎక్కువ సన్నిహితంగా ఉంటుందని తెలిపారు. చిన్నకుమార్తె ఖుషి మాత్రం భర్త బోనీకపూర్ వైపని అన్నారు. పిల్లల పెంపకం విషయంలో దంపతులిద్దరమూ తగిన శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ లాంటి తేడాలేవీ తమ మధ్యలేవని అన్నారు. మరోవైపు తను అమ్మ చాటు కూచిననీ ఆమె తెలిపారు. పిల్లలూ తను చెప్పేవాటికి ప్రాధాన్యం ఇస్తారని పేర్కొన్నారు. వారిద్దరూ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలరని చెప్పారు. పెద్దకుమార్తె జాన్వీకి మాత్రం తన అవసరం కాస్త ఎక్కువంటూ వివరించారు.







వసుంధర

ఆ దశాబ్దం.. ఆమె స్వర్ణయుగం

వెండితెరపై అగ్ర తారగా వెలుగొందిన శ్రీదేవి సినీ జీవితంలో 1980 దశకం స్వర్ణయుగమే. ఒక విధంగా చెప్పాలంటే ఆ దశాబ్దం అంతా ఆమెదే. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఆమె నటించిన ఎన్నో చిత్రాలు సంచలన విజయాలు సాధించాయి. ఆమె పేరు ప్రఖ్యాతులను శిఖరానికి చేర్చాయి. హిమ్మత్‌వాలా.. తోఫా... నాగిని...మిస్టర్ ఇండియా.. చాందినీ...ఇలా శ్రీదేవి నటించిన హిందీ సినిమాలన్నీ దాదాపు సూపర్ హిట్టే. తెలుగులోనూ సర్దార్ పాపారాయుడు, జస్టిస్ చౌదరి...ఆకలిరాజ్యం...ప్రేమాభిషేకం...కొండవీటి సింహం...బొబ్బిలి పులి తదితర చిత్రాలు రికార్డులు సృష్టించాయి. కథానాయకుడు ఎవరైనా సరే...కథానాయికిగా మాత్రం శ్రీదేవే ఉండాలన్నంత డిమాండ్. 'కొన్ని పాత్రలను ఆమె మాత్రమే చేయగలదు. ఆ స్థానంలో ఇతరులను కనీసంగానైనా ఊహించుకోలేం...ఆమెకు ప్రత్యామ్నాయంలేదు' అన్నంతగా బాలీవుడ్, టాలీవుడ్‌లో పరిస్థితి ఉండేది. ఆ దశాబ్ద కాలంలో ఆమె 100కు పైగా సినిమాల్లో (హిందీ, తెలుగు, తమిళ్, మలయాళం) నటించారు. ఉత్తరాది, దక్షిణాది సినీ ప్రేక్షకులను ఏకకాలంలో ఉర్రూతలూగించారు. సీరియస్ పాత్రలే కాదు హాస్య ప్రధాన చిత్రాలు, ప్రతినాయిక పాత్రల్లోనూ శ్రీదేవి తన అద్భుత నటన, హావభావాలు, అంద చందాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

విదేశాల్లో స్థిరపడదామనుకున్నా

విదేశాల్లోనైతే నాకు నచ్చిన ఐస్‌క్రీంలు, మిల్క్‌షేక్‌లు లాగించేయవచ్చు. బాంబేలో ఉంటే నాకు దేనికీ సమయం చిక్కడం లేదు. చెన్నైలో ఉంటే రోజంతా టీవీ చూడడంతోనే సరిపోతుంది. ఒకసారి కమల్‌హాసన్ చిత్రాన్ని చూడడానికి బురఖా ధరించి మరీ థియేటర్‌కు వెళ్లా. సినిమా చూసేందుకైనా విదేశాల్లో స్థిరపడతా.

• శ్రీదేవి

సౌందర్య పరిరక్షణే శాపమా!

• మళ్లీ చర్చనీయాంశమైన తారల తపన
• శస్త్రచికిత్సల పరిణామాలపై జోరుగా చర్చ

శ్రీదేవి హఠాన్మరణానికి గుండెపోటే కారణమని తెలుస్తున్నా అంతటి తీవ్రస్థాయిలో ఆమె కుప్పకూలడానికి కొన్ని సౌందర్య చికిత్సలూ పరోక్షంగా కారణమయ్యాయా...? చెక్కుచెదరని అందంతో ప్రేక్షకుల్ని అలరించాలనే తహతహే అనేక మంది తారల్ని మృత్యుముఖంలోకి తీసుకువెళ్తోందా...? ఆదివారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన సందేశాల సారాంశాన్ని చూస్తే ఎవరికైనా ఈ కోణంలోనూ అనుమానాలు రాకపోవు. కేవలం 54 ఏళ్ల వయసులోనే ప్రఖ్యాత నటి శ్రీదేవి కన్నుమూయడంతో ఈ వాదనకు ఊపు వచ్చింది. ఎందుకంటే శ్రీదేవి, కరీనా కపూర్, అనుష్క... ఇలాంటి ఎందరో ప్రముఖ తారలు తమ అందానికి మెరుగులు దిద్దుకునేందుకు శస్త్రచికిత్సల వరకు వెళ్లిన వారే. శ్రీదేవి ప్లాస్టిక్ సర్జరీలను చేసుకున్నారు. అప్సరసకు మారు రూపుగా కనిపించాలనే ఆరాటంతో తపన పడుతూ వివిధ సౌందర్య సాధనాలు, సౌందర్య ఉత్పత్తులపై ఆధారపడుతున్నారు.

సౌందర్య రాశుల కోసం...

తీరైన నాసిక కోసం శ్రీదేవి, సన్నగా నాజూగ్గా కనిపించడానికి కరీనా కపూర్, దొండపండు లాంటి పెదవుల కోసం అనుష్క శర్మ... ఇలా ఒక్కొక్కరు సినీ పరిశ్రమ అంచనాలను చేరుకునేందుకు శస్త్రచికిత్సలు చేయించుకున్నవారే. ప్రేక్షకుల్ని అలరించి, మార్కెట్లో తమ డిమాండ్ పడిపోకుండా చూసుకునేందుకు ఇలాంటి పాట్లు పడుతున్నా అమాంతం బరువు తగ్గిపోవడం, అనవసరంగా చికిత్సలు చేయించుకోవడం వల్ల వారి ప్రాణాలకే ప్రమాదం తలెత్తుతున్న సందర్భాలూ ఉంటున్నాయి. సైజ్ జీరో అంటూ 2009లో కరీనా అందుకున్న పల్లవి మన దేశంలో సంచలనం సృష్టించింది. ఆమె తీసుకునే ఆహారం, పాటించే నిబంధనలపై అనేక కథనాలు వెలువడ్డాయి. అనురాగ్ కాశ్యప్ దర్శకత్వం వహించిన 'బాంబే వెల్వెట్' చిత్రంలో ఒక పాత్ర కోసం అనుష్కశర్మ తన పెదవులకు చికిత్స తీసుకొన్నారు. పాత్రకు న్యాయం చేయడానికి ఆ పద్ధతిని ఎంచుకోవాల్సి వచ్చిందనీ, దానిలో దాచిపెట్టడానికేమీ లేదనీ ఆమె సమర్థించుకున్నారు. కరిష్మా కపూర్, కంగనా రనౌత్, ప్రియాంక చోప్రా, శిల్పాశెట్టి, శ్రుతి హాసన్ తదితరులు సౌందర్యపరమైన శస్త్రచికిత్సలు చేసుకున్నారంటూ ఆ చికిత్సకు ముందు, తర్వాత వారు కనిపించిన తీరును సామాజిక మాధ్యమాల్లో అనేకమంది పంచుకున్నారు.

అగ్రగామి మైఖేల్ జాక్సన్

సౌందర్యపరమైన చికిత్సలనేసరికి చప్పున గుర్తుకువచ్చే పేరు పాప్ ధ్రువతార మైఖేల్ జాక్సన్. ముక్కు, బుగ్గలు, గడ్డం, దవడ తదితర భాగాలకు ఆయన అనేకమార్లు శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. అప్పుడే అందుబాటులోకి వస్తున్న, ప్రమాదకరమైన చికిత్సలనూ ఆయన ఎంచుకోవడం విశేషం. రెండేళ్ల వ్యవధిలో 10-12 శస్త్రచికిత్సలను జాక్సన్ చేయించుకున్నట్లు వైద్యులు చెప్పేవారు. డ్రీమ్‌గర్ల్ హేమామాలిని, కాజోల్‌లు మిసమిసమెరిసే మేనిఛాయ కోసం చికిత్సలు పొందారని పరిశ్రమ వర్గాల కథనం. 2013లో నందితా దాస్ అయితే 'నలుపే అందం' (డార్క్ ఈజ్ బ్యూటిఫుల్) అంటూ నడిచిన ప్రచారోద్యమానికి బాసటగా నిలిచారు. తెల్లతొక్క కోసం తపించిపోవడంలో అర్థం లేదని వాదించారు. శ్రీదేవి మరణానికి, సౌందర్య చికిత్సలకు సంబంధం ఉన్నా లేకపోయినా ఈ తపనలో మనం చెల్లించుకుంటున్న మూల్యం గురించి చర్చ మళ్లీ మొదలయింది.

ముందస్తు సంకేతాలే లేవా?

దిల్లీ: శ్రీదేవి హఠాన్మరణంతో దేశమంతా దిగ్భ్రాంతికి గురైంది. భారత చిత్రసీమ బాధలో మునిగింది. ఆమె శనివారం రాత్రి గుండె హఠాత్తుగా ఆగిపోయి మృతిచెందారు. ఊహించిన పెను ఉప్పెనై ముంచెత్తి...గుక్కతిప్పుకోనీయకుండా చేసి... గుండె చప్పుడును ఆపేసి...ప్రాణాలను హరించేసే 'కార్డియాక్ అరెస్ట్' ఒక్కోసారి ముందస్తు సంకేతాలు కూడా ఉంటాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. తల తిరగడం, ఉన్నట్టుండి చెప్పలేనంత అలసటగా అనిపించడం.... ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడటం, గుండె నొప్పిగా అనిపించడం వంటివి ముంచుకురానున్న ముప్పునకు సంకేతాలు. ఒక్కోసారి నాలుగు వారాల కంటే ముందు నుంచీ కూడా శరీరం ఇలాంటి సంకేతాలను పంపుతుంది. వాటిని గుర్తించడం తప్పనిసరి. అయితే, గుండెపోటు లక్షణాలు స్త్రీ, పురుషుల్లో వేర్వేరుగా ఉంటాయి.

ఒక రకంగా వికారంగా అనిపించడం, అలసట, వెన్నునొప్పి, మెడ, భుజాల నొప్పులు కూడా రాబోయే గుండెపోటుకు సంకేతాలే కావచ్చు. అధికరక్తపోటు, మధుమేహం, ధూమపానం, కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉండటం...అసలు ఏ విధమైన శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం వంటివి గుండెపోటుకు దారితీస్తాయి. అందుకే, ఇలాంటి లక్షణాలు కనపడానే తక్షణం వైద్యసాయం కోసం పరుగుపెట్టాలి.

గుండెపోటుతో మరణించిన రీమాలాగూ, ఆర్తిఅగర్వాల్ తదితర నటీమణులు కొందరు ఇలా గుండెపోటుతోనే హఠాన్మరణం పాలయ్యారు. ఇక, దేశాన్నే దిగ్భ్రాంతికి గురిచేసిన శ్రీదేవి విషయంలో ఇలాంటి సంకేతాలేవీ లేవా? అనేది ఇప్పుడు శేషప్రశ్న. కాస్మొటిక్ శస్త్రచికిత్సలు, బొటాక్స్‌లు చేయించుకుంటున్నారన్న ఊహాగానాలను పక్కనబెడితే....54 ఏళ్ల వయసులో కూడా కళ్లు తిప్పుకోనీయని సౌందర్యం ఆమెది. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ....మిగిలిన అందరిలాగే శ్రీదేవి కూడా అని నేటి విషాదం చెబుతోంది.

ముందే అమితాబ్ కలవరపాటు!



ముంబయి: అందాల తార శ్రీదేవి హఠాన్మరణం వార్త యావద్దేశాన్ని దిగ్భ్రాంతిలో ముంచెత్తేయడానికంటే ముందే బాలీవుడ్ నటదిగ్గజం అమితాబ్ బచ్చన్ మనసు ఏదో తెలియని కలవరానికి గురైంది. ఆ కలవరానికి...మనసును కుదిపేసిన తెలియని అలజడికి ఆయన ట్విటర్‌లో అక్షరరూపం ఇచ్చారు. శ్రీదేవి మరణవార్త వెలువడటానికంటే ముందే ఆయన చేసిన ట్వీట్‌ను బట్టి చూస్తే....ఆయన మనసుకు కలిగిన ఆవేదన ఈ మహావిషాదానికి పూర్వసంకేతమా అనిపిస్తోంది. 'న జానే క్యో ....ఏక్ అజీబ్ సీ ఘబరాహట్ హో రహీ హై' (ఎందుకో తెలియట్లేదు కానీ...ఏదో తెలియని కలవరం కలుగుతోంది) అంటూ చేసిన ట్వీట్‌ను బట్టి చూస్తే...ఏదో ఉపద్రవం వాటిల్లుతోందని అతడికి ముందుగా అనిపించిందా?

మనసుకు పూర్వసంకేతం అందినట్లు అనిపించడం వంటివి....శాస్త్రీయ పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నమ్మశక్యం కానట్లు ఉన్నప్పటికీ ఇలాటి సంఘటననే అమితాబ్ ఒకప్పుడు మీడియాతో పంచుకున్నారు. 1982లో 'కూలీ' చిత్రం కోసం బెంగళూరులో అమితాబ్ షూటింగ్‌లో పాల్గొంటుండగా.. ఓ రోజు రాత్రి ఒంటిగంట ప్రాంతంలో నాటి మేటినటి స్మితాపాటిల్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. "అమితాబ్ జీ! ఈ సమయంలో ఫోన్ చేసినందుకు ఏమీ అనుకోకండి. మీరు బాగానే ఉన్నారు కదా! నాకేదో పీడకల వచ్చింది. అందుకే మీరెలా ఉన్నారా అని ఫోన్‌చేశా అంటూ స్మిత" ఆరోజున ఆయనకు చెప్పారట. తాను కులాసానే అని ఆయన జవాబిచ్చారు. ఆ మర్నాడే 'కూలీ' షూటింగ్‌లో అమితాబ్ అత్యంత తీవ్రమైన ప్రమాదానికి గురైనారు. ఆ విషయాన్ని ఆయన ఇటీవల స్మిత కుమారుడు ప్రతీక్ బబ్బర్ నటించిన ఓ చిత్రం ప్రచార కార్యక్రమంలో పేర్కొన్నారు.

ఆహార్యమే కాదు.. ఆహారంలోనూ క్రమశిక్షణే

ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేది శ్రీదేవి. యాభై ఏళ్లు దాటినా చలాకీగా, చురుగ్గా, ఏ మాత్రం చెక్కుచెదరని అందంతో కనిపించిందంటే కారణం తన ఆహారపు అలవాట్లే. శ్రీదేవి పూర్తిగా శాకాహారి. చిరుతిళ్లకి దూరం. కనీసం శీతల పానీయాలు కూడా స్వీకరించేది కాదట. రోజూ వ్యాయామం తప్పనిసరి. కుమార్తెలతో కలిసి ఆటాపాటల్లో మునిగితేలేది. అదే తనని ఉత్తేజపరిచే వ్యాపకం. శ్రీదేవికి వంట రాదు. కాకపోతే.. 'ఈ కూర ఇలా వండితే బాగుండు.. అందులో ఇంకొంచెం కారం వేస్తే బాగుండు' అని సలహాలు మాత్రం ఇచ్చేదట.

ఆహార్యంలోనే కాదు.. వ్యక్తిత్వంలోనూ శ్రీదేవి అందాల రాశే. దక్షిణాదిలో, బాలీవుడ్‌లోనూ అగ్ర తారలతో కలిసి పనిచేసింది. పారితోషికం పరంగా, విజయాల పరంగా నెంబర్ వన్ కథానాయిక అనిపించుకుంది. 'లేడీ సూపర్ స్టార్'గా ఎదిగింది. అయినా అదే వినమ్రత. మీడియా దగ్గర ఎప్పుడూ దురుసుగా ప్రవర్తించిన దాఖలాలు లేవు. ఒక్కసారి కూడా వివాదాల్లో ఇరుక్కోలేదు. ఎవరినీ పల్లెత్తు మాట అనలేదు. ఆ మధ్య 'బాహుబలి' వ్యవహారంలో శ్రీదేవి పేరు బాగా వినిపించింది. 'శివగామి' పాత్ర కోసం ముందు శ్రీదేవిని సంప్రదించి... ఆమె కాదంటే రమ్యకృష్ణని ఎంచుకున్నారు. ఈ విషయంపై ఓ సారి రాజమౌళి. . 'శ్రీదేవి నో చెప్పడం మా అదృష్టం' అని సరదాగా వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యాఖ్యలు ఎవరికైనా కోపాన్ని తెప్పిస్తాయి. కానీ, శ్రీదేవి మాత్రం ఇలాంటి పరిస్థితుల్లోనూ హుందాగా వ్యవహరించింది. మీడియా గుచ్చి గుచ్చి ఇదే ప్రశ్న వేసినా 'నో కామెంట్' అంటూ సుతిమెత్తగా ఆ విషయాన్ని పక్కనబెట్టింది.

'చిటికెలో సన్నబడి పోగలను'

ఎప్పుడు కాస్త లావయినట్లు అనిపించినా...సులువుగా తగ్గిపోగల శరీర తత్వం తనదని శ్రీదేవి ఒకానొక సందర్భంలో చెప్పారు. మిఠాయిలన్నా....ఐస్‌క్రీములన్నా... చెప్పలేనంత ఇష్టం. ఎడాపెడా లాగించేస్తాను. అయితే, ఆ తర్వాత నా ముఖం కావలసిన దానికంటే ఎక్కువ గుండ్రంగా తయారైందనిపించినపుడు చటుక్కున జాగ్రత్త పడతా. కేవలం ఉడికించిన ఆహారాన్ని మాత్రమే తీసుకుంటాను. అంతే... కేవలం నాలుగురోజుల్లో చక్కగా సన్నబడిపోతానన్నారు.

ఆకుచాటు నుంచే 'ఓరి బ్రహ్మదేవుడో..'

శ్రీదేవికి కెరీర్‌లో గుర్తుండిపోయే పాట. 'ఆకుచాటు పిందెతడిసే..' ఆ తరవాత అంతటి పేరు పొందిన పాటల్లో 'గోవిందా గోవిందా'లోని 'ఓరి బ్రహ్మదేవుడో కొంపముంచినావురో..' ఒకటి. నిజానికి 'ఓరి బ్రహ్మదేవుడో' పాటకు 'ఆకుచాటు పిందెతడిసే' పాటే స్ఫూర్తి అంటారు రామ్‌గోపాల్‌వర్మ. 'వేటగాడు' సినిమా చూస్తున్నప్పుడు... అందులో 'ఆకుచాటు పిందెతడిసే..' పాట పూర్తయ్యాక ఓ అభిమాని లేచి 'ఎట్లా పుట్టించాడురా బాబూ... ఇంత అందాన్ని.. వాడికి దణ్ణం పెట్టాలి' అంటూ గట్టిగా అరిచాడట. ఆ మాటనే స్ఫూర్తిగా తీసుకుని 'గోవిందా గోవిందా'లో 'ఓరిబ్రహ్మ దేవుడో' పాటను సిరివెన్నెలతో రాయించారట వర్మ.





పులి చిత్రంలో శ్రీదేవి..

ఓ తరం జ్ఞాపకం.. బేబీ శ్రీదేవి



శివకాశి.. మందుగుండు సామగ్రికి ప్రసిద్ధి. అందుకేనేమో. . మనసును దోచే అందం కూడా అక్కడే విస్ఫోటించింది. పల్లెటూరి పైరగాలి తెరల్లో తేలి వచ్చిన ఆ సిరిమల్లె చూపుల్లో పారిజాతాలు, నవ్వుల్లో పున్నాగ పూలు ఒకేసారి కురిశాయి. పొలం గట్టున చెట్టుకొమ్మకు కట్టిన ఉయ్యాలతోపాటు ప్రేక్షకుల హృదయాల్నీ ఊపేశాయి. ప్రేక్షకుల కళ్లు దోసిళ్లుగా మారి.. చూపుల్నీ, నవ్వుల్నీ ఒకేసారి ఒడిసిపట్టాయి. అవి దక్షిణాదికే పరిమితం కాలేదు. మట్టి పొరల్లోని అంకురం మహా వృక్షంగా ఎదిగినట్లు ఇక్కడ వెలిగించిన అందాల చిచ్చుబుడ్డి రవ్వలు ఉత్తరాదికి ఎగిశాయి. మన్మథ బాణాలై మతులు పోగొట్టాయి. ఫలితంగా ఓ టీవీ ఛానెల్ అయిదేళ్ల నాడు నిర్వహించిన జాతీయ స్థాయి సర్వే ఫలితాలు 'భారతదేశ చలనచిత్ర శతాబ్ద చరిత్రలో మహానటి' మకుటాన్ని శ్రీదేవి శిరసున ఉంచాయి. ఇదో సుందర ప్రస్థానం. దీనికో తొలి ఇన్నింగ్స్ ఉంది. ఓ తరం జ్ఞాపకాల్లో ఆమె బేబీ శ్రీదేవి. భావికాలం నాటి 'అతిలోక సుందరి'. ఓ బాలతారగా తెలుగు లోగిట అడుగుపెట్టిన అలనాటి వైనం.. ఓ అభిమాన తరానికి చెక్కుచెదరని స్మృతి పరిమళం.

బాల్యంలో అందం, అమాయకత్వం ఉంటాయి. ఎదిగిన కొద్దీ ఇవి ఎంతమందిలో కొనసాగుతాయో చెప్పలేంగానీ, శ్రీదేవిలో మాత్రం చివరి వరకు ఉండిపోయాయి. వస్తూనే తారాపథంలోకి దూసుకొచ్చిన బాలనటులు ఎదిగిన తర్వాత ఆ పోకడను కొనసాగించలేక తెరమరుగైన సందర్భాలు అనేకం. దీనికి మినహాయింపు శ్రీదేవి. చెప్పాలంటే తెలుగులో బేబీ శ్రీదేవి ఇన్నింగ్స్ భారీ సిక్సర్‌తో మొదలుకాలేదు. 'లేత మనసులు'లోని బేబీ పద్మిని, 'భక్త ప్రహ్లాద'లో రోజారమణి, 'పాపకోసం'లో బేబీ రాణికి వచ్చినట్లుగా ఆరంభంలోనే అమాంతంగా తారాపథంలోకి దూసుకుపోయే సినిమాలేవీ బేబీ శ్రీదేవికి రాలేదు. ఓ డబ్బింగు సినిమాలో 'బాలమురుగన్' పాత్రలో తళుక్కుమన్నప్పుడు అచ్చం క్యాలెండర్లలో కనిపించే కుమారస్వామిలా ఉందీ పాప అనుకున్నారు. అక్కడి నుంచి బేబీ శ్రీదేవికి అంచెలంచెలుగా తెలుగులో అవకాశాలు రావడం మొదలైంది. అంతకు మునుపు బేబీ పాత్రల్లో కనిపించిన పద్మిని, రాణి, రోజారమణి లాంటి వారు ఎదిగిపోయిన తర్వాత అలాంటి పాత్రల్లో ఒదిగిపోయే అవకాశం బేబీ శ్రీదేవికి వచ్చింది. చక్రాల్లాంటి కళ్లలో ఉట్టిపడే అమాయకత్వం వల్లేనేమో జాలి గొలిపే పాత్రల్లో ఆమెను చూసేందుకు మనవాళ్లు, ముఖ్యంగా మహిళా ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడ్డారు.



'భార్యాబిడ్డలు'లో 'చక్కనయ్యా చందమామా..' అని ఎక్కిఎక్కి ఏడుస్తూ, అన్నయ్య కోసం వెతుకుతూ వెళ్లిన పిల్లల బృందంలోని శ్రీదేవిని చూసి పాపం అని కళ్లు తుడుచుకున్నారు.

కొద్దిపాటి సీన్లకే పరిమితమైన పాత్రల నుంచి కొంచెం నిడివి ఉన్న పాత్రలో సైతం రాణించే అవకాశం 'నా తమ్ముడు'లో బేబీ శ్రీదేవికి వచ్చింది. 'చిన్నారి పాపల పొన్నారి తోటలో..' ఎర్రగులాబీగా విరబూసింది. అక్కడి నుంచి 'బడిపంతులు'తో మరో ముందడుగు పడింది. 'బూచాడమ్మా బూచాడు..' అంటూ బుల్లిపెట్టె లాంటి టెలిఫోన్ పాటతో ముద్దుల మూటకట్టింది. తెలుగు పౌరాణికాల్లో చిన్నారి పాత్రలకూ వన్నె తెచ్చింది. 'బాలభారతం'లో దుస్సలగా, 'యశోదాకృష్ణ'లో భాగవత దశమ స్కంధంలోని రేపల్లె గోపాలుడి లీలలు ప్రదర్శించి ప్రేక్షకుల అభిమానాన్ని కొల్లగొట్టింది.

'భార్యాబిడ్డలు'లో ఏయన్నార్‌కి చెల్లెలుగా, 'నా తమ్ముడు'లో శోభన్‌బాబుకు అన్నయ్య కుమార్తెగా, 'బడిపంతులు'లో ఎన్టీఆర్‌కి మనవరాలిగా నటించిన శ్రీదేవి.. భవిష్యత్తులో వారి సరసన హీరోయిన్‌గా అందాల విందు చేస్తుందని ఎవరూ ఊహించలేదు. ఎదుగుతున్న దశలో సైతం శ్రీదేవికి చెప్పుకోదగ్గ ఆరంభమేమీ లభించలేదు. 'అనురాగాలు', 'మా బంగారక్క' లాంటి చిత్రాల్లో హీరోయిన్‌గా అవకాశాలు లభించినా ప్రేక్షకాదరణ అంతంత మాత్రమే. అలాంటి సమయంలో తమిళ చిత్రాలే ఆమెకు దారి చూపాయి. ప్రధానంగా భారతీరాజా, బాలు మహేంద్ర లాంటి దర్శకుల చిత్రాలు నటిగా శ్రీదేవిలోని పరిణతి చెందిన పార్శ్వాన్ని చూపాయి. అక్కడ లభించిన ఆదరణ ఇక్కడ 'పదహారేళ్ల వయసు'గా పల్లవించింది. రాఘవవేంద్రరావు దర్శకత్వం శ్రీదేవి మలి ప్రస్థానానికి విజయ తిలకం దిద్ది, అనంతర కాలంలో ఆమెను 'అతిలోక సుందరి' స్థానానికి చేర్చింది.

• ఓలేటి శ్రీనివాసభాను

'మా నాన్న నిర్దోషి'లో 'ఎంతెంత దూరం..' అని బేబీ శ్రీదేవి పాడుతూ, ఆడుతుంటే బాగుందీ పాప అనుకున్నారు. 'కళ్యాణ మంటపం'లో చిన్నప్పటి కాంచన పాత్రలో చిన్నారిని చూసి జాలిపడ్డారు. తనకు పెళ్లి కాదంటూ సాటి పిల్లలు కులం పేరుతో ఎగతాళి చేసినప్పుడు పసి మనసు ఆరాటాన్ని పండించిన శ్రీదేవికి ఉజ్వల భవిష్యత్తు ఉందని అప్పుడే అనుకున్నారంతా. దానికి కొనసాగింపుగా 'శ్రీమంతుడు'లోని చిన్ననాటి జమున పాత్రలో 'చిట్టి పొట్టి బొమ్మలూ..' పాటలో పెళ్లికూతురి వేషాన్ని చూసి అభిమానులు మనసులోనే దిష్టి తీశారు.


శ్రీదేవిని ఢీకొట్టిన ఎన్టీఆర్..!

శోభన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'నా తమ్ముడు' చిత్రంలో శ్రీదేవి బాలనటిగా కనిపించింది. ఈ చిత్రంలో ఓ సన్నివేశాన్ని చిత్రానికి సహాయకుడిగా పని చేస్తున్న రాఘవేంద్రరావు తెరకెక్కిస్తున్నారు. సన్నివేశం ప్రకారం శ్రీదేవి రోడ్డుకు అడ్డంగా పరిగెత్తుతూ వస్తుంటే.. అనుకోకుండా ఓ కారు వచ్చి ఆమెను ఢీ కొట్టింది. పాదానికి కొద్దిగా గాయమైంది. ఊహించని ఆ ఘటనతో షాక్‌కు గురైన రాఘవేంద్రరావు కిందపడిన శ్రీదేవిని ఎత్తుకొని పరుగు పరుగున ఇంటికి తీసుకెళ్లారు. 'బంగారు బాతుగుడ్డు'లోనూ శ్రీదేవికి ఇలాంటి ప్రమాదమే జరిగిందట. కాకపోతే ఈసారి గుద్దింది ఎన్టీ రామారావు కారు. సన్నివేశం ప్రకారం ఎన్టీఆర్ కారు శ్రీదేవి ముందుకెళ్లి ఆగాలి. కానీ, సమయానికి బ్రేకులు పనిచేయలేదు. దాంతో నేరుగా కారుతో శ్రీదేవిని ఢీకొట్టారట ఎన్టీఆర్. కారు నెమ్మదిగా నడపడం వల్ల... ఈసారి కూడా శ్రీదేవికి పెద్ద ప్రమాదమేం జరగలేదు.

నాకూ 14 ఏళ్లే అన్న ఎన్టీఆర్..!

'బడిపంతులు'లో ఎన్టీఆర్‌కు మనవరాలిగా నటించిన శ్రీదేవి 'వేటగాడు' చిత్రంతో తొలిసారి ఆయన పక్కన కథానాయికగా అవకాశాన్ని అందుకుంది. మనవరాలిగా చేసిన అమ్మాయితో తమ అభిమాన కథానాయకుడు డ్యూయెట్లు పాడితే ప్రేక్షకులు చూస్తారా అని నిర్మాతలు ఆందోళన పడ్డారట. దర్శకుడు రాఘవేంద్రరావు ధైర్యం చేసి ఎన్టీఆర్‌కు విషయమంతా చెప్పారట. 'శ్రీదేవికి 14 అయితే నాకూ 14 ఏళ్లే.. సినిమా తీసేద్దాం...' అన్నారట ఎన్టీఆర్ నవ్వుతూ.

34,540 పైన ముగిస్తే లాభాలే!



సమీక్ష : ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీలు.. గత వారం స్వల్ప లాభాలతో ముగిశాయి. చిన్న, మధ్య షేర్ల బలహీనతలు కొనసాగాయి. అయితే రూపాయి బలహీనపడటంతో ఎగుమతి ఆధారిత షేర్లు కొంత మేర రాణించాయి. వడ్డీ రేట్ల పెంపునకు అమెరికా ఫెడ్ సంకేతాలివ్వడం, ద్రవ్యోల్బణంపై ఆర్‌బీఐ ఆందోళనలు, ఎఫ్ఐఐలు స్థిరంగా అమ్మకాలు కొనసాగించడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. అయితే ఐటీ షేర్ల లాభాలు కలిసొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లకు వరుస సెలవులు రావడంతో దేశీయ సూచీలు ఈ వారాన్ని స్తబ్దుగానే ప్రారంభించాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంతో ప్రభుత్వ బ్యాంకుల షేర్లకు అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. విదేశీ మదుపర్ల అమ్మకాలు తోడవ్వడంతో సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. అయితే ఐటీ రంగ వృద్ధి స్వల్పంగా పెరగొచ్చన్న నాస్కామ్ అంచనాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి తరుగుదల ఐటీ షేర్ల లాభాలకు తోడ్పడింది. ఇదే సమయంలో కాంట్రాక్టుల గడువు దగ్గరపడటంతో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చోటుచేసుకోవడం, ఎగుమతుల ఆధారిత రంగాలైన ఐటీ, ఔషధ, లోహ షేర్లకు మద్దతు లభించడం మార్కెట్లు కోలుకోడానికి దోహదపడ్డాయి. ఈ పరిణామాలతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 132 పాయింట్లు పెరిగి 34,142 వద్ద ముగిసింది. నిఫ్టీ 39 పాయింట్లు లాభపడి 10,491 దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికర విక్రయాలు రూ.5782 కోట్లుగా నమోదయ్యాయి. డీఐఐలు, ఫండ్లు మాత్రం రూ.5973 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా నమోదుకావడం.. మార్కెట్లలో అప్రమత్తతను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } సెన్సెక్స్ 34,540 పాయింట్ల వద్ద నిరోధాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. ఒకవేళ పెరిగితే 35,010 పాయింట్ల దగ్గర బలమైన నిరోధం కనిపిస్తోంది. సూచీ 33,482 దిగువన ముగిస్తే.. స్వల్పకాలంలో బలహీనతలకు ఆస్కారం ఉంది.

ప్రభావిత అంశాలు } శుక్రవారం హోలీ సందర్భంగా సెలవు కావడంతో ఈ వారం నాలుగు రోజుల పాటే మార్కెట్ పనిచేస్తుంది. 28న వెలువడనున్న సెప్టెంబరు- డిసెంబరు త్రైమాసిక జీడీపీ గణాంకాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. వృద్ధి తగ్గితే మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడొచ్చు. పీఎన్‌బీ కుంభకోణం, ప్రభుత్వ బ్యాంకుల మొండిబకాయిలకు సంబంధించిన వార్తలు ఈ షేర్లకు దిశానిర్దేశం చేయొచ్చు. నెలవారీ విక్రయ గణాంకాలు వెలువడనుండటంతో వాహన షేర్లలో కదలికలు కనిపించొచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా జీడీపీ గణాంకాలు, చైనా, జపాన్, అమెరికా, భారత్ పీఎంఐ తయారీ గణాంకాలు దిశానిర్దేశం చేయొచ్చు. గత కొన్ని వారాలుగా ఒడుదొడుకులు ఎదుర్కొంటున్న రూపాయి కదలికలు కీలకం కానున్నాయి. ముడిచమురు ధరలు, ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 33,832, 33,482, 32,683; **తక్షణ నిరోధ స్థాయిలు:** 34,540, 35,010, 35,507

34,540 పాయింట్ల ఎగువన ముగిస్తే.. స్వల్పకాలంలో మార్కెట్లు లాభాలు నమోదు చేయొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

ఈనాడు బిజినెస్



కోడిగుడ్లు

25న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)			
హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	360
బెంగళూరు	385	చెన్నై	395
26వ తేదీకి		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	358	నమక్కల్	380

అవసరానికి తగిన బీమా

- అప్పుడే కంపెనీలు విజయవంతం
- ప్రజల్లో అవగాహనా పెరిగింది

బీమా పాలసీల అవసరాన్ని గుర్తించే వారి సంఖ్య పెరగడంతో, ఈ రంగం గతంతో పోలిస్తే వేగంగా వృద్ధి సాధిస్తోందని అంటున్నారు.. ఐడీబీఐ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) విఘ్నేశ్ సహానే. పాలసీదార్ల నమ్మకాన్ని పెంచుకోవడం, దీర్ఘకాలం పాలసీలు కొనసాగేలా చూడటం బీమా కంపెనీలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లని ఆయన పేర్కొంటున్నారు. 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఇంకా ఏమంటున్నారంటే..

ఈనాడు ఇంటర్వ్యూ

ఐడీబీఐ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈఓ విఘ్నేశ్ సహానే



? బీమా రంగానికి ఈ ఏడాది ఎలా ఉండబోతోంది? వృద్ధి రేటు కొనసాగుతుందా?

2016 నవంబరులో పెద్ద నోట్ల రద్దు తరవాత నుంచి బీమా రంగానికి సానుకూలంగానే ఉందని చెప్పొచ్చు. 2017లో ఈ రంగంలో 20శాతం వరకూ వృద్ధి కనిపించింది. బ్యాంకుల్లో ఉన్న డబ్బుతో చాలామంది బీమా పాలసీలు తీసుకోడానికి ప్రయత్నించారు. 2018లోనూ ఈ వృద్ధి రేటు కొనసాగుతుందనే ఆశించవచ్చు. దీనికి ప్రధాన కారణం.. బీమా పాలసీలపై ప్రజలకు అవగాహన పెరిగింది. కచ్చితంగా ఒక పాలసీ తీసుకోవాల్సిందేనని ఆలోచిస్తున్నారు. డిజిటల్ ఆర్థిక లావాదేవీలు పెరుగుతుండటం కూడా ఈ రంగానికి సానుకూలంగా ఉండబోతోందని చెప్పొచ్చు.

? ఈ రంగంలో ఎదురవుతున్న ప్రధాన సవాళ్లు ఏమిటి? వాటిని బీమా సంస్థలు ఎలా అధిగమిస్తున్నాయి?

ప్రస్తుతం బీమా సంస్థలకు ప్రధానంగా నాలుగు రకాల సవాళ్లు ఎదురవుతున్నాయి.. పాలసీదారుల నమ్మకాన్ని పొందేందుకు తీవ్రంగా కృషి చేయాల్సి వస్తోంది. పాలసీదారుల అవసరాలకు తగ్గట్టుగా పాలసీలను అందించడం ద్వారానే ఇది సాధ్యం అవుతుంది. పాలసీల విక్రయంలో కూడా గట్టి పోటీ ఎదురవుతోంది. ఖర్చుల నియంత్రణ పాటిస్తూనే దీన్ని అధిగమించాల్సిన అవసరం ఉంది. పాలసీలు తీసుకున్న వారు కచ్చితంగా వ్యవధి పూర్తయ్యేంత వరకూ వాటిని కొనసాగించేలా చూసుకోవాలి. ఈ విషయంలో బీమా సంస్థలు పాలసీదారుల్లో అవగాహన పెంచడానికి ప్రయత్నించాలి. బీమా పాలసీ అంటే స్వల్పకాలిక వ్యవధికి కాదు.. దీర్ఘకాలం ప్రీమియం చెల్లించాలి అని పాలసీదారులూ గుర్తించాలి.

? జీవిత బీమా కంపెనీలు ఐపీఓలకు వస్తున్నాయి కదా! వీటివల్ల ఎలాంటి ఫలితాలు కనిపించబోతున్నాయి?ఐడీబీఐ ఫెడరల్ ఇన్సూరెన్స్ ఐపీఓకి వచ్చే అవకాశం ఉందా?

ఇక్కడ ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విషయం ఒకటుంది.. ఇన్నాళ్లూ బీమా అంటే ఓ వైపే చూసేవారు.. ఇప్పుడు ఇందులో ఉన్న పెట్టుబడి అవకాశాలనూ గమనించే అవకాశం ఐపీఓల వల్ల కలిగింది. బీమా సంస్థల్లో పారదర్శకత పెరిగేందుకు ఈ పరిణామం దోహదం చేస్తోంది. కొన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ.. ఐపీఓల తరవాత ఈ రంగంపై వచ్చిన సానుకూల అంశాలే ఎక్కువ. బీమా రంగానికి విస్తృత ప్రచారం లభించింది. సంస్థల పట్ల ఆసక్తి పెరిగింది. మార్కెట్లో మదుపు చేయడానికి ఒక కొత్త రంగాన్ని ఇవి పరిచయం చేశాయి. విదేశీ సంస్థలు దేశీయ బీమా రంగంలో ఉన్న అభివృద్ధిని పరిశీలించేందుకు ఇది వీలు కల్పించింది. మా వరకూ చూస్తే.. సాంకేతికంగా ఐపీఓకి రావడానికి వీలుంది. కానీ, ఇది సంస్థ భాగస్వాముల నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుంది.

? ఐడీబీఐ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ పనితీరు ఎలా ఉంది?

ప్రస్తుతం మా సంస్థకు పదో సంవత్సరం. 2017లో వ్యక్తిగత ప్రీమియం విభాగంలో వృద్ధి రేటు 40శాతం మేరకు ఉంది. పాలసీదారులు తమ నమ్మకాన్ని కొనసాగించారు. పాలసీల పునరుద్ధరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులూ ఎదురవ్వలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో గత రెండేళ్ల కాలంలో 10శాతం వృద్ధి సాధించాం. హైదరాబాద్ వరకూ చూస్తే 20శాతం వృద్ధి కనిపించింది. 2018లో కూడా ఇది కొనసాగుతుందని ఆశిస్తున్నాం.

? గతంతో పోలిస్తే బీమా రంగంలో సలహాదార్లు/ఏజెంట్లు బాగా తగ్గారు కదా? బీమా వ్యాపారంలో ఇది అడ్డంకిగా మారబోతోందా?

పదేళ్ల క్రితం ఉన్న పరిస్థితులకూ, ప్రస్తుతం ఎన్నో మార్పులు వచ్చాయి. అప్పటిలాగా ఇప్పుడు ఏజెంట్లకు అంత ఆకర్షణీయంగా ఉండటం లేదనే చెప్పొచ్చు. కానీ, కొత్త ఏజెంట్లను నియమించుకునేందుకు బీమా సంస్థలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. రైల్వే తరవాత అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తోంది బీమా రంగమే. డిజిటలైజేషన్ వల్ల ఏజెంట్లు సులభంగా పాలసీలు విక్రయించేందుకు అవకాశం లభిస్తోంది. మా వరకూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 1800 మంది ఏజెంట్లు ఉన్నారు. వీరి సంఖ్యను పెంచాలని చూస్తున్నాం. బీమా సంస్థలకు ఇప్పుడు బ్యాంక్ అస్యూరెన్స్ ఇప్పుడు పెద్ద పంపిణీ వ్యవస్థ. ప్రతి బ్యాంకూ ఇప్పుడు ఏదో ఒక బీమా సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని, పాలసీలను విక్రయిస్తున్నాయి. ఆన్‌లైన్‌లోనూ పాలసీలు అధికంగానే అమ్ముడవుతున్నాయి. కాబట్టి, బీమా పాలసీల పంపిణీకి ఇబ్బందులు రాకపోవచ్చనే నా అభిప్రాయం.

? పాలసీలపై ప్రజల ధోరణి మారుతోందా? ఎలాంటి పాలసీలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి?

అర్థం చేసుకోవడానికి సులువుగా ఉన్న పాలసీలకు ఇప్పుడు గిరాకీ పెరుగుతోంది. ఒకప్పటిలాగా బీమా అంటే కేవలం పన్ను ఆదా కోసం అనే ధోరణి ప్రస్తుతం లేదు. ఇదొక దీర్ఘకాలిక పథకంగా నమ్ముతున్నారు. అయితే, ఈ అవగాహన ఇంకా పెరగాల్సిన అవసరం ఉంది. టర్మ్ పాలసీల విషయంలో కూడా సానుకూల ధోరణి ఏర్పడుతోంది. యువత ఎక్కువగా వీటిని తీసుకుంటున్నారు. రూ.25లక్షల నుంచి రూ.50లక్షల వరకూ పాలసీలపై ఆసక్తి చూపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం ద్వారా బీమా రక్షణ అందుబాటులోకి వచ్చింది. ఇది బీమా రంగానికి మంచి పరిణామమే.

– ఈనాడు, హైదరాబాద్

టీవీల ధరలు 7% వరకు పెంపు!

దిల్లీ: కస్టమ్స్ సుంకం పెరిగిన నేపథ్యంలో, ఎల్ఈడీ/ఓఎల్ఈడీ టీవీల ధరలను 7 శాతం వరకు పెంచేందుకు సోనీ, ఎల్‌జీ, పానసోనిక్, శామ్‌సంగ్ వంటి సంస్థలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇందువల్ల అమ్మకాలపై స్వల్పకాలం ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నాయి. పానసోనిక్ సంస్థ 2-7 శాతం, శామ్‌సంగ్ 5-6 శాతం వరకు ధరలు పెంచనున్నాయని సమాచారం. ధరలు పెంచడం మినహా ప్రత్యామ్నాయం లేదని, అయితే పరిశోధన-అభివృద్ధి ద్వారా కొంతమేర వ్యయ నియంత్రణకు ప్రయత్నిస్తామని ఎల్‌జీ పేర్కొంది. ఇప్పటి వరకు ధరలు పెంచలేదని, కస్టమ్స్ సుంకంలో మార్పు ప్రభావం ఎంతమేర ఉంటుందనే విషయమై అంచనాలు రూపొందిస్తున్నామని, భవిష్యత్తులో పెంచక తప్పదని సోనీ ఇండియా వివరించింది. ప్యానెళ్లపై కస్టమ్స్ సుంకాన్ని 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో ప్రతిపాదించిన సంగతి విదితమే. టీవీ విడిభాగాలపై సుంకాన్ని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. దేశీయ తయారీ పెంచేందుకే ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

రూ.10,000 కోట్లు

- **ఈ నెలలో విదేశీ మదుపర్లు వెనక్కి తీసుకున్న మొత్తమిది**
- **పీఎన్‌బీ కుంభకోణం, అంతర్జాతీయ సంకేతాలే కారణం**

దిల్లీ: ఫిబ్రవరిలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు భారీ స్థాయిలో పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు రూ.10,000 (1.5 బి. డాలర్లు) విలువైన షేర్లను విక్రయించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వెలుగుచూసిన భారీ కుంభకోణం, ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలే ఇందుకు కారణమని విశ్లేషకులు అంటున్నారు. జనవరిలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) రూ.13,780 కోట్లకు పైగా పెట్టుబడులను చొప్పించడం గమనార్హం. ముడిచమురు ధరలు పెరుగుతున్నందున, ద్రవ్యలోటుపై భారం పడొచ్చన్న అంచనాలు మదుపర్ల అప్రమత్తతకు కారణమయ్యాయని అన్నారు. డిపాజిటరీల దగ్గర ఉన్న తాజా సమాచారం మేరకు.. ఫిబ్రవరి 1-23 తేదీల మధ్యలో ఎఫ్‌పీఐలు రూ.9,899 కోట్లు (1.5 బి. డాలర్లు) ఉపసంహరించుకున్నారు. ఇదే సమయంలో రూ.1,500 కోట్లను రుణ మార్కెట్‌లో చొప్పించడం గమనార్హం.

రూ.25,000 కోట్ల సమీకరణే లక్ష్యం!

- రెండు డజన్ల ఐపీఓలు రానున్నాయ్

దిల్లీ: ఈ ఏడాదిలో పబ్లిక్ ఇష్యూల ద్వారా నిధుల సమీకరణకు దాదాపు పాతిక కంపెనీలు సిద్ధమవుతున్నాయి. వచ్చే కొన్ని నెలల్లో రూ.25,000 కోట్లు సమీకరణే లక్ష్యంగా రెండు డజన్లకు పైగా కంపెనీలు ముందస్తు పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, బార్బిక్యూ నేషన్ హాస్పిటాలిటీ, ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్ వంటి కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. వ్యాపార, ప్రాజెక్టుల విస్తరణ, మూలధన అవసరాల కోసం నిధులు సమీకరించాలనుకుంటున్నట్లు, ఆయా కంపెనీలు సెబీ వద్ద దాఖలు చేసిన ముసాయిదా పత్రాల్లో పేర్కొన్నాయి. స్టాక్ మార్కెట్లలో ఈక్విటీ షేర్లను నమోదు చేయడం ద్వారా బ్రాండ్ పేరు విస్తృతం అవుతుందని, ప్రస్తుత వాటాదార్లకు నగదు లభ్యత లభిస్తుందని మరికొన్ని సంస్థలు విశ్వసిస్తున్నాయి.



పబ్లిక్ ఆఫర్‌పై ముందుకు వెళ్లేందుకు బార్బిక్యూ నేషన్ హాస్పిటాలిటీ, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, భారత్ డైనమిక్స్, ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీలకు సెబీ పచ్చజెండా ఊపింది. రైట్స్, మిశ్రధాతు నిగమ్ (మిధానీ), బంధన్ బ్యాంక్, ఇండోస్టార్ కేపిటల్ ఫైనాన్స్, నజారా టెక్నాలజీస్, రూట్ మొబైల్ సహా 20 కంపెనీలు సెబీ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ కలిపి దాదాపు రూ.25,000 కోట్లు సమీకరించొచ్చని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాదిలో న్యూజెన్ సాఫ్ట్‌వేర్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు 5 కంపెనీలు ఇప్పటికే మార్కెట్లు ముందుకువచ్చిన విషయం తెలిసిందే.

పబ్లిక్ ఇష్యూ కోసం పాతిక సంస్థలు ఎదురు చూస్తుండటంతో, రాబోయే కొన్ని నెలల్లో ప్రాథమిక మార్కెట్ కళకళలు కొనసాగొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ద్వితీయ శ్రేణి మార్కెట్‌లో వివిధ కంపెనీల షేర్ల విలువలు అధికంగా ఉండటంతో, ఐపీఓలకు వచ్చే సంస్థల షేర్లు కొనుగోలు చేసేందుకు మదుపర్లు మొగ్గుచూపొచ్చని విశ్లేషకులు అంటున్నారు. 2017లో మొత్తంగా 36 కంపెనీలు ఐపీఓలకు వచ్చి.. రూ.67,000 కోట్లు కూడగట్టాయి. 2010లో కంపెనీలు ఈ పద్ధతిలో రూ.37,535 కోట్లు సమీకరించాక, ఇదే అత్యధికం.

నేటి నుంచి హింద్‌కాన్ కెమ్ ఐపీఓ

రసాయన ఉత్పత్తులను తయారు చేసే హింద్‌కాన్ కెమికల్స్ పబ్లిక్ ఇష్యూ నేటి నుంచి ప్రారంభం కానుంది. రూ.7.73 కోట్లు సమీకరణ లక్ష్యంతో వస్తున్న ఈ కంపెనీ.. వచ్చిన నిధులను మూలధన అవసరాలు, సాధారణ కార్పొరేట్ నిర్వహణ, వ్యయాల కోసం వినియోగించనున్నట్లు ప్రకటించింది. రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరును రూ.28 చొప్పున విక్రయించనుంది. 27,60,000 షేర్ల జారీకి తలపెట్టిన ఇష్యూ 28న ముగియనుంది. 'రసాయనాల రంగంలో దశాబ్దానికి పైగా అనుభవం, విస్తృత శ్రేణిలో ఉత్పత్తులు, బలమైన పరిశోధన, అభివృద్ధి విభాగం దన్నుగా నిలవడంతో కంపెనీ అగ్రగామిగా ఉందని, మార్కెట్ వాటా, లాభదాయకత పెంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామ'ని కంపెనీ ఎండీ, ప్రమోటర్ సంజయ్ గోయెంకా పేర్కొన్నారు. 2016-17లో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.33.94 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఇందులో 32.14 శాతం వాటా నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లకు ఎగుమతుల ద్వారా వస్తోంది.

కార్పొరేట్లకు రుణాలు ఆగకూడదు!

- అక్రమాలు అడ్డుకునేందుకు పటిష్ఠ చర్యలు కావాలి
- పారిశ్రామిక సంఘాల ఆకాంక్ష

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీలు చోటుచేసుకున్న నేపథ్యంలో, కార్పొరేట్ సంస్థలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు తీవ్రంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని పారిశ్రామిక సంఘాలు భావిస్తున్నాయి. రుణాలకు గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో, ఆర్థిక వృద్ధి పరుగులు పెట్టాల్సిన స్థితిలో కార్పొరేట్లకు తప్పనిసరిగా రుణాలు అందేలా చూడాలని పేర్కొన్నాయి. ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు మరింత మెరుగైన నియంత్రణ వ్యవస్థలు అవసరమని, ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీ)పై ప్రభుత్వ ఆధిపత్యం క్రమంగా తగ్గాల్సి ఉందని సూచిస్తున్నాయి.

ప్రభుత్వ వాటా 33 శాతానికి తగ్గించాలి: సీఐఐ అధ్యక్షురాలు శోభనా కామినేని



ఇటీవలి మూలధన పునర్నిర్మాణ పథకం వల్ల, పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటా పెరుగుతుంది. అయితే సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వ లక్ష్యమే అయిన 52 శాతానికి తగ్గించాలి. 3-4 ఏళ్లలో ఈ వాటాను క్రమంగా 33 శాతానికి తగ్గించాలి. ఆర్థిక మోసాల నియంత్రణకు ద్విముఖ వ్యూహాన్ని అమలు చేయాలి. మెరుగైన పర్యవేక్షణ జరపడంతో పాటు ఉత్తమ కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు పాటించాలి. ఆర్థిక వ్యవస్థలో సంస్థాగత నష్టభయ ప్రమాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, పరిశ్రమ వేగంగా స్పందించాలి. బ్యాంకింగ్ రంగానికి 3 కీలక పరిష్కారాలు తప్పనిసరి. అవినీతి అధికారులు, అనైతిక వ్యాపార సంస్థలు కలిసి చేసిన మోసపూరిత లావాదేవీల ప్రభావం వల్ల, కార్పొరేట్ సంస్థలకు రుణాలు ఆగకూడదు. బ్యాంకుల ఏకీకరణ కొనసాగించి, పటిష్ఠమైన కొద్ది బ్యాంకులను ఏర్పరచాలి.

రుణాలివ్వాలంటే భయపడకూడదు: అసోచామ్ సెక్రటరీ జనరల్ డీఎస్ రావత్



పీఎన్‌బీలో జరిగిన మోసపూరిత లావాదేవీల కారణంగా కార్పొరేట్ సంస్థలకు రుణాలివ్వాలంటే, ప్రభుత్వ రంగ బ్యాంకులు భయపడే పరిస్థితి రాకూడదు. నైతికతతో పనిచేసే బ్యాంకుల అధికారులు, నిబద్ధత కలిగిన వ్యాపార సంస్థలకు మద్దతు పెరగాలి. ఒకరిపై మరొకరికి విశ్వాసం పెంపొందాలి. దీర్ఘకాలంలో బ్యాంకుల ప్రైవేటీకరణ జరగాలి. వ్యవస్థాగత సంస్కరణల ద్వారా ఇలాంటి మోసాలను నివారించవచ్చు.

క్లెయిమ్ లోపాల వల్లే 70 శాతం రిఫండ్‌లు ఆగాయ్: సీబీఈసీ

దిల్లీ: ఎగుమతిదార్లకు సంబంధించి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రిఫండ్‌లు ఆగిపోయేందుకు 70 శాతం క్లెయిమ్‌లలో సమాచారం సరిగా లేకపోవడమే కారణమని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) పేర్కొంది. ఎగుమతిదార్లు తదుపరి నెలలో చేసే తుది రిటర్నులలో వివరాలను సరిదిద్దాలని సూచించింది. ఇందువల్ల మార్చి కల్లా ఆ క్లెయిమ్‌లను పరిష్కరించే వీలు చిక్కుతుందని తెలిపింది. అక్టోబరు నుంచి 4 నెలలకు గాను రూ.4,000 కోట్లను రిఫండ్‌గా ఎగుమతిదార్లకు సీబీఈసీ మంజూరుచేసింది. ఇప్పటికీ ఇంకా రూ.10,000 కోట్ల విలువైన రిఫండ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎగుమతిదార్లు కస్టమ్స్‌కు అందచేసిన వివరాలకు, జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్)లో నమోదు చేసిన వివరాల మధ్య తేడా ఉండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని సీబీఈసీ తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ ప్లాంట్‌కు యూఎస్ఎఫ్‌డీఏ ఈఐఆర్

దిల్లీ: శ్రీకాకుళంలోని ఫార్ములేషన్ల తయారీ ప్లాంట్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ (ఈఐఆర్) జారీ చేసిందని ఔషధ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈఐఆర్‌లోని విషయాలను కంపెనీ వెల్లడించనప్పటికీ.. ఏపీఐ తయారీ ప్లాంట్‌కు ఓఏఐ స్థితిని యూఎస్ఎఫ్‌డీఏ కొనసాగించినట్లు తెలిపింది. 'యూఎస్ఎఫ్‌డీఏ మరిన్ని వివరాలు కోరింది. మేము వివరాలు అందించనున్నాం. ఇదే సమయంలో ఎఫ్‌డీఏతో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి చర్చలు జరుపుతాం' అని డాక్టర్ రెడ్డీస్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది.

చమురు పైకే!

కమొడిటీస్ ఈ వారం

• బంగారం, వెండి




పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు గతవారం రూ.30,763 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత లాభాలు కొనసాగిస్తూ రూ.30,792 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. అయితే అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో అనంతరం రూ.30,387 స్థాయికి దిగివచ్చింది. చివరకు 0.83% నష్టంతో రూ.30,509 వద్ద స్థిరపడింది. సాంకేతికంగా పసిడి కాంట్రాక్టు ప్రతికూల ధోరణిలోకి వెళ్లినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రూ.30,333; ఆ తర్వాత రూ.30,043 వరకు కాంట్రాక్టు దిగివచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఈ వారం అమెరికా కాంగ్రెస్ ఎదుట ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ పరపతి విధాన సమావేశ వివరాలను వెల్లడించనున్నారు. ద్రవ్యోల్బణం, దేశ ఆర్థిక వ్యవస్థపై ఆయన ఏమి చెబుతారో అని ట్రేడర్లు గమనించే అవకాశం ఉంది. వీటన్నింటి దృష్ట్యా ఈవారం రూ.30,967 ఎగువన కాంట్రాక్టు ట్రేడ్ కాకుంటే, షార్ట్ సెల్ చేయడం మంచిది. కిందటి వారం వెండి మార్చి కాంట్రాక్టు ట్రేడింగ్ రూ.38,557 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత రూ.38,770 వరకు వెళ్లినప్పటికీ, అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో రూ.38,087కి దిగివచ్చింది. చివరకు 0.37% నష్టపోయి రూ.38,414 వద్ద ముగిసింది. సాంకేతికంగా వెండి కూడా ప్రతికూలంగానే కనిపిస్తోంది. ఈవారం రూ.38,919 ఎగువకు వెళ్లకుంటే మరింత డీలాపడి రూ.37,740; ఆ తర్వాత రూ.37,567 వరకు పడిపోయే అవకాశం ఉంది.

• ప్రాథమిక లోహాలు

రాగి మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.458.50- 469.80 మధ్య కదలాడొచ్చు. రూ.468 ఎగువకు వెళ్లకుంటే.. పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది. సీసం మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.163.35 దిగువన కదలాడకుంటే ఒడుదొడుకుల మధ్య చలించొచ్చు. ఈ నేపథ్యంలో సీసం కాంట్రాక్టును కూడా పెరిగినప్పుడల్లా అమ్మడం మంచిది. జింక్ మార్చి కాంట్రాక్టు రూ.237.70 కిందకు రానంత వరకు షార్ట్ సెల్‌కు దూరంగా ఉండటమే మేలు. అల్యూమినియం మార్చి కాంట్రాక్టు ఈవారంలో ఒక్క రోజైనా రూ.139.85 దిగువకు వస్తే. ప్రతికూల ధోరణి కొనసాగుతుందని భావించొచ్చు. దీని దృష్ట్యా ఈ స్థాయి వద్ద షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.141.80 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి. నికెల్ మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.881.90 దిగువకు రాకుంటే లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. ఒకవేళ ఈ స్థాయి కిందకు వస్తే రూ.856; ఆ తర్వాత రూ.745 వరకు దిగివచ్చే అవకాశం ఉంటుంది.



• ఇంధన రంగం




ముడి చమురు మార్చి కాంట్రాక్టు ఈవారం మరింత పైకి వెళ్లొచ్చు. అయితే ఆ లోపు ఓసారి కిందకు దిగివచ్చేందుకూ అవకాశం ఉంది. అందువల్ల రూ.3,895 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణించాలి. అదేవిధంగా రూ.4,133 స్థాయిని మించితే రూ.4,225 వరకు కాంట్రాక్టు పెరిగేందుకు అవకాశం ఉంది. సహజ వాయువు మార్చి కాంట్రాక్టుకు ఈవారం కూడా లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (నవంబరు కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (మార్చి)	465.90	464.24	(0.35)
సీసం (మార్చి)	168	165.60	(1.43)
జింక్ (మార్చి)	230.50	228.65	(0.80)
అల్యూమినియం(మార్చి)	141.65	139.85	(1.27)
నికెల్ (మార్చి)	889.90	892.70	0.31
ముడి చమురు (మార్చి)	3,995	4,125	3.25
సహజ వాయువు (మార్చి)	170.80	174.20	1.99
సెనగలు (మార్చి)	3,948	3,892	(1.44)
ధనియాలు (ఏప్రిల్)	5,531	5,608	1.39
గోరు చిక్కుడు (మార్చి)	4,500	4,298	(4.49)

• వ్యవసాయ ఉత్పత్తులు



ఈవారం మొక్కజొన్న కాంట్రాక్టును రూ.1,147-1,151 మధ్య కొనుగోలు చేయడం మంచిదే. నాలుగు వారాల వరుస లాభాల అనంతరం సెనగలు మార్చి కాంట్రాక్టులో దిద్దుబాటు మొదలైంది. అయితే రూ.3,776 సమీపంలో మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయి దిగువకు వచ్చే వరకు కాంట్రాక్టు ధర తగ్గినప్పుడల్లా కొనుగోళ్లకు మొగ్గు చూపడం ఉత్తమమే. ధనియాలు ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం మరికాస్త దిద్దుబాటు అయ్యే అవకాశం కనిపిస్తోంది. అయితే రూ.5,319 వద్ద మద్దతు లభించొచ్చు. ఒకవేళ ఈ స్థాయిని నిలబెట్టుకున్నట్లయితే తిరిగి కాంట్రాక్టు పుంజుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈవారం గోరు చిక్కుడు మార్చి కాంట్రాక్టుకు రూ.4,194- 4,019 మధ్య అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్


టీ20 సిరీస్ ట్రోఫీతో భారత జట్టు

ఛాంపియన్స్



కోహ్లి, ధోనిలకు విశ్రాంతి

- రోహిత్‌శర్మకు పగ్గాలు
- హుడా, విజయ్‌శంకర్, పంత్‌లకు చోటు
- ముక్కోణపు టీ20 టోర్నీకి భారత జట్టు

దిల్లీ: కొలంబో వేదికగా వచ్చే నెల 6న ప్రారంభం కానున్న ముక్కోణపు టీ20 టోర్నీకి భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, సీనియర్ ఆటగాడు మహేంద్రసింగ్ ధోనిలకు సెలక్టర్లు విశ్రాంతినిచ్చారు. యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టును ఓపెనర్ రోహిత్‌శర్మ నడిపించనున్నాడు. మరో ఓపెనర్


దీపక్ హుడా


రిషబ్ పంత్


విజయ్‌శంకర్


మహ్మద్ సిరాజ్

శిఖర్ ధావన్ వైస్ కెప్టెన్ బాధ్యతలు చేపట్టనున్నాడు. కోహ్లి, ధోనిలతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, పేసర్లు భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్‌లకు కూడా విశ్రాంతి ఇచ్చారు. వీరి స్థానంలో దేశవాళీ టోర్నీల్లో సత్తా చాటిన ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించారు. మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుంటున్న వికెట్‌కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్‌తో పాటు ఆల్‌రౌండర్లు దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్‌లకు సెలక్టర్లు అవకాశం ఇచ్చారు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ మరో అవకాశం దక్కించుకున్నాడు. జట్టులో సీనియర్ దినేశ్ కార్తీక్ కూడా ఉండడంతో అతనే కీపింగ్ బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి. పంత్ బ్యాట్స్‌మన్‌గా కొనసాగుతాడు. ఈ సీజన్లో 2 వేల పరుగులు చేసిన మయాంక్ అగర్వాల్‌కు ఆశ్చర్యకంగా ఈ జట్టులో చోటు దక్కలేదు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఆకట్టుకున్న సురేశ్ రైనా, మనీష్ పాండే చోటు నిలబెట్టుకున్నారు. ముక్కోణపు సిరీస్‌లో భారత్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్ పాల్గొంటున్నాయి.

భారత్ జట్టు: రోహిత్‌శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), రాహుల్, రైనా, పాండే, దినేశ్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్‌శంకర్, శార్దూల్ ఠాకూర్, జయ్‌దేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

వన్డేల్లోకీ వచ్చేస్తా



"భారత జట్టులోకి పునరాగమనం చేయడం నాకెంతో ముఖ్యం. దీని తర్వాత శ్రీలంక సిరీస్ ఉంది. ఆ తర్వాత ఐపీఎల్ వస్తుంది. చాలా మ్యాచ్‌లు రాబోతున్నాయి. వన్డేల్లో ఐదో స్థానంలో సత్తా చాటాను. ఇంకో రెండు మ్యాచ్‌లు బాగా ఆడితే వన్డే జట్టులోకి పునరాగమనం చేయడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చు. నా ఆట మెరుగు పరుచుకునేందుకు ఎంతో శ్రమించాను. అలాగే శారీరక, మానసిక దృఢత్వం పెంచుకోవడం మీదా దృష్టిపెట్టా" –సురేశ్ రైనా


మూడు టెస్టులు.. ఆరు వన్డేలు.. మూడు టీ20లు.. మొత్తం 12 మ్యాచ్‌లు. అందులో 8 టీమ్‌ఇండియా సొంతమవగా.. నాల్గింట్లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. సఫారీలు ఒక సిరీస్ నెగ్గగా.. రెండు సిరీస్‌లు టీమ్‌ఇండియా వశమయ్యాయి. మ్యాచ్‌లు, సిరీస్ విజయాలు, వివిధ విభాగాల్లో ప్రదర్శన చూస్తే దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్‌ఇండియాదే పైచేయి అన్నది స్పష్టం! దక్షిణాఫ్రికా పర్యటనలో ఒక్క సిరీస్ విజయమే కలగా ఉంటే.. ఒకటికి రెండు సిరీస్‌లు గెలవడమంటే మాటలా? అందుకే ఈ విజయాలు అపురూపం.. ఈ పర్యటన ఓ మధుర జ్ఞాపకం! అలాగని ఈ పర్యటన పూర్తి సంతృప్తినిచ్చిందా.. మనోళ్ల ప్రదర్శనలో లోపాలే లేవా.. అంటే ఔనని అనలేం! కొంచెం జాగ్రత్తగా ఆడి ఉంటే, వ్యూహ తప్పిదాలు చేయకపోయి ఉంటే ఈ పర్యటన భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేదే.

అపురూపమే కానీ..

ఫోర్త్ అంపైర్

సొంతగడ్డపై శ్రీలంకతో ఫ్లాట్ పిచ్‌లపై పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడి వెళ్లిన టీమ్‌ఇండియాకు దక్షిణాఫ్రికాలో పచ్చికతో కూడిన పిచ్‌లు దర్శనమిచ్చాయి. అయితే ప్రపంచంలోనే అత్యుత్తమ పేస్ బౌలింగ్ దళాల్లో ఒకటన దగ్గ భారత బౌలింగ్ విభాగానికి ఈ పిచ్‌లు వరంగా మారాయి. సఫారీ పేసర్లకు ఏమాత్రం తగ్గని రీతిలో.. ఇంకా చెప్పాలంటే కొన్నిసార్లు వాళ్ల కంటే మిన్నగా మనోళ్లు ప్రభావం చూపగలగడం విశేషం. 3 టెస్టుల సిరీస్‌లో ఏడుగురు దక్షిణాఫ్రికా బౌలర్లు కలిసి 57 వికెట్లు తీయగా.. ఆరుగురు టీమ్‌ఇండియా బౌలర్లు కలిపి 57 వికెట్లే పడగొట్టారు. దక్షిణాఫ్రికా తీసిన వికెట్లలో ఆ జట్టు బౌలర్ల ఘనతతో పాటు మన బ్యాట్స్‌మెన్ వైఫల్యం, నిర్లక్ష్యం పాత్ర కూడా చాలానే ఉంది. టెస్టు సిరీస్‌లోకోహ్లి మినహా మరే ఆటగాడు స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయారు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేదన్నదీ నిజమే. కానీ ఎక్కువ వైఫల్యం మన బ్యాట్స్‌మెన్‌దే. మూడు టెస్టుల్లో కోహ్లి 286 పరుగులు చేశాడు. టెస్టు సిరీస్‌లో నమోదైన ఏకైక శతకం అతడిదే. కోహ్లి తర్వాత రెండో స్థానంలో ఉన్న బ్యాట్స్‌మన్ డివిలియర్స్ (211). తర్వాతి 4 స్థానాలు సఫారీ బ్యాట్స్‌మెన్‌వే. ఆ తర్వాత కూడా పాండ్య, భువనేశ్వర్ ఉండటం గమనార్హం! అంటే కోహ్లి కాకుండా ఒక్క ప్రధాన బ్యాట్స్‌మన్ కూడా బ్యాటింగ్‌లో జట్టుకు అండగా నిలువలేకపోయారు. బ్యాటింగ్‌లో టీమ్‌ఇండియా తరపున కోహ్లి ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడనడానికి ఈ గణాంకాలే నిదర్శనం!

ఒక్క టెస్టులే కాదు వన్డేల్లోనూ టీమ్‌ఇండియా ప్రధాన ఆధారం కోహ్లినే. 6 వన్డేల సిరీస్‌లో కోహ్లి చూపిన ఆధిపత్యం అసామాన్యం. కోహ్లి సాధించిన 558 పరుగులే (3 సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ) లేకుండా ఉండుంటే వన్డే సిరీస్‌లోనూ టీమ్‌ఇండియాకు తెల్లముఖం వేసేదేమో! మరీ టెస్టుల్లా కాకుండా వన్డేల్లో ధావన్ (323), రోహిత్‌శర్మ (170), రహానె (140) తలా ఓ చేయి వేశారు. ఐతే బ్యాటింగ్‌లో కోహ్లిపై టీమ్‌ఇండియా అధికంగా ఆధారపడుతోందనడంలో సందేహం లేదు. కోహ్లి జోరును మిడిలార్డర్ అందుకోలేకపోతోంది. ఈ పరిణామం ముున్ముందు కోహ్లిపై భారం పెంచొచ్చు! ఒకప్పుడు సచిన్ చుట్టూ భారత బ్యాటింగ్ తిరిగేది. సచిన్ ఔటైతే టీమ్‌ఇండియా పనైపోయినట్లేనన్న భావన ఉండేది. తర్వాత పరిస్థితి మారింది. ముఖ్యంగా ధోని సారథ్య బాధ్యతలు అందుకున్నాక జట్టులో ఎక్కువమంది మ్యాచ్ విన్నర్లు తయారయ్యారు. ఏ ఒక్కరిపైనో ఆధారపడే పరిస్థితిని ధోని మార్చేశాడు. అయితే దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్‌ఇండియా మిడిలార్డర్ ప్రదర్శన చూస్తే సచిన్ జమానాను గుర్తుకురాక మానదు! ప్రతిసారీ కోహ్లినే ఆడాలి.. అతడు ఆడితేనే భారత్ గెలుస్తుందన్న భావన రాకూడదు! కోహ్లి బాగా ఆడాలనే కోరుకుంటాం. మిగతా వాళ్లు రాణించడమూ ముఖ్యమే!


భువనేశ్వర్

టెస్టు సిరీస్‌కు ముందు సరైన సన్నాహకం ఉండుంటే అందులోనూ ఫలితం మరోలా ఉండేదేమో. ఆ సిరీస్‌లో ఓపెనర్లు ధావన్, మురళీ విజయ్, కేఎల్ రాహుల్ తడబడ్డారు. అయితే దక్షిణాఫ్రికా పరిస్థితులు అలవాటు పడ్డాక ధావన్ మెరుగయ్యాడు. వన్డేలు, టీ20ల్లో అలవోకగా ఆడిన ధావన్.. టెస్టులకు తగ్గట్లు టెక్నిక్ మెరుగుపర్చుకోవడం అవసరం. ఇక రోహిత్ ఈ సిరీస్‌లో ఘోర వైఫల్యాలతో తీవ్ర విమర్శలెదుర్కొన్నాడు. అతను విదేశాల్లో నిలకడగా ఆడటమెలాగో నేర్చుకోవాలి. ఫ్లాట్ పిచ్‌లపై మాదిరే అన్ని చోట్లా షాట్లు ఆడితే వికెట్ పారేసుకోవడం తప్ప మరో ప్రయోజనం ఉండదు. మరింత ఏకాగ్రతతో పరిస్థితులకు తగ్గట్లు ఆడటం అలవర్చుకోవాలి. అన్ని ఫార్మాట్లకూ పనికొచ్చే రహానెకు మరిన్ని అవకాశాలు ఇవ్వాలిందే. ఇక టెస్టులకు ధోని రిటైర్మెంట్ తర్వాత వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ లోటు స్పష్టంగా కనిపించింది దక్షిణాఫ్రికా పర్యటనలోనే. ధోని ఉన్నప్పుడు ప్రధాన బ్యాట్స్‌మన్‌గా పనికొచ్చేవాడు. మిడిలార్డర్‌ను సమన్వయం చేసేవాడు. ధోని తర్వాత అతడి స్థానంలోకి వచ్చిన సాహా.. ఫాస్ట్ పిచ్‌లు ఎదురైతే చేతులెత్తేస్తున్నాడు. అతడికి ప్రత్యామ్నాయంగా దినేశ్ కార్తీక్, పార్థివ్ లాంటి వాళ్లు ఉండొచ్చు కానీ జట్టు దీర్ఘకాలిక అవసరాల్ని దృష్టిలో ఉంచుకుని రిషబ్ పంత్ లాంటి యువ వికెట్ కీపర్‌ను సానబెట్టడం ఎంతో అవసరం.

దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్‌ఇండియా బౌలింగ్ యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భువనేశ్వర్, బుమ్రా, షమిల పేస్, స్వింగ్ చూసి దిగ్గజ బౌలర్లు కూడా అబ్బురపడ్డారు. వైవిధ్యమైన బంతులతో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించారు. ఫాస్ట్ పిచ్‌లు తయారు చేసి టీమ్‌ఇండియాను చిత్తు చేయొచ్చన్న అభిప్రాయాన్ని తుడిచిపెట్టేశారు. అదే ఎత్తుగడతో సిరీస్‌ను ప్రారంభించిన దక్షిణాఫ్రికా చివరికి తాను తీసిన గోతిలో తానే పడింది. బ్యాట్స్‌మెన్ కాస్త సంయమనం ప్రదర్శించి ఉంటే, తుది జట్టు ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించి ఉంటే టెస్టు సిరీస్ కూడా మనదే అయ్యేది. యువ స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లంతా కలిసి 23 వికెట్లు తీయగా.. కుల్దీప్ (17), చాహల్ (16) కలిసి 33 వికెట్లు పడగొట్టడం విశేషం. చాహల్, కుల్దీప్ మరింత అనుభవం సంపాదిస్తే ఎలాంటి పిచ్‌లు.. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సత్తా చాటేందుకు అవకాశముంటుంది. ఈ పర్యటన ఆసాంతం నిలకడగా రాణించిన ఘనత భువనేశ్వర్‌దే. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలగడం అతడి ప్రత్యేకత. చిన్న వయసులోనే బుమ్రా జట్టుపై తనదైన ముద్ర వేశాడు. ఇంకొంచం అంతర్జాతీయ అనుభవం సంపాదిస్తే అతడికి తిరుగుండదు. చివరి ఓవర్లలో ప్రస్తుతం ప్రపంచంలోనే మేటి భువి- బుమ్రా జోడీనన్న ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ మాటలు అక్షర సత్యం. భువి, బుమ్రా మూడు ఫార్మాట్లలో టీమ్‌ఇండియాకు తిరుగులేని ఆయుధాలిప్పుడు. గాయాలతో ఇబ్బంది పడుతున్న షమి.. ఫిట్‌నెస్‌పై దృష్టిసారిస్తే బౌలింగ్ బలం మరింత పెరుగుతుంది. ఈ పర్యటనలో తప్పిదాల్ని సమీక్షించుకుని దిద్దుబాట్లు చేసుకుంటే ముున్ముందు టీమ్‌ఇండియాను ఆపడం ఎవరి తరమూ కాదు.

శీతాకాల సంరంభానికి తెర

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): 17 రోజుల క్రీడా సంబరానికి తెరపడింది. దక్షిణ కొరియా వేదికగా ఈ నెల 9న ఆరంభమైన శీతాకాల ఒలింపిక్స్ ఆదివారం ముగిశాయి. ఆతిథ్య దక్షిణ కొరియా నగరం ప్యాంగ్‌చాంగ్‌లో ముగింపు వేడుకల్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయురాలు ఇవాంకా ట్రంప్ ఈ వేడుకలకు అతిథిగా హాజరైంది. ఆరంభ వేడుకల్లో ఉమ్మడిగా మార్చ్ పాస్ట్‌లో పాల్గొన్న దక్షిణ కొరియా, ఉత్తర కొరియా అథ్లెట్లు.. ముగింపు వేడుకల్లో మాత్రం వేర్వేరు జెండాలతో కవాతు చేశారు. నార్వే 14 స్వర్ణాలు సహా 39 పతకాలతో పట్టికలో అగ్రస్థానంలో నిలవగా.. జర్మనీ 14 స్వర్ణాలతో పాటు 31 పతకాలతో రెండో స్థానం సాధించింది. కెనడా 11 స్వర్ణాలు సహా 29 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది.



అరుణకు ఏడో స్థానం



మెల్‌బోర్న్: జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో వాల్ట్ విభాగంలో కాంస్యం గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా నిలిచిన తెలుగమ్మాయి బుడ్డా అరుణారెడ్డి ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో నిరాశ పరిచింది. ఆమె ఈ ఈవెంట్లో ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. ఫైనల్లో 10.833 పాయింట్లే సాధించిన ఆమె పతకం రేసులో నిలువలేకపోయింది. పురుషుల విభాగంలో రాకేశ్ పాత్రా కూడా ఏడో స్థానంలోనే నిలిచాడు. పారలాల్ బార్స్‌లో అతను 13.433 పాయింట్లు సాధించి పతకానికి దూరమయ్యాడు. ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్యం గెలిచిన అరుణకు తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ అభినందనలు తెలిపారు.

అమిత్, వికాస్‌లకు స్వర్ణం

సోఫియా (బల్గేరియా): స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నమెంట్లో భారత బాక్సర్లు అమిత్, వికాస్ కృషన్ స్వర్ణాలు సొంతం చేసుకున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్లో వారు విజయం సాధించారు. మరోవైపు మేరీకోమ్‌కు నిరాశ ఎదురైంది. స్వర్ణ పతకానికి ఫేవరెట్ అయిన ఆమె రజతంతో సరిపెట్టుకుంది. ఆదివారం 48 కేజీల విభాగం ఫైనల్లో మేరీ... స్వెడా అసెనోవా (బల్గేరియా) చేతిలో ఓడింది. సీమా పునియా (81 కేజీల పైన) కూడా రజతంతో సంతృప్తి పడింది. ఫైనల్లో ఆమె ఇవనోవా (రష్యా) చేతిలో ఓడింది. ఈ టోర్నీలో మీనా కుమారి (54 కేజీలు), సరితాదేవి (60 కేజీలు), స్వీటీ (75 కేజీలు). భాగ్యభతి కచారి (81 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు.


మేరీ


సమీర్‌కు స్విస్ టైటిల్

బసెల్ (స్విట్జర్లాండ్): భారత యువ షట్లర్ సమీర్‌వర్మ స్విస్ ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ సాధించాడు. ఆదివారం పురుషుల సింగిల్స్ ఫైనల్లో సమీర్ 21-15, 21-13తో జాన్ జార్గెన్‌సెన్ (డెన్మార్క్)ను వరుస గేముల్లో ఓడించాడు. గతేడాది సయ్యద్ మోదీ గ్రాండ్‌ప్రి గోల్డ్ టైటిల్ గెలిచిన సమీర్. . 2016లో హాంకాంగ్ సూపర్ సిరీస్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. కిదాంబి శ్రీకాంత్, ప్రణయ్ తర్వాత ఈ టైటిల్ అందుకున్న మూడో భారత ఆటగాడిగా నిలిచాడు.



ద్రవిడ్ మాటకు తలొగ్గిన బీసీసీఐ

దిల్లీ: అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు శిక్షక బృందంలో ఉన్న సహాయ సిబ్బందికి తనతో పోలిస్తే తక్కువ నజరానాలివ్వడంపై కోచ్ రాహుల్ ద్రవిడ్ లేవనెత్తిన అభ్యంతరాలపై బీసీసీఐ స్పందించింది. అందరికీ సమానంగా నజరానాలు ఇవ్వడానికి బోర్డు అంగీకరించింది. మొదట బోర్డు ద్రవిడ్‌కు రూ.50 లక్షలు, మిగతా సహాయ సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున నజరానాలు ప్రకటించింది. ఇది భావ్యం కాదని, తనకు ప్రకటించిన మొత్తాన్ని తగ్గించి అందరికీ సమానంగా బహుమతి అందించాలని ద్రవిడ్ కోరినట్లుగా వార్తలొచ్చాయి. ఇందుకు అంగీకరించిన బోర్డు.. ద్రవిడ్‌తో పాటు అందరికీ ఒకే రకంగా రూ.25 లక్షల చొప్పున నజరానా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రపంచకప్ జట్టులో సభ్యులు ఒక్కొక్కరికి రూ.30 లక్షల చొప్పున బీసీసీఐ నజరానా ప్రకటించిన సంగతి తెలిసిందే.






టేలర్ సెంచరీ

- న్యూజిలాండ్ బోణీ
- స్టోక్స్ పునరాగమనం

హామిల్టన్: రాస్ టేలర్ (113; 116 బంతుల్లో 12×4) సెంచరీ సాధించడంతో ఇంగ్లాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ బోణీ కొట్టింది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన తొలి వన్డేలో కివీస్ 3 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 284 పరుగులు చేసింది. రూట్ (71; 75 బంతుల్లో 5×4, 1×6), బట్లర్ (79; 65 బంతుల్లో 5×4, 5×6) రాణించారు. ఛేదనలో వోక్స్ (2/47), విల్లె (1/26) ధాటికి కివీస్ ఒక దశలో 27 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో టేలర్, లోథమ్ (79)తో కలిసి నాలుగో వికెట్‌కు 178 పరుగులు జత చేసి కివీస్‌ను విజయపథంలో నడిపించాడు. కెరీర్‌లో 18వ సెంచరీ చేసిన టేలర్ కూడా కీలక సమయంలో ఔట్ కావడంతో ఒక దశలో 244/7తో ఓటమి దిశగా నడిచింది. కానీ చివర్లో ధాటిగా ఆడిన శాంట్నర్ (45 నాటౌట్; 27 బంతుల్లో 2×4, 4×6), సౌథీ (8 నాటౌట్)తో కలిసి జట్టును గెలిపించాడు. నిషేధానికి గురైన తర్వాత తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ (2/43) ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో మాత్రం అతను 12 పరుగులకే ఔటయ్యాడు.

హాకీ మాంత్రికుడికీ తప్పలేదు!



కోల్‌కతా: ఒకప్పుడు తన స్టిక్ మాయాజాలంతో అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసిన హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ ఒకసారి హాకీ మ్యాచ్‌లు చూడటానికి వరుసలో నిల్చొని టిక్కెట్లు కొనుక్కోవాల్సి వచ్చిందట. ఈ విషయాన్ని ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన భారత హాకీ జట్టులో సభ్యుడైన మాజీ కెప్టెన్ గుర్బాక్స్ సింగ్ చెప్పాడు. తన స్వీయ పుస్తకం 'మై గోల్డెన్ డేస్'లో అతనీ విషయాన్ని ప్రస్తావించాడు. "భారత హాకీలో రాజకీయాలు ఏ స్థాయిలో నడిచాయో చెప్పడానికి ఈ సంఘటనే ఉదాహరణ అని అతను చెప్పాడు. 1962లో ధ్యాన్‌చంద్.. ఎన్‌ఐఎస్ పటియాల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఉండేవాడు. అప్పట్లో భారత హాకీ సమాఖ్యకు పటియాల జాతీయ క్రీడల సంస్థ మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ ప్రభావం దిగ్గజమైన ధ్యాన్‌చంద్ మీద కూడా పడింది. అహ్మదాబాద్‌లో జరిగిన టోర్నమెంట్ కోసం ధ్యాన్‌చంద్ తన బృందంతో కలిసి వెళ్లాడు. అయితే నిర్వాహకులు ఏదో కారణం చెప్పి ధ్యాన్‌చంద్, అతని శిష్యులకు ప్రవేశ పత్రం ఇవ్వలేదు. దీంతో అంతటి గొప్ప ఆటగాడైనా కూడా ధ్యాన్‌చంద్ అందరితో కలిసి ప్రతిరోజూ వరుసలో నిలుచొని మ్యాచ్ టిక్కెట్లు కొనుక్కోవాల్సి వచ్చింది" అని గుర్బాక్స్ గుర్తు చేసుకున్నాడు.

జడేజాల జోరు

- ఫైనల్లో సౌరాష్ట్ర.. ఆంధ్ర నిష్క్రమణ
- విజయ్ హజారె వన్డే ట్రోఫీ

దిల్లీ: విజయ్ హజారె వన్డే ట్రోఫీలో ఆంధ్ర జైత్రయాత్రకు తెరపడింది. పెద్ద జట్లను మట్టికరిపిస్తూ. . అద్భుత విజయాలు సాధిస్తూ సెమీస్ చేరిన ఆ జట్టుకు సౌరాష్ట్ర షాకిచ్చింది. ఆదివారం బౌలర్ల ఆధిపత్యం సాగిన సెమీఫైనల్లో సౌరాష్ట్ర 59 పరుగుల తేడాతో ఆంధ్రను ఓడించింది. రవీంద్ర జడేజా బ్యాటింగ్‌లో మెరిస్తే.. ధర్మేంద్ర జడేజా బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మొదట సౌరాష్ట్ర 49.1 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 69 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ సౌరాష్ట్రకు రవీంద్ర జడేజా (56; 51 బంతుల్లో 4×4, 1×6), అర్పిత్ (58; 59 బంతుల్లో 4×4, 2×6) ఆదుకుని, గౌరవప్రదమైన స్కోరు అందించారు. అనంతరం ధర్మేంద్ర జడేజా (4/40), సనందియ (2/40)ల ధాటికి ఆంధ్రా క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 45.3 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటైంది. బి.సుమంత్ (42), రవితేజ (42) మినహా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు.


రవీంద్ర జడేజా (56)

'నీళ్ల'వంక!



★ చంద్రుడిపై అంతటా నీరుందని తాజా పరిశోధనలో వెల్లడి

వాషింగ్టన్: చంద్రుడి ఉపరితలంపై పుష్కలంగా నీరుందని తాజా అధ్యయనంలో తేలింది. అంతే కాదు ఈ నీటి వనరులు ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాలేదనీ బయటపడింది. చంద్రయాన్-1 ఆర్బిటర్ సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. చంద్రుడిపై నీటి ఉనికి గుట్టు విప్పేందుకు, అక్కడి నీటిని ఇంధన వనరుగా ఉపయోగించేందుకు ఈ పరిశోధన ఎంతగానో తోడ్పడే వీలుంది. ఒకవేళ చంద్రుడిపై నీరు పుష్కలంగా ఉండటంతోపాటు దీన్ని సులువుగా సేకరించగలిగితే ఎన్నో ప్రయోజనాలుంటాయి. భవిష్యత్తులో చంద్రుడిపైకి వెళ్లేవారికి ఇవి తాగునీరుగా ఉపయోగపడే వీలుంది. అంతే కాదు ఇక్కడి నీటిని హైడ్రోజన్, ఆక్సీజన్‌లుగా విడగొడితే రాకెట్ ఇంధనంగా ఉపయోగపడతాయి. ఈ ప్రక్రియలో మనకు కావాల్సిన ప్రాణవాయువూ లభిస్తుంది. 'పగలు, రాత్రి అని తేడాలేదు. ఏ అక్షాంశ పరిధిలో చూసినా నీటి జాడలు కనిపిస్తున్నాయి'అని పరిశోధనలో పాలుపంచుకున్న అమెరికాలోని స్పేస్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ పరిశోధకులు జోషువా బాండ్‌ఫీల్డ్ తెలిపారు. 'చంద్రుడి ఉపరితలంపై ఖనిజాలతో నీటికి సంబంధంలేదు. అన్నిచోట్లా నీటి ఉనికి గుర్తించగలుగుతున్నాం'అని ఆయన వివరించారు. చంద్రుడి ధ్రువ ప్రాంతాల్లో మాత్రమే నీరు పుష్కలంగా ఉందన్న ఇదివరకటి అధ్యయన ఫలితాలతో తాజా పరిశోధన విభేదిస్తోంది.

గురుడి చందమామపై జీవం!



వాషింగ్టన్: గురుగ్రహ చందమామ యూరోపాపై జీవం ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. 10 కిలో మీటర్ల మందంతో కూడిన దాని పైపొర కింద దాగున్న మహాసముద్రాల్లో ప్రాణులు ఉండొచ్చని చెప్పారు.

యూరోపాపై సూక్ష్మజీవులు మనుగడ సాగించే అవకాశంపై బ్రెజిల్‌లోని సావ్ పాలో విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు సైద్ధాంతిక పరిశోధన చేపట్టారు. భూమిపై ఉన్న ఆ తరహా వాతావరణాల నుంచి సేకరించిన డేటాను ఇందుకోసం ఉపయోగించారు. దక్షిణాఫ్రికాలోని జోహెన్స్‌బర్గ్‌లో ఉన్న పోనెంగ్ బంగారు గనిలో 2.8 కిలో మీటర్ల లోతులో పరిశీలనలు చేపట్టారు. అక్కడ యూరోపాతో పోలిన పరిస్థితులు ఉన్నాయని తేల్చారు. క్యాండిడాటస్ డెసల్ఫోరుడిస్ ఆడాక్సివేటర్ అనే సూక్ష్మజీవి.. సూర్యకాంతి చొరబడని ఈ గనిలో నివసిస్తోందని గుర్తించారు. నీటి రేడియోలసిస్ ద్వారా అది మనుగడ సాగిస్తోందని పేర్కొన్నారు. అయనీకరణ రేడియోధార్మికతతో నీటి అణువులను విడగొట్టడాన్ని రేడియోలసిస్‌గా పేర్కొంటారు. రేడియోధార్మిక యురేనియం కలిగిన పగుళ్ల గుండా ఈ గనిలోకి నీరు లీకవుతోంది. నీటి అణువులను యురేనియం విడగొట్టి, ఫ్రీ రాడికల్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇవి.. చుట్టుపక్కల ఉన్న రాతితో చర్య జరిపి, సల్ఫేట్‌ను వెలువరిస్తాయి. ఈ సల్ఫేట్ ద్వారా శక్తిని ఉత్పత్తి చేయడం, నిల్వ చేసుకోవడం వంటి చర్యలను బ్యాక్టీరియా చేపడుతోంది.

అణుశక్తి ఆధారంగా ప్రత్యక్షంగా జీవనాన్ని సాగించడాన్ని గుర్తించడం ఇదే తొలిసారని శాస్త్రవేత్తలు తెలిపారు. యూరోపా కిందున్న మహాసముద్రంలోని ఇలాంటి వాతావరణం ఉంటుందని వారు పేర్కొన్నారు. యురేనియం, థోరియం, పొటాషియం వంటి రేడియోధార్మిక మూలకాల సాయంతో అక్కడ కూడా రేడియోలిసిస్ జరిగి, ఫ్రీ రాడికల్స్ ఉత్పత్తి జరగొచ్చని వివరించారు.

చట్టబద్ధ పాలనతోనే సామాజిక న్యాయం

- **విశ్రాంత ఐఏఎస్ అధికారి కేఆర్ వేణుగోపాల్**



సదస్సులో మాట్లాడుతున్న కేఆర్ వేణుగోపాల్. చిత్రంలో సర్వేశ్వర్‌రావు, డా.తేజల్ కనిత్కార్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: చట్టబద్ధ పాలన(రూల్ ఆఫ్ లా)తోనే సామాజిక న్యాయం జరుగుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రధానమంత్రి పూర్వ కార్యదర్శి డా. కేఆర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర 30వ వార్షికోత్సవం సందర్భంగా 'వైజ్ఞానిక పరిశీలన స్ఫూర్తి, ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించడం' అనే అంశంపై రెండో రోజు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పేదలందరికీ ఆహార భద్రత, సంక్షేమ పథకాలు అందాలన్నారు. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ (ముంబయి) ప్రొ. ఆర్. రామకుమార్ మాట్లాడుతూ.. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి కార్యవర్గ సభ్యుడు డా. సవితాశెటే మాట్లాడుతూ... సత్యాన్వేషకులైన దబోల్కర్, గోవింద్ పన్సారే, కల్బుర్గీ, గౌరీలంకేష్ హత్యలపై ప్రభుత్వమే జవాబు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త డా. టీవీ. వెంకటేశ్వరన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి వీఎం మనోహర్ ప్రసాద్, నల్సార్ యూనివర్శిటీ ప్రొ. హారతివాఘే షన్, సీనియర్ సంపాదకులు ప్రబీర్ పుర్కాయాస్థ, డా. తేజల్ కనిత్కార్, మాజీ ఎమ్మెల్సీ, ప్రొ. కె. నాగేశ్వర్ తదితరులు మాట్లాడారు. మూఢ విశ్వాసాల నిర్మూలన చట్టం చేయాలని కోరుతూ అందుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. సదుస్సులో ప్రొ. బీఎన్‌రెడ్డి, అందె సత్యం, సర్వేశ్వర్‌రావు, కోయ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జమ్ముకశ్మీర్‌లో ముష్కరుల కాల్పులు

- **వేర్వేరు ఘటనల్లో ఇద్దరు పోలీసుల మృత్యువాత**

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ముష్కరులు మరోసారి రెచ్చిపోయారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం కాల్పులకు తెగబడి ఇద్దరు పోలీసులను పొట్టనపెట్టుకున్నారు. బుద్గాం జిల్లాలోని చ్రార్-ఎ-షరీఫ్ ప్రార్థనాస్థలం వద్ద కాపలా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ కుల్తార్ సింగ్‌పై ముష్కరులు కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడ్డ కుల్తార్.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మరో ఘటనలో, సౌరా ప్రాంతంలోని బిలాల్ కాలనీలో వేర్పాటువాద హురియత్ నేత ఫజల్ హక్ ఖురేషి ఇంటి వద్ద భద్రతా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ఫరూక్ అహ్మద్ యటూపై ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. ఆయన కూడా చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డారు.

సరిహద్దుల్లో కాల్పుల హోరు

సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాకిస్థాన్ దళాలు మరోసారి ఉల్లంఘించాయి. జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లో నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి ఆదివారం విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాయి. ఈ కాల్పులను భారత బలగాలు దీటుగా తిప్పికొట్టాయి. ఇరుపక్షాల మధ్య రెండు గంటలకుపైగా కాల్పులు కొనసాగాయి.

సీనియర్ పాత్రికేయులు రమేష్‌బాబు సేవలు చిరస్మరణీయం

ఈనాడు డిజిటల్, అమరావతి: సీనియర్ పాత్రికేయులు, 'న్యూస్‌టుడే' మాజీ ఎండీ గుత్తికొండ రమేష్‌బాబు సేవలు చిరస్మరణీయమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు రమేష్‌బాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సంతాపం తెలిపారు. రమేష్‌బాబు పార్థివదేహాన్ని సోమవారం ఉదయం 6 నుంచి 11గంటల వరకు సుందర్ నగర్‌లోని ఆయన స్వగృహంలోసందర్శనార్థం ఉంచనున్నారు. జూబ్లీహిల్స్, విస్పర్ వాలీ సమీపంలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

2022 తర్వాతా చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్!

- **పదవీకాలంపై పరిమితిని ఎత్తివేసే యోచనలో సీపీసీ**

బీజింగ్: చైనా అధ్యక్ష పీఠంపై ప్రస్తుత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2022 తర్వాత కూడా కొనసాగేందుకు అధికార చైనా కమ్యూనిస్టు పార్టీ(సీపీసీ) రంగం సిద్ధం చేస్తోంది. దేశ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల్లో ఎవరూ వరుసగా రెండు దఫాల కంటే ఎక్కువసార్లు కొనసాగకుండా ప్రస్తుతం రాజ్యాంగంలో ఉన్న పరిమితిని ఎత్తివేయాలని పార్టీ కేంద్ర కమిటీ ప్రతిపాదించినట్లు ప్రభుత్వరంగ వార్తాసంస్థ 'షిన్హువా' ఆదివారం వెల్లడించింది. సోమవారం నుంచి మూడు రోజులపాటు జరిగే పార్టీ సమావేశాల్లో ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందే అవకాశముందని తెలిపింది. అదే జరిగితే.. కాలపరిమితి లేకుండా ఎంతకాలమైనా దేశాధ్యక్ష పదవిలో జిన్‌పింగ్(64) కొనసాగేందుకు మార్గం సుగమమవుతుందని పేర్కొంది. చైనా అధ్యక్షుడిగా, సీపీసీ ప్రధాన కార్యదర్శిగా జిన్‌పింగ్ రెండో దఫా పదవీకాలం గతేడాదే ప్రారంభమైంది. 2022లో ఆ పదవుల నుంచి దిగిపోవాల్సి ఉంది. జిన్‌పింగ్‌కు ముందు చైనా అధ్యక్షులుగా, పార్టీ ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన జియాంగ్ జెమిన్(1993-2003), హు జింటావో(2003-2013) రాజ్యాంగంలోని కాల పరిమితి నిబంధనల కారణంగానే పదవుల నుంచి దిగిపోయారు.

మీసా భారతి ఫాంహౌస్‌పై ఈడీ జప్తు కొనసాగాల్సిందే!

పీఎంఎల్‌ఏ స్పష్టీకరణ

దిల్లీ: లాలూ కుమార్తె మీసా భారతికి చెందిన ఫాంహౌస్‌కు వాస్తవానికి నల్లధనం చెలామణి వ్యవహారంతో సంబంధం ఉందని 'నల్లధనం చెలామణి నిరోధక చట్టం'(పీఎంఎల్‌ఏ) అధికార వర్గాలు తెలిపాయి. అందుకే, ఆ ఫామ్‌హౌస్‌పై ఈడీ జప్తును అలాగే కొనసాగించాలని స్పష్టం చేసింది. దక్షిణ దిల్లీలోని బిజ్‌వాసన్ ప్రాంతంలో ఉన్న ఈ ఫామ్‌హౌస్‌ను ఈడీ గత సెప్టెంబరులో జప్తు చేసిన విషయం గమనార్హం. నల్లధనం చెలామణికి సంబంధించిన కేసు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కాలంలో ఈ ఫాంహౌస్‌పై జప్తు అలాగే కొనసాగుతుందని పేర్కొంది. ఈ ఫాంహౌస్ వాస్తవానికి మీసాభారతి, ఆమె భర్త శైలేష్‌కుమార్‌ల పేరుమీద ఉంది. 2008-09 సంవత్సరంలో నల్లధనం చెలామణితో సంబంధం ఉన్న రూ.1.2 కోట్లను పెట్టి ఈ ఫాంహౌస్‌ను కొనుగోలు చేసినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది.

ఆస్పత్రిలో మళ్లీ చేరిన పారికర్



పనాజీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్(62) మరోసారి అస్వస్థతకు గురయ్యారు. ఇటీవలే ఉదరసంబంధ సమస్యలతో ముంబయిలో చికిత్స పొందిన ఆయన గురువారం డిశ్చార్జి అయ్యారు. అయితే, ఆదివారం సాయంత్రం పొత్తి కడుపులో నొప్పి రావటంతో గోవా మెడికల్ కాలేజి ఆస్పత్రిలో చేరారు. ఆయన డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే వెల్లడించారు.

పీఎన్‌బీ ఈడీ రావును ప్రశ్నించిన సీబీఐ

నీరవ్‌మోదీ కుంభకోణం నేపథ్యంలో..

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కార్యనిర్వాహక సంచాలకుడు (ఎగ్జిక్యూటివ్ డైరక్టర్) కేవీ. బ్రహ్మాజీ రావును సీబీఐ ఆదివారం కూడా ప్రశించారు. రూ. 11,400 కోట్ల భారీ నీరవ్‌మోదీ కుంభకోణం నేపథ్యంలో ఆయనను సీబీఐ ప్రశ్నించడం ఇది రెండోసారి. పీఎన్‌బీ వెబ్‌సైట్‌ను బట్టి చూస్తే.... 'ఇంటిగ్రేటెడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ డివిజన్, క్రెడిట్(ఆపరేషన్స్), స్టాక్ ఆడిట్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీస్(పీఎంఎస్) వంటి కీలక విభాగాలకు బ్రహ్మాజీరావు బాధ్యులుగా పనిచేసిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. సుమారు 35 ఏళ్ల క్రితం ప్రొబేషనరీ ఆఫీసరుగా ఆయన చేరారు. ఇదే కేసుకు సంబంధించి పలువురు ఇతర అధికారులను కూడా సీబీఐ ప్రశ్నిస్తోంది. 'భరోసా పత్రాల' (ఎల్‌వోయు)జారీ ప్రక్రియ, ఇతరత్రా బ్యాంకు నిబంధనల ఉల్లంఘనలు, అసలు ఈ భారీ నేరాన్ని ఎలా గుర్తించారన్న అంశాలపై ఓ అవగాహనకు రావడానికే ఈ అధికారులను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని నిందితులుగా సీబీఐ పరిగణించడం లేదు. కాగా, నీరవ్‌మోదీ, ఆయన సమీప బంధువు మెహుల్ ఛోక్సీలకు 293 ఎల్‌వోయుల జారీ ద్వారా రూ.11,400 కోట్ల కుంభకోణానికి మార్గం సుగమమైందన్న ఆరోపణలున్న విషయం విదితమే.

సింభావలీ షుగర్స్‌పై సీబీఐ కేసు

బ్యాంకు రుణ ఎగవేతపై చర్యలు

దిల్లీ: ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)కి రూ.200 కోట్లకుపైగా కుచ్చుటోపీ పెట్టిన కేసులో సింభావలీ షుగర్స్, ఆ సంస్థ సీఎండీ, డైరెక్టర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. తమ బ్యాంకు చెందిన మేరఠ్ శాఖను 2011, 2015లో ఆ సంస్థ మోసగించిందని ఓబీసీ పేర్కొంది. సింభావలీ షుగర్స్ సీఎండీ గుర్మీత్ సింగ్ మాన్, డిప్యూటీ ఎండీ గురుపాల్ సింగ్, సీఎఫ్‌వో సహా 8 మంది డైరెక్టర్ల పేర్లను, బ్యాంకుకు చెందిన గుర్తు తెలియని అధికారులపై కేసులు పెట్టారు. డైరెక్టర్లలో ఒకరు పంజాబ్‌కు చెందిన అగ్రశ్రేణి కాంగ్రెస్ నేతకు మేనల్లుడు కావడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించి దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు ప్రదేశాల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. 2011లో ఈ చక్కెర కర్మాగారం రూ.150 కోట్ల రుణం కోసం ఓబీసీని ఆశ్రయించింది. 5200 మంది చక్కెర రైతులకు ఆర్థిక సాయం చేయడానికి ఈ సొమ్మును అడిగింది. ఈ రైతుల పేరిట ఖాతాలు తెరవడానికి కేవైసీ పత్రాలను సమర్పించింది. అయితే రైతుల ఖాతాల్లోకి సొమ్మును జమచేయగానే..ఆ సొమ్మును ఇతర అవసరాల కోసం బదలాయించారు. రుణ వసూలు ట్రైబ్యునల్‌ను ఓబీసీ ఆశ్రయించింది. ఆ రుణాన్ని ఒక్కసారిగా తీర్చేయడానికంటూ 2015లో ఆ చక్కెర కర్మాగారం మరో రూ.110 కోట్ల రుణాన్ని తీసుకుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.